ఆంధ్రజ్యోతి


శుక్రవారం | 16-2-2018 | పేజీలు: 16 + 20 | వెల: రూ.5.00 | సంపుటి: 58 సంచిక: 302 | శ్రీహేవళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, శుక్లపక్షం; తిథి: పాడ్యమి తె. 3.57 తదుపరి విదియ; నక్షత్రం: ధనిష్ఠ ఉ. 9.42 తదుపరి శతభిషం; వర్జ్యం: సా. 5.26-7.09; దుర్ముహూర్తం: ఉ. 9.03-9.49, మ. 12.53-1.39; అమృతఘడియలు: తె. 3.44-5.27; రాహుకాలం: ఉ. 10.30-12.00; సూర్యోదయం: 6.46; సూర్యాస్తమయం: 6.14 | విజయవాడ సిటీ

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Kakinada | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad | Bangalore and Chennai

సస్పెండ్ చేశారని..

బడిలో నరమేధం





ఫ్లోరిడాలో పూర్వ విద్యార్థి ఉన్మాదం

ఎరవేసి కాల్పులు..17 మంది మృత్యువాత

- ఎన్నారై పిల్లలు ఎక్కువ ఉన్న స్కూలిది
- క్షతగాత్రుల్లో ఓ తెలుగు విద్యార్థి కూడా
- 19 ఏళ్ల మాజీ విద్యార్థి నికోలస్ ఘాతుకం
- అతడికి మారణాయుధాలంటే పిచ్చి
- ఫేస్‌బుక్ ఖాతా నిండా అవే పోస్టులు

అమెరికాలోని ఫ్లోరిడా నగరంలో తాను చదివిన స్కూలులోనే ఓ విద్యార్థి రక్తపాతం సృష్టించాడు. తోటి విద్యార్థులు, టీచర్లపై తుపాకీ గురిపెట్టి విచక్షణారహితంగా కాల్పులు జరిపాడు. ఈ తూటాల వర్షానికి ఎన్నో పసిదేహాలు జల్లెడలా చిల్లులు పడ్డాయి. తరగతి గదుల గోడలు రక్తసిక్తమయ్యాయి. ఆ గదుల్లో కొన్ని గంటలపాటు విద్యార్థులు, సిబ్బంది ఆర్తనాదాలు వినిపించాయి.

వాషింగ్టన్, ఫిబ్రవరి 15: అమెరికాలో మరోసారి తుపాకీ సంస్కృతి స్వైరవిహారం చేసింది. ఫ్లోరిడాలోని పార్క్‌ల్యాండ్‌లోని మర్జోరీ స్టోన్‌మన్ డగ్లస్ స్కూలులో గురువారం దారుణం జరిగింది. ఓ పూర్వ విద్యార్థి జరిపిన కాల్పుల్లో 17 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో

మిగతా 16వ పేజీలో...



పార్క్‌లాండ్‌లో పాఠశాల బయట బంధువుల రోదనలు

విశాఖలో గేమింగ్ సిటీ

40 ఎకరాల్లో వినోద నగరం ఏర్పాటు

- గేమింగ్, యానిమేషన్, గ్రాఫిక్స్ సంస్థల ఏర్పాటుకు ప్రోత్సాహం
- డిస్నీల్యాండ్‌కూ ఆహ్వానం
- వినోద నగరంలో అంతర్జాతీయ సంస్థల ఏర్పాటే లక్ష్యంగా త్వరలో ఏవీజీసీ విధానం
- ఏపీలో వర్క్‌ఫ్రం హోమ్ ప్రాజెక్టు
- లోకేశ్‌తో 'ఫస్ట్ అమెరికా' ప్రతినిధుల భేటీ



అమరావతి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): యానిమేషన్, వీఎఫ్ఎక్స్, గ్రాఫిక్స్, కామిక్స్ రంగాల్లో కొత్త అవకాశాలను అందిపుచ్చుకునేందుకు విశాఖపట్నంలో వినోద నగరాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నాలుగు విభాగాలకు ఇటీవల కాలంలో విపరీతమైన డిమాండ్ ఏర్పడుతోంది. దీంతో వీటికి చెందిన సంస్థల ఏర్పాటును ప్రోత్సహించేందుకు రాష్ట్ర ఐటీ శాఖ సిద్ధమవుతోంది. ఫిల్మ్, మీడియా, ఏవీజీసీ(యానిమేషన్, వీఎఫ్ఎక్స్, గ్రాఫిక్స్, కామిక్స్) సిటీ పేరుతో 40 ఎకరాల్లో వినోద నగరాన్ని ఏర్పాటు చేయనుంది. ప్రస్తుతం సినిమాల్లో యానిమేషన్, గ్రాఫిక్స్ ఓ భాగంగా మారిపోయాయి. పూర్తిస్థాయి యానిమేషన్ సినిమాలూ ఎక్కువగానే వస్తున్నాయి. బాహుబలి లాంటి సినిమా తర్వాత వీఎఫ్ఎక్స్, గ్రాఫిక్స్‌కు విపరీతమైన క్రేజ్ ఏర్పడింది. మరోవైపు గేమింగ్ పరిశ్రమ శరవేగంగా అభివృద్ధి

మిగతా 5వ పేజీలో...

పెట్టుబడి అవకాశాలను

కళ్లకు కట్టండి

- ఏరోస్పేస్, డిఫెన్స్ నమూనా ప్రదర్శనలు ఏర్పాటు చేయండి
- భాగస్వామ్య సదస్సుపై సీఎం ఆదేశం
- చిత్తూరులో టెక్స్‌టైల్, అనంతలో అపెరల్ పరిశ్రమలకు ఎస్ఐపీబీ ఓకే

5

కియ... క్రియ!

5

చకచకా నిర్మాణ పనులు

- 2019 మార్చి నాటికి మొదటి కారు
- కియ ప్లాంట్లలో ఇదే అత్యాధునికం
- అదనంగా బ్యాటరీ కారూ తయారు



22న సీఎం పరిశీలించనున్న ఫ్రేమ్ ఇన్‌స్టలేషన్ ప్రాంతం



టీడీపీ సమన్వయ కమిటీ సభ్యులతో సమావేశమైన చంద్రబాబు

మార్చి 5 టీడీపీ డెడ్‌లైన్ | ఏప్రిల్ 6 వైసీపీ..రాజీనామా ముహూర్తం

ఒత్తిడి వ్యూహం!

టీడీపీ దూకుడు.. కేంద్రంపై అంచెలంచెల పోరుకు బాబు నిర్ణయం

- మార్చి 5 లోపు న్యాయం జరగాల్సిందే
- లేదంటే... అంచెలుగా కీలక నిర్ణయాలు
- తొలుత కేంద్ర మంత్రి పదవులకు గుడ్‌బై!?
- పార్టీ సమన్వయ కమిటీ భేటీలో చర్చ
- కేంద్రం తీరుపై సీఎం ఆవేదన.. జగన్‌పై ఫైర్
- ప్రత్యేకంగా ఇచ్చిందేమిటో చెప్పాలి!
- కాగితాలపై ఉన్నవన్నీ వచ్చినట్లుకాదు
- 29సార్లు ఢిల్లీ చుట్టూ తిరిగాను: సీఎం

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

'ఏప్రిల్ 6'... ప్రత్యేక హోదాపై ఎంపీలు రాజీనామాలు చేసేందుకు విపక్ష వైసీపీ పెట్టుకున్న డెడ్‌లైన్!

'మార్చి 5'... రాష్ట్రానికి న్యాయం జరిగేలా కేంద్రంపై ఒత్తిడి పెంచేందుకు అధికార తెలుగుదేశం నిర్ణయించుకున్న గడువు! ఈలోపు కేంద్రం నుంచి సానుకూల స్పందన రాకపోతే... దశల వారీగా

మిగతా 14వ పేజీలో...

మొదటి బడ్జెట్‌లోనే కేంద్రాన్ని ప్రశ్నించా!

- జైట్లీ స్పష్టంగా చెప్పినందునే ప్యాకేజీకి ఒప్పుకొన్నాం
- కేంద్రమంటే నాకెందుకు భయం?.. కేసులతో జగన్‌కే దడ
- పదవులు మనకెప్పుడూ లెక్క కాదు: పార్టీ భేటీలో బాబు



శ్వేతపత్రం ఇవ్వాల్సింది కేంద్రమే: సీఎం

జగన్‌పై మరో చార్జిషీటు

- 'ఇందూ' పెట్టుబడులపై ఈడీ అభియోగాలు
- మనీ లాండరింగ్ నిజమన్న ఈడీ
- నిందితులుగా సాయిరెడ్డి, నిమ్మగడ్డ తదితరులు

5



టీడీపీ ఎంపీలూ రాజీనామా చేయాలి

25 మంది ఎంపీలూ చేస్తే కేంద్రం దిగొస్తుంది: జగన్ 14

సార్వత్రికం తర్వాత మద్దతు.. బీజేపీ-వైసీపీ డీల్.. జాతీయ పత్రికల్లో వార్తలు: సీఎం

కాపు కోటా కోసం 14

కేంద్రంపై ఒత్తిడి


- డీవోపీటీ అభ్యంతరం దురదృష్టకరం
- కమిషన్ వేసి అధ్యయనం చేయించాం
- తర్వాతే రిజర్వేషన్లకు సిఫారసు: సీఎం

నీరవ్ పరార్



జనవరిలోనే కుటుంబం సహా స్విట్జర్లాండ్‌కు చెక్కేసిన మోదీ

- దేశవ్యాప్తంగా ఆఫీసులు, నివాసాల్లో ఈడీ సోదాలు
- 5100 కోట్ల విలువైన వజ్రాలు, ఆస్తులు స్వాధీనం



పంజాబ్ నేషనల్ బ్యాంకుకు 11,520 కోట్ల రూపాయల 'ఖరీదైన కుచ్చుటోపీ' పెట్టిన ఘరానా మోసగాడు నీరవ్ మోదీ జనవరిలోనే దేశం నుంచి 'జంప్' అయ్యాడు. స్విట్జర్లాండ్‌లో వాలిపోయాడు. ఆయన ఆస్తులపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దృష్టి సారించింది. దేశవ్యాప్తంగా ఉన్న ఆయన ఆఫీసులు, షోరూములు, డైమండ్ వర్క్‌షాపులపై గురువారం దాడులు చేసింది. ఈ దాడుల్లో దాదాపు రూ.5,100 కోట్ల విలువైన వజ్రాలు, ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు ఈడీ ప్రకటించింది. అనేక డాక్యుమెంట్లు కూడా స్వాధీనం చేసుకుంది. ఇప్పటిదాకా ఈ కేసులో ఎవ్వరినీ అరెస్టు చేయలేదు.

16



గడ్కరీ, మేఘ్వాల్‌తో దేవినేని ఉమ

ప్రాజెక్టుల పరిధి

తేల్చండి!

- కృష్ణాపై ఉన్న అన్ని ప్రాజెక్టులను బోర్డు పరిధిలోకి తీసుకురండి
- ఎవరు నిర్వహించాలో తేల్చండి
- చిన్ననీటి పారుదలకు తెలంగాణ ఎక్కువ నీటిని వాడుకుంటోంది: ఏపీ
- కాళేశ్వరం కొత్తదేనన్న కేంద్రం
- **టీవీ పెడితే పోలవరమే: గడ్కరీ**

2

టెట్ సెంటర్లు మళ్లీ మార్చుకోవచ్చు

- నేటి సాయంత్రం 5 వరకూ చాన్స్
- ఇతర రాష్ట్రం, జిల్లాల్లో సెంటర్లు వచ్చిన వారికి అవకాశం: గంటా
- 2న పరీక్ష.. ఇతరులకు యథాతథం

5



రాముని భరతనామ జపం

పరంజ్యోతి

రామ వియోగంతో దశరథుడు మరణించాక అంత్యక్రియలు నిర్వర్తించిన భరతుణ్ణి.. రాజ్యభారం వహించాల్సిందిగా కౌసల్య, మంత్రులు, రాజోద్యోగులు విశేషించి కులగురువు వశిష్ఠుడు కోరారు. భరతునికి పెద్ద సమస్యే ఎదురైంది. అంతరాత్మ అంగీకరించని ఆజ్ఞను ఎలా పాటించడం? గురువుకు నచ్చజెప్పడమెలా? అని ఆలోచించాడు. ప్రవృత్తి, నివృత్తి.. అని ధర్మం రెండు విధాలు. ప్రవృత్తి దేహధర్మం. నివృత్తి ఆత్మధర్మం. దేహధర్మమేమో.. కౌసల్య, వశిష్ఠుల ఆజ్ఞ పాటించి రాజ్యాధికారాన్ని స్వీకరించాలని భరతుడిని ప్రోత్సహిస్తోంది. ఆత్మ ధర్మమేమో.. రామునికి శరణాగతి గావించమని ప్రబోధిస్తోంది. ఆత్మధర్మ పాలనలో దేహధర్మం అవరోధమైతే దాన్ని గౌణం (అప్రధానం)గా భావించి త్యజించాలి. ఆత్మధర్మమే పాటించాలి. అందుకే ధర్మజ్ఞుడైన భరతుడు ఆత్మధర్మం వైపే మొగ్గుచూపాడు. రామ పారతంత్ర్య రూప ఆత్మధర్మ నిర్వహణకై సద్బుద్ధిని, సామర్థ్యాన్ని ప్రసాదించమని మనసా రామశరణాగతి చేశాడు. వశిష్ఠుడికి నమస్కరించి.. "గురుదేవా! ఈ రాజ్యం మా అన్నగారిదే. నేనూ మా అన్నగారి వాడనే. శ్రీరాముడే నా జీవితాదర్శం. జ్యేష్ఠుడైన ఆ పురుష శ్రేష్ఠుడే రాజ్యార్హుడు. ఈ రాజ్యాన్ని ఎంగిలి చేసి నా స్వామిని ఎంగిలి పడనివ్వను" అని తెలిపాడు. భరతుని నిర్ణయంతో చాలా రోజుల తర్వాత అయోధ్యలో ఆనందోత్సాహాలు వెల్లివిరిసినై. రామ వనవాస పర్యంతం రామపాదుకలు సేవిస్తూ రాజ్యభారం వహించిన భరతుని త్యాగానికి భగవంతుడు సంతసించాడు. లోకమంతా రామనామం జపిస్తే రాముడు భరతనామం జపించాడు.



- తంగిరాల రాజేంద్రప్రసాదశర్మ

ప్రాజెక్టుల అంచనా వ్యయం పెంచండి

- పీఎంకేఎస్‌వై భేటీలో మంత్రి ఉమ వినతి
- కృష్ణా, గోదావరి జల వివాదాల పరిష్కారానికి త్వరలో అపెక్స్ కౌన్సిల్ భేటీ ఉంటుందని వెల్లడి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో ప్రధాన మంత్రి కృషి సించాయి యోజన (పీఎంకేఎస్‌వై) కింద ఎంపికైన ప్రాజెక్టులకు సంబంధించిన అంచనా వ్యయాలను పెంచాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. గురువారం ఢిల్లీలో కేంద్ర జలవనరుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ అధ్యక్షతన పీఎంకేఎస్‌వై ప్రాజెక్టులపై సమావేశం జరిగింది. పీఎంకేఎస్‌వై కింద దేశవ్యాప్తంగా 99 ప్రాజెక్టులను ఎంపిక చేయగా, వాటిలో 8 ఏపీ ప్రాజెక్టులు ఉన్నాయి. సమావేశం అనంతరం ఉమ విలేకరులతో మాట్లాడుతూ... దశాబ్ద కాలం క్రితం రూ.1800 కోట్ల వ్యయంతో 8 ప్రాజెక్టులను ప్రారంభించారని, అందులో ఒక ప్రాజెక్టుకు ఇప్పటి వరకు రూ.498 కోట్లు దాకా ఇచ్చారని తెలిపారు. మిగిలిన 7 ప్రాజెక్టులకు సంబంధించి రూ.1098 కోట్లు రావాల్సి ఉందని, వాటిని కూడా త్వరగా ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. కాగా, ఏపీ, తెలంగాణ మధ్య కృష్ణా, గోదావరి జలాలకు సంబంధించిన వివాదాలను పరిష్కరించడానికి త్వరలో అపెక్స్ కౌన్సిల్ సమావేశం జరుగుతుందని దేవినేని ఉమా వెల్లడించారు.

టీవీ పెడితే పోలవరమే!

- ప్రాజెక్టులకు ఏపీ ప్రాధాన్యం భేష్: గడ్కరీ

సాగునీటి ప్రాజెక్టులకు తెలుగు రాష్ట్రాలు ఇస్తున్న ప్రాధాన్యం బాగుందని కేంద్ర జలవనరుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ప్రశంసించారు. పీఎంకేఎస్‌వై ప్రాజెక్టుల సమీక్ష సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'తెలుగు రాష్ట్రాలు ప్రాజెక్టులపై ఎక్కువ దృష్టి పెడుతున్నాయి. టీవీ ఆన్ చేస్తే చాలు.. పోలవరం ప్రాజెక్టు గురించే వినిపిస్తుంది. దీన్ని బట్టి ఏపీ సర్కార్ ఆ ప్రాజెక్టుకు ఎంత ప్రాధాన్యం ఇస్తుందో అర్థమవుతుంది.' అని గడ్కరీ వ్యాఖ్యానించినట్లు తెలిసింది. సాగునీటి ప్రాజెక్టులకు బడ్జెట్ కేటాయింపులనూ ఆయన అభినందించారు. 'మహారాష్ట్ర భూభాగం కంటే తెలంగాణ భూభాగం తక్కువ. జనాభా కూడా తక్కువ. కానీ మహారాష్ట్ర సాగునీటి రంగానికి రూ.7 వేల కోట్లు కేటాయిస్తే, తెలంగాణ రూ.26 వేల కోట్లు కేటాయించింది. ఏపీ కూడా అదే స్థాయిలో కేటాయించింది.' అన్నారు.

ప్రాజెక్టుల పరిధి తేల్చండి!

- చిన్ననీటి పారుదలకు తెలంగాణ ఎక్కువ నీటిని వాడుకుంటోంది
- కృష్ణా, గోదావరి నదీ యాజమాన్య బోర్డుల భేటీలో ఏపీ సర్కార్ వాదన



ఢిల్లీలో జరిగిన సమావేశంలో కేంద్ర మంత్రి గడ్కరీ, దేవినేని

న్యూఢిల్లీ/అమరావతి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల్లో కృష్ణా నదిపై ఉన్న అన్ని ప్రాజెక్టులను కృష్ణా నది యాజమాన్య బోర్డు పరిధిలోకి తీసుకురావాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం డిమాండ్ చేసింది. ఏ ప్రాజెక్టును ఏ రాష్ట్రం నిర్వహించాలన్న అంశాన్నీ తేల్చాలని కోరింది. గురువారం ఢిల్లీలో కేంద్ర జలవనరుల శాఖ కార్యదర్శి యూపీ సింగ్ సమక్షంలో కృష్ణా, గోదావరి నదీ యాజమాన్య బోర్డుల సమావేశం జరిగింది. ఈ భేటీలో ఏపీ, తెలంగాణ నడుమ నెలకొన్న జలవివాదాలపై చర్చ జరిగింది. సమావేశంలో ఆంధ్రప్రదేశ్ నుంచి జలవనరుల శాఖ కార్యదర్శి శశిభూషణ్ కుమార్, ఇంజనీర్ ఇన్ చీఫ్ ఎం.వెంకటేశ్వర రావు, తెలంగాణ నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి, ఇంజనీర్ ఇన్ చీఫ్ మురళీధర్ పాల్గొన్నారు. ప్రాజెక్టులను బోర్డు పరిధిలోకి తీసుకురావాలన్న ఏపీ వాదనను తెలంగాణ అధికారులు వ్యతిరేకించారు. దీంతో బోర్డు అధికారులు ఎలాంటి నిర్ణయం తీసుకోకుండానే సమావేశాన్ని ముగించారు.

ఏపీ వాదనను సమర్థించిన యూపీ సింగ్

కృష్ణా నదిపై ఉన్న ప్రాజెక్టుల పరిధిని నిర్ణయించేందుకు కృష్ణా రివర్ వాటర్ ట్రైబ్యునల్ తీర్పు వచ్చేవరకు వేచి ఉండాలని తెలంగాణ అధికారులు చేసిన వాదనను ఏపీ తీవ్రంగా వ్యతిరేకించింది. తక్షణం ప్రాజెక్టులను బోర్డు పరిధిలోకి తీసుకురావాలని కోరింది. ఈ వాదనతో యూపీ సింగ్ కూడా ఏకీభవించారు. ట్రైబ్యునల్ తీర్పు వచ్చిన తర్వాత అవసరమైతే మార్పులు చేసుకోవచ్చని, ప్రాజెక్టులను తక్షణం బోర్డు పరిధిలోకి తీసుకురావడం ద్వారా రెండు రాష్ట్రాల నడుమ జలవివాదాలకు ముగింపు పలుకవచ్చని ఆయన అభిప్రాయపడినట్లు సమాచారం. కృష్ణా నదీజలాల్లో వాటాలు, పట్టిసీమ ప్రాజెక్టు ద్వారా నీటి మళ్లింపు తదితర అంశాలపైనా బోర్డు సమావేశంలో చర్చ జరిగింది. ఏ ప్రాజెక్టును ఏ రాష్ట్రం నిర్వహించాలో నోటిఫై చేయాలని, ఆ తర్వాతే నీటి వాటాలు తేల్చాలని ఏపీ అధికారులు స్పష్టం చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ట్రైబ్యునల్ కేటాయించిన 811 టీఎంసీల నీటిలో తెలంగాణ 290 వాడుకోవాలని ఏపీ అధికారులు తెలిపారు. దీనికి తెలంగాణ అధికారులు అభ్యంతరం తెలిపారు. 'మాకు అంతకు మించి వాటా ఉంటుంది. ముందు నీటి వాటాలు తేల్చాల్సిందే.' అని తెలంగాణ వాదించింది.

తెలంగాణ వాదనను తిప్పికొట్టిన ఏపీ: పట్టిసీమ ద్వారా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గోదావరి నీటిని కృష్ణా నది పరీవాహక ప్రాంతానికి మళ్లిస్తోందని, అలా మళ్లించిన నీటిలో పైరాష్ట్రాలకు వాటా ఇవ్వాలని బచావత్ ట్రైబ్యునల్ తన తీర్పులో పేర్కొందని తెలంగాణ అధికారులు ప్రస్తావించారు. తెలంగాణ వాదనను ఏపీ అధికారులు తోసిపుచ్చారు. 'గోదావరి నది నుంచి సముద్రంలోకి వృథాగా పోయే నీటినే మేము పట్టిసీమ ద్వారా కృష్ణానది ప్రాంతానికి మళ్లిస్తున్నాము. వృథాగా పోయే నీటిలో వాటా ఎలా ఇస్తామ'ని ఏపీ అధికారులు సమాధానం ఇచ్చారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా గోదావరి నీటిని తెలంగాణ కృష్ణా ప్రాంతానికి తరలిస్తుందని, మరి ఆ నీటి సంగతి ఏమిటని తెలంగాణ అధికారులను ఏపీ అధికారులు నిలదీశారు. ఈ ప్రాజెక్టును కొత్తగా నిర్మిస్తున్న ప్రాజెక్టుగా పరిగణించాలన్న ఏపీ వాదనతో కేంద్ర జలవనరుల శాఖ కార్యదర్శి కూడా ఏకీభవించినట్లు సమాచారం. కాగా, నాగర్జున సాగర్ ప్రాజెక్టు నుంచి తెలంగాణ ప్రభుత్వం 89 టీఎంసీల నీటిని తీసుకుని చెరువులను నింపిందని ఏపీ అధికారులు ఆరోపించారు. దీనికి తెలంగాణ అధికారులు స్పందిస్తూ..ఈ ఏడాది సరిగా వర్షాలు లేని కారణంగా కాస్త అటూ ఇటూగా నీటి వాడుకున్నామని, అయితే, 89 టీఎంసీలు మాత్రం వాడుకోలేదని తెలిపినట్లు సమాచారం. దీనికి ఏపీ అధికారులు స్పందిస్తూ.. వర్షాలు ఎన్ని పడ్డాయి? ఎన్ని నీళ్లు అందాయి? అనేదానిపై లెక్కలు ఉన్నాయా అని ప్రశ్నించారు.

తెలంగాణ, ఆంధ్ర రైతుల జలజగడం!

మైలవరం, ఫిబ్రవరి 15: కృష్ణా జిల్లా మైలవరం మండలం మొర్సుమిల్లి వద్ద గల మైలవరం బ్రాంచి ఎన్నెస్పీకాల్వ 27వ కిలోమీటరులోని రెగ్యులేటర్ వద్ద బుధవారం అర్ధరాత్రి హైడ్రామా నడిచింది. మైలవరం సరిహద్దులోని తెలంగాణ రైతులు ఈ రెగ్యులేటర్ వద్దకు వచ్చి షట్టర్లను పైకె త్తేందుకు ప్రయత్నించారు. సమాచారం అందుకున్న మొర్సుమిల్లి రైతులు పొందుగల పంగిడి చెరువు నీటిసంఘం అధ్యక్షుడు బొందలపాటి సుధాకర్‌ను వెంటబెట్టుకుని వచ్చారు. ఈ సందర్భంగా ఇరువర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం సాగింది. ఇంతలో మైలవరం పోలీసులు హుటాహుటిన మొర్సుమిల్లి రెగ్యులేటర్ వద్దకు చేరుకొని.. ఇరు వర్గాలకు నచ్చజెప్పి పంపించివేశారు.

ప్రతిసారీ ఇబ్బందిపెడుతున్నారు!

- శశిభూషణ్‌ను ఉద్దేశించి హరీశ్ వ్యాఖ్య

బోర్డు సమావేశం ముగిసిన అనంతరం బయటకు వచ్చే సమయంలో ఏపీ జలవనరుల శాఖ కార్యదర్శి శశిభూషణ్ కుమార్‌ను ఉద్దేశించి తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు సరదా వ్యాఖ్యలు చేశారు. మీరు ప్రతిసారీ మమ్మల్ని ఇబ్బంది పెట్టేలా వాదనలు సిద్ధం చేసుకుని వస్తున్నారు. దీనికి శశిభూషణ్ స్పందిస్తూ.. 'మీరు లేని ప్రాజెక్టులను ఉన్నట్లు చూపుతుంటే, మేం ఉన్నవాటి గురించీ మాట్లాడకపోతే ఎలా?' అని వ్యాఖ్యానించారు.

సెల్ వెలుగులో శస్త్రచికిత్సలా?

- జీజీహెచ్‌పై సర్కారు సీరియస్
- డీఎంఈతో విచారణకు ఆదేశం
- ఆంధ్రజ్యోతి కథనాన్ని సుమోటోగా స్వీకరించిన రాష్ట్ర హక్కుల కమిషన్
- నేడు ఆస్పత్రికి మంత్రి కామినేని



'ఆంధ్రజ్యోతి' కథనం చూపుతూ జీజీహెచ్ వద్ద గురువారం ధర్నా చేస్తున్న స్థానిక ఎమ్మెల్యే ముస్తఫా

గుంటూరు (మెడికల్) ఫిబ్రవరి 15: గుంటూరు ప్రభుత్వాస్పత్రిలో సెల్‌ఫోన్ లైట్ వెలుగులో ఆపరేషన్లు చేస్తున్న ఉదంతంపై 'సెల్ వెలుగే దిక్కు' పేరిట ఆంధ్రజ్యోతి గురువారం సంచికలో వెలువడిన కథనం..ప్రభుత్వ యంత్రాంగాన్ని కదిలించింది. ఆపరేషన్ థియేటర్‌లో లైట్లు సమకూర్చని ఈ ఉదంతంలో అధికారుల పాత్రపై విచారణ జరిపి నివేదిక అందజేయాలని వైద్య విద్యా సంచాలకులు(డీఎంఈ) ఎన్.సుబ్బారావును ప్రభుత్వం ఆదేశించింది. ఆయన్నే విచారణాధికారిగా నియమించింది. సీఎం ఆదేశాలపై మంత్రి కామినేని శ్రీనివాస్ శుక్రవారం జీజీహెచ్‌ని సందర్శించనున్నారు. అప్పటికి డీఎంఈ ప్రాథమిక విచారణ పూర్తవుతుంది. ఆయన ఇచ్చే నివేదిక ఆధారంగా జీజీహెచ్‌లో అప్పటికప్పుడు బాధ్యులైన అధికారులపై మంత్రి చర్యలు తీసుకొంటారని చెబుతున్నా రు. దీంతో ఎవరిపై వేటు పడుతుందో అనే ఆందోళన వైద్యాధికారుల్లో కనిపిస్తోంది. కాగా, ఆంధ్రజ్యోతి కథనాన్ని రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ సుమోటోగా స్వీకరించింది. రోగులకు సెల్‌ఫోన్ టార్చ్‌లైట్ వెలుగులో ఎందుకు శస్త్రచికిత్సలు చేయాల్సి వచ్చిందో వివరణ ఇవ్వాల్సిందిగా రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి పూనం మాలకొండయ్య, గుంటూరు డీఎంహెచ్‌వో, జీజీహెచ్ సూపరింటెండెంట్‌ను.. కమిషన్ ఆదేశించింది. జీజీహెచ్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలంటూ నరసరావుపేట మున్సిపల్ కౌన్సిలర్ మాడిశెట్టి మోహన్‌రావు హక్కుల కమిషన్‌లో ఒక పిటిషన్ వేశారు.

జీజీహెచ్ వద్ద ఉద్రిక్తత

గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహ్మద్ ముస్తఫా గురువారం జీజీహెచ్ సూపరింటెండెంట్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. జీజీహెచ్‌పై కథనం ప్రచురించిన ఆంధ్రజ్యోతి పత్రికను చూపుతూ..సూపరింటెండెంట్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆయనను పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ధర్నా చేస్తున్నవారి వద్దకు సూపరింటెండెంట్ చేరుకొని, శాంతింపజేయడానికి ప్రయత్నించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని పరిస్థితులపై ఆయనను ఎమ్మెల్యే ముస్తఫా నిలదీశారు. కాగా, శస్త్రచికిత్సలకు ఉపయోగించే సున్నితమైన పరికరాలకు కూడా ఈ ఆస్పత్రిలో బాగా కొరత ఉన్నట్టు చెబుతున్నారు.

లైట్లు లేని మాట నిజమే

"కుక్కల దాడిలో తీవ్రంగా గాయపడిన ఓ మహిళకు ప్లాస్టిక్ సర్జరీ నిర్వహించాం. ఈ శస్త్ర చికిత్స జరుగుతుండగా ఆపరేషన్ థియేటర్‌లో ఐదు నిమిషాల పాటు కరెంటు పోయింది. థియేటర్‌లోని వైద్యులు ఆ కొద్దిసేపు సెల్‌ఫోన్ వెలుగుని వాడుకొన్నారు. ఈ థియేటర్‌లో రెండు టేబుళ్లు ఉన్నాయి. అందులో ఒక టేబుల్‌పై ఉన్న రెండు లైట్లు వెలగడం లేదు. కొత్త లైట్ల కొనుగోలు కోసం చర్యలు తీసుకొంటున్నాం. త్వరలో వాటిని థియేటర్‌లో ఏర్పాటు చేస్తాం"

– జీజీహెచ్ సూపరింటెండెంట్ రాజు నాయుడు

విద్యుత్ అంతరాయం వల్లనే..

- ఆంధ్రజ్యోతి కథనానికి డీఎంఈ వివరణ

ఆపరేషన్ థియేటర్‌లో లైట్లు అందుబాటులో ఉన్నాయి. రోగికి ఆపరేషన్ చేస్తున్న సమయంలో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. జనరేటర్ వేసినా, ఎంసీబీ ట్రిప్ అవ్వడంతో ఆ థియేటర్‌లో లైట్లు వెలగలేదు. అది కేవలం మూడు, నాలుగు నిముషాలు మాత్రమే. ఎమర్జెన్సీ కేసుకు ఆ సమయంలో ఆపరేషన్ జరగడం లేదు.

- ఎన్. సుబ్బారావు, డీఎంఈ



నేత్రపర్వంగా అమరేశ్వరుని రథోత్సవం

అమరావతి, ఫిబ్రవరి 15: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం గుంటూరు జిల్లా అమరావతిలోని అమరేశ్వరుని రథోత్సవం నయనానందకరంగా.. ఉత్సాహంగా సాగింది. బాలచాముండికా సమేతుడైన అమరేశ్వరస్వామి రథంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు.

విజయవాడలో..: మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం విజయవాడ కెనాల్ రోడ్డులో రథోత్సవం వైభవంగా సాగింది. ఇంద్రకీలాద్రిపై ఉన్న గంగాపార్వతీ సమేత మల్లేశ్వరస్వామి ఉత్సవమూర్తులతోపాటు పాతశివాలయంలోని భద్రకాళి వీరభద్రస్వామి, భ్రమరాంబ మల్లేశ్వరస్వామి, బుద్ధవారి గుడిలోని వసంత మల్లికార్జున భ్రమరాంబల ఉత్సవమూర్తులను రథంపై ఊరేగించారు.

సీపీటీ లేని సీఏ మేలో

- మునుపు ఒకే పరీక్ష.. ఇప్పుడు నాలుగు

సీఏలో కొత్తవిధానంతో కూడిన ఫౌండేషన్ కోర్సు పరీక్షను మేలో నిర్వహిస్తారు. తొలి అంకంగా పేర్కొనే కామన్ ప్రొఫిషియెన్సీ టెస్ట్ (సీపీటీ)ను ఫౌండేషన్‌గా మార్చారు. ఈ మేరకు 2017లో జూన్‌లో ప్రవేశాలు పొందిన బ్యాచ్ వాస్తవానికి అదే ఏడాది డిసెంబరులో పరీక్ష రాయాల్సి ఉన్నా సిలబస్ పూర్తిగా వెలువడకపోవడంతో మేలో నిర్వహించనున్నారు. కొత్త విధానమైన 'ఫౌండేషన్'ను ఆబ్జెక్టివ్, డిస్క్రిప్టివ్‌గా నిర్వహిస్తారు. ఆబ్జెక్టివ్ ప్రశ్నలతో విశ్లేషణ సామర్థ్యం, డిస్క్రిప్టివ్ ప్రశ్నలతో భావవ్యక్తీకరణ నైపుణ్యాలు మెరుగుపడతాయన్న ఆలోచనతో ఈమార్పు చేశారు. అబ్జెక్టివ్, డిస్క్రిప్టివ్‌లకు సమాన మార్కులు ఉంటాయి.

'ఫౌండేషన్'ను నాలుగు పేపర్లుగా పరీక్షను నిర్వహిస్తారు. వందమార్కులకు ఉండే ప్రతి పేపర్‌ను 3 గంటల పాటు నిర్వహిస్తారు. మొదటి పేపర్ ప్రిన్సిపుల్స్ అండ్ ప్రాక్టీస్ ఆఫ్ అకౌంటింగ్. రెండో పేపర్లో 60 మార్కులకు బిజినెస్‌లాస్, 40 మార్కులకు బిజినెస్ కరస్పాండెన్స్ అండ్ రిపోర్టింగ్ ఉంటాయి. మూడో పేపర్లో బిజినెస్ మేథ్స్‌కి 40, లాజికల్ రీజనింగ్‌కు 20, స్టాటిస్టిక్స్‌కు 40మార్కులు నిర్దేశించారు. నాలుగో పేపర్లో బిజినెస్ ఎకనామిక్స్‌కు 60, బిజినెస్ అండ్ కమర్షియల్ నాలెడ్జ్‌కు 40 మార్కులు కేటాయించారు. ఇక్కడ జాగ్రత్తగా నేర్చుకుని అడుగేయగలిగితే ఆ అనుభవం సీఏ తదుపరి దశల్లో బాగా ఉపకరిస్తుందన్నది నిపుణుల అభిప్రాయం. డిస్క్రిప్టివ్ విధానంలో పది లైన్లు రాయాల్సిన చోట నాలుగు వాక్యాలు రాసినా ఏవో కొన్ని మార్కులు వస్తాయని, దీంతో మూకుమ్మడిగా ఒకే మార్కు దగ్గర ఎక్కువ మంది విద్యార్థులు ఉండే అవకాశాలు తగ్గుతాయని అంటున్నారు.

సీపీటీతో పోల్చితే 'ఫౌండేషన్' ద్వారా విద్యార్థులకు ఎంతో ప్రయోజనం ఉంటుందని నిపుణులు అంటున్నారు. ఇంటర్‌కు సీఏ ఫౌండేషన్‌కు మధ్య వ్యవధిని 6 నెలలుగా ఉంచారు. ఫౌండేషన్‌లో పరీక్షించే టాపిక్స్‌లో రీజనింగ్ కూడా ఉంది. కోర్సులో ఉండే కష్టనష్టాలపై ఆదిలోనే అవగాహన ఉండేలా ఫౌండేషన్‌ను తీర్చిదిద్దారు. సీపీటీ ఉన్నప్పుడు గత ఏడాది జనవరిలో 46 శాతం, జూలైలో 41 శాతం, ఈ ఏడాది జనవరిలో 38 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. కొత్త పద్ధతిలో ఈ సంవత్సరం జూలైలో వచ్చే ఫలితాలు ఎలా ఉంటాయో చూడాలి మరి!

-స్టడీ డెస్క్

సబ్జెక్ట్	పరీక్ష తేదీ
పేపర్-1: ప్రిన్సిపుల్స్ అండ్ ప్రాక్టీస్ ఆఫ్ అకౌంటింగ్	10-5-18
పేపర్-2: బిజినెస్ లాస్, బిజినెస్ కరస్పాండింగ్, రిపోర్టింగ్	12-5-18
పేపర్-3: బిజినెస్ మేథమెటిక్స్, లాజికల్ రీజనింగ్, స్టాటిస్టిక్స్	14-5-18
పేపర్-4 బిజినెస్ ఎకనామిక్స్, బిజినెస్, కమర్షియల్ నాలెడ్జ్	16-5-18

(అన్ని పరీక్షలు ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 వరకు)

విద్యార్థులకెంతో ప్రయోజనం

"ఫౌండేషన్ ఎగ్జామ్‌లో ఆబ్జెక్టివ్, డిస్క్రిప్టివ్ విధానాలకు సమాన ప్రాధాన్యం ఇచ్చారు. అలాగే పేపర్లు కూడా సీఏ కోర్సును బలంగా పరిచయం చేసేలా ఉన్నాయి. మొత్తమ్మీద చేసిన మార్పులు ఇటు విద్యార్థికి ప్రయోజనం కలిగించేలా, అటు ప్రొఫెషన్‌కు సానుకూలంగా ఉన్నాయనటంలో సందేహం లేదు"

- సీఏ ప్రకాశ్, అకడమిక్ డైరెక్టర్, మాస్టర్ మైండ్స్

మరో వివాదంలో రమణ దీక్షితులు

- మాండ్యాలో నిర్వహించిన..ప్రైవేట్ శ్రీవారి కల్యాణోత్సవానికి హాజరు
- నిబంధనల ఉల్లంఘనపై టీటీడీ విచారణ



తిరుమల, ఫిబ్రవరి 15: తిరుమల ఆలయ ప్రధాన అర్చకులు రమణ దీక్షితులు మరో వివాదంలో చిక్కుకున్నారు. టీటీడీ నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటుగా నిర్వహించిన శ్రీవారి కల్యాణోత్సవంలో పాల్గొని, పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ఆయన పెద్ద కుమారుడు వెంకటపతి దీక్షితులు కూడా ఈ కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. దీనిపై టీటీడీ అధికారులు విచారణ చేపట్టారు. నిబంధనల ప్రకారం శ్రీవారి ఆలయ అర్చకులు ప్రైవేటు కార్యక్రమాల్లో పాల్గొనకూడదు. అటువంటిది కర్ణాటకలోని మాండ్యాలో ఈనెల పదో తేదీన నిర్వహించిన కల్యాణోత్సవ సేవలో వీరిద్దరూ పాల్గొన్నారు. పూజలతోపాటు స్వామివారి వివాహ తంతూ నిర్వహించారు. అదేరోజున హైదరాబాదులో టీటీడీ ఆధ్వర్యంలో శ్రీవారి కల్యాణోత్సవం జరిగినా రమణదీక్షితులు ఆ కార్యక్రమానికి హాజరు కాలేదు. తమను కించపరిచేలా రమణదీక్షితులు మాట్లాడుతున్నారంటూ ఆలయ కైంకర్య అర్చకులు మీడియా ముందు వాపోవటం సంచలనమైంది. రెండేళ్లుగా తిరుమలలో విధులకు హాజరు కాని నేపథ్యంలో రమణదీక్షితులు కుమారుడు వెంకటపతి దీక్షితులను బ్రహ్మోత్సవాలప్పుడు సూర్యప్రభవాహనం నుంచి టీటీడీ తొలగించింది. గోవిందరాజస్వామి ఆలయంలో విధులు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసినా..ఆయన ఇంతవరకు హాజరు కాకపోవటం గమనార్హం.

లోకం తీరు



విశ్వరూపం హిట్ అయింది. ఇక రాజకీయ విశ్వరూపం హిట్ అవుతుందో లేదా చూడాలి !

తగ్గిన రాత్రి ఉష్ణోగ్రతలు

విశాఖపట్నం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): కోస్తా, రాయలసీమల్లో మరోసారి చలి వాతావరణం నెలకొంది. వాయువ్య దిశ నుంచి పొడిగాలులు రావడంతో రాత్రి ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా తగ్గాయి. సాధారణం కంటే ఉత్తర కోస్తాలోని కళింగపట్నంలో ఆరు, విశాఖ విమానాశ్రయంలో ఐదు డిగ్రీలు తక్కువగా నమోదయ్యాయి. కళింగపట్నంలో 15 డిగ్రీలు నమోదైంది. తెలంగాణలో కూడా రాత్రి చలి వాతావరణం కొనసాగింది. రానున్న ఇరవై నాలుగు గంటల్లో రెండు రాష్ట్రాల్లో వాయువ్య గాలుల ప్రభావం కొనసాగుతుందని వాతావరణ శాఖ తెలిపింది. ఇంకా పొడి వాతావరణం నెలకొంటుందని పేర్కొంది.



కాంగ్రెస్‌లోని దళితులు పాపాత్ములు

అంబేడ్కర్‌ను మోసం చేసింది, ఆయన అంత్యక్రియలకు స్థలం ఇవ్వకుండా ఇబ్బంది కలిగించినది, ఎన్నికలలో ఓడించింది కాంగ్రెస్ వారు కాదా? ఇంకా కాంగ్రెస్ పార్టీలో కొనసాగే దళితులు పాపాత్ములే.

- రమేష్ జిగజిణగి, కేంద్రమంత్రి



ఉగ్ర సంస్థల్లో ముస్లింలనూ లెక్కిస్తారా?

సైనికుల్లో భారత ముస్లింలు ఎందరు చనిపోయారో ఒవైసీ లెక్కచెబుతారు. అలాగే జవాన్లపై దాడులు చేసి చంపేస్తున్న ఉగ్రవాద సంస్థల్లో ముస్లింల సంఖ్య ఎంతో కూడా ఆయన చెబుతారా?

- బీజేపీ ఎంపీ సుబ్రమణ్యస్వామి

సర్వదర్శనానికి 6గంటలు

తిరుమలలో గురువారం భక్తుల రద్దీ తక్కువగా ఉంది. దాదాపు 60వేల మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. సర్వదర్శనానికి సుమారు 6గంటలు, దివ్య దర్శనానికి సుమారు 2గంటల సమయం పడుతోంది. శనివారం సేవలకు సంబంధించి విజయాబ్యాంకులో శుక్రవారం లాటరీ ద్వారా జారీచేసే సుప్రభాతం:50, కల్యాణోత్సవం:80, డోలోత్సవం:25టిక్కెట్లు అందుబాటులో ఉన్నాయి. ఆన్‌లైన్‌లో రూ.300 టిక్కెట్లు పొందడానికి w w లో సంప్రదించాలి

- ఆంధ్రజ్యోతి,తిరుమల

పెరుగుతో హృద్రోగాలు దూరం



వాషింగ్టన్, ఫిబ్రవరి 15: పెరుగు ఆరోగ్యానికి చాలా మంచిది. ప్రతిరోజు దీన్ని ఆహారంలో తీసుకోవడం ద్వారా అధిక రక్తపోటు తగ్గుతుందని తెలుసు. అయితే, వారానికి కనీసం రెండుసార్లు పెరుగు తీసుకోవడం వల్ల హృద్రోగాలు కూడా దూరమవుతాయంటున్నారు అమెరికాలోని బోస్టన్ వర్సిటీ స్కూల్ ఆఫ్ మెడిసిన్ పరిశోధకులు. 30-55 ఏళ్ల వయసు ఉన్న 55 వేలమంది మహిళలు 40-75 ఏళ్ల వయసున్న 18వేలమంది పురుషులపై జరిపిన పరిశోధనలో ఈ విషయాన్ని గుర్తించారు.

అల్జీమర్స్‌కు కొత్త చికిత్స

వాషింగ్టన్, ఫిబ్రవరి 15: వృద్ధాప్యంలో వచ్చే అల్జీమర్స్‌ను తగ్గించేందుకు శాస్త్రవేత్తలు కొత్త పద్ధతిని కనిపెట్టారు. ఆమిలాయిడ్ ప్లాక్స్ పెరగడం వల్ల అల్జీమర్స్ వస్తుంది. అయితే బేస్-1 అనే ఎంజైమ్‌ను తగ్గించడం ద్వారా ఆమిలాయిడ్ ప్లేక్స్ ఏర్పడటాన్ని తగ్గించవచ్చంటున్నారు అమెరికాకు చెందిన క్లైవెలాండ్ క్లినిక్ లెర్నర్ రీసెర్చి ఇన్‌స్టిట్యూషన్ శాస్త్రవేత్తలు. ఎలుకల్లో బేస్-1 ఎంజైమ్ తగ్గించడం ద్వారా వాటిల్లో అల్జీమర్స్ దూరమైనట్లు శాస్త్రవేత్తలు వెల్లడించారు.

రాహుల్ క్యాంటీన్‌గా మౌలాసాబ్ బడ్డీకొట్టు

- కాంగ్రెస్ అధినేత వచ్చి వెళ్లాక మారిన సీన్
- గిరాకీ పెరిగింది..వ్యాపారి దశ తిరిగింది

బెంగళూరు, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): రాయచూరు జిల్లా కల్మలా గ్రామం మౌలాసాబ్ బడ్డీ కొట్టుకు దశ తిరిగింది. జాతీయస్థాయిలో ప్రచారం లభించింది. ఈ నెల 12న కర్ణాటకలోని దేవదుర్గలో బహిరంగసభకు వెళ్తూ...కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ, మౌలాసాబ్ బడ్డీకొట్టు దగ్గర ఆగారు. మిరపకాయ బజ్జీ, కారం బొరుగులు తిని అక్కడే టీ తాగారు. అంతే..మౌలాసాబ్ బడ్డీకొట్టు కాస్తా ఒక్కసారిగా రాహుల్ గాంధీ క్యాంటీన్‌గా మారిపోయింది. ఆనాడు రెండు బజ్జీలు తిన్న రాహుల్ గాంధీ రూ.2 వేల నోటు ఇచ్చి చిల్లర తీసుకోలేదు. మరికొంత మంది బజ్జీలు తిని వెయ్యి రూపాయలు ఇచ్చి వెళ్లిపోయారు. ఏడేళ్లుగా బడ్డీకొట్టు నిర్వహిస్తున్న మౌలాసాబ్‌కు రోజుకు రూ.1,500 వ్యాపారం జరుగుతోంది. రాహుల్ వెళ్లిన తర్వాత నాలుగు రోజులుగా డిమాండ్ పెరిగింది. ఆ మార్గంలో వెళ్లే ద్విచక్ర వాహనదారులే కాకుండా, కార్లు, లారీల్లో వెళ్లేవారు సైతం తమ వాహనాలను ఆపి మరీ బజ్జీలు ఆరగిస్తున్నారు. రాహుల్ బజ్జీలు తిన్న బల్లపై యువకులు కూర్చొని సెల్ఫీలు తీసుకుంటున్నారు.


మౌలాసాబ్ బడ్డీకొట్టులో రాహుల్ తదితరులు (ఫైల్)

నగ్నపూజల నరబలి

శిశువు తల కేసులో వీడిన మిస్టరీ

యజమానే హంతకుడు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): 'చంద్రగ్రహణం రోజు నరబలి ఇస్తే అనారోగ్యం నుంచి నీ భార్య కోలుకుంటుంది' అని మంత్రగాళ్లు చెబితే ఆ భర్త గుడ్డిగా నమ్మాడు. అందుకు.. మంత్రగాళ్లు ఏం చెబితే అది చేశాడు. నరబలికి శిశువు కావాలన్నారు. సరే అన్నాడు. అంతకు ముందు తమతో కలిసి దంపతులు నగ్నంగా కూర్చొని పూజలు చేయాలని చెప్పారు. భార్యతో కలిసి ఒంటిమీద నూలు పోగు కూడా లేకుండా పూజలకు కూర్చున్నాడు. చంద్రగ్రహణం రాత్రే శిశువు తలను నరికి తేవాలన్నారు. దీంతో ఫుట్‌పాత్‌పై తల్లిఒడిలో ఆదమరచి నిద్రిస్తున్న శిశువును అపహరించాడు. నిర్దాక్షిణ్యంగా ఆ శిశువు తలను నరికి రక్తమోడుతున్న శిరస్సును పాలిథిన్ కవర్లో పట్టుకొచ్చాడు. చంద్రుడి కిరణాలు శిశువు తలపై పడాలని మంత్రగాళ్లు చెబితే రాత్రంతా ఆ ఖండిత శిరస్సును మేడపైనే ఉంచాడు. పట్టుబడకుండా కేసును పక్కదోవ పట్టించేందుకు విశ్వప్రయత్నాలు చేశాడు. చివరకు భార్యతో కలిసి ఊచలు లెక్కబెడుతున్నాడు! ఈ నెల 1వ తేదీన హైదరాబాద్ ఉప్పల్‌లోని చిలుకానగర్‌లో ఓ భవనంపై దొరికిన శిశువు తల ఘటనలో మిస్టరీ వీడింది. ఆ ఇంటి యజమాని రాజశేఖరే ఈ ఘోరానికి పాల్పడ్డాడని రాచకొండ పోలీసులు తేల్చారు. నిందితుడు రాజశేఖర్, అతడి భార్య శ్రీలతను అరెస్టు చేశారు.

రైతుకు దన్ను!

- ఈసారి 25-30% పెరగనున్న నిధులు
- వ్యవసాయ అనుబంధ రంగాలకు ప్రాధాన్యం
- వ్యవసాయ బడ్జెట్ కసరత్తు ప్రారంభం



అమరావతి, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): వ్యవసాయాన్ని మొదటి ప్రాధాన్య రంగంగా గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం... రైతులకు దన్నుగా ఉండేలా కొత్త బడ్జెట్‌ను ప్రవేశపెట్టేందుకు కసరత్తు చేస్తోంది. ఆర్థికమంత్రి యనమల రామకృష్ణుడు అధ్యక్షతన గురువారం సచివాలయంలో ప్రీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఈ సమావేశంలో వ్యవసాయమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, మత్స్య, పశుసంవర్ధక, మార్కెటింగ్‌శాఖ మంత్రి ఆదినారాయణరెడ్డి, వ్యవసాయ అనుబంధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. 2017-18లో వ్యవసాయ ప్రణాళిక వ్యయం కింద రూ.1170 కోట్లు, ప్రణాళికేతర వ్యయం కింద రూ.4355 కోట్లు కేటాయించారు. మొత్తం రూ.5525కోట్లు కేటాయించగా, 2018-19 వ్యవసాయ బడ్జెట్‌లో రూ.20 నుంచి 30శాతం నిధులు పెంచేలా ప్రతిపాదనలు చేసినట్లు సమాచారం. ప్రధానంగా రైతు రుణమాఫీకి నాలుగో విడత నిధులను విడుదల చేయనున్నట్లు అధికార వర్గాల ద్వారా తెలిసింది. ఆక్వా, మత్స్య, పాడి తదితర వ్యవసాయ అనుబంధరంగాల్లో మూడో త్రైమాసికానికి 25.6శాతం వృద్ధిరేటు సాధించినందున ఇదే ఉత్సాహంతో మరింత వృద్ధి సాధించేందుకు నిధులు పెంచనున్నట్లు తెలుస్తోంది. వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్‌కు రూ.500కోట్లు కేటాయించాలని మంత్రి ఆదినారాయణరెడ్డి కోరగా, వ్యవసాయ యాంత్రీకరణ, సాగు సాంకేతికతకు నిధులు పెంచాలని మంత్రి సోమిరెడ్డి కోరినట్లు సమాచారం. కాగా, రాష్ట్రంలో ఉద్యానతోటలను కోటి ఎకరాలకు పెంచి, రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు నిధుల కేటాయింపునకు అధికారులు బడ్జెట్ అంచనాలు రూపొందించారు. రైతులకు సాగు ఖర్చులు తగ్గించేందుకు ప్రకృతి సేద్యం వైపు ప్రోత్సహించడంతో పాటు వ్యవసాయ యాంత్రీకరణకు పెద్దపీట వేయనున్నట్లు తెలిసింది. కౌలు రైతులకు గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది రూ.2వేల కోట్లు రుణాలిచ్చిన ప్రభుత్వం... కొత్త బడ్జెట్‌లో పంట రుణాల లక్ష్యాన్ని పెంచనున్నట్లు అధికారవర్గాల ద్వారా తెలిసింది. గ్రామీణ ప్రజల తలసరి ఆదాయం పెరిగే విధంగా బడ్జెట్ ప్రతిపాదనలు రూపొందించాలని యనమల అధికారులకు సూచించారు. సచివాలయంలో గురువారం ఉదయం వ్యవసాయం, అనుబంధ శాఖలు, మార్కెటింగ్, పశు సంవర్ధకం, సహకార, మునిసిపల్, పట్టణాభివృద్ధి శాఖలతో బడ్జెట్ ప్రతిపాదనలపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా యనమల మాట్లాడుతూ. ప్రాథమిక రంగమైన వ్యవసాయం, అనుబంధరంగాల్లో సమ్మిళిత వృద్ధి సాధించే విధంగా బడ్జెట్ ప్రతిపాదనలు ఉండాలని ఆదేశించారు.

అంతర్జాతీయ ఎర్రదొంగ అరెస్టు

4కోట్ల విలువైన 'ఎర్ర' బొమ్మలు సీజ్


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ, వెనుక స్మగ్లర్ అశోక్‌కుమార్

కడప క్రైం, ఫిబ్రవరి 15: అంతర్జాతీయ ఎర్రచందనం స్మగ్లర్ అశోక్‌కుమార్ అగర్వాల్‌ను కడప జిల్లా పోలీసులు ఎట్టకేలకు అరెస్టు చేశారు. కడప జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం ఎస్పీ అట్టాడ బాబూజీ, ఓఎస్‌డీ (ఆపరేషన్) అడ్నాన్ నయీమ్ ఆస్మి, ఫ్యాక్షన్ జోన్ డీఎస్పీ బి.శ్రీనివాసులుతో కలిసి విలేకరులకు వివరాలను వెల్లడించారు. రాజస్థాన్ జైపూర్ సిటీలోని మురళీపుర గంగా, యమున కాలనీకి చెందిన అశోక్‌కుమార్ పల రాష్ట్రాలు, ఇతరదేశాల స్మగ్లర్లతో సంబంధాలు ఏర్పరుచుకుని కడప జిల్లాలో స్మగ్లింగ్ కార్యకలాపాలకు పాల్పడుతూ వచ్చాడు. జైపూర్ సిటీలో గోడౌన్ ఏర్పాటు చేసుకుని అక్కడ ఎర్రచందనం దుంగలతో బొమ్మలను తయారు చేయించేవాడు. వాటిని చైనా, జపాన్, మలేషియా తదితర దేశాలకు రవాణా చేసేవాడు. ఇటీవల అరెస్టయిన స్మగ్లర్ల సమాచారం మేరకు కడప జిల్లా పోలీసులు రాజస్థాన్‌లో నిఘా ఉంచిన జిల్లా పోలీసులు బడా స్మగ్లర్ అశోక్‌కుమార్ అగర్వాల్‌ను అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి రూ.4 కోట్ల విలువ చేసే 3 టన్నుల ఎర్రచందనం దుంగలు, 44 ఎర్రచందనం బొమ్మలు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.



టీటీడీ బర్డ్ ట్రస్టుకు రూ.కోటి విరాళం


తిరుమల, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు మదురైకి చెందిన టీవీఎస్ శ్రీ చక్రటైర్స్ ఎండీ శోభనరామచంద్రన్ టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న బర్డ్ ట్రస్టుకు కోటి రూపాయలు విరాళంగా అందజేశారు. గురువారం మధ్యాహ్నం ఆమె జేఈవో శ్రీనివాసరాజుకు డీడీ అందజేశారు.

రాష్ట్ర ప్రభుత్వానిదే బాధ్యత: ముద్రగడ

కిర్లంపూడి, ఫిబ్రవరి 15 : కాపు రిజర్వేషన్లకు సంబంధించి కేంద్రం లేవనెత్తిన అభ్యంతరాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం అన్నారు. తూర్పుగోదావరి జిల్లా కిర్లంపూడిలో ముద్రగడ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. 'గవర్నర్ ఆమోదం తర్వాత రాష్ట్ర పరిధిలో రిజర్వేషన్లను అమలు చేయవచ్చని న్యాయకోవిదులు చెబుతున్నారు.. ఆ మేరకు రాష్ట్రంలో అమలు చేసిన తర్వాత, 9వ షెడ్యూల్‌లో పొందుపరచాలని కేంద్రానికి పంపాల్సి ఉంది.. అయితే రాష్ట్రం పరిధిలో అమలు చేయకుండా రాష్ట్రపతి అనుమతికి పంపించడంతో మీ చిత్తశుద్ధి, నిబద్ధతను అనుమానించే పరిస్థితి వచ్చింది'అని ముద్రగడ ఆరోపించారు.

రైతుల కోసం స్టార్ ఆస్పత్రి

- జిల్లా కో-ఆపరేటివ్ సొసైటీ రైతుల ట్రస్ట్ నిర్వహణ
- ఖమ్మంలో 17న ప్రారంభం.. రైతులకు హెల్త్‌కార్డులు



ఖమ్మం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఖమ్మం జిల్లా రైతుల కోసం రూ.8 కోట్లతో 100 పడకలతో ఓ స్టార్ ఆస్పత్రిని ఈ నెల 17వ తేదీన ప్రారంభిస్తామని ఖమ్మం డీసీసీబీ ఛైర్మన్ మువ్వా విజయ్‌బాబు తెలిపారు. ఖమ్మం జిల్లా కో-ఆపరేటివ్ సొసైటీ రైతుల ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించే స్టార్ ఆస్పత్రి తెలుగు రాష్ట్రాల్లో ఇదే మొదటిది అన్నారు. జిల్లా రైతు సహకార సంఘాల సభ్యులకు హెల్త్‌కార్డులు పంపిణీ చేసి వారి కుటుంబానికి 50% రాయితీపై వైద్య సేవలు అందిస్తామన్నారు. ప్రారంభోత్సవానికి మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పోచారం శ్రీనివాసరెడ్డి, జగదీశ్‌రెడ్డి, హరీశ్‌రావు, లక్ష్మారెడ్డి, ఆప్కాబ్, టెస్కాబ్ ఛైర్మన్లు, తెలుగు రాష్ట్రాల జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఛైర్మన్లు, ఖమ్మం జిల్లా ప్రజాప్రతినిధులు, సొసైటీ అధ్యక్షులను ఆహ్వానించామన్నారు. మృతి చెందిన రైతులకు తమ ట్రస్ట్ ద్వారా ఆర్థిక సాయం చేస్తున్నామని, అయితే వైద్యం కోసం రైతులు భారీగా నష్టపోతుండటంతో ఆస్పత్రి నిర్మించాలని నాలుగేళ్ల క్రితం నిర్ణయించామన్నారు.

సీసీఎల్‌ఏ బలోపేతం

- అసిస్టెంట్ సెక్రటరీలుగా ముగ్గురు డిప్యూటీ కలెక్టర్లు

అమరావతి, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): భూపరిపాలన ప్రధాన కమిషనరేట్(సీసీఎల్‌ఏ)ను బలోపేతం చేసేలా ఖాళీపోస్టులను భర్తీచేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ముగ్గురు డిప్యూటీ కలెక్టర్లను అసిస్టెంట్ సెక్రటరీలుగా నియమించింది. సీఆర్‌డీఏలో ఇటీవల భారీ భూ కుంభకోణాన్ని వెలుగులోకి తీసుకొచ్చిన కె.ఈ సాధనను సీసీఎల్‌ఏ కార్యాలయంలో అసిస్టెంట్ సెక్రటరీగా నియమించారు. టీఆర్‌అండ్‌బీ భూసేకరణ విభాగంలో పనిచేస్తున్న ఎ.సుబ్బరాజు, శాప్‌లో పనిచేస్తోన్న వి.సుబ్బారావులను కూడా సీసీఎల్‌ఏ కార్యాలయంలోకి బదిలీచేసి అసిస్టెంట్ సెక్రటరీలుగా నియమించారు. ఎ. ప్రభావతిని పురపాలకశాఖలో కార్యదర్శిగా నియమించారు. సీసీఎల్‌ఏలోనే అసిస్టెంట్ సెక్రటరీగా పనిచేస్తున్న ఎస్.వి.సుబ్బలక్ష్మిని తూర్పుగోదావరి జిల్లా రెవెన్యూ అధికారి(డీఆర్‌వో)గా నియమించారు. అనంతపురం జిల్లా రెండో జాయింట్ కలెక్టర్‌గా పనిచేస్తున్న ఖాజా మొహిద్దీన్‌ను శాసనమండలి ఛైర్మన్‌కు ఓఎస్‌డీగా నియమించారు. పురపాలకశాఖలో కార్యదర్శిగా పనిచేస్తున్న హెచ్.సుబ్బరాజును అనంతపురం జేసీ2గా నియమించారు. వీరంతా వెంటనే సంబంధిత అధికారులకు రిపోర్టు చేయాలని సాధారణపరిపాలన శాఖ గురువారం ఆదేశించింది.


బుల్లిరామయ్య పార్థివ దేహానికి శ్రద్ధాంజలి ఘటిస్తున్న మంత్రులు

బుల్లిరామయ్యకు కన్నీటి వీడ్కోలు

మానేపల్లి(పి.గన్నవరం/అమలాపురం), ఫిబ్రవరి 15: కేంద్ర మాజీ మంత్రి బోళ్ల బుల్లిరామయ్య భౌతికకాయానికి మానేపల్లి శ్మశానవాటికలో గురువారం అధికార లాంఛనాలతో అంత్యక్రియలు జరిగాయి. పలువురు మంత్రులు, శాసనసభ్యులు, నాయకులు బుల్లిరామయ్య భౌతికకాయంపై పుష్పగుచ్ఛాలు ఉంచి ఘన నివాళులర్పించారు. కాగా, బోళ్ల మృతికి మాజీ ముఖ్యమంత్రి రోశయ్య సంతాపం వ్యక్తం చేశారు.

సయీద్‌కు సంకెళ్ళు

ముంబై పేలుళ్ళ సూత్రధారి, జమాత్–ఉద్–దావా (జేయూడీ) అధినేత హఫీజ్ సయీద్‌ను పాకిస్థాన్ ఉగ్రవాదిగా గుర్తించడం విశేషమైన పరిణామం. సయీద్‌ను ఐక్యరాజ్యసమితి ఎప్పుడో ఉగ్రవాదిగా ప్రకటించినా, పాకిస్థాన్ ఆయనను ఇలా గుర్తించని విషయం తెలిసిందే. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకంటూ ఆయన కార్యాలయాలన్నింటికీ ఉన్న రక్షణ ఏర్పాట్లను ప్రభుత్వం తొలగించిన మర్నాడు పాక్ ప్రభుత్వం ఓ ఆర్డినెన్సు ద్వారా ఈ ప్రకటన చేసింది. ఐక్యరాజ్యసమితి నిషేధించిన వ్యక్తులు, సంస్థలన్నీ పాకిస్థాన్ ఉగ్రవాద వ్యతిరేక చట్టం పరిధిలోకి వస్తాయంటూ తెచ్చిన ఆ ఆర్డినెన్సు మంగళవారం నుంచి అమలులోకి వచ్చింది. హఫీజ్ సయీద్‌తో పాటు లష్కరే తొయ్యిబా, అల్‌ఖైదా, తాలిబాన్ ఇత్యాది 27 సంస్థలను సవరించిన ఈ చట్ట పరిధిలోకి వచ్చాయి. అంతర్జాతీయ ఆంక్షలను తప్పించుకోవడానికే పాకిస్థాన్ హడావుడిగా ఈ ఆర్డినెన్స్ తెచ్చిన మాట నిజమే అయినప్పటికీ, భారత్ సహా ప్రపంచానికి ఉపశమనం కలిగించే చర్య ఇది.

పారిస్‌లో కీలకమైన ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్‌ఫోర్స్ (ఎఫ్ఏటీఎఫ్) సమావేశం జరగబోతున్న నేపథ్యంలో, ఉగ్రవాద సంస్థలపై కఠినమైన చర్యలకు వివిధ విభాగాలనుంచి ఒత్తిడి పెరగడంతో ప్రభుత్వం ఈ పనికి పూనుకున్నదని పాక్ పత్రికలు అంటున్నాయి. హవాలాను, ఉగ్రవాద నిధుల చేరవేతను అరికట్టడంలో విఫలమవుతున్న దేశాలను బ్లాక్‌లిస్ట్, గ్రే లిస్ట్ పేరిట రెండు జాబితాల్లో ఎఫ్ఏటీఎఫ్ చేరుస్తుంది. అమెరికా ప్రభుత్వంనుంచి, ముఖ్యంగా ఆ దేశాధ్యక్షుడినుంచి ఇటీవలికాలంలో పాకిస్థాన్‌కు వరుస హెచ్చరికలు అందడం, ఉగ్రవాద సంస్థలపై కఠినంగా వ్యవహరించమంటూ ఒత్తిడి పెరగడం తెలిసిందే. భారత్, అమెరికాల ఒత్తిడిమేరకు ఎఫ్ఏటీఎఫ్ ఈ మారు పాకిస్థాన్‌ను గ్రే లిస్ట్‌లో చేర్చుతుందన్న ప్రచారం ముందునుంచే ఉన్నది. ఇప్పటికే ఫ్రాన్స్, బ్రిటన్ ఇత్యాది దేశాలు పాకిస్థాన్‌ను గ్రే లిస్టులో చేర్చేందుకు కట్టుబడివున్నట్టు బాహాటంగానే చెప్పాయి. సాధారణంగా అంతర్జాతీయ వేదికలపై పాకిస్థాన్ కష్టాలు ఎదుర్కొన్నప్పుడు దానిని కాపాడటానికి చైనా సిద్ధంగా ఉంటుంది. కానీ, భద్రతామండలిలో అగ్రరాజ్యాలు వీటో శక్తితో ఆశ్రితదేశాలను రక్షిస్తున్నట్టుగా ఎఫ్ఏటీఎఫ్‌లో కాపాడటం సాధ్యపడదు. ఏదో ఒక దేశం వీటోతో మిగతావారి నిర్ణయాన్ని తిరగదోడినట్టుగా కాక, ఇక్కడ ఎవరికీ వీటో అధికారం లేకుండా మెజారిటీ నిర్ణయమే అమలవుతూంటుంది. అందువల్ల, తనను ఎవరూ తప్పించలేరన్న విషయం స్పష్టంగా అర్థమై పాకిస్థాన్ ఈ నిర్ణయం తీసుకుని ఉండవచ్చు. గ్రే లిస్ట్‌లో చేరినపక్షంలో అంతర్జాతీయంగానూ, ముఖ్యంగా వాణిజ్యపరంగానూ పాకిస్థాన్‌కు నష్టం తప్పదు. ఒక విధంగా అంతర్జాతీయ సమాజం పాకిస్థాన్‌ను ఉగ్రవాద దేశంగా ప్రకటించినట్టవుతుంది కనుక పెట్టుబడులపై దాని ప్రభావం ఎంతోకొంత ఉంటుంది. మూడు బిలియన్ డాలర్ల రుణం ఉన్న పాకిస్థాన్, అంతర్జాతీయ ఆర్థిక సంస్థలనుంచి, దాతలనుంచి అందే సహకారాన్ని కోల్పోవలసి రావచ్చు. అనేక అంతర్జాతీయ ప్రాజెక్టులకు నిధులు సమకూరడమూ కష్టం. 2012 నుంచి మూడేళ్ళపాటు ఇదే హోదాను పొందిన పాకిస్థాన్ ఈ మారు తనపై ఆ ముద్ర పడకుండా జాగ్రత్తపడివుండవచ్చు. కోట్లాది రూపాయల స్థిరచరాస్తులున్న జేయూడీ ఆస్తులతో పాటు, దాని చారిటీ విభాగం ఫలా–ఎ– ఇన్సానియత్ ఫౌండేషన్ నిర్వహిస్తున్న పాఠశాలలు, మదరసాలకు చెందిన ఆస్తిపాస్తులన్నింటినీ పాక్ ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాల్సి ఉంది. వీటి నిర్వహణ ఇకపై ఎవరు చేయాలన్న విషయంలోనూ ఇప్పటికే ఓ నిర్ణయం జరిగినట్టు తెలుస్తున్నది. పాక్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగిన సయీద్ మరోమారు అమెరికా, భారత్‌లకు భయపడి అబ్బాసీ ప్రభుత్వం తనకు అన్యాయం చేసిందనీ, న్యాయస్థానాల్లో న్యాయం సాధిస్తానని అంటున్నారు.

పాకిస్థాన్ తీసుకున్న ఈ కఠినమైన నిర్ణయాన్ని కంటితుడుపు చర్యగా, తాత్కాలికమైనదిగా అభివర్ణిస్తున్నవారు కూడా లేకపోలేదు. ఎఫ్ఏటీఎఫ్ తీసుకున్న నిర్ణయం ఆధారంగా పాక్‌తో వ్యవహరించవలసింది ఆయా సభ్యదేశాలే కానీ, ఏ అంతర్జాతీయ సంస్థా ఈ నిర్ణయం అమలుకు స్వయంగా పూనుకోదు. అంతర్జాతీయ న్యాయస్థానం తీర్పును చైనా తూచ్ అన్నట్టుగానే ఎఫ్‌టీఎఫ్ నిర్ణయాన్ని కూడా త్రోసిరాజనే వీలు పూర్తిగా ఉన్నది. ముంబై దాడుల తరువాత 2008లోనే ఐక్యరాజ్యసమితి సయీద్‌పై నిషేధం విధించినప్పటికీ ఇంతకాలం ఆయన హాయిగా దేశంలో తిరగగలుగుతున్నాడంటే దానికి కారణం ఇదే. అప్పుడప్పుడు గృహనిర్బంధంలో ఉంచడం, ఏవో కేసులపై జైలులో పెట్టడం, న్యాయస్థానాల్లో కేసులు వీగిపోయేట్టు ప్రభుత్వమే జాగ్రత్తపడటం, ఆయన బయటకు రాగానే తిరిగి భారత వ్యతిరేక కార్యకలాపాలకు పునరంకితం కావడం చూస్తున్నదే. న్యాయస్థానాలతో చీవాట్లు తింటూ ఆతడికి విశేషమైన సౌకర్యాలు, భద్రత కల్పించడానికే అక్కడి ప్రభుత్వం సిద్ధపడుతుంది తప్ప ఈగవాలనివ్వదు. పాక్ ఆర్డినెన్సు నిర్ణయానికి అమెరికా ఒత్తిడితో పాటు రాబోయే ఎన్నికలు కూడా కొంత కారణం కావచ్చు. కేవలం భారత వ్యతిరేకతతో సయీద్ వంటి దుష్టశక్తులను కాపాడుకొస్తూ, పాకిస్థాన్ అంతర్జాతీయంగా అప్రదిష్టపాలవుతున్నదన్న విమర్శ దేశంలో ఇటీవల అధికమవుతున్నది. స్వయంగా తానే ఉగ్రవాదానికి బలవుతున్నప్పుడల్లా అక్కడి మీడియాలో ప్రభుత్వంపై ఈ రకపు విమర్శ జరుగుతూనే ఉన్నది. సయీద్ విషయంలో పాకిస్థాన్ ఏవో చర్యలు తీసుకుంటున్నట్టు కనిపించడం కొత్తేమీ కాదు. ఎఫ్ఏటీఏ నుంచి తప్పించుకున్న తరువాత సయీద్‌పై ఇదే కఠినవైఖరి కొనసాగుతుందన్న నమ్మకమేమీ లేదు.

ఎన్‌కౌంటర్ కేసులో పోలీసులకు శిక్ష!

"అర్థాలు మారిపోతాయి/ కాలక్రమంలో అర్థాలు మారిపోతాయి/ సందర్భాన్ని బట్టి/ హావభావాల్ని బట్టి/ అర్థాలు మారడం సహజమే/ కానీ, /మౌలికంగానే అర్థాలు మారిపోతున్నాయి/ ఎన్‌కౌంటర్, లాకప్‌డెత్‌ల అర్థాలు/ ఇప్పుడు మనకు తెలియదా?"– అని ప్రశ్నించాడు ఓ తెలుగు కవి 1994లో.

'న్యాయపాలన ఉన్న సమాజంలో నకిలీ ఎన్‌కౌంటర్లకి స్థానం లేదు. అవి తీవ్రమైన విషయాలు' అంది ఢిల్లీ హైకోర్టు ఈ వారంలో. ఎన్‌కౌంటర్ మీద ఎన్‌కౌంటర్ దూసుకుపోతోంది ఉత్తరప్రదేశ్‌లో. ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం కూడా వారికి లభిస్తోంది. పంజాబ్ రాష్ట్రంలో కూడా విపరీతంగా ఎన్‌కౌంటర్లు జరిగాయి. అక్కడ వాతావరణం మెరుగుపడిన తరువాత పోలీసుల మీద ఎన్నో కేసులు దాఖలయ్యాయి. అజిత్‌సింగ్ సందూ అన్న పోలీసు అధికారి జైల్లో ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు ఈ



ఎన్‌కౌంటర్ సంఘటనల్లో పోలీసుల మీద కేసులు పెట్టడం అరుదైన విషయం. శిక్షలు పడడం ఊహించలేం. ఉత్తరాఖండ్ నకిలీ ఎన్‌కౌంటర్ కేసులో సీబీఐ కోర్టు పోలీసులకు శిక్షవేసింది. ఢిల్లీ హైకోర్టు ఆ శిక్షను సమర్థించింది.

విషయం మరచిపోయారో లేదా లెక్క చేయడంలేదో తెలియదు. ఈ దశలో ఢిల్లీ హైకోర్టు ఏడుగురు పోలీసులకు సెషన్స్ కోర్టు విధించిన శిక్షను ఖరారు చేసింది. 2009లో ఉత్తరాఖండ్‌లో జరిగిన ఓ నకిలీ ఎన్‌కౌంటర్లో 22 సంవత్సరాల రణబీర్ సింగ్ మరణించాడు. అప్పుడు అతను ఎంబీఏ చదువుతున్నాడు. ఈ సంఘటన 2009 జులై 3న డెహ్రాడూన్లో జరిగింది. కేసు విచారణ నిష్పక్షపాతంగా ఉండాలని ఈ కేసును డెహ్రాడూన్ నుంచి ఢిల్లీకి సుప్రీం కోర్టు బదిలీ చేసింది. ఈ కేసును విచారించిన సీబీఐ ప్రత్యేక కోర్టు 17 మంది పోలీసులకు శిక్ష విధించింది. ఢిల్లీ హైకోర్టు డివిజన్ బెంచ్‌లోని ఇద్దరున్యాయమూర్తులు సీబీఐ కోర్టు తీర్పును సమర్థించారు. కానీ 10 మంది పోలీసులను ఈ కేసునుండి విముక్తి చేసి ఏడుగురికి శిక్షను ఖరారు చేశారు.

పోలీసుల కథనం ప్రకారం... మృతుడు రణబీర్ సింగ్ దోపిడీ ముఠాలో సభ్యుడు, అనుమానంతో అతడిని, అతడి స్నేహితులని సోదా చేస్తున్నప్పుడు, రణబీర్ పోలీసుల వద్ద నుంచి రివాల్వార్ లాక్కొని పోలీసులపై దాడి చేశాడు, అప్పుడు పోలీసులు జరిపిన కాల్పుల్లో అతను మరణించాడు. కానీ, నేరాన్ని చూసిన ప్రత్యక్ష సాక్షుల కథనం మరోలా ఉంది. వాళ్ళ కథనానికి పోలీసుల కథనానికీ భేదం ఉంది. ఆ రోజు 12.45 నిముషాలకు ఒక పోలీసుతో రణబీర్ సింగ్ అతని స్నేహితులకు గొడవ జరిగింది. రణబీర్ స్నేహితుడు పోలీసు అధికారి దగ్గర ఉన్న రివాల్వర్ లాక్కొని పారిపోయాడు. పోలీసులు వచ్చి రణబీర్ సింగ్‌ను తీసుకుని వెళ్లారు. ఈ కేసులో చాలా మంది ప్రత్యక్ష సాక్షుల స్టేట్‌మెంట్లని మెజిస్ట్రేట్ దగ్గర సెక్షన్ 164 క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ ప్రకారం నమోదు చేయించారు. అయినా వాళ్ళు కోర్టు ముందు ప్రతికూల సాక్ష్యం చెప్పారు. పర్వీజ్ ఖాన్ అన్న సాక్షి మాత్రం సీబీఐకి అనుకూలంగా సాక్ష్యం చెప్పాడు. అతని ప్రకారం... ఇద్దరు వ్యక్తులు పోలీసులతో ఘర్షణ పడ్డారు. అందులో ఒక వ్యక్తి పోలీసుల దగ్గర నుంచి రివాల్వార్ లాక్కొని పారిపోయాడు. అతను జోక్యం చేసుకొని అతని వద్దనున్న లైసెన్స్‌డ్ రివాల్వర్‌తో గాలిలో కాల్పులు జరిపి పరిస్థితిని అదుపులోకి తెచ్చాడు. అక్కడికి వచ్చిన పోలీసులు రణబీర్ సింగ్‌ను అరెస్టు చేశారు. రివాల్వర్ లాక్కొని పారిపోయిన వ్యక్తి రణబీర్ సింగ్ కాదు. అతని బంధువు రామ్ కుమార్. రామ్ కుమార్‌ని కూడా కోర్టులో విచారించారు. కానీ అతను సరైన సాక్ష్యం చెప్పలేదు. అతనిపై ఆ రోజు కేసు కూడా నమోదై ఉంది. ముద్దాయిలైన పోలీసుల కథనం ప్రకారం ముగ్గురు యువకులు పోలీసులతో ఘర్షణ పడి పారిపోయారు. ఇది పర్వీజ్ ఖాన్ సాక్ష్యానికి విరుద్ధం. పర్వీజ్ ఖాన్ స్వతంత్రమైన వ్యక్తి. అనవసరంగా ఎవరినీ కేసులో ఇరికించే అవకాశం లేదు. అంతే కాదు.. పోలీసులు ఈ సంఘటన జరిగిన వెంటనే జైన్ ధర్మశాల మీద రెయిడ్ చేశారు. రణబీర్ సింగ్, అతని స్నేహితుడు ఉన్నది అక్కడే. రణబీర్ సింగ్‌ను అరెస్టు చేయకపోతే పోలీసులకు వాళ్ళు అక్కడ ఉన్న విషయం ఎలా తెలుస్తుందన్న భావనకు కోర్టు వచ్చింది. పోలీసులు రణబీర్ సింగ్‌ను అరెస్టు చేయకపోతే వాళ్ళు అక్కడ ఉంటున్న విషయం వెంటనే తెలిసే అవకాశమే లేదు. ఈ ఘర్షణ జరిగిన తరువాత ఒక వ్యక్తిని అరెస్టు చేసినట్టు జనరల్ డైరీలో నమోదు కూడా చేశారు. కరుణేశ్ అన్న వ్యక్తిని అరెస్టు చేశామని, ఘర్షణ పడిన ముగ్గురు వ్యక్తుల్లో అతను ఒకడని పోలీసుల వాదన. అయితే కరుణేశ్‌ని సాక్షిగా ప్రవేశపెట్టలేక పోయారు. అంతే కాదు కరుణేశ్ దగ్గర రైఫిల్ ఉందని చెప్పారు. అది పూర్తి విరుద్ధం. పోయింది రివాల్వర్.

రణబీర్‌సింగ్ శరీరం మీద 30 రౌండ్ల గాయాలున్నాయి. అతి దగ్గర నుంచి అతనిపై కాల్పులు జరిపారన్న సాక్ష్యం ఉంది. ఆ గాయాలు ఆత్మ రక్షణకోసం జరిపిన కాల్పులయ్యే అవకాశం లేదు. ఎన్‌కౌంటర్ జరిగినపుడు ఏడుగురు పోలీసులు ఉన్నట్టు ప్రథమ సమాచార నివేదికను పోలీసులే విడుదల చేశారు. అందుకని ఆ ఏడుగురు పోలీసులు అక్కడ ఉన్నట్టు రుజువవుతుంది. హైకోర్టు అందుకే ఆ ఏడుగురుకి శిక్షను ఖరారు చేసింది. ఎన్‌కౌంటర్ కేసుల్లో పోలీసుల మీద కేసులు పెట్టడం చాలా అరుదైన విషయం. అందులో శిక్ష పడడం ఊహించలేం. ఈ కేసులో సీబీఐ కోర్టు శిక్షవేసింది. ఢిల్లీ హైకోర్టు ఆ శిక్షను సమర్థించింది. ఇలాంటి తీర్పుల వల్ల పోలీసుల్లో గుణాత్మక మార్పు వస్తుందని ఆశించడం అత్యాశే అవుతుంది. ఎందుకంటే చాలా ఎన్‌కౌంటర్లు ప్రభుత్వాల ప్రోద్బలం వల్ల జరుగుతున్నాయన్న అపవాదు ఉంది. శాసన ప్రకారం నడుచుకుంటామని ప్రమాణం చేసిన పోలీసు అధికారులు శాసన ప్రకారం నడుస్తారా? వ్యతిరేకంగా నడుస్తారా అన్నది వాళ్ళ విచక్షణకే వదిలి వేస్తున్నాం. ఏమైనా అన్ని రోజులూ ఎప్పుడూ ఒకేలా ఉండవు. ఈ తీర్పే అందుకు సాక్ష్యం.

■ మంగారి రాజేందర్

(వ్యాసకర్త గతంలో జిల్లా, సెషన్స్ జడ్జిగా పనిచేశారు)

పెద్దలకు అండ, పేదలపై దోపిడీ ఇదీ బ్యాంకుల తీరు!

ఒకప్పుడు ధనికులకే పరిమితమైన బ్యాంకులు, జాతీయీకరణ అనంతరం అందరికీ చేరువైనప్పటికీ నేటికీ అనేకులు బ్యాంకింగ్ వ్యవస్థకు దూరంగానే ఉన్నారు. అందరికీ బ్యాంక్ సదుపాయం కల్పించి ప్రభుత్వ పథకాలు, ఆర్థిక సహాయం, ప్రభుత్వ సబ్సిడీలు నేరుగా లబ్ధిదారులకు చేరాలన్నా, ప్రతి వ్యక్తి జరిపే లావాదేవీలు, క్రయవిక్రయాలు, ఆస్తిపాస్తులపై అంచనాకు రావాలన్నా (ఆదాయపన్ను విధింపుకై) తప్పనిసరిగా బ్యాంక్ ఖాతా అవసరం. దీనిని గమనించిన కేంద్రం ప్రతీ ఒక్కరికీ బ్యాంకు ఖాతా ఉండాలని 'జన్ ధన్ యోజన పథకం'ద్వారా కోట్ల కొద్దీ కొత్త ఖాతాలను సైతం ప్రారంభింపజేసిన విషయం తెలిసిందే. అందులో చాలావరకు క్రియాశీలరహితంగా ఉండటమన్నది సామాన్య ప్రజల ఆర్థిక పరిస్థితిని కళ్లకు కడుతున్నది. మరొకవైపు సామాన్య ప్రజల్లో పెరుగుతున్న అవగాహన, సులభ విధానం మరియు రక్షణ ఉంటుందని బ్యాంకులవైపు మరలుతుండగా, మధ్యతరగతి వర్గం సైతం ఆర్థిక లావాదేవీలు, ఏటీఎం సదుపాయానికి అలవాటుపడడం, పెరిగిన ఆన్లైన్ లావాదేవీలు, తప్పనిసరి బ్యాంకు ఖాతా చెల్లింపులతో ఈ మధ్య కాలంలో అందరికీ బ్యాంక్లతో వ్యవహారం విపరీతంగా పెరిగిపోయింది. అదే సమయంలో బ్యాంకులు పెరుగుతున్న ఖాతాదారుల సంఖ్యను దృష్టిలో పెట్టుకొని కనీస నిల్వల పేరిట, అంతర్ శాఖ లావాదేవీలపై రుసుం వసూలు, లావాదేవీల్లో స్తబ్ధతపై, ఖాతా నిర్వహణ వ్యయం రూపేణా, ఇంకా వివిధ సాకులతో ఖాతాదారులకు బ్యాంకులు చుక్కలు చూపెడుతున్నాయి. మన దేశంలో అతిపెద్ద జాతీయ బ్యాంకు అయిన ఎస్.బీ.ఐ ఒక్కటే కనీస నిల్వ లేని ఖాతాలపై చర్యగా సుమారు 1700 కోట్ల రూపాయల మేర వసూలు చేసిందంటే సామాన్య ఖాతాదారుల జేబులో సొమ్ము ఎలా మాయమవుతున్నదో మరియు సమస్య తీవ్రతను ఇట్టే అర్థం చేసుకోవచ్చు. సామాన్యుడి ముక్కుపిండి వసూలు చేస్తున్న ఇవే బ్యాంకులు వారికి లోన్లు కావాలంటే మాత్రం అస్సలు నమ్మవు. కానీ వేలకోట్లు నట్టేట ముంచే వారిని నమ్మి డబ్బులు ఇచ్చి వారి దివాళా నంతరం సామాన్యులపై చార్జీలు వేసి వసూలు చేసి జరిగిన నష్టం పూడ్చుకోవాలనుకోవడం, లేకపోతే ప్రభుత్వాన్ని మూలధనం రూపేణా సాయం అడగటం (2.13 లక్షల కోట్లు ఈమధ్యే కేంద్రం ప్రకటన) లాంటివి తిరిగి సామాన్యుల నెత్తిపై పన్నుల పెంపు ద్వారా ప్రభుత్వం పిడుగు పడేయడం రివాజుగా మారింది. ఒకవైపు విజయ్ మాల్యా అంశం మరుగున పడకముందే తాజాగా పంజాబ్ నేషనల్ బ్యాంక్ వ్యవహారం (సుమారు రూ.11000కోట్ల కుంభకోణం) తెరమీదకొచ్చింది. "కాకులను కొట్టి గద్దలకు పెట్టిన చందంగా" వ్యవహరిస్తున్న బ్యాంకుల తీరు దారుణం. అందరికీ బ్యాంకు సౌకర్యం చేరువచేసి, లీకేజీలు తగ్గేలా, ఆదాయ పన్ను రాబడి పెంచేలా చర్యలు తీసుకోవాల్సింది పోయి పెద్దలకు రాజమార్గాన దోచిపెడుతూ, పేదలను దొడ్డిదారిన దోచుకుంటూ, వ్యవస్థను భ్రష్టు పట్టించే వారికే రాచమర్యాదలు చేసే బ్యాంకుల వ్యవహార శైలి ఇకనైనా మార్చుకోవాలి. పేదవారి కాసింత పొదుపును ఎలా దోచుకోవాలో ఆలోచనలు మాని, బడా నాయకుల మరియు పారిశ్రామికవేత్తల రుణాల ఎగవేతలకు పరిష్కార మార్గాలు కనుగొనాలి. కేంద్ర ప్రభుత్వం సైతం ఎగవేతదారులను కట్టడి చేసేందుకు కఠిన చట్టం రూపకల్పనకై తక్షణం పూనుకోవాలి. అంతేకాదు వారి యొక్క పూర్తి ఆస్తిపాస్తులను తక్షణం జప్తు చేసుకునే విధంగా చట్టాన్ని రూపొందించాలి. లేదంటే సామాన్యులు బ్యాంకులపై నమ్మకం కోల్పోయే ప్రమాదం ఉంది. అది దేశ ఆర్థిక వ్యవస్థకు తీవ్రనష్టదాయకం.

■ వినోద్ కుమార్ సుద్దాల,
ఉస్మానియా యూనివర్సిటీ

మోగిన 'యుద్ధ' భేరీలు!

భారతీయ ఓటరు చాలా వివేకవంతుడు. నాయకుల ప్రచార్భాటాలు, భాషాపటాటోపాల వెనుక ఉన్న నిజానిజాలను నిశితంగా అర్థం చేసుకొని అంతిమంగా ఎవరికి ఓటు వేయాలో నిర్ణయం తీసుకోగల ప్రాజ్ఞుడు. కొన్నినెలల క్రితం ఓటర్ల వైఖరి బీజేపీకి అనుకూలంగా ఉండి ఉండవచ్చు. ఆ వైఖరిలో ఎటువంటి మార్పు ఉండదనే పూచీ ఇంకెంతమాత్రం లేదు.

■ రాజ్‌దీప్ సర్దేశాయి




దీపశిఖ

దేశ రాజధాని న్యూఢిల్లీలో ప్రాకృతిక పరిస్థితుల పరంగా మాఘ మాసం (ఫిబ్రవరి) రోజులు నిస్సందేహంగా చాలా ఉల్లాసకరంగా ఉంటాయి. క్రమంగా మారుతోన్న ఋతు శోభకు సూచనగా హిమావృతమైన మలయ మారుతాలు నిష్క్రమిస్తుండగా చల్లని నిదానమైన మంద మారుతాలు ఆగమిస్తున్నాయి. ప్రపంచపు మహా ప్రజాస్వామ్య సమర భేరీలు సుదూరాన వినవస్తున్న నేపథ్యంలో రాజకీయ వాతావరణంలో సంభావ్య మార్పుల సూచనలు కూడా ఈ మాఘమాసంలో కన్పిస్తున్నాయి. పదవీ ప్రాభవ ప్రాబల్యాలు కోల్పోయిన భారత జాతీయ కాంగ్రెస్ నాయకులు, ఈ (రాజ్యాధికార రహిత) శీత రుతువు ఇంకెంతకాలం కొనసాగుతుందోనని నిన్నటి దాకా భయపడిపోయారు. అయితే ఈ మాఘమాసపు తెమ్మెరలతో తేరుకొని హఠాత్తుగా మహోత్సాహంతో (అధికార ఆశాభావ) పులకితులవుతున్నారు. రాజకీయ తుఫానుల తాకిడిని తట్టుకొని, ప్రతికూల పరిస్థితులను అధిగమించి అజేయ శక్తిగా వెలుగొందుతున్న భారతీయ జనతా పార్టీకి ఈ మాఘమాసంలో ఒక సత్యం తెలిసివచ్చింది: 2019 సార్వత్రిక ఎన్నికలకు సిద్ధమవుతున్న ప్రస్తుత తరుణాన భావి విజయం తమదే అన్న నిండు భరోసా ఎంత మాత్రం శ్రేయస్కరం కాదు.

కాంగ్రెస్‌లో ఒక కొత్త కదలికకు, బీజేపీలో ఒక అనివార్య ఆత్మశోధనకు కారణమేమిటి? రాజస్థాన్ ఉప ఎన్నికల ఫలితాలే దేశ పాలక, ప్రతిపక్షాలలో ఈ మార్పుకు దారి తీశాయి. ఆల్వార్, అజ్మీర్ లోక్‌సభా నియోజక వర్గాల ఉపఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థుల ఘన విజయాలు, 2014 సార్వత్రిక ఎన్నికల విజయాలు 2019 సార్వత్రిక ఎన్నికలలో పునరావృతం కాబోవని, తిరుగులేని విధంగా సూచించాయి (ఈ రెండు లోక్‌సభా నియోజక వర్గాల పరిధిలోని అన్ని అసెంబ్లీ స్థానాలలోను కాంగ్రెస్ పార్టీయే అగ్రగామిగా ఉన్నది). 2014లో రాజస్థాన్‌లోని మొత్తం 25 లోక్‌సభా నియోజక వర్గాలనూ బీజేపీయే గెలుచుకున్నది. గోవా నుంచి జార్ఖండ్ వరకు పశ్చిమోత్తర భారత దేశంలోని 90 శాతం లోక్ సభా నియోజక వర్గాలలో బీజేపీయే విజయం సాధించిన విషయాన్ని ఇక్కడ తప్పక గుర్తు చేసుకోవల్సి వున్నది. సార్వత్రిక ఎన్నికలలో బీజేపీ అటువంటి అసాధారణ విజయం సాధించడం అదే మొదటిసారి. తత్కారణంగానే తన సొంత మెజారిటీతో కేంద్రంలో అధికారాన్ని కైవసం చేసుకోగలిగింది. అయితే ఇప్పుడు రాజస్థాన్ ఉప ఎన్నికల పరాజయం ఆ హవా క్షీణముఖం పట్టిందని స్పష్టం చేసింది. ఆర్థిక వ్యవస్థ వృద్ధిరేటు తగ్గుదల, ఫ్రాన్స్ నుంచి యుద్ధ విమానాల కొనుగోలులో అవకతవకలు మొదలైన అంశాల ఆధారంగా పాలక పక్షంపై కాంగ్రెస్ పార్టీ నిర్భయంగా ధ్వజమెత్తుతోంది. గుజరాత్‌లో లభించిన 'నైతిక విజయం'తో రాహుల్ గాంధీ ఎట్టకేలకు ఎన్నికల కదన కుతూహలం ప్రదర్శిస్తున్నారు. రాబోయే ఎన్నికలలో కాంగ్రెస్‌ను గెలిపించేందుకు ఆయన కృతనిశ్చయంతో ఉన్నారు.

ఒక ప్రశ్నను మనం తప్పక వేసుకోవాలి. మిగతా భారతీయ రాష్ట్రాలలోని రాజకీయ పరిస్థితులకు కూడా రాజస్థాన్ దర్పణం పట్టుతున్నదా? ఒక వాస్తవాన్ని మనం స్పష్టంగా గుర్తు పెట్టుకోవాలి. రాజస్థాన్ ఉప ఎన్నికలలో బీజేపీకి సారథ్యం వహించింది ముఖ్యమంత్రి వసుంధరా రాజే కానీ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కాదు. మరో వాస్తవాన్ని కూడా పేర్కొంటాను. రాజస్థాన్‌లో గత నాలుగేళ్ళుగా అధికారంలో ఉన్న వసుంధరా రాజే ప్రభుత్వం పట్ల వ్యతిరేకత అంతకంతకూ పెరిగిపోతోందని ఆల్వార్, అజ్మీర్ ఉప ఎన్నికల ఫలితాలు స్పష్టం చేశాయి. ఇటీవలి దశాబ్దాలలో రాజస్థాన్ ఓటర్లు ప్రతి ఐదేళ్ళకూ అధికారంలో ఉన్న పార్టీకి వ్యతిరేకంగా ఓటు వేయడం ఒక ఆనవాయితీగా ఉన్నది. రాజస్థాన్ ఉపఎన్నికలలో బీజేపీ పరాజయం దృష్ట్యా నరేంద్ర మోదీ మహాశక్తి అప్రతిహత జైత్రయాత్ర నిలిచిపోయిందని చెప్పడం అతిశయోక్తే అవుతుంది. అలాగే వచ్చే సంవత్సరం ఆ పార్టీ నాయకత్వం కలవరపడవలసిన అవసరం ఉండదనే నిర్ణయానికి రావడం తప్పుడు అంచనాయే అవుతుంది.

సత్యమేమిటంటే ప్రధాని మోదీ, ఆయన ఆంతరంగిక సచివుడు, బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా కలవరపడడానికి పలు సహేతుక కారణాలు ఉన్నాయి. వ్యవసాయ రంగం దుస్థితి ఒక వాస్తవం. కేవలం ఒకటి రెండు రాష్ట్రాలలో మాత్రమే కాదు దేశవ్యాప్తంగా వ్యవసాయం వెతలమయంగా ఉన్నది. బడ్జెట్‌లో పలు హామీలివ్వడం ద్వారా రైతులను ప్రసన్నం చేసుకోవడానికి మోదీ ప్రభుత్వం ప్రయత్నించింది. అయితే ఆ హామీలను అమలుపరచడం ఎలా అన్నది మోదీ ప్రభుత్వం ముందున్న ఒక అతి పెద్ద సవాల్. ఏటా పది లక్షల కొత్త ఉద్యోగాలను సృష్టిస్తామని గత సార్వత్రిక ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చారు. ఆ హామీని ఏ మాత్రం నెరవేర్చకపోగా ఉపాధికి పకోడీ దుకాణాలు పెట్టుకోవడం మంచిదని పాలకులు ఉపదేశిస్తున్నారు. సామాజికంగా, ఆర్థికంగా మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆరాటపడుతున్న భారతదేశపు యువజనులకు పాలకుల 'పకోడానిమిక్స్' ఏ మాత్రం రుచించడం లేదు. మోదీ ఇచ్చిన సుప్రసిద్ధ 'అచ్చే దిన్' హామీపై ఈ దేశ ప్రజలకు భ్రమలు తొలగిపోతున్నాయి. భ్రమలు వీడినవారు భృకుటి ముడుస్తున్నారు. వచ్చే పన్నెండు నెలల్లో దేశ ఆర్థిక పరిస్థితులలో స్పష్టమైన మెరుగుదల కన్పించని పక్షంలో ఆగ్రహ భారతీయులు తమ మూడో కన్నును తెరవడం ఖాయం.



ప్రజల దృక్పథంలో చోటుచేసుకొంటున్న ఈ మార్పు సామాజిక మాధ్యమాలలో ప్రతిబింబిస్తోంది. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల ప్రజల భావాలు, అభిప్రాయాలు ఎప్పటికప్పుడు సామాజిక మాధ్యమాలలో వ్యక్తమవుతున్నాయి. నిన్నగాక మొన్నటి వరకు ఈ అత్యాధునిక మాధ్యమాలలో ఎల్లెడలా బీజేపీ, మోదీ కన్పించే వారు. ఇప్పుడు సామాజిక మాధ్యమాలలో మోదీ మీద జోక్‌లే నిత్యం షికారు చేస్తున్నాయి. ప్రజలలో పెరిగిపోతోన్న అసంతృప్తిని ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్ సైతం తొలగించలేకపోయింది. ముఖ్యంగా పట్టణ ప్రాంత మధ్య తరగతి ప్రజల్లో ఎటువంటి ఆశను కల్పించలేకపోయింది. సమీప భవిష్యత్తులో తమ ఆదాయాలు కించిత్ అయినా పెరుగుతాయనే ఆశాభావాన్ని ఇసుమంత కూడా వారిలో 2018–19 ఆర్థిక సంవత్సర బడ్జెట్ కలిగించ లేకపోయింది.

ప్రజల నుంచి ఎదురవుతున్న ఈ ప్రతికూల పరిస్థితి నుంచి బయటపడేందుకు మార్గాంతరమేమిటి? మోదీ ప్రభుత్వం ఆర్థిక అంశాలకు కాకుండా 'మతపరమైన జాతీయవాదం'తో ముడివడివుండే ఉద్వేగాత్మక అంశాలకు ప్రాధాన్యమివ్వడం ద్వారా దేశ రాజకీయాలను ఒక కొత్త మలుపు తిప్పాల్సిన అవసరముందనే భావన పాలకపక్ష వర్గాలలో క్రమంగా పెరుగుతోంది. జమ్ములో ఒక సైనిక స్థావరంపై మరో ప్రధాన ఉగ్రవాద దాడి జరిగిన వారంలోనే తూర్పు ఢిల్లీ ఎంపీ మహేష్ గిరి 'రాష్ట్రీయ రక్షా యజ్ఞ'కు పూనుకోవడాన్ని రాజకీయ ప్రాధాన్యం లేని అంశంగా పరిగణించడం సరి కాదు. రాబోతున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ప్రజలలో మతపరమైన–జాతీయవాద భావోద్వేగాలను రెచ్చగొట్టేందుకు ఉద్దేశపూర్వకంగానే ఈ 'మహా యజ్ఞాన్ని' ప్రారంభించారన్నది స్పష్టం. 'రాజ్యాంగం అనుమతించిన పక్షంలో' దేశ సరిహద్దుల రక్షణకు తమ స్వయంసేవక్‌లను పంపుతామని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ సర్‌సంఘ్‌చాలక్ మోహన్ భాగవత్ ఇప్పటికే ప్రతిపాదించారు. అయోధ్య వివాదంపై దేశసర్వోన్నత న్యాయస్థానం విచారణ జరుపుతున్నప్పటికీ రామాలయాన్ని నిర్మించే విషయమై మళ్ళీ ఉద్యమాన్ని నిర్వహించనున్నట్టు విశ్వహిందూపరిషత్ ప్రకటించింది. వినయ్ కటియార్ లాంటి వారు ముస్లింలకు వ్యతిరేకంగా రెచ్చగొట్టే ప్రకటనలు చేస్తున్నారు. ఇది ఎన్నికల సంవత్సరం కాబట్టి అటువంటి ప్రకటనలు ఎవరినీ ఆశ్చర్య పరచడం లేదు. ప్రజలలో మతపరమైన భావోద్వేగాలను రెచ్చగొట్టడం ద్వారా మరోసారి విజయం సాధించాలని అధికార పక్షం వారు భావిస్తున్నారనడానికి సదరు ప్రకటనలే నిదర్శనాలు. కర్ణాటకలో హిందూ ఓటర్లను తమకు అనుకూలంగా సంఘటితపరచడానికి బీజేపీ ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వం ముస్లింలను బుజ్జగిస్తున్నదనే విమర్శనాస్త్రాలను సంధిస్తోంది.

ఇలా యథేచ్ఛగా ఆచరిస్తోన్న పాత తరహా హిందుత్వ రాజకీయాలు బీజేపీకి 2014 చరిత్రాత్మక ఎన్నికల ఫలితాలను మళ్ళీ అందజేయగలవా అన్నది అనిశ్చిత విషయమేనని చెప్పక తప్పదు. 'కొత్త' భారతదేశాన్ని నిర్మించాలన్న తన లక్ష్యం నెరవేరడానికి బీజేపీకి మరోసారి అటువంటి ఘన విజయం దక్కాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. అయితే కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం పట్ల ప్రజల ఆగ్రహావేశాలకు తోడు తాము ఆశిస్తున్న మార్పును సాధించగల నాయకుడుగా నరేంద్ర మోదీ పట్ల నిండు నమ్మకం ఏర్పడడం వల్లే 2014లో బీజేపీకి చరిత్రాత్మక విజయం లభించిందన్నది స్పష్టం. అయితే ఇప్పుడు మోదీ పట్ల ప్రజలలో అటువంటి నిండు నమ్మకం లేదు. అయితే ప్రజా విశ్వాసాన్ని చూరగొనడంలో రాహుల్ గాంధీ, ఇతర ప్రతిపక్ష నాయకుల కంటే మోదీనే ఇంకా ముందంజలో ఉన్నారని చెప్పక తప్పదు. మరింత స్పష్టంగా చెప్పాలంటే ప్రతిపక్షాల అనైక్యతే మోదీ బలం. ఆయనకు రెండో సారి అధికారం దక్కడానికి ఆ అనైక్యత దోహదం చేసే అవకాశం ఎంతైనా ఉన్నది. ఎన్నికల ప్రచారాన్ని అద్భుతంగా నిర్వహించడంలో మోదీకి ఉన్న ప్రజ్ఞ, దక్షత మరెవ్వరికీ లేవు. ఓటర్లలో మోదీ పట్ల ఉన్న ఆకర్షణ ఏ మాత్రం సన్నగిల్లకుండా ఉండేందుకు ఆయన మద్దతుదారులు సకల ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే భారతీయ ఓటరు చాలా వివేకవంతుడు. నాయకుల ప్రచార్భాటాలు, భాషాపటాటోపాల వెనుక ఉన్న నిజానిజాలను నిశితంగా అర్థం చేసుకొని అంతిమంగా ఎవరికి ఓటు వేయాలో నిర్ణయం తీసుకోగల ప్రాజ్ఞుడు. కొన్నినెలల క్రితం ఓటర్ల వైఖరి బీజేపికి అనుకూలంగా ఉండి ఉండవచ్చు. ఆ వైఖరిలో ఎటువంటి మార్పు ఉండదనే పూచీ ఇంకెంతమాత్రం లేదు. 2019 సార్వత్రిక ఎన్నికల పోరాటం ఇప్పటికే ప్రారంభమయింది మరి.

(వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్)

ఆంధ్రుడు ఆగ్రహిస్తే..!

'నవ్యాంధ్రప్రదేశ్ అభివృద్ధికి కావాల్సినన్ని నిధులిస్తున్నాం, అభివృద్ధి చేసే బాధ్యత మాది.. న్యాయం చేస్తాం.. చేసితీరుతాం' అని చెబుతోన్న బీజేపీ నాయకులు ఆచరణలో రాష్ట్రానికి తీరని అన్యాయం చేస్తున్నారు. తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని పూర్తిగా దెబ్బతీసి రాష్ట్రాన్ని విభజించిన కాంగ్రెస్ దారిలోనే ఇప్పటి కేంద్రం ప్రభుత్వం నడుస్తోంది. మిత్రపక్షంగా ఉండి కూడా తెలుగుదేశం పార్టీ పార్లమెంటు సభ్యులు పోరాటం చేయాల్సిన పరిస్థితి కేంద్ర ప్రభుత్వం సృష్టించింది. ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలో పేర్కొన్న అంశాలను వేగంగా పరిష్కరిస్తున్నామన్న కేంద్రం వాదనలో ఎలాంటి వాస్తవం లేదు. విభజన చట్టంలో ఇచ్చిన 90% హామీలు కేంద్రం నేటికీ పరిష్కరించలేదు. ఇచ్చాం.. ఇస్తున్నాం అంటూ కాలక్షేపం చేస్తున్నారు కానీ హామీల గురించి పట్టించుకోవడం లేదు. రెవెన్యూలోటు, విశాఖ రైల్వే జోన్, దుగరాజపట్నం పోర్టు, కడప ఉక్కు ఫ్యాక్టరీల విషయంలో కాలయాపన చేస్తున్నారు. విద్యుత్ బకాయిలు, ఉన్నత విద్యా సంస్థలు, 9, 10 షెడ్యూల్స్, సెక్షన్ 108, మెట్రో రైలు, పెట్రోకెమికల్ కాంప్లెక్స్‌లు పెండింగ్‌లో ఉన్నాయి. ఎంఎస్‌ఎంఈ టెక్నాలజీ సెంటర్, వైజాగ్‌లో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, కాకినాడలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్, గుంటూరులో మిర్చి పార్క్, 690 కోట్లతో 90 పట్టణాల్లో విద్యుత్, మౌలిక సదుపాయాల అభివృద్ధి, విజయవాడలో ఇంజనీరింగ్ టెక్నాలజీ సంస్థ, నెల్లూరులో ఈఎస్ఎస్ఐ, ఎన్ఐఓటీ, అనంతపురంలో జాతీయ కస్టమ్స్, ఎక్సైజ్ సంస్థలు లాంటివి ఎన్నో ప్రకటించినప్పటికీ పనుల్లో ఎటువంటి పురోగతి లేదు.

రాజధాని నిర్మాణానికి 3,500 కోట్లు ఇచ్చామన్న బీజేపీ నేతల మాటల్లో వాస్తవం లేదు. రాజ్‌భవన్, హైకోర్టు, సచివాలయ భవనాలకు, మౌలిక సదుపాయాలకు 42,935 కోట్లు అవసరమని అంచనా వేస్తే ఇప్పటివరకు రాజధాని నిర్మాణానికి ఇచ్చింది 1500 కోట్లు మాత్రమే. అభివృద్ధి చెందిన బెంగుళూరులో 17వేల కోట్లతో మెట్రో రైలు ఏర్పాటు చేస్తామని ప్రకటించిన కేంద్రం, విభజన చట్టంలో హామీ ఇచ్చిన అమరావతి మెట్రో రైలును మాత్రం గాలికొదిలేసింది.

జాతీయ విద్యా సంస్థలకు పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తున్నామని బీజేపీ నేతలు పదేపదే గొప్పగా చెబుతున్నారు. కానీ గత నాలుగేళ్ళలో బడ్జెట్‌లో 626 కోట్లను కేటాయించగా, అందులో ఇచ్చింది 359 కోట్లు మాత్రమే. కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న నిధుల ప్రకారం విద్యా సంస్థలు ఏర్పాటు చేయడానికి 50 ఏళ్ళకు పైగా సమయం పడుతుంది! 11 కేంద్ర విద్యా సంస్థలకు రాష్ట్ర ప్రభుత్వం 11 వేల కోట్ల విలువైన భూమి ఇచ్చినప్పటికీ పనులు మాత్రం ఎక్కడా పూర్తి కాలేదు. అయితే ఇదే సమయంలో నవ్యాంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం భూమి కేటాయించిన భూమిలో ఎస్ఆర్ఎం, విట్ వంటి విద్యా సంస్థలు ఆధునిక భవనాలు నిర్మించి తమ కార్యకలాపాలను మొదలుపెట్టాయి. నిట్‌కు 700 కోట్లు అవసరముంటే 90 కోట్లు మాత్రమే ఇచ్చారు. ట్రిపుల్ ఐటీకి 125 కోట్ల అవసరముంటే 20 కోట్లు మాత్రమే ఇచ్చారు. ఐఐఎంకి 680 కోట్లకుగాను 92 కోట్లు మాత్రమే ఇచ్చారు. ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయడానికి నిర్దిష్టమైన కేటాయింపులు అవసరమని కేంద్రం దృష్టికి తీసుకువెళ్ళినా ఎటువంటి కేటాయింపులు జరపలేదు.



రాష్ట్ర అభివృద్ధికి ప్రత్యేకహోదాకు మించి ప్రత్యేక ప్యాకేజీ ద్వారా నిధులు కేటాయిస్తామని కేంద్ర మంత్రి అరుణ్‌జైట్లీ ఇచ్చిన హామీ వాస్తవరూపం దాల్చలేదు. హామీ ఇచ్చి రెండు సంవత్సరాలు గడుస్తున్నా నేటికీ రాష్ట్ర అవసరాలకు అవసరమైన నిధులను కేంద్రం కేటాయించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. 14వ ఆర్థిక సంఘం, కంప్ట్రోలర్ & ఆడిటర్ జనరల్ రాష్ట్ర ప్రభుత్వానికి ఐదేళ్ల లోటు బడ్జెట్ కలిపి 22,113 కోట్లు ఇవ్వాలని చెప్పాయి. నాగాలాండ్‌కు ఎన్నికలు ఉన్నాయని పది వేల కోట్లు, త్రిపురకు 4,500 కోట్లిచ్చిన కేంద్రం, ఏపీకి మాత్రం హక్కుగా రావాల్సిన వాటిని బిక్షం వేసినట్లుగా ఇస్తోంది. 2016లో రాష్ట్రానికి ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించే సమయంలో రాష్ట్ర రెవెన్యూ లోటు 7,509 కోట్లు ఉంటుందని అరుణ్‌జైట్లీ చెప్పి కూడా ఇప్పుడు తగ్గించడం కేంద్ర ప్రభుత్వం యొక్క ద్వంద్వ విధానానికి నిదర్శనం. ప్రత్యేక సాయం కింద 60:40 నిష్పత్తిలో ఇవ్వడం ద్వారా 30% గ్యాప్‌ను ఈఏపీ ప్రాజెక్టుల ద్వారా భర్తీ చేస్తామని చెప్పి ఆచరణలో విఫలమయ్యారు.

పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్రం పూర్తి సహకారం అందిస్తుందన్న వాదనలో వాస్తవం లేదు. ఆంధ్రుల చిరకాల స్వప్నం పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి లక్షలాది ప్రజానీకానికి మేలు చేసే విధంగా చంద్రబాబునాయుడు సోమవారాన్ని పోలవరంగా మార్చుకుని తీవ్ర కృషిచేస్తున్నారు. అయినా నిధులు, అనుమతులు ఇవ్వడంలో కేంద్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోన్న విషయం రాష్ట్ర ప్రజలందరికీ తెలిసిందే. ఇప్పటి వరకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ, ల్యాండ్ అక్విజేషన్‌లకు సంబంధించి కేంద్రం నుంచి ఒక్క రూపాయి రాలేదు. నిర్మాణాలకు సంబంధించి మాత్రమే నిధులు వస్తున్నాయి. ఎగువ కాపర్‌డ్యామ్, అటవీ అనుమతులు, కాంట్రాక్టర్‌ను మార్చడం, పొరుగు రాష్ట్రాలతో వివాదాలు పరిష్కరించడం వంటి వాటిల్లో కేంద్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. నాలుగేళ్ళలో రాష్ట్ర ప్రభుత్వం 7,900 కోట్లు వ్యయం చేస్తే అందులో 3,500 కోట్లు బకాయి ఉంది. దీనిపై నెలకు రూ.300 కోట్లకు పైగా వడ్డీ భారం రాష్ట్రంపై పడుతోంది. పునరావాసం, అంచనాల పెంపుకు సంబంధించిన నివేదికను కేంద్ర ప్రభుత్వం ఆమోదించకుండా నేటికీ పెండింగులో పెట్టింది.

రాష్ట్రంలో రోడ్ల నిర్మాణాలకు లక్ష కోట్లు ఇచ్చామని చెబుతున్నారు కాని గడిచిన నాలుగేళ్లలో కేంద్రం ఇచ్చింది కేవలం 5900 కోట్లు మాత్రమే. నాలుగేళ్లలో ఒక్క రోడ్డు కూడా పూర్తి చేయలేదు. అమరావతి – అనంతపురం రహదారి నిర్మాణానికి కేటాయింపు కూడా చేయలేదు. హౌసింగ్‌కు 7952 కోట్ల నిధులు ఇచ్చామని చెబుతున్నారు. కాని కేంద్ర ప్రభుత్వం కేటాయించింది కేవలం 1038 కోట్లు మాత్రమే. అర్బన్‌కు 10,500 కోట్లు కేటాయించామని కేంద్రం చెబుతున్నా వాస్తవానికి వంద కోట్లు కూడా రాలేదు.

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకంగా కేటాయింపులు జరుపుతున్నామన్న మాటలు నీటి మీద రాతలే అవుతున్నాయి. పెన్షన్స్‌లో కేంద్రానికి సమానంగా రాష్ట్రం ఇవ్వాలి. రాష్ట్ర ప్రభుత్వం ఐదు రెట్లు పెంచిందనే సాకుతో రూ. 3,575 కోట్లను ఇవ్వకుండా నిలిపివేశారు. బుందేల్ ఖండ్ తరహా ప్యాకేజి వెనుకబడిన 7జిల్లాలకు ఇస్తామన్నారు. బుందేల్ ఖండ్ లో 7,266కోట్లు ఇచ్చారు. ఇక్కడ ఏడాదికి జిల్లాకు 50కోట్ల చొప్పున ఇప్పటివరకు రూ.1050కోట్లు మాత్రమే ఇచ్చారు. ఎక్కడ రూ.7,226 కోట్లు..? ఎక్కడ రూ.1050కోట్లు..?బుందేల్ ఖండ్‌కు దీనికి ఏమైనా పోలికుందా? నవ్యాంధ్రప్రదేశ్‌కు ప్రకృతి వరంగా ఉన్న సుధీర్ఘ సముద్ర తీరానికి రైల్వేజోన్ ఎంత గానో ఉపయోగపడుతుంది. అయినా కేంద్రం స్పందించకుండా ఉంది సంకుచిత, స్వార్థ రాజకీయాలను తెలుగు ప్రజలు హర్షించరనే విషయాన్ని కేంద్రం గుర్తుంచుకోవాలి. నిధుల కేటాయింపు, హామీల అమలులో రాష్ట్రానికి కేంద్రం అన్యాయం చేస్తున్న విషయం ప్రజలు అర్థం చేసుకొంటున్నారు. తెలుగు బిడ్డ తిరగబడితే ఏ విధంగా ఉంటుందనేది కేంద్ర ప్రభుత్వ పెద్దలు ఇప్పటికైనా అర్థం చేసుకోవాలి.

■ పాటిబండ్ల అనిల్

సంకుచిత, స్వార్థ రాజకీయాలను తెలుగు ప్రజలు హర్షించరనే విషయాన్ని కేంద్రం గుర్తుంచుకోవాలి. నిధుల కేటాయింపు, హామీల అమలులో రాష్ట్రానికి కేంద్రం అన్యాయం చేస్తున్న విషయం ప్రజలు అర్థం చేసుకొంటున్నారు. తెలుగు బిడ్డ తిరగబడితే ఏ విధంగా ఉంటుందనేది కేంద్ర ప్రభుత్వ పెద్దలు ఇప్పటికైనా అర్థం చేసుకోవాలి.

విశాఖలో గేమింగ్ సిటీ

(మొదటి పేజీ తరువాయి)

చెందుతోంది. ఈ నేపథ్యంలో విశాఖలో అంతర్జాతీయ స్థాయిలో వినోద నగరాన్ని ఏర్పాటు చేయాలని సీఎం చంద్రబాబు అధికారులకు నిర్దేశించారు. వినోద రంగానికి సంబంధించిన పలు సంస్థలు ఈ నగరంలో ఏర్పాటయ్యేలా చూస్తారు. దేశ, విదేశాల్లోని ప్రముఖ సంస్థలు తమ యూనిట్లను ఇక్కడ పెట్టేలా చూడటంతోపాటు అమెరికాకు చెందిన డిస్నీల్యాండ్ సంస్థతో కూడా మాట్లాడి, ఆ సంస్థనూ ఆహ్వానించాలని ఐటీ శాఖ అధికారులు భావిస్తున్నారు. ఈ సిటీకి సంబంధించిన పూర్తిస్థాయి మాస్టర్‌ప్లాన్‌ను రూపొందించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. ఏవీజీసీ రంగాల్లోని ప్రముఖ సంస్థలను రాష్ట్రానికి వచ్చేలా ఆకర్షించేందుకు కొత్తగా ఏవీజీసీ విధానాన్ని తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించింది. వినోద నగరంలో సంస్థలను ఏర్పాటు చేసే కంపెనీలకు ఇచ్చే రాయితీలు, ప్రోత్సాహకాలు, వారికి కలిగే ప్రయోజనాలు తదితరాలన్నీ ఈ విధానంలో ఉంటాయి.

ఫైబర్ గ్రిడ్‌తో వర్క్ ఫ్రమ్ హోం!

రాష్ట్రంలో ఫైబర్‌గ్రిడ్‌ను ఉపయోగించుకుని వర్క్ ఫ్రం హోమ్ ప్రాజెక్టును కొన్ని గ్రామాల్లో ప్రయోగాత్మకంగా చేపట్టనున్నట్లు ఫస్ట్ అమెరికా(ఇండియా) కంపెనీ పేర్కొంది. ఇంటి నుంచే ల్యాండ్ రికార్డులను డిజిటలైజ్ చేసే ప్రక్రియను ప్రారంభిస్తామని కంపెనీ ఉపాధ్యక్షుడు రఘు పేర్కొన్నారు. ఇది విజయవంతమైతే ఇతర రాష్ట్రాలు, ఇతర దేశాల ల్యాండ్ రికార్డులను కూడా ఏపీలో ఇంటి దగ్గర కూర్చునే డిజిటలైజ్ చేసే అవకాశం లభిస్తుందన్నారు. ఫలితంగా ఇంటి దగ్గర నుంచే పనిచేస్తూ ఉపాధి అవకాశాలను మెరుగుపర్చుకోవచ్చన్నారు. ఫస్ట్ అమెరికా ప్రతినిధులు గురువారం సచివాలయంలో మంత్రి లోకేశ్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ.. ఫైబర్‌గ్రిడ్‌ను ఉపయోగించుకుని గ్రామాల్లోని యువతీయువకులు ఇంటి నుంచే పని చేసుకునేలా ఒక మోడల్ అభివృద్ధి చేయాలని కోరారు. భూరికార్డుల డిజిటలైజేషన్ కార్యక్రమంలో భాగంగా డ్వాక్రా మహిళలు, గృహిణులకు శిక్షణ ఇచ్చి ఇంటి నుంచే పనిచేసుకునే విధంగా కార్యాచరణ రూపొందించాలన్నారు. రాష్ట్రంలో కంపెనీ ఏర్పాటు చేయాలని ఫస్ట్ అమెరికా యాజమాన్యాన్ని ఆహ్వానించారు. దీనిపై కంపెనీ ప్రతినిధులు స్పందిస్తూ.. త్వరలోనే విజయవాడలో కంపెనీ ఏర్పాటు చేసి కార్యకలాపాలు విస్తరిస్తామన్నారు.

క్యుబెక్ మంత్రితో ఏపీ ఆర్సీ భేటీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు కాబోతున్న గేమింగ్, డిజిటల్ లెర్నింగ్ హబ్‌పై ఢిల్లీలో చర్చలు జరిగాయి. ఈ హబ్ ఏర్పాటుకు గతేడాది డిసెంబరులో యునెస్కో ఎంజీఐఈపీతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. ఈ హబ్‌ను కెనడా దేశంలోని క్యుబెక్ ప్రావిన్స్ ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో ఆ ప్రావిన్స్ అంతర్జాతీయ సంబంధాల వ్యవహారాల మంత్రి క్రిస్టియన్ పియారితో గురువారం ఢిల్లీలో ఏపీ భవన్ రెసిడెంట్ కమిషనర్ ప్రవీణ్ ప్రకాశ్ సమావేశమయ్యారు. హబ్ ఏర్పాటుపై చర్చించారు. ఏపీ ప్రభుత్వం కల్పిస్తోన్న సౌకర్యాలు, పరిపాలనలో సీఎం చంద్రబాబు ప్రవేశపెట్టిన సరికొత్త టెక్నాలజీ గురించి ఆమెకు వివరించారు. నూతన రాజధాని అభివృద్ధిని పరిశీలించడానికి అమరావతిని సందర్శించాలని ఆయన ఆహ్వానించారు.

కియ... క్రియ!



చకచకా నిర్మాణ పనులు

అనంతపురం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ పారిశ్రామిక ముఖచిత్రాన్ని మార్చేది... నవ్యాంధ్రలోనే అతిపెద్ద ఆటోమొబైల్ పరిశ్రమ ! 'కియ' కార్ల కంపెనీ ఏర్పాటు పనులు జోరుగా సాగుతున్నాయి. మరొక్క ఏడాదిలోనే కియ ప్లాంటు నుంచి మొదటి కారు రోడ్డెక్కనుంది. అనంతపురం జిల్లా పెనుకొండ సమీపంలో... యర్రమంచి గ్రామం వద్ద, జాతీయ రహదారి పక్కనే 'కియ' ప్లాంటు ఏర్పాటవుతోంది. మొత్తం 535.5 ఎకరాలను దీనికి కేటాయించారు. అందులో 84.14 ఎకరాల్లో బాడీషాప్, పెయింట్‌షాప్, అసెంబ్లీ షాప్, ఇంజిన్ షాప్, ప్రెస్‌కు సంబంధించిన యూనిట్లను నిర్మిస్తున్నారు. వీటికి సంబంధించిన ఐరన్ ఫ్రేమ్‌లు బిగించే పనులు ఇప్పటికే 40 శాతం పూర్తయ్యాయి. పరిశ్రమ ప్రాంగణంలోనే కార్ల రైడింగ్ ట్రాక్ తోపాటు పార్కింగ్ పనులు కూడా జరుగుతున్నాయి. మిగిలిన అన్ని యూనిట్ల నిర్మాణాలు ఉధృతంగా సాగుతున్నాయి. భూమి చదునులో రాష్ట్ర ప్రభుత్వం చూపిన వేగాన్ని... కంపెనీ ఏర్పాటులో కియ కూడా చూపిస్తోంది. ప్రస్తుతం కొరియాకు చెందిన 200 మంది సిబ్బంది ఇక్కడ నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్నారు. సుమారు 1500 మంది కార్మికులు ఈ పనుల్లో పాల్గొంటున్నారు.

ఇదే అత్యాధునికం...

దక్షిణ కొరియాకు చెందిన కియ (హ్యుండయ్ మాతృ సంస్థ) కార్ల తయారీ ప్లాంట్లు జెకొస్లోవేకియా, చైనా, మెక్సికో, అమెరికాలోని అట్లాంటాలో ఉన్నాయి. వీటిలో... అట్లాంటా పరిశ్రమ సాంకేతికపరంగా అత్యాధునికమైనదని నిపుణులు చెబుతున్నారు. ఇప్పుడు అనంతపురం జిల్లాలో ఏర్పాటవుతున్న ప్లాంటులో అంతకు మించిన సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగిస్తున్నారు. అట్లాంటా ప్లాంటులో ఇప్పటికే బ్యాటరీ కార్లు తయారవుతున్నాయి. అయితే... అవి ఇంకా ట్రయల్ దశలోనే ఉన్నాయి. అనంతపురం కియ ప్లాంటులోనూ బ్యాటరీ కారు తయారీ చేపట్టనున్నట్లు తెలిసింది.

ఇక్కడ... గంటకు 34 కార్లు తయారవుతాయని నిపుణులు చెబుతున్నారు. అంటే... రోజుకు 821 కార్లు! సంవత్సరానికి 3 లక్షల కార్లు తయారవుతాయి. వీటిని ఇక్కడి నుంచి ప్రపంచంలోని అనేక దేశాలకు ఎగుమతి చేస్తారు. కియ ప్లాంటును వివిధ ఓడ రేవులకు అనుసంధానిస్తూ ప్రత్యేకంగా రైల్వే ట్రాక్ కూడా సిద్ధం చేస్తున్నారు.

రూ. 13 వేల కోట్లు.. 11 వేల ఉద్యోగాలు..

రూ.13 వేల కోట్ల పెట్టుబడితో ఏర్పాటవుతున్న కియ కార్ల పరిశ్రమలో 11 వేల మందికి ఉద్యోగాలు లభించే అవకాశాలున్నాయి. వాటిలో నాలుగు వేల మంది నిపుణులు (స్కిల్డ్), 7 వేల మంది ఔట్‌సోర్సింగ్ వర్కర్లను నియమిస్తారని తెలుస్తోంది. ఉద్యోగాలకు సంబంధించిన సమాచారాన్ని డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.కియ.ఇన్ వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. ఇప్పటికే దరఖాస్తులను కూడా ఆహ్వానించారు. కియ పరిశ్రమ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ద్వారా శిక్షణ ఇచ్చి నియామకాలు చేపడతారు. కియలో ఉద్యోగాలు ఇప్పిస్తామని ఎవరైనా చెబితే నమ్మి మోసపోవద్దని అధికారులు సూచించారు. మరోవైపు... కియకు అనుబంధంగా 18 పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయి. ఆ కంపెనీల ప్రతినిధులు ఇప్పటికే భూమిని పరిశీలించి వచ్చారు. వీటికోసం స్థలం కూడా సిద్ధంగా ఉంది. మరో 3 వేల ఎకరాల సేకరణకు ఆరు గ్రామాలను రెవెన్యూ అధికారులు రెడ్‌జోన్‌గా ప్రకటించారు.

22న సీఎం రాక...

కియ ప్రతినిధుల ఆహ్వానం మేరకు సీఎం చంద్రబాబు ఈనెల 22న ప్లాంటును సందర్శిస్తున్నారు. కియ పరిశ్రమ ప్రాంగణంలో సీఎం ముందుగా ఫ్రేమ్ ఇన్‌స్టలేషన్ (శిలా ఫలకం తరహా) చేస్తారు. దీనిపై సీఎం, కియ ఎండీ, సంస్థ ఇండియా జీఎంల సంతకాలు ఉంటాయి. ఇది కొరియన్ల సంప్రదాయమని... అనంతపురం ప్లాంటులోనూ దీనిని పాటిస్తున్నారని జిల్లా కలెక్టర్ వీరపాండ్యన్ తెలిపారు. ఈ పర్యటనలో భాగంగా... 36 ఎకరాల్లో నిర్మించే కొరియా టౌన్‌షిప్, 11 ఎకరాల్లో నిర్మించిన స్కిల్‌డెవలప్‌మెంట్ సెంటర్‌ను కూడా సీఎం సందర్శించే అవకాశాలున్నాయి. సీఎం సభ కోసం 100 ఎకరాలను సిద్ధం చేస్తున్నారు.

వచ్చే మార్చి నాటికి రోడ్డుపైకి కియ కారు : కలెక్టర్

2019 మార్చినాటికి అనంతపురం జిల్లాలోని కియ పరిశ్రమ నుంచి మొదటి కారు రోడ్డెక్కుతుందని కలెక్టర్ వీరపాండ్యన్ తెలిపారు. "కొరియా, అమెరికాలోని కియ కార్ల పరిశ్రమలను నేను సందర్శించాను. అనంతలోని ప్లాంటు అంతకంటే ఆధునికమైనది. పెనుకొండ మండలంలోని యర్రమంచి ప్రాంతంలో కొరియాను తలపించేలా ఆ దేశపు భాషతో బోర్డులు వెలిశాయి. కియతో అనంతపురం జిల్లాకు విదేశీయులతోపాటు దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి వ్యాపారుల రాకపోకలు పెరుగుతాయి" అని తెలిపారు.





కియ కార్ల ప్లాంటు నిర్మాణ పనుల్లో పాల్గొంటున్న కార్మికులు

పెట్టుబడుల స్వర్గధామం

ఏరోస్పేస్, డిఫెన్స్ పరిశ్రమల నమూనా ప్రదర్శనలు ఏర్పాటు చేయండి.. భాగస్వామ్య సదస్సుపై సీఎం ఆదేశం

అమరావతి, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో ఈ నెల 24 నుంచి ప్రారంభంకానున్న భాగస్వామ్య సదస్సులో రాష్ట్రంలో వివిధ రంగాల్లో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను కళ్లకుకట్టేలా వివరించి, పెట్టుబడులను ఆకర్షించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పరిశ్రమల శాఖ అధికారులను ఆదేశించారు. ఆటోమొబైల్, ఏరోస్పేస్, డిఫెన్స్ పరిశ్రమల నమూనా ప్రదర్శన ఏర్పాటు చేయాలని సూచించారు. గురువారం సచివాలయంలో సీఎం అధ్యక్షతన స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డు(ఎస్ఐపీబీ) సమావేశం జరిగింది. స్మార్ట్ పవర్‌గ్రిడ్, ఎలక్ట్రికల్ వెహికల్స్, డిజరప్టివ్ టెక్నాలజీ, సోలార్ స్టోరేజ్ రంగాలకు చెందిన వారిని ఆ సదస్సులో భాగస్వాముల్ని చేయాలని అధికారులకు సీఎం సూచించారు. రియల్ టైం గవర్నెన్స్ ద్వారా పరిశ్రమలకు సత్వరం అనుమతులు ఇస్తున్న విధానాన్ని కళ్లకు కట్టినట్లు తెలియజేయాలన్నారు. ఏపీలో తయారయ్యే కియ కారు, ఫాక్స్‌కాన్ సెల్‌ఫోన్లు తదితర ఉత్పత్తులన్నింటినీ సదస్సులో ప్రదర్శించాలన్నారు.

పలు పరిశ్రమలకు ఆమోదం

ఎస్ఐపీబీ సమావేశంలో పలు పరిశ్రమల ఏర్పాటుకు ఆమోదం తెలిపారు. చిత్తూరు జిల్లాలో 150 ఎకరాల్లో రూ.400 కోట్ల పెట్టుబడులతో అరవింద్ ఇంటిగ్రేటెడ్ టెక్స్‌టైల్స్ అండ్ గార్మెంటింగ్ యూనిట్ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఏటా వెయ్యి కోట్ల రూపాయల విలువైన ఎగుమతులు చేయనున్న గార్మెంటింగ్ పరిశ్రమలో 8 వేల మందికి, టెక్స్‌టైల్స్‌లో 7 వేల మందికి ప్రత్యక్షంగా ఉద్యోగావకాశాలు లభించనున్నాయి. అనంతపురం జిల్లా పాలసముద్రంలో 2 ఎకరాల విస్తీర్ణంలో రూ.20 కోట్లతో సాయిదివ్య అపెరల్స్ అండ్ ఫ్యాషన్స్ పరిశ్రమ ఏర్పాటు కానుంది. ఈ ఏడాది మార్చి నాటికి వాణిజ్య ఉత్పత్తి ప్రారంభించి 2 వేల మందికి ప్రత్యక్షంగా, 600 మందికి పరోక్షంగా ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నారు. కర్నూలు జిల్లా ఓర్వకల్లు మెగా ఇండస్ట్రియల్ హబ్‌లో నాచు కార్పొరేషన్ స్టీల్ ఇండస్ట్రీస్ ఆధ్వర్యంలో రూ.1033.22 కోట్ల పెట్టుబడితో ఇంటిగ్రేటెడ్ డీఐ పైప్ తయారీ పరిశ్రమను ఏర్పాటు చేస్తున్నారు. 161.16 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసే ఈ పరిశ్రమ ద్వారా 800 మందికి ప్రత్యక్షంగా, 1200 మందికి పరోక్షంగా ఉద్యోగావకాశాలు కల్పించనున్నారు. భూమి కేటాయించిన 30 మాసాలలోపు ఇక్కడ ఉత్పత్తిని ప్రారంభించనున్నారు.



రాష్ట్ర పెట్టుబడి ప్రోత్సాహక విభాగం సమావేశంలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

జగన్‌పై మరో చార్జిషీటు

- 'ఇందూ' పెట్టుబడులపై ఈడీ అభియోగాలు
- విచారణకు స్వీకరించిన ప్రత్యేక కోర్టు
- మార్చి 16న కోర్టుకు రావాలని సమన్లు



హైదరాబాద్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): విపక్ష నేత వైఎస్ జగన్‌పై మరో చార్జిషీటు దాఖలైంది. ఇప్పటికే ఆయనపై 11 సీబీఐ, రెండు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) చార్జిషీట్లు దాఖలయ్యాయి. కొత్తగా ఈడీ చార్జిషీటు మరొకటి తోడయింది. జగన్ కంపెనీల్లో ఇందూ టెక్ జోన్ పెట్టుబడులకు సంబంధించి దాఖలు చేసిన ఫిర్యాదు(అభియోగపత్రం)ను గురువారం ఈడీ కోర్టు(సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం) విచారణకు స్వీకరించింది. ఇందులో ప్రధాన నిందితులైన వైఎస్ జగన్ తోపాటు ఎంపీ విజయసాయిరెడ్డి, నిమ్మగడ్డ ప్రసాద్, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఐ.శ్యాంప్రసాద్ రెడ్డి, సీనియర్ ఐఏఎస్ అధికారి బీపీ ఆచార్య, డి.పార్థసారథి రావు, ఆడిటర్ సీవీ కోటేశ్వరరావులకు ఈడీ కోర్టు సమన్లు జారీచేసింది. ఇదే ఫిర్యాదులో నిందితుల జాబితాలో ఉన్న ఎస్పీఆర్ ప్రాపర్టీస్ ప్రైవేట్ లిమిటెడ్, వాల్డెన్ ప్రాపర్టీస్ ప్రైవేట్ లిమిటెడ్, భూమి రియల్ ఎస్టేట్స్ ఇన్వెస్ట్‌మెంట్స్, కార్మెల్ ఏషియా హోల్డింగ్స్, నిమ్మగడ్డ ప్రసాద్‌కు చెందిన వీన్ ప్రమోటర్స్, బీటా అవెన్యూస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలకూ సమన్లు జారీ చేసింది. వచ్చేనెల 16న నిందితులు, ఆయా సంస్థల ప్రతినిధులు స్వయంగా కోర్టుకు రావాలని ఆదేశించింది.

మనీ లాండరింగ్ జరిగింది

జగన్ కంపెనీల్లో ఇందూటెక్ పెట్టుబడులపై సీబీఐ సమర్పించిన చార్జిషీట్ ఆధారంగా ఈడీ కూడా విచారణ చేపట్టింది. మనీలాండరింగ్ నిరోధక చట్ట నిబంధనలకు విరుద్ధంగా ఈ పెట్టుబడులు వచ్చినట్లు నిర్ధారించింది. ఈడీ అభియోగాల ప్రకారం... 'ఇందూ' శ్యాంప్రసాద్‌రెడ్డికి చెందిన ఇందూ కన్సార్షియానికి అర్హతలు లేకపోయినా అప్పటి రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం రంగారెడ్డి జిల్లా మామిడిపల్లిలో 250 ఎకరాలను కేటాయించింది. ఈ సెజ్ ప్రాజెక్టును అప్పగించేందుకు అప్పటి ఏపీఐఐసీ వైస్ చైర్మన్, ఎండీ బీపీ ఆచార్య ప్రభుత్వానికి సిఫారసు చేశారు. అలాగే, 100 ఎకరాలు శ్యాంప్రసాద్‌రెడ్డి కుమారుడు దయాకర్‌రెడ్డి డైరెక్టర్‌గా ఉన్న ఎస్పీఆర్ ప్రాపర్టీస్‌కు బదిలీ చేశారు. ఈ భూమిని కేటాయించినందుకు ప్రతిఫలంగా ఇందూ శ్యాంప్రసాద్ రెడ్డి జగన్‌కు చెందిన జగతి పబ్లికేషన్స్‌లో రూ.50 కోట్లు, కార్మెల్ ఏషియాలో రూ.20 కోట్లు పెట్టుబడులు పెట్టారు. ఇందులో కొంత మొత్తాన్ని నిమ్మగడ్డకు చెందిన సంస్థల ద్వారా సూట్‌కేస్ కంపెనీల ద్వారా పెట్టుబడులు పెట్టారు. ఇవి మనీలాండరింగ్ నిరోధక చట్టం నిబంధనలకు విరుద్ధం. ఈ నేపథ్యంలో మనీ లాండరింగ్ నిరోధక చట్టం సెక్షన్ 3,4 నిందితులను శిక్షించాలని ఈడీ తన చార్జిషీటులో కోరింది.

ఆజాద్ ఎన్‌కౌంటర్ కేసు కొత్త మలుపు

- 29 మంది పోలీసులూ విచారణకు హాజరవ్వాలి
- ఆదిలాబాద్ కోర్టు సంచలన ఆదేశాలు

ఆదిలాబాద్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): మావోయిస్టు అగ్రనేత చెరుకూరి రాజ్‌కుమార్ అలియాస్ ఆజాద్, జర్నలిస్టు హేమచంద్ర పాండేల ఎన్‌కౌంటర్ కేసు కొత్త మలుపు తిరిగింది. ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్న 29 మంది పోలీసులూ న్యాయ విచారణకు హాజరు కావాలని ఆదిలాబాద్ జిల్లా ఎస్సీ, ఎస్టీ కోర్టు సంచలన ఆదేశాలు జారీ చేసింది. ఆజాద్ భార్య పద్మ తరఫు న్యాయవాదుల విజ్ఞప్తిపై జడ్జి భరతలక్ష్మి సానుకూలంగా ఆదేశాలిచ్చారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఈ ఎన్‌కౌంటర్ జరిగింది. దీనికి బాధ్యులైన పోలీసులపై కేసులు నమోదు చేయాలని పద్మ, హేమచంద్ర పాండే భార్య బబిత, సామాజికవేత్త స్వామి అగ్నివేశ్ 2015లో సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. సుప్రీంకోర్టు సీబీఐకి ఈ కేసును అప్పగించింది. విచారణ అనంతరం సీబీఐ అధికారులు కేసును మూసివేశారు. ఆ తర్వాత పద్మ, బబిత మున్సిఫ్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీంతో తిరిగి జిల్లా కోర్టుకు కేసును బదిలీ చేసింది. ప్రస్తుతం ఈ కేసు అదనపు కోర్టులో ఉండగా... న్యాయ విచారణకు ఆదేశించాలని పిటిషనర్ల విజ్ఞప్తికి జడ్జి సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా పద్మ మాట్లాడుతూ న్యాయవ్యవస్థపై తమకు పూర్తి విశ్వాసం ఉందని, న్యాయం గెలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

టెట్ సెంటర్లు మళ్లీ మార్చుకోవచ్చు

అమరావతి, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): 'ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్)' సెంటర్లలో గందరగోళం ఏర్పడిన నేపథ్యంలో... సెంటర్ మార్చుకోరుకునే అభ్యర్థులు తిరిగి ఆప్షన్ ఇచ్చుకోవచ్చని మానవ వనరుల అభివృద్ధిశాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు ప్రకటించారు. ఆప్షన్స్‌కు భిన్నంగా ఇతర రాష్ట్రాలు, జిల్లాల్లో సెంటర్లు వచ్చిన అభ్యర్థులకు శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకూ మళ్లీ ఆప్షన్లు ఇచ్చుకునే అవకాశం ఇచ్చినట్లు చెప్పారు. టెట్ రాసేందుకు మొత్తం 4,46,833 మంది దరఖాస్తు చేసుకోగా... వారిలో కోరుకున్న ఆప్షన్లకు భిన్నంగా ఇతర రాష్ట్రాల్లో సెంటర్లు వచ్చిన వారు 15,605 మంది ఉన్నారు. మరో 805 మందికి కోరుకున్న జిల్లాల్లో కాకుండా ఇతర జిల్లాల్లో అధికారులు సెంటర్లు కేటాయించారు. అంటే మొత్తం 16,410 మంది అభ్యర్థులకు ఇప్పుడు తిరిగి ఆప్షన్లు ఇచ్చుకునే అవకాశం లభించింది. వీరిలో ఇప్పటికే 9,518 మంది అభ్యర్థులు తిరిగి ఆప్షన్స్ ఇచ్చుకున్నారు. మిగిలిన వారు కూడా ఆప్షన్లు ఇచ్చుకోవచ్చు. సెంటర్లలో మార్పు కోసం తిరిగి ఆప్షన్ ఇచ్చిన అభ్యర్థులకు మార్చి 2న పరీక్ష నిర్వహిస్తారు. అభ్యర్థులు ఇచ్చుకున్న ఆప్షన్లకు అనుగుణంగానే సెంటర్లు కేటాయిస్తామని మంత్రి చెప్పారు. ఇతర రాష్ట్రాలు, జిల్లాల్లో సెంటర్ల కేటాయింపులు, హాల్‌టికెట్లలో తప్పులు దొర్లడం తదితర అంశాలపై గురువారం విద్యాశాఖ అధికారులతో మంత్రి సమీక్షించారు. అభ్యర్థులు కోరుకున్న ఐదు ఆప్షన్లలో సీటింగ్ కెపాసిటీ లేనందునే సమీపంలోని రాష్ట్రాలు, జిల్లాల్లో సెంటర్లు కేటాయించాల్సి వచ్చిందని ఆయన తెలిపారు. షెడ్యూల్ ప్రకారమే.. యథాతథంగా ఈ నెల 21 నుంచి మార్చి 3 వరకూ టెట్ నిర్వహిస్తామని చెప్పారు. పరీక్షా కేంద్రాల్లో కంప్యూటర్లు, బ్యాకప్ పరిశీలించాలని, ముందుగా ట్రయల్ రన్ నిర్వహించాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. విద్యాశాఖ అధికారులు, ఏజెన్సీల సంయుక్త పర్యవేక్షణలో తనిఖీలు ఉంటాయని ఆయన చెప్పారు. అభ్యర్థులు సందేహాల నివృత్తికి 9505619127, 9505780616, 9505853627, 9885604333, 9701376243లో సంప్రదించవచ్చని మంత్రి తెలిపారు.

లేని కేంద్రం ఉన్నట్లు..

అవనిగడ్డ, ఫిబ్రవరి 15: టెట్ పరీక్ష కేంద్రాల కేటాయింపులో అధికారుల తప్పిదాలతో అభ్యర్థులకు చుక్కలు కనిపిస్తున్నాయి! అవనిగడ్డలో శిక్షణ తీసుకుంటున్న ప్రకాశం జిల్లా దర్శి గ్రామానికి చెందిన కోటేశ్వరరావు నాయక్‌కు 17107143039 13 నంబర్‌తో హాల్‌టిక్కెట్ జారీ అయింది. "కృష్ణచైతన్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, చిలకలూరిపేట రోడ్డు, టేకానిపల్లి పోస్టు, నర్సారావుపేట" చిరునామాతో పరీక్షా కేంద్రాన్ని కేటాయించినట్లు అందులో ఉంది. సంబంధిత కళాశాలను విచారించేందుకు కుటుంబ సభ్యులు ఆ ప్రాంతానికి చేరుకోగా, అలాంటి కళాశాల ఆ ప్రాంతంలో లేదని తెలియటంతో దిగ్భ్రాంతికి గురయ్యారు. ఆరా తీయగా... ఆ కళాశాల మార్కాపురంలో ఉన్నట్లుగా తెలిసింది.

విద్యాశాఖ బడ్జెట్‌పై గంటా చర్చలు

2018-19 సంవత్సరపు విద్యాశాఖ బడ్జెట్ ప్రతిపాదనలపై మంత్రి గంటా గురువారం సచివాలయంలో అధికారులతో సమావేశమయ్యారు. గత ఏడాదితో పోలిస్తే బడ్జెట్ ప్రతిపాదనలు విభాగాల వారీగా 20శాతం మేరకు పెంచాలని సూచించారు.

మాత్ర అడ్డుపడి బాలుడి మృతి

కందిపాడు(బెల్లంకొండ), ఫిబ్రవరి 15: గుంటూరు జిల్లా బెల్లంకొండ మండలంలో జ్వరం తగ్గడానికి వేసిన టాబ్లెటే గొంతులో ఇరుక్కుని బాలుడి ఊపిరి తీసింది. పైడిరాజు, మారమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్దవాడైన సామ్రాజు(3)కు బుధవారం రాత్రి జ్వరం వచ్చింది. మెడికల్ షాపు నుంచి తీసుకొచ్చిన మాత్రను గురువారం ఉదయం వేశారు. అది గొంతులో అడ్డుపడి బాలుడు విలవిల్లాడిపోయాడు. ఆందోళన చెందిన తల్లిదండ్రులు బెల్లంకొండలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. కానీ, అప్పటికే బాలుడు చనిపోయాడని వైద్యులు చెప్పడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.

పంచాయతీల్లో జీఐఎస్ సేవలు

అమరావతి, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 1521 గ్రామ పంచాయతీల్లో జీఐఎస్(జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టం) ఆధారిత థీమాటిక్ మ్యాప్స్ తయారీకి మార్గం సుగమమైంది. ఇందుకు ఆంధ్రప్రదేశ్ స్పేస్ అప్లికేషన్ సెంటర్ (ఏపీఎస్ఏసీ)తో గ్రామీణాభివృద్ధిశాఖ ఒప్పందం చేసుకునేందుకు ప్రభుత్వం అనుమతించింది. ఆ మేరకు పంచాయతీరాజ్‌శాఖ గురువారం ఉత్తర్వులు జారీచేసింది. ఇందుకోసం ఏపీఎస్ఏసీకి రూ.1.59 కోట్లు చెల్లించనున్నారు.

అగ్నిమాపక శాఖ పేరు మార్పు

అమరావతి, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విపత్తు స్పందన, అగ్నిమాపక శాఖ పేరును 'సివిల్ డిఫెన్స్ ఆర్గనైజేషన్'గా ప్రభుత్వం మార్పు చేసింది. వేసవిలో అగ్ని ప్రమాదాలు, వర్షాకాలంలో వరదలు, ఇతరత్రా విపత్తులు సంభవించినప్పుడు డిజాస్టర్ రెస్పాన్స్, ఫైర్ సర్వీసెస్ రంగంలోకి దిగుతుంది. అయితే ఈ పేరుపై గత కొంత కాలంగా ఆ శాఖలోనే అసంతృప్తి నెలకొంది. ఈ నేపథ్యంలో శాఖ పేరును ప్రభుత్వం మార్చింది. అలాగే, శాఖాధిపతి హోదాను డైరెక్టర్ జనరల్ కాకుండా డైరెక్టర్‌గా మార్పు చేసింది.

చిన్న దేవాలయాలకు స్వయం ప్రతిపత్తి ఇవ్వాలి!

ఏపీ సీఎంకు ఎంవీ సౌందరరాజన్ వినతి



హైదరాబాద్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): చిన్న దేవాలయాలకు స్వయం ప్రతిపత్తి కల్పించేవిధంగా చర్యలు తీసుకోవాలని ఏపీ సీఎం చంద్రబాబును దేవాలయాల పరిరక్షణ సమితి కన్వీనర్ డాక్టర్ ఎం వీ సౌందరరాజన్ కోరారు. అర్చకులను ఆదుకునేవిధంగా సర్వీసు నిబంధనలను తక్షణమే అమలుచేయాలని డిమాండ్ చేశారు. సరిగ్గా ఏడాది కిందట అర్చకుల సర్వీసు నిబంధనలపై ప్రాథమిక ఉత్తర్వులు వచ్చాయని గురువారం ఒక ప్రకటనలో ఆయన తెలిపారు. ప్రభుత్వం ఈ ఉత్తర్వులు ఇచ్చినందుకు సీఎంకు కృతజ్ఞతలు తెలిపామని, కానీ మిరాసీ బూచి చూపి అర్చకత్వ నిబంధనల జీవో 76ను నిలిపి వేయడం అన్యాయమన్నారు. "వేతన స్కేళ్లు, అర్చకుల సంక్షేమ కమిటీలు ఇచ్చిన నివేదికలను ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించింది. కోర్టు కూడా కమిటీ సిఫార్సులు అమలు చేయాలని 1997లోనే ఆదేశించింది. కానీ అమలు చేయలేదు. 2007లో దేవాదాయచట్ట సవరణ జరిగినా చర్యలు మాత్రం శూన్యమయ్యాయి. దీనిపైనే పలు ఆలయాల అర్చకులు, ఆలయ సిబ్బంది 2010, 2011లో సమ్మె చేశారు. దాని పర్యవసానంగా మరో కమిటీ వేశారు. అయితే దాని నివేదిక ఎక్కడ ఉందన్నది మాత్రం తెలియదని" డాక్టర్ సౌందరరాజన్ పేర్కొన్నారు. కాగా, 2014లో ఏపీ ప్రభుత్వం చేసిన దేవాదాయ చట్ట సవరణ విషయమై తాము సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ దాఖలు చేస్తున్నట్లు తెలిపారు.

'బచావత్ అవార్డు'కు కట్టుబడి ఉన్నారా?

- 4 వారాల్లో అఫిడవిట్లు దాఖలు చేయండి: సుప్రీం
- పోలవరం కేసు ఏప్రిల్ 17కు వాయిదా

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): బచావత్ నేతృత్వంలోని గోదావరి జల వివాద ట్రైబ్యునల్ ఇచ్చిన అవార్డుకు కట్టుబడి ఉండటంపై అన్ని రాష్ట్రాలు, కేంద్రం అఫిడవిట్లు దాఖలు చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. పోలవరం ప్రాజెక్టు అనుమతులు, నిర్మాణంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ 2007లో ఒడిసా ప్రభుత్వం దాఖలు చేసిన వ్యాజ్యంపై జస్టిస్ మదన్ బి.లోకూర్, జస్టిస్ దీపక్ గుప్తాలతో కూడిన ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. ప్రాజెక్టు నిర్మాణానికి తాము వ్యతిరేకం కాదని, అయితే బచావత్ అవార్డు ప్రకారమే నిర్మించాలని ఒడిసా తరఫు సీనియర్ న్యాయవాది గోపాల సుబ్రహ్మణ్యం కోరారు. అయితే, అవార్డు ప్రకారమే నిర్మాణం చేపడుతున్నామని, అదే విషయాన్ని గతంలో సుప్రీంకోర్టు నియమించిన గోపాలకృష్ణ కమిటీ నివేదికలోనూ పేర్కొన్నారని ఏపీ తరఫు సీనియర్ న్యాయవాదులు ఏకే గంగూలి, గుంటూరు ప్రభాకర్ కోర్టుకు తెలిపారు. ఈ అంశంపై ఒడిసా, మహారాష్ట్ర, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, కర్ణాటక కూడా అవార్డుకు కట్టుబడి ఉన్నట్లు ధర్మాసనానికి తెలియజేశారు. దాంతో అవార్డుకు కట్టుబడి ఉన్నట్లు ఏపీ సహా అన్ని రాష్ట్రాలు, కేంద్రం నాలుగు వారాల్లోపు అఫిడవిట్లు దాఖలు చేయాలని ధర్మాసనం ఆదేశించింది. ఒడిసా ప్రభుత్వ సూట్‌లో ఇప్పటి వరకు 12 మధ్యంతర అభ్యర్థనలు(ఐఆర్‌లు) దాఖలు చేసింది. వాటిలో ఒకటి, 12 అభ్యర్థనలు తప్ప మిగతావి పరిష్కారం(డిస్పోజ్) అయ్యాయి. సెక్షన్90పై లేవనెత్తిన అభ్యంతరాన్ని సుప్రీంకోర్టు విచారణకు స్వీకరిస్తుందా? లేదా? అనేది ధర్మాసనం తేల్చాల్సి ఉంది. విచారణను ఏప్రిల్ 17కు వాయిదా వేసింది.

టార్గెట్ ఐఏఎస్

సివిల్స్ ఇంటర్వ్యూ.. చివరి సవాల్

సివిల్స్ ప్రయాణం చివరి దశకు చేరుకుంది. ఈ నెల 19 నుంచి యూపీఎస్సీ సివిల్స్ - 2017 పర్సనాలిటీ టెస్ట్ (ఇంటర్వ్యూ) నిర్వహించనుంది. దాదాపు 2,500 మంది ఈ సారి ఇంటర్వ్యూలకు హాజరు కానున్నారు. ఈ నేపథ్యంలో విజయం సాధించడానికి సలహాలు, సూచనలతోపాటు గత విజేతల ఇంటర్వ్యూ వివరాలు...

ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ (ఐఎఫ్ఎస్)కు సంబంధించిన ఇంటర్వ్యూలను ఈ నెల 2 నుంచి 15 వరకు నిర్వహించారు. దీనికోసం మూడు బోర్డులను ఏర్పాటు చేశారు. అయితే సివిల్స్ ఇంటర్వ్యూల కోసం అదనంగా మరో రెండు బోర్డులను నియమించవచ్చు.

- **సుమారుగా 30 నిమిషాలు:** ప్రతి అభ్యర్థిని 30 నిమిషాలపాటు ఇంటర్వ్యూ చేస్తున్నట్లు తెలుస్తోంది. గత, ప్రస్తుత ఇంటర్వ్యూ సరళిని పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమవుతుంది. ఇంటర్వ్యూలో ముఖ్యంగా మూడు రకాల ప్రశ్నలను అడిగే అవకాశం ఉంది.
- **ప్రొఫైల్** (DAF - Detailed Application Form): మెయిన్స్‌లో ఎంపికైక అభ్యర్థులకు యూపీఎస్సీ డీఏఎఫ్‌ను పంపిస్తుంది. ఇందులో పేరు - ఇంటి పేరు, స్వగ్రామం - ప్రాంతం, విద్య - వికాసం, అలవాట్లు, అనుభవం తదితర అంశాలకు సమాధానాలను ఇవ్వాలి. ఆ అంశాలపై అభ్యర్థులకు సంపూర్ణ అవగాహన ఉండాలి. ఎందుకంటే వీటి ఆధారంగా కూడా ప్రశ్నలు అడగొచ్చు. పేరు, ఊరుకు సంబంధించి ఏదైనా ప్రాధాన్యం ఉంటే దాన్ని తెలుసుకోవాలి. అంతేకాకుండా చారిత్రక విశేషాలు, జాగ్రఫీ, సమకాలీన ప్రాథమిక, ద్వితీయ, తృతీయ రంగాలు, మతపరమైన విషయాలపై కూడా దృష్టి సారించాలి. ఆయా అంశాలపై అడిగే అవకాశం ఉన్న ప్రశ్నలను రూపొందించుకోవాలి. **ఉదాహరణకు మీ పేరు కృష్ణ కుమార్ / నవీన్ కృష్ణ అయితే ప్రశ్నలు ఈ విధంగా ఉండొచ్చు...**



- భారతంలో కృష్ణుడి పాత్రను ఏ విధంగా చూడాలి?
- భగవద్గీతపై మీ అభిప్రాయం?
- భాగవత మతం ఎప్పుడు ప్రారంభమైంది?
- భాగవత మతంలో ప్రధాన దేవతలు ఎవరు?
- మధ్య యుగ భారతదేశంలో కృష్ణభక్తిని ప్రచారం చేసిందెవరు?
- కృష్ణుడికి సంబంధించిన చారిత్రక ప్రదేశాలైన ద్వారకా, మధురల భౌగోళిక, చారిత్రక ప్రాధాన్యంపై మీకున్న అవగాహన?
- ద్వారకా నగరం ఉన్నదా? లేదా? ఏ తీరంలో ఉంది? పశ్చిమ తీరానికి, తూర్పు తీరానికి మధ్య తేడా?
- భారతంలోని ప్రధాన పాత్రలు చెబుతున్న విషయాలేమిటి?
- **ప్రాంతానికి సంబంధించి.. ఉదాహరణకు మీరు రాయలసీమ జిల్లా నుంచి అయితే ప్రశ్నలు ఈ విధంగా ఉండొచ్చు..**
- సీడెడ్ జిల్లాలు అంటే ఏమిటి?
- సబ్సియడరీ అలయెన్స్ అంటే ఏమిటి?
- రాయలసీమలో ఫ్యాక్షనిజానికి కారణమైన పాలెగార్ వ్యవస్థ ఎప్పుడు ప్రారంభమైంది?
- రెడ్డి అంటే ఎవరు?
- పాలెగార్ వ్యవస్థకు పునాదులు ఎక్కడ ఉన్నాయి?
- అమర నాయంకర వ్యవస్థ అంటే ఏమిటి?

విద్యపై (బయోటెక్నాలజీ చదివి ఉంటే)...

- బయోటెక్నాలజీ ఆవిర్భవానికి దారితీసిన పరిస్థితులు?
- డీఎన్ఏ ప్రొఫైల్ అంటే ఏమిటి?
- రీకాంబినెంట్ వ్యాక్సిన్‌కు ఉదాహరణ?
- జీన్ థెరపీ అంటే?
- వ్యాధుల గుర్తింపులో, మెడిసిన్‌లో జెనెటిక్ ఇంజనీరింగ్ పాత్ర?
- జెనెటిక్ స్క్రీనింగ్, జెనెటిక్ కౌన్సిలింగ్ మధ్య తేడా?

వర్తమాన అంశాలు: ఇంటర్వ్యూలో వర్తమాన అంశాలపై కూడా ప్రశ్నలు అడగొచ్చు. ఇటీవలి కాలంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయుల్లోని చోటు చేసుకున్న సంఘటనలు, రాజకీయ, న్యాయపరమైన అంశాలు, ఆర్థిక రంగం, శాస్త్రసాంకేతిక రంగానికి సంబంధించిన మార్పులు ఇలా అన్ని విభాగాలపై ప్రశ్నలు ఎదురుకావచ్చు. కాబట్టి మెయిన్స్ మాదిరిగానే ఆయా అంశాలను విశ్లేషణాత్మకంగా ప్రిపేర్ కావాలి. అదే సమయంలో బోర్డు చైర్మన్, సభ్యుల ప్రొఫైల్‌పై కూడా అవగాహనతో ఉండాలి.


గమనించాల్సినవి

- ఇంటర్వ్యూ బోర్డు సభ్యులను మభ్యపెట్టడానికి ప్రయత్నించకూడదు.
- ప్రశ్నకు ఆలోచించి ఎలాంటి కంగారు లేకుండా సమాధానం ఇవ్వాలి.
- ప్రశ్న ఎవరు అడిగినప్పటికీ.. అందరి వైపు చూస్తూ సమాధానం చెప్పాలి.
- గెస్ చేస్తానని చెప్పకూడదు.
- డ్రెస్‌కోడ్ పాటించాలి.
- తెలియని విషయాన్ని తెలియదు, సారీ సార్ / మేడమ్ అని చెప్పాలి.



డాక్టర్ పి.వి. లక్ష్మయ్య
(డాక్టర్ లక్ష్మయ్య ఐఏఎస్ స్టడీ సర్కిల్)

ఆర్మీలో ఎందుకు చేరలేదు..?



రాజస్థాన్‌కు చెందిన గంగా సింగ్ హిందీ లిటరేచర్ ఆప్షనల్‌గా రెండో ప్రయత్నంలో సివిల్స్ - 2016లో 33వ ర్యాంక్ సాధించారు. గంగా న్యూఢిల్లీలోని జేఎన్‌యూ నుంచి ఎంఏ పూర్తి చేశారు. గంగా సింగ్ ఇంటర్వ్యూ 25 నిమిషాలపాటు సాగింది. అందులోని ముఖ్యాంశాలు..

- చైర్మన్: హాస్టల్‌లో ఉండే విద్యార్థులకు సాధారణంగా ఎటువంటి సమస్యలు ఉంటాయి? మీరు వార్డెన్ అయితే వాటిని ఎలా పరిష్కరిస్తారు? (జేఎన్‌యూ, న్యూఢిల్లీలో చదివిన నేపథ్యంలో ఈ ప్రశ్న అడిగారు)
- గంగా: సార్ జేఎన్‌యూలో నాకు కేటాయించిన కావేరీ హాస్టల్‌లో సౌకర్యాలు చక్కగా ఉన్నాయి. కొన్నిసార్లు రూమ్‌మేట్స్ మధ్య అభిప్రాయ భేదాలు వచ్చేవి. శానిటేషన్ విషయంలో సమస్యలు ఉండేవి. నేను వార్డెన్ అయితే రూమ్‌మేట్స్ మధ్య వచ్చే సమస్యలను పరిష్కరించడానికి ప్రయత్నిస్తాను. అప్పటికీ వినకపోతే కఠిన చర్య తీసుకుంటాను.
- మొదటి సభ్యురాలు: ఐఏఎస్ ఆఫీసర్ కావాలనే స్ఫూర్తి ఎక్కడి నుంచి వచ్చింది?
- గంగా: మేడమ్, మా జిల్లాలో పని చేసిన కలెక్టర్లు మా ఊరు చుట్టుపక్కల ప్రాంతాల అభివృద్ధికి ఎంతో కృషి చేశారు. దాంతో నేను కూడా అలాంటి హోదాలో ఉంటే వారిలాగే ప్రజలకు మేలు చేయవచ్చు అనే ఆలోచన వచ్చింది. అదే ఐఏఎస్ ఎంచుకోవడానికి స్ఫూర్తిగా నిలిచింది.
- రెండో సభ్యుడు: ప్రస్తుతం భారత ఆర్థిక వ్యవస్థ ఎలా ఉంది?
- గంగా: సార్, ప్రస్తుతం భారత ఆర్థిక వ్యవస్థ పనితీరు నామమాత్రంగానే ఉంది. మరీ బాగుందని చెప్పలేం, బాగాలేదని అనలేం. ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటుంది. కానీ అతి పెద్ద మార్కెట్, డెమోగ్రాఫిక్ డివిడెంట్ వంటి అంశాలు సవాళ్లను ఎదుర్కోవడానికి ఉపయోగపడతాయి.
- మూడో సభ్యుడు: మీ స్వస్థలం బార్మర్ జిల్లాలో చాలా మంది ఆర్మీలో చేరతారు. మీరు ఎందుకు ఆ దిశగా ఆలోచించలేదు?
- గంగా: సార్, మా గ్రామం నుంచి కూడా గతేడాది ఇద్దరు - ముగ్గురు విద్యార్థులు ఆర్మీలో చేరారు. నేను కూడా ఎన్‌డీఏ, సీడీఎస్, ఏఎఫ్‌సీటీ ద్వారా చేరాలని ప్రయత్నించాను కానీ విజయం సాధించలేదు.
- మూడో సభ్యుడు: గంగా నది ప్రక్షాళనకు ప్రభుత్వం ఎందుకంత ప్రాముఖ్యం ఇస్తుంది? (నా పేరులో గంగా ఉండటంతో ఈ ప్రశ్న అడిగారు)
- గంగా: సార్, గంగా నదికి ఆధ్యాత్మికంగా ఉన్న ప్రాముఖ్యం, దేశంలోని 40 శాతం భూభాగం ఈ నదీ ప్రవాహ పరిధిలో ఉండటంతో ప్రభుత్వం గంగా నది ప్రక్షాళనకు ప్రాముఖ్యం ఇస్తుండొచ్చు. కేవలం గంగా నదే కాకుండా ఇంటిగ్రేటెడ్ రివర్ డెవలప్‌మెంట్ పథకంలో భాగంగా అన్ని నదులను అభివృద్ధి చేయాలని భావిస్తోంది.
- నాలుగో సభ్యుడు: ఆఫ్రికా, అమెరికాలో జాత్యహంకార దాడుల గురించి విన్నారా? ఇటీవల బెంగళూరు, నోయిడాలో కూడా ఇటువంటి ఘటనలు చోటు చేసుకున్నాయి. వీటిపై మీ అభిప్రాయం?
- గంగా: గతంలో జరిగిన జాత్యాహంకార దాడులకు చారిత్రక కారణాలు ఉండొచ్చు. ప్రస్తుతం చోటు చేసుకుంటున్న ఇలాంటి ఘటనలకు సంకుచిత మనస్తత్వమే కారణం.

(ఈ ప్రశ్న తరవాత బోర్డు చైర్మన్ జోక్యం చేసుకుంటూ సంకుచిత మనస్తత్వం అంటే ఏమిటి, భారతీయ సమాజం దీన్ని అంగీకరిస్తుందా, దానికి ఉదాహరణలను అడిగారు).

క్రీడల్లో ఆసక్తి లేదా..?



మహారాష్ట్రకు చెందిన అభిషేక్ సింగ్ ఆంత్రోపాలజీ ఆప్షనల్‌తో మొదటి ప్రయత్నంలోనే సివిల్స్ - 2016లో 181వ ర్యాంక్ సాధించారు. ముంబైలోని కేజే సోమయ్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ నుంచి బీఈ (ఎలక్ట్రికల్), బిట్స్ పిలానీ నుంచి ఎంఈ (కమ్యూనికేషన్ ఇంజనీరింగ్) పూర్తి చేశారు. భోంస్లే బోర్డు 35 - 40 నిమిషాలపాటు అభిషేక్‌ను ఇంటర్వ్యూ చేసింది.

- చైర్మన్: చదువుల్లో చాలా మెరిట్. క్రీడల్లో ఆసక్తి లేదా?
- అభిషేక్: సార్, నాకు క్రీడలంటే చాలా ఇష్టం. ఎక్స్‌ట్రాకరిక్యులర్ యాక్టివిటీస్‌లో కూడా చురుగ్గా పాల్గొనేవాణ్ని. (పలు ఉదాహరణలతో వాటిని వివరించాను)
- చైర్మన్: జర్మనీ, అర్జెంటీనా ఫుట్‌బాల్ జట్లకు మధ్య ఉన్న తేడా ఏమిటి?
- అభిషేక్: రెండు జట్ల బలాలు, క్రీడాకారుల ఆధారంగా తేడాలను వివరించాను. 2014 ఫిఫా వరల్డ్ కప్ ఫైనల్లో జర్మనీ అర్జెంటీనాను ఓడించింది. దాంతో ఏది ఉత్తమ జట్టు అనేది నిరూపితమైంది.
- మొదటి సభ్యుడు: మిడ్ డే మీల్స్ స్కీమ్ దేనికి ఉద్దేశించింది?
- అభిషేక్: డ్రాప్ అవుట్స్‌ను తగ్గించడానికి ఉద్దేశించింది ఈ స్కీమ్.
- రెండో సభ్యుడు: వొడాఫోన్, ఐడియా విలీనంపై మీ అభిప్రాయం?
- అభిషేక్: రెండు పెద్ద కంపెనీలు విలీనం కావడం అంతిమంగా వినియోగదారులకు మేలు చేస్తుంది. సత్వర సేవలు అందుతాయి. సమీప భవిష్యత్‌లో టెలికాం రంగాన్ని ప్రభావితం చేయకుండా జాగ్రత్త పడేలా ఇలాంటి విలీనాలు ఉండాలి.
- మూడో సభ్యుడు: పవర్ జనరేషన్ ప్రభావవంతంగా ఎలా అమలు చేస్తారు?
- అభిషేక్: ట్రాన్స్‌మిషన్‌పరంగా ఎదురవుతున్న నష్టాలను తగ్గించడం ద్వారా పవర్ జనరేషన్‌ను ప్రభావవంతంగా అమలు చేయవచ్చు. ఇందుకు ఎస్‌సీఏడీఏ వంటి స్మార్ట్ గ్రిడ్ టెక్నాలజీ ఉపయోగించుకోవచ్చని ఉదాహరణలతో వివరించాను.
- నాలుగో సభ్యుడు: ఆంత్రోపాలజీని ఎందుకు ఎంచుకున్నారు?
- అభిషేక్: ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ ఆప్షన్ లేకపోవడం, జనరల్ స్టడీస్‌తో ఆంత్రోపాలజీకి సంబంధం ఉంటుంది కాబట్టి ఈ సబ్జెక్ట్‌ను ఎంచుకున్నాను.
- చైర్మన్: ప్రపంచవ్యాప్తంగా ఎదురవుతున్న సమస్యలు ఏమిటి?
- అభిషేక్: గ్లోబల్ వార్మింగ్, జల వివాదాలు, ఉగ్రవాదం తదితరాలను ఉదహరించాను.

(రష్యా - క్రిమియా వివాదం, దక్షిణచైనా సముద్రం వివాదంపై ప్రశ్నలు అడిగారు)

ఇంటర్వ్యూ రోజు.. ఆ రోజు దినపత్రికలు చదివి వెళ్లడం ప్రయోజనకరం.

ఎన్ని ప్రశ్నలకు సమాధానం చెప్పారనే దానికంటే ఎంత స్పష్టంగా చెప్పారనేది ముఖ్యం.

జాబ్ కార్నర్

పదో తరగతితో పోస్టల్ ఉద్యోగం

విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ పోస్టల్ సర్కిల్ పోస్ట్‌మన్, మెయిల్ గార్డ్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. కేవలం పదోతరగతి అర్హతతోనే ప్రభుత్వోద్యోగం సాధించే ఈ అవకాశానికి సంబంధించిన వివరాలను చూద్దాం.

తాజా నోటిఫికేషన్ ద్వారా మొత్తం 245 పోస్టులను భర్తీ చేస్తారు. వీటిలో 234 పోస్ట్‌మన్, 11 మెయిల్‌గార్డ్ ఖాళీలు ఉన్నాయి. పోస్ట్‌మన్ ఉద్యోగానికి సంబంధించి విజయవాడలో 106, కర్నూలులో 60, విశాఖపట్నంలో 68 ఖాళీలు ఉన్నాయి. మెయిల్ గార్డ్ పోస్టులు విజయవాడలో 6, కర్నూలులో 2, విశాఖపట్నంలో 3 ఖాళీలు ఉన్నాయి.

- **అర్హత:** రెండు రకాల పోస్టులకు గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి పదోతరగతి లేదా తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి.
- **వయసు:** దరఖాస్తు నాటికి అభ్యర్థులు 18 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి. రిజర్వుడు వర్గాలవారికి ప్రభుత్వ నిబంధనల మేరకు వయోపరిమితి సడలింపు వర్తిస్తుంది.
- **ఎంపిక:** ఆప్టిట్యూడ్ టెస్ట్‌లో వచ్చిన మార్కుల ఆధారంగా మెరిట్ జాబితాను రూపొందిస్తారు. పోస్టల్ / ఆర్ఎంఎస్ డివిజన్ల వారీగా అక్కడి ఖాళీల ప్రకారం ఈ జాబితాను తయారు చేస్తారు.

ఆప్టిట్యూడ్ టెస్ట్ వివరాలు

ఈ పరీక్షకు 100 మార్కులు కేటాయించారు. 2 గంటల పరీక్ష సమయంలో వీటికి సమాధానాలు గుర్తించాలి. ప్రశ్నలను పదోతరగతి స్థాయికి మించకుండా ఆబ్జెక్టివ్ టైప్ మల్టిపుల్ ఛాయిస్ విధానంలో ఇస్తారు. పరీక్షలో మూడు పార్టులు ఉంటాయి. పార్టు ఎలో జనరల్ నాలెడ్జ్, పార్టు బిలో మేథమెటిక్స్‌కు సంబంధించిన ప్రశ్నలు ఇస్తారు. ఈ రెండు పార్టుల్లో ఒక్కో దాని నుంచి 25 ప్రశ్నలు (25 మార్కులు) అడుగుతారు. పార్టు సిలో రెండు విభాగాలు ఉంటాయి. మొదటి విభాగంలో ఇంగ్లీషు లాంగ్వేజ్, రెండో విభాగంలో తెలుగు లాంగ్వేజ్ ప్రశ్నలు ఇస్తారు. విభాగానికి 25 ప్రశ్నలు (25 మార్కులు) ఇస్తారు. నెగెటివ్ మార్కింగ్ లేదు.

పరీక్షలో అర్హత పొందాలంటే

పార్టు ఎ, బిలకు సంబంధించి ఒక్కోదానిలో జనరల్ అభ్యర్థులకు 10 మార్కులు, ఒబిసిలకు 9, ఎస్సీ / ఎస్టీలకు 8 మార్కులు రావాలి. పార్టు - సికి సంబంధించి ఒక్కో విభాగంలో కూడా ఈ విధంగానే మార్కులు రావాలి. అంటే పరీక్ష మొత్తమ్మీద జనరల్ అభ్యర్థులకు 40, ఒబిసిలకు 37, ఎస్సీ / ఎస్టీలకు 33 మార్కులు రావాలి. పరీక్ష కేంద్రాలు: కర్నూలు, విజయవాడ, విశాఖపట్నం.

ముఖ్య సమాచారం

- వేతనం: నెలకు రూ.21,700
- ప్రొబేషన్: రెండేళ్లు
- దరఖాస్తు ఫీజు: రూ.100
- పరీక్ష ఫీజు: రూ.400 (మహిళలు/ ఎస్సీ / ఎస్టీ / దివ్యాంగులకు మినహాయింపు వర్తిస్తుంది)
- ఆన్‌లైన్‌లో ప్రైమరీ దరఖాస్తుకు ఆఖరు తేదీ: మార్చి 15
- ఫీజు చెల్లించేందుకు ఆఖరు తేదీ: మార్చి 16
- ఆన్‌లైన్‌లో ఫైనల్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: మార్చి 20
- వెబ్‌సైట్: www.appost.in

భెల్‌లో అప్రెంటీస్‌లు

ఖాళీలు 271

భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ (బిహెచ్ఇఎల్) - ట్రేడ్ అప్రెంటీస్‌ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- ట్రేడ్స్ వారీ ఖాళీలు: ఫిట్టర్ 90, టర్నర్ 24, మెషినిస్ట్ 80, వెల్డర్ 27, ఎలక్ట్రీషియన్ 30, డ్రాఫ్ట్‌మన్ (మెకానికల్) 3, ఎలక్ట్రానిక్స్ (మెకానికల్) 1, మోటార్ మెకానిక్ వెహికిల్ 1, ఫౌండ్రీ మన్ 9, పాట్రన్ మేకర్ 2, ఫోర్జర్ & హీట్ ట్రీట్‌మెంట్ 4
- అర్హత: పదోతరగతి ఉత్తీర్ణతతోపాటు సంబంధిత ట్రేడ్‌లో ఐటిఐ పూర్తిచేసి ఉండాలి.
- వయసు: ఏప్రిల్ 1 నాటికి 18 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి.
- ఎంపిక: ఇంటర్వ్యూ ద్వారా
- ఇంటర్వ్యూ: మార్చి 26 నుంచి 29 వరకు
- ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఫిబ్రవరి 23
- వెబ్‌సైట్: www.bhel.com

ఎగ్జామ్ గైడ్

కెమిస్ట్రీలో మార్కుల ఫార్ములా

ఇంటర్మీడియట్ కెమిస్ట్రీలో మంచి మార్కులు సాధించాలంటే విద్యార్థులు నిర్దిష్ట ప్రణాళికతో సిద్ధం కావాలి. బ్లూ ప్రింట్‌కు అనుగుణంగా పాఠాల ప్రాముఖ్యాన్ని అనుసరించి చదువుకోవాలి.

ఇంటర్ మొదటి సంవత్సరం

- **8 మార్కుల ప్రశ్నలు:** ముఖ్యంగా పరమాణు నిర్మాణం, మూలకాల వర్గీకరణ, రసాయనిక బంధం వంటి అధ్యాయాల నుంచి ఎక్కువగా ప్రశ్నలు వస్తాయి. రసాయనిక బంధం నుంచి 8 మార్కుల ప్రశ్న రాని పక్షంలో కర్బన రసాయన శాస్త్రం నుంచి వచ్చే అవకాశం ఉంది. కాబట్టి విద్యార్థులు ఈ అధ్యాయాన్ని కూడా సమగ్రంగా చదువుకోవాలి. పరమాణు నిర్మాణం నుంచి ముఖ్యంగా బోర్ నమూనా, హైడ్రోజన్ వర్ణపటం, క్వాంటం సంఖ్యల నుంచి ప్రశ్నలు చదువుకోవాలి.
- మూలకాల వర్గీకరణ నుంచి ప్రథమ అయనీకరణ శక్తి(I_1), ద్వితీయ అయనీకరణ శక్తి(I_2), వీటిని ప్రభావితం చేసే అంశాలు, s, p, d, f - వర్గీకరణ మూలకాలు, ఆవర్తనత పరమాణు సైజు, అయనీకరణ శక్తి, ఎలక్ట్రాన్ ఎఫినిటీ, రుణ విద్యుదాత్మకత అనేవి పీరియడ్, గ్రూప్‌ల్లో మారే విధానానికి సంబంధించిన ప్రశ్నలను చదువుకోవాలి.
- **4 మార్కుల ప్రశ్నలు:** ఈ విభాగంలోని ప్రశ్నలకు సమగ్రంగా సమాధానాలు రాస్తే పూర్తి మార్కులు సాధించవచ్చు. కింది అధ్యాయాల్లోని అంశాలను వివరణాత్మకంగా ఉదాహరణలతో సహా నేర్చుకోవాలి.
- **పదార్థం స్థితులు:** ఈ అధ్యాయం నుంచి గ్రాహం వ్యాపన నియమం, డాల్టన్ పాక్షిక పీడన నియమం, వాయువుల అణుచలన సిద్ధాంత ప్రతిపాదనలను చదవాలి. చలద్వాయు సమీకరణం నుంచి బాయిల్ నియమం, చార్లెస్ నియమం, గ్రాహం నియమం, డాల్టన్ నియమం ఉత్పాదనలను సవివరంగా అధ్యయనం చేయాలి.
- **స్టాయికోమెట్రీ:** ఈ పాఠం నుంచి 6 మార్కులకు ప్రశ్నలు వస్తాయి. ఈ అధ్యాయం నుంచి అయానిక సమీకరణం చర్యను తుల్యం చేయడం (ఆమ్ల, క్షార యానకాల్లో), అనుభావిక, అణు ఫార్ములా నుంచి ప్రశ్నలు వస్తాయి. ఆక్సీకరణ స్థితులు, మోల్ సంఖ్య లెక్కలు, మోలారిటీ, నార్మాలిటీ సమస్యలను ఎక్కువగా సాధన చేయాలి.
- **ఉష్ణగతిక శాస్త్రం (థర్మోడైనమిక్స్):** దీని నుంచి 4 మార్కుల ప్రశ్న వస్తుంది. ముఖ్యంగా హెస్ స్థిర ఉష్ణ సంకలన నియమం, ఉదాహరణలు, C_p, C_vల సంబంధం, ఎంట్రపి, ఉష్ణగతిక శాస్త్ర రెండో నియమం నుంచి ప్రశ్నలు వస్తాయి.
- **రసాయన సమతా స్థితి - ఆమ్లాలు క్షారాలు:** ఈ అధ్యాయం నుంచి 4 మార్కుల ప్రశ్న, 2 మార్కుల ప్రశ్న వస్తాయి. K_p, K_vల మధ్య సంబంధం, కాంజుగేట్ ఆమ్ల- క్షార జంటల ఉదాహరణలు, లీ చాట్లియర్స్ ప్రిన్సిపల్ నుంచి ఎక్కువగా ప్రశ్నలు వస్తాయి. నీటి అయానిక లబ్ధం, విలువ, పిహెచ్ స్కేలు సంబంధిత ప్రశ్నలు చదువుకోవాలి.
- **హైడ్రోజన్ దాని సమ్మేళనాలు:** ఈ పాఠం నుంచి H_2O_2 ఆక్సీకరణ, క్షయకరణ ధర్మాలు, H_2O_2 తయారీ పద్ధతులు, కఠిన జలం (కఠిన జలాన్ని తొలగించే విధానం, కాల్గన్ పద్ధతి, అయాన్ వినిమయ పద్ధతి) పాఠాలను చదవాలి.
- **ఎస్ - బ్లాకు మూలకాలు:** ఈ అధ్యాయం నుంచి రెండు మార్కుల ప్రశ్నలు రెండు వస్తాయి. I - A, II - A గ్రూపు మూలకాల పాఠం నుంచి వాషింగ్ సోడా, బేకింగ్ సోడా, సోడియం, కార్బొనేట్ ఉపయోగాలు, పొడి సున్నం, మెగ్నీషియం ఉపయోగాలు, జీవశాస్త్రంలో మెగ్నీషియం, కాల్షియం లోహాల పాత్ర, సాల్వే పద్ధతిలో వాషింగ్ సోడా తయారీ, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ మీద లఘు వ్యాఖ్య, సిమెంటుకు జిప్సం ఎందుకు కలపాలి వంటి ప్రశ్నలను చదువుకోవాలి.
- **పి - బ్లాకు మూలకాలు:** ఈ పాఠంలోని III - A నుంచి డైబోరేన్ నిర్మాణం, డైబోరేన్ తయారీ, పద్ధతులు, ధర్మాలు, బోరాక్స్ పూస పరీక్ష, బోరజీన్ సాంకేతికత, సాధారణ నామం, బోరాక్స్, కోలిమనైట్ సాంకేతికాలు, జంట ప్రభావం, BF_3 లూయి ఆమ్ల స్వభావం గురించిన ప్రశ్నలు వస్తాయి. అలాగే IV - A నుంచి CO^{2-}_3 వజ్రం, గ్రాఫైట్‌ల్లో కార్బన్ సంకరీకరణం, SiO_2, CO, Al_2O_3, PbO_2 ఆక్సైడ్‌ల స్వభావం, ప్రొడ్యూసర్ వాయువు వంటి ప్రశ్నల మీద శ్రద్ధ పెట్టాలి.
- పర్యావరణ రసాయన శాస్త్రం నుంచి రెండు మార్కుల ప్రశ్నలు రెండు వస్తాయి. కర్బన రసాయన శాస్త్రం అధ్యాయం నుంచి 10 మార్కుల వరకు ప్రశ్నలు వస్తాయి. 8 మార్కుల విభాగంలో బెంజీన్ తయారీ పద్ధతులు, చర్యలు (హాలోజనీకరణం, ఆల్కైలీకరణం, ఎసైలేషన్, నైట్రేషన్), ఎసిటిలీన్, ఇథిలీన్ తయారీ పద్ధతులు, ధర్మాలు చదువుకోవాలి.

రెండో సంవత్సరం

- బ్లూ ప్రింట్‌ను అనుసరించాలి.
- కెమికల్ కైనెటిక్స్, పి బ్లాక్ ఎలిమెంట్స్, ఆర్గానిక్ కెమిస్ట్రీల నుంచి 8 మార్కుల ప్రశ్నలు వస్తాయి. వీటి కోసం మాలిక్యులర్ కొల్లిషన్ థియరీ, రసాయన చర్యలను ప్రభావితం చేసే అంశాలు, వివిధ క్రమాంక చర్యల లెక్కలు, అర్హీనియస్ సమీకరణానికి సంబంధించిన లెక్కలు నేర్చుకోవాలి. అలాగే పి - బ్లాక్‌లోని ఆక్సీ ఆమ్ల నిర్మాణాలు, ఓజోన్, HNO_3, H_2SO_4 ధర్మాలు నేర్చుకోవాలి. ఆర్గానిక్ కెమిస్ట్రీలో ప్రమేయ సమూహాల చర్యల గురించి నేర్చుకోవాలి.
- 4 మార్కుల ప్రశ్నల కోసం ఇచ్చిన 8 ప్రశ్నల్లో 6 ప్రశ్నలకు సమాధానాలు రాయాలి. వీటి కోసం కింది అంశాలను చదువుకోవాలి.
- **సాలిడ్ స్టేట్:** క్యూబిక్ క్రిస్టల్స్‌కి సంబంధించిన లెక్కలు, బ్రాగ్ సమీకరణం, క్రిస్టల్ లోపాలు (షాట్కీ, ఫ్రెంకెల్) అంశాలను ఉదాహరణలతో నేర్చుకోవాలి.
- **ద్రావణాలు:** రౌల్ట్ నియమం, హెన్రీ నియమం, కొలిగేటివ్ ధర్మాలు, అస్మాటిక్ పీడనం లెక్కలు, వాంట్ హాఫ్ లెక్కలు నేర్చుకోవాలి.
- **ఎలక్ట్రో కెమిస్ట్రీ:** ఫారడే నియమాలు, నెర్న్‌స్ట్ సమీకరణం, కాల్ రాష్ సమీకరణం ఫార్ములాలు, లెక్కలు నేర్చుకోవాలి.
- **ఉపరితల రసాయన శాస్త్రం:** భౌతిక, రసాయన శోషణాల భేదాలు, కొల్లాయిడ్స్‌లోని రకాలు, వాటి ఉదాహరణలు, ఎమల్షన్ రకాలు సంబంధిత అంశాలను సమగ్రంగా చదవాలి.
- **లోహ సంగ్రహణ శాస్త్రం:** లోహ సంగ్రహణలో ఉపయోగపడే వివిధ ప్రక్రియల నిర్వచనాలు, ఉపయోగాలు, కాపర్, ఐరన్ సంగ్రహణాలు, వివిధ లోహ ఖనిజాలు, ధాతువుల ఫార్ములాలను వివరంగా చదవాలి.



- డి- బ్లాక్: సంశ్లిష్ట సమ్మేళనాల్లో వెర్నర్ సిద్ధాంతం, వెర్నర్ నిర్మాణాలు, లైగాండ్‌ల రకాలు, ఉదాహరణలు, ఐయుపిఎసి నామకరణం, ఐసోమెరిజం గురించి చదవాలి. 2 మార్కుల విభాగంలో పాలిమర్‌లు, నిత్య జీవితంలో కెమిస్ట్రీ, బయో మాలిక్యూల్స్ వంటి అధ్యాయాల నుంచి 5 ప్రశ్నలు వస్తాయి. పి - బ్లాక్ హాలైడ్‌లు, హైడ్రైడ్‌లు, ఆక్సైడ్‌లు, ఆక్సీ ఆమ్లాలు నుంచి మరో 5 ప్రశ్నలు వస్తాయి. వీటితోపాటు ఆర్గానిక్ కెమిస్ట్రీలో సైంటిస్ట్ పేర్లతో ఉన్న చర్యలు అంటే ఉదాహరణకు రీమర్ - టీమన్ చర్యలు, ఉర్ట్జ్, గాటర్‌మేన్, కానిజరోచర్య వంటి వాటి గురించి చదువుకోవాలి. ప్రమేయ సమూహాలను గుర్తించే పరీక్షలు నేర్చుకోవాలి.

- రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ విభాగం, వెలాసిటి విద్యాసంస్థలు

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
శుక్రవారం • 16 ఫిబ్రవరి 2018

సొగసు

కళ.. కళంకారీ



'చుట్టూ చెంగావి చీర...కట్టాలే చిలకమ్మా!'... ఆకుల్లో దాగున్న చిలకమ్మలా కనిపించాలంటే హరివిల్లు రంగుల కలంకారీ చీరే కట్టాలి. సంప్రదాయంగా కనిపిస్తూనే ఆధునికత కూడా ప్రతిబింబించాలి అనుకునే వాళ్లకు కలంకారీ పలాజోలు, అనార్కలీలు, జాకెట్లూ ఉన్నాయి. కలంకారీకి మాత్రమే సొంతమైన చిక్కటి రంగులు, అద్భుతమైన గుళ్లు గోపురాల డిజైన్లతో నలుగురిలో ప్రత్యేకంగా కనిపించాలనుకుంటే... ఇవిగో ఈ కలంకారీ ఫ్యాషన్ ట్రెండ్స్ ట్రై చేయండి.

కలంకారీ షర్ట్: జీన్స్ ప్యాంట్ మీదకు కలంకారీ షర్ట్ మోడ్రన్ లుక్ తెస్తుంది. పొడవు చేతులు, వెడల్పాటి కాలర్‌తో ఉండే కలంకారీ షర్ట్ డైలీ వేర్‌గా వేసుకోవచ్చు.

జాకెట్: జీన్స్ లేదా చుడీదార్‌లో కూడా నలుగురిలో ప్రత్యేకంగా కనిపించాలనుకుంటే కలంకారీ జాకెట్ వేసుకోవాలి. ముదురు ఎరుపు లేదా నలుపు రంగుల మీద డిజైన్ ఉన్న జాకెట్ అయితే ట్రెండీగా ఉంటుంది.

చూడ చక్కని చీరలు: కలంకారీ చీరకు భారీగా ఎంబ్రాయిడరీ చేసిన బ్లౌజ్ జత చేస్తే చూడముచ్చటగా ఉంటుంది. ఇలాంటి వస్త్రధారణ పెళ్ళిళ్లు, ఎంగేజ్‌మెంట్ల లాంటి వేడుకలకూ బాగుంటుంది. భారీ పట్టు చీరలతో ఇబ్బందిపడటం ఇష్టం లేని వారు కలంకారీ చీరలను ఎంచుకుంటే అందానికి అందం, సౌకర్యానికి సౌకర్యం.

అందాల అనార్కలి: కలంకారీలో మునిగిపోవటం ఇష్టం లేకుంటే కలంకారీతో తయారైన అనార్కలి వేసుకుని, అడుగున సాదా లెగ్గింగ్ వేసుకున్నా చక్కగా ఉంటుంది. అయితే బాటమ్‌కు వాడిన మెటీరియల్‌కు టాప్‌లోనూ చోటు కల్పించాలి.

లాంగ్ గౌన్: నిలువెత్తు బొమ్మలా కనిపించాలంటే కలంకారీ గౌన్ వేసుకోవాలి. రౌండ్ నెక్‌తో, నడుము నుంచి పాదాల వరకూ కుచ్చులతో ఉండే ఈ గౌన్, నడిచేటప్పుడు అలల్లా కదులుతూ భలేగా ఉంటుంది.

జాలీ జంప్‌సూట్: మోడ్రన్ డ్రస్‌లో మెరిసిపోవాలంటే కలంకారీ జంప్ సూట్ బాగుంటుంది. ధరించటానికి తేలికగా ఉండి, స్నేహితులతో హ్యాంగవుట్స్‌కి సరిగ్గా నప్పే డ్రస్ ఇది.

బ్యూటీకేర్


మెడ నల్లబడితే...

సూర్యరశ్మి సోకి మెడ భాగం నల్లబడితే దాన్ని పోగొట్టడానికి ఆపిల్ సైడర్ వెనిగర్, యోగర్ట్‌లు బాగా ఉపయోగపడతాయి.



- చర్మంలోని పీహెచ్ లెవల్స్‌ను ఆపిల్ సైడర్ వెనిగర్ చక్కగా బ్యాలెన్స్ చేసి శరీరం కాంతివంతమయ్యేలా చేస్తుంది. చర్మంపై మృతకణాలను తొలగించడంలో వెనిగర్ బాగా పనిచేస్తుంది. రెండు స్పూన్ల ఆపిల్ సైడర్ వెనిగర్‌ను తీసుకుని, దానికి నాలుగు స్పూన్ల నీళ్లు కలపాలి. దూది ఉండతో మెడభాగంలో ఈ మిశ్రమాన్ని రాసి, పది నిమిషాల పాటు వదిలేయాలి. ఆ తర్వాత నీటితో శుభ్రంగా కడగాలి. రోజు విడిచి రోజు ఇలా చేస్తే మెడభాగంలో చర్మం మెరుస్తుంది.





- యోగర్ట్‌లోని సహజసిద్ధమైన ఎంజైములు నిమ్మరసంతో కలిస్తే అవి చర్మంపై చక్కని ప్రభావాన్ని చూపుతాయి. రెండు టేబుల్‌స్పూన్ల యోగర్ట్‌ను నిమ్మరసంలో కలిపి మెడపై మర్దన చేయాలి. ఇరవై నిమిషాల తర్వాత నీటితో మెడను శుభ్రం చేస్తే ఫ్రెష్‌గా కనిపిస్తుంది. ఆపిల్ సైడర్ వెనిగర్, యోగర్ట్‌లు రెండు కూడా చర్మానికి ఏ మాత్రం హాని చేయవు కాబట్టి దురద, ఇతర ఇన్ఫెక్షన్ల భయం ఉండదు.

పరిశోధన

నెగిటివ్ ఆలోచనలకు ఫుల్‌స్టాప్!



ప్రతిరోజూ ఉదయం పరుగెత్తడం వల్ల మానసిక ఒత్తిడి నుంచి దూరమవ్వడమేగాక, నెగిటివ్ ఆలోచనలను కూడా దూరం పెట్టవచ్చంటున్నారు ఆరోగ్య నిపుణులు. రన్నింగ్, వాకింగ్ అనేది కేవలం ఫిజికల్ ఫిట్‌నెస్‌కే కాకుండా మెంటల్ ఫిట్‌నెస్‌కు కూడా ఎంతో తోడ్పడుతుందని, నెగిటివ్ ఆలోచనలు రాకుండా మెదడుపై ప్రభావం చూపుతుందని ఇటీవల ఒక పరిశోధనలో తేలింది. రోజూ కాసేపు పరుగెత్తడం వల్ల ఒత్తిడి నుంచి విముక్తి పొందటంతో పాటు మెదడు యాక్టివేట్ కావడం వల్ల నెగిటివ్ ఆలోచనలు రావంటున్నారు.

కౌన్సెలింగ్ కార్నర్

ఇంటర్ అంటే ఇంతేనా?

నేను ఇంటర్ చదువుతున్నాను. ఒకరకంగా చెప్పాలంటే... ఇంట్లోవాళ్ల పోరు పడలేక చదువుతున్నా. వాళ్ళ ఆశలు అన్నీ నేను తీర్చాలనుకుంటున్నారు. ఊళ్ళోనే నన్ను హాస్టల్లో పెట్టారు. అక్కడ తిండి, చదువు... ఏమీ బాగా లేవు. ఇంటికొస్తానంటే వద్దంటారు. మార్కులు తగ్గితే తిడతారే గానీ, ఎందుకు తగ్గాయని ఒక్కసారీ ప్రేమగా అడగరు. పండగలు, పుట్టినరోజులు అన్నీ బంద్. చదువుదామని కూర్చున్న ప్రతిసారీ ఇవే గుర్తుకు వస్తున్నాయి. అమ్మానాన్నలకు నా కన్నా ర్యాంకులే ఎక్కువనే చేదు నిజం నాకు వాళ్ళ మీద ద్వేషం పెంచుతోంది. వీలైతే ఇప్పుడు పరీక్ష తప్పి, వాళ్ళను సాధించాలనుంది. దాంతో, వాళ్ళకు అర్థం అవుతుంది కదా! నేను ఇలా అనుకోవడం తప్పే. కానీ తప్పడం లేదు.... మీరన్నా చెప్పండి అమ్మానాన్నలకి! ఇంటర్ అంటే ఇంతేనా?

- సుస్వర


చుట్టూ ఉన్న పోటీ ప్రపంచంలో నెగ్గుకు రావాలంటే ఈ చదువులే మార్గమని మీ తల్లిదండ్రుల నమ్మకం. మరి నీకు ఇష్టం లేకపోతే ముందే చెప్పాల్సింది. అంతా అయిపోయి పరీక్షల ముందు ఎందుకమ్మా ఈ కక్ష? దీనివల్ల అమ్మానాన్నల్ని సాధించే తృప్తి మాట అటుంచు. నువ్వు నష్టపోయేదే ఎక్కువ! దానికి తోడు ఇటు చదువూ గాడి తప్పుతుంది! అటు ఇంట్లోనూ సమస్యలు! నిజమే! విద్య, వైద్యం వ్యాపారమైన ఈ రోజుల్లో తల్లిదండ్రులు పిల్లల్ని లక్షలు ఖర్చు పెట్టి చదివిస్తూ, వారి బాల్యాన్ని చిదిమేస్తున్నారు. అయితే ఇక్కడ తల్లిదండ్రులూ బాధితులే. పిల్లల చదువుల కోసం, ఫీజుల డబ్బుల కోసం వారు పడే పాట్లు అన్నీ ఇన్నీ కావు. తీరా ఇంత కష్టపడి పిల్లల్ని కార్పొరేట్ కాలేజీల్లో చదివిస్తే, ఒక్కోసారి ఏ ఫలితమూ ఉండకపోవచ్చు. ఈ పద్ధతి మారాలని అందరూ కోరుకుంటారు గానీ మారుద్దామని ఎవరూ అనుకోరు. ఇక్కడిదాకా బాగా చదివావు కాబట్టి ఇంటర్ పరీక్షలు చక్కగా రాయి. ఆ తర్వాత అమ్మానాన్నలతో నీ ఆలోచనలు పంచుకో. అప్పుడు నీకు ఇష్టమైనదే చదువు. అంతవరకూ ఓపికపట్టు. నువ్వు కోరుకున్న ఒత్తిడి లేని చదువులు రావాలని ఆశిస్తూ... విష్ యూ బెస్టాఫ్ లక్!

• **కె.శోభ,**
ఫ్యామిలీ కౌన్సెలర్, హార్ట్ టు హార్ట్,
shobhas292@gmail.com



పేరెంటచ్

విమర్శ... సున్నితంగానే!



ఏది ఎందుకు తప్పో..... ఏది ఎందుకు ఒప్పో... టీనేజ్‌లో ఏం తెలుస్తుంది? ఆ వయసులో తనకు తెలిసిన ఒకటి రెండు కోణాల్లోంచి ఆలోచించి ఒక అభిప్రాయానికి వచ్చేస్తారు. ఆచరణలో పెట్టేస్తారు. ఆ తర్వాత ఎప్పుడో పెద్దవాళ్ల దృష్టికి వచ్చి, వాళ్లు అడ్డదిడ్డంగా తిట్టేస్తుంటే పిల్లలకు ఏమీ అర్థం కాదు. అవాక్కవుతారు. హర్ట్ అవుతారు.

లేత వయసు పిల్లల మనసులు కూడా లేతగానే ఉంటాయనే నిజాన్ని చాలా మంది తల్లిదండ్రులు గుర్తించరు. అందుకే అంత పరుషమైన మాటల్ని ఉపయోగిస్తారు. పెద్దవాళ్ల విషయంలో అయితే విమర్శతో మొదలెట్టి విమర్శతోనే ముగించినా నడిచిపోతుంది. కానీ, పిల్లల విషయంలో అలా కుదరదు. అంతకు ముందు చేసిన ఏదో ఒక చిన్న మంచి పనికి వారిని ముందు ప్రశంసించి, ఆ తర్వాత చేసిన తప్పు గురించిన ప్రస్తావన తేవాలి. అదైనా "ఇలా ఎందుకు చేశావు? అలా ఎందుకు చేశావు?" అనే ధోరణిలో కాకుండా, "అలా చేయడం వల్ల అంతిమంగా అది ఏ కష్టనష్టాలకు దారి తీస్తుందో తెలుసా?" అంటూ ఆ పరిణామాల గురించి చెప్పాలి. "మేమంటే నీ మీది ప్రేమ కొద్దీ క్షమిస్తున్నాం. బయటి వాళ్లు ఎందుకు క్షమిస్తారు చెప్పు? క్షమించని వారు శిక్షిస్తారు కూడా. ఆ హక్కు వారికి ఉంటుంది. నష్టం జరిగిపోయాక పశ్చాత్తాపం చెందడం వల్ల కలిగే ప్రయోజనం ఏమీ ఉండదు. అలా అని చేసే ముందు అది తప్పో ఒప్పో నీకు నువ్వే తేల్చుకునే వయసు కూడా కాదు కాబట్టి, చేసే ముందు పెద్దవాళ్ల అభిప్రాయం తీసుకోవడం చాలా అవసరం. దాని వల్ల నీకూ ప్రయోజనం, మాకూ ప్రయోజనం" లాంటి మాటలు వాళ్లను సరిదిద్దడానికి వాడాలి. అలా కాకుండా, "నువ్వు మమ్మల్ని సుఖంగా ఉండనిచ్చేలా లేవు. నీ వల్ల నలుగురిలో మేము తలెత్తుకోలేని పరిస్థితి ఏర్పడుతోంది. ఇంకోసారి ఇలా ఏమైనా చేశావంటే అప్పుడు నిన్నేం చేస్తానో నాకే తెలీదు" లాంటి మాటలు అన్నారనుకోండి. వాళ్లు తీవ్రమైన భయభ్రాంతులకు లోనవుతారు. ఫలితంగా వాళ్లింక ఏమీ చేయలేని స్థితిలోకి జారిపోతారు. తప్పుడు పనుల మాట అలా ఉంచి మంచి పనులు చేయడానికి కూడా వాళ్లకు చేతులు రావు. చివరికి ఎందుకూ పనికిరాని అసమర్థులవుతారు. అందుకే పిల్లల్లో మార్పు రావాలంటే వారి మనసు నొప్పించకుండా ఏమైనా చెప్పగలగాలి. ముఖం మాడ్చుకుని కూర్చోకుండా, మన మాటలు పిల్లలు మళ్లీ మామూలుగానే అందరితోనూ కలిసిపోయే స్థితిలోనే వాళ్లను ఉంచాలి.

దైవమార్గం

ఉపవాస ప్రార్థనంటే...



● సుశీల్ సందేశ్

మీకు తెలుసా?

అష్టవిధ అర్చనలు




దైవాన్ని పూజించేటప్పుడు చేయాల్సిన అర్చనలు లేదా పరిచర్యలు ఎనిమిది రకాలని పెద్దలు చెప్పారు. అవి: 1. రంగవల్లి (ముగ్గులు తీర్చడం) 2.చందనం పూయడం 3. అక్షతలు చల్లడం 4. పుష్పాలతో అలంకరించడం, అర్చించడం 5. ధూపం వేయడం, 6. దీపం వెలిగించడం 7. నైవేద్యం పెట్టడం 8. తాంబూలం సమర్పించడం. వీటిని అష్టవిధ అర్చనలు అంటారు.

ఉపదేశం

అదే జీవిత లక్ష్యం!

మీలోపల మీకు శాంతి లేకపోతే మీరు దాన్ని మరెక్కడా పొందలేరు. జీవిత లక్ష్యం శాంతిని సాధించడమే, అధికారాన్నో, పేరునో, ప్రతిష్ఠనో, సంపదనో ఆర్జించడం కాదు.



\- స్వామి శివానంద

సందర్భం



రేపు జిల్లెళ్ళమూడిలో అమ్మ అన్నాభిషేకం

అన్నంలో అమ్మ ప్రేమ!

మాతృశ్రీ జిల్లెళ్ళమూడి అమ్మ ఆరు శతాబ్దాల క్రితం ప్రారంభించిన అన్నపూర్ణాలయం నిరంతరాయంగా కొనసాగుతూనే ఉంది. ప్రతిరోజూ ఎనిమిది వందల మందికి అన్న వితరణ జరుగుతోంది. ప్రత్యేక సందర్భాల్లో వేలాదిమంది అన్నాన్ని ప్రసాదంగా భావించి స్వీకరిస్తూ ఉంటారు. ఈ పవిత్ర కార్యక్రమం అమ్మ సంకల్పించిన మాతృయోగం!

నడిచే దేహం, అది నడవడానికి కావలసిన శక్తి కూడినపుడు, అంటే యుక్తాహారం, యుక్త విహారం జమిలి అయినపుడు మరొక ప్రశాంత, పరితృప్త, ప్రసన్న కోశం ఏర్పడుతుంది. అదే మనోమయ కోశం. అనేక ఆలోచనల సమాహారమే మనసు. దానికి రూపం లేదు.



"అమ్మా! నీ యాభయ్యవ పుట్టినరోజు! ఏం చెయ్యమంటావ్?" అని అడిగినప్పుడు, "చేయటానికేముంటుంది? ఒక లక్షమంది కలిసి భోజనం చేయడం చూడాలని ఉంది!" అన్నది. పట్టుమని పదిళ్ళు లేని జిల్లెళ్ళమూడిలో, పందిళ్ళలో ఒక లక్షా అరవైవేల మంది భోజనం చేయడం మహిమా? అనుగ్రహమా? అమ్మ ప్రేమా?

అందుకే అమ్మ మాట్లాడినా, సూచించినా ముందు అన్నం తి... 'అందరిల్లు' అందరికీ సహపంక్తిని సిద్ధం చేసింది. ఆకలికి ... లేవు. అరమరికలు , బంధనలు , వివక్ష లేని వాత్సల్యాలయం... నమయ కోశంగా మారడం వెనుక కారణం ఇదే.

'నేను పెట్టేదేముంది? ఎవరన్నం...' అన్న అమ్మది అకర్తృత్వ స్థితి.

బువ్వ పెట్టిన అవ్వలందరూ అ... ఆ పెట్టడం ఒక సహజ మాతృ ల...

అది నేర్పడమే మాతృయోగం!
అందువల్లనే ఆమె మాతృశ్రీ!

● వి.యస్.ఆర్.మూర్తి

శ్రీరమణధామ్యతం

భగవాన్ సాక్షాత్కారం

(గత సంచిక తరువాయి)




అనుకునే వాణ్ణి. కాస్త పెద్దయ్యాక ఆ భావనను విడిచేశాను ... చూడగానే ఆ చిన్ననాటి నమ్మకమే నిజమనిపించింది. ఆ ప్ర... గురించి ఆలోచిస్తున్నప్పుడు అంతటి ప్రకాశమానమైన కాంతి...

● పింగళి సూర్యసుందరం

సద్గురువాణి



ఏడు రోజులూ జీవిద్దాం!



● సద్గురు జగ్గీ వాసుదేవ్

సందేశం

దేవుడు పెట్టిన పరీక్ష!

...తలు, ఖర్చులు బాగా పెరిగిపోయాయి. నేను నీకు ఎలాంటి సాయమూ చేయలేను' అన్నాడు. దైవదూత ఆ మాటలు విని, 'బహుశా నేను నిన్ను గుర్తుపట్టాననుకుంటా! నీవు గతంలో కుష్ఠురోగిగా ఉండేవాడివి కదూ! దానివల్ల జనం నిన్ను చాలా అసహ్యించుకునేవారు. నువ్వు పేదవాడిగా ఉంటే, అల్లాహ్ నీకు ఈ సంపద ప్రసాదించాడు. ఔనా?' అని అడిగాడు. అందుకు కుష్ఠు...



...మాత్రమే. నీలాగే నిరుపేదలుగా, కష్టాలు పడుతూ ఉన్నప్పుడు దైవం చేసిన సహాయాన్ని మరిచిపోయిన నీ సహచరులిద్దరూ దైవాగ్రహానికి గురయ్యారు. నీవు దైవం పట్ల కృతజ్ఞత చెల్లించడం నా మనసుకు ఆనందాన్నిచ్చింది. నీ సంపద వల్ల నీకు సకల శుభాలూ చేకూరుగాక!' అని ఆశీర్వదించాడు.

● మహమ్మద్ వహీదుద్దీన్


అనాథలు ఎక్కడైతే ప్రేమ, దయ పొందుతారో అదే అత్యుత్తమమైన ఇల్లు

\- మహమ్మద్ ప్రవక్త

నవజీవనవేదం



సంతృప్తే పరమావధి



డా. గరికపాటి నరసింహారావు

నవ్య సకల

ప్యాడ్‌మ్యాన్... ప్రస్తుతం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన సినిమా. రీల్‌పై అక్షయ్ కుమార్ ఆ పాత్రకి ప్రాణం పోస్తే... ఆ పాత్రకు స్ఫూర్తినిచ్చిన రియల్ ప్యాడ్‌మ్యాన్ మురుగానందం అరుణాచలం. తమిళనాడులోని కోయంబత్తూరుకి చెందిన ఆయన రెండు రోజుల క్రితం చెన్నైలో చేపట్టిన 'స్టాండ్ బై హర్' ఉద్యమంలో పాల్గొన్నారు. ఆ సందర్భంగా తక్కువఖర్చుతో శానిటరీ నాప్కిన్ తయారీ వెనుక కష్టనష్టాల గురించి 'నవ్య'తో పంచుకున్నారు.

ముఖాముఖి



'ప్యాడ్‌మ్యాన్' సినిమా మీ నిజజీవితానికి దగ్గరగా ఉందా?

అవును. నా నిజజీవితానికి 80 శాతం దగ్గరగా ఉంది. 100 శాతం ఎందుకు లేదంటే... ఒకవేళ మిగతా 20 శాతం కూడా చూపిస్తే సినిమాకి 'ఏ' సర్టిఫికెట్ వస్తుంది. ఇది మహిళల పీరియడ్స్‌కు సంబంధించిన విషయం కాబట్టి.. 'ఏ' సర్టిఫికెట్ వచ్చుంటే సమాజంలో వ్యతిరేకత వచ్చేదేమో! ఎంతవరకు ప్రజలకి చూపించవచ్చో ఆ మేరకు...

ఈ సక్సెస్‌కు స్ఫూర్తి నా భార్యే!





...ఒక సమస్యని తీసుకుని తనకున్న అతి తక్కువ పరిజ్ఞానంతోనే ఆ సమస్యకి పరిష్కారం చూపించాడు. అలాగే విద్యావంతులందరూ ఏదో ఒక సమస్యని తీసుకుని పరిష్కారానికి కృషి చేస్తే మెరుగైన సమాజాన్ని నిర్మించగలం.

■ గనిరెడ్డి అరుణ్‌కుమార్

ద్రి సుడోకు - 108

			4			5		
3	4			2		9		7
		2			7			4
	6					8	7	
			6	1	8			
	5	3					9	
7			9			2		
1		6		8			5	9
		4			3			

ఎలా పూరించాలి?

ప్రతి బాక్స్‌లోనూ 9 గళ్లు ఉంటాయి.

నిలువుగానూ, అడ్డంగానూ ప్రతీ లైనులోనూ 1 నుంచి 9 వరకు అంకెలను పూరించాలి.

ఒకసారి పూరించిన అంకెను తిరిగి వాడకూడదు.

సుడోకు- 107 సమాధానం



రత్నబాబు, మోహన్‌బాబు, మదన్

అలాంటివారు.. నా దృష్టిలో నికృష్టులు!

\- మోహన్‌బాబు

"ఏ ఇంట్లో అయినా ఇంటి పెద్దను బట్టి సంస్కారం ఉంటుంది. పైరసీ చేసే వాళ్లను గురించి ఏమనాలి? వాళ్ల పెంపకాన్ని గురించి తప్పు పట్టలేను. ఎందుకంటే తన బిడ్డ చెడు అలవాట్లకు గురి కావాలని ఏ తల్లీ కోరుకోదు. పైరసీ చేస్తున్న వాళ్లు నా దృష్టిలో నికృష్టులు. పైరసీ చిత్రాలను చూసే వారు మహా నికృష్టులు. వాళ్లను దేవుడు చల్లగా చూడాలి" అని డా. మంచు మోహన్‌బాబు అన్నారు. ఆయన ద్విపాత్రాభినయం చేసిన 'గాయత్రి' ఇటీవల విడుదలైంది. ఈ చిత్రం సక్సెస్ మీట్ గురువారం హైదరాబాద్‌లో జరిగింది. మోహన్‌బాబు మాట్లాడుతూ "మా చిత్రం చూసిన వాళ్లందరూ బావుందని ప్రశంసిస్తున్నారు. ఇందులో రాజకీయాలకు సంబంధించిన డైలాగులు రత్నబాబు రాసినవే. నేను ఏ పార్టీకీ చెందిన వాడిని కాదు. ఏదైనా పార్టీలోకి వెళ్తే అప్పుడు నా అంతట నేనే చెప్తాను. నేనెప్పుడూ వ్యక్తిగత ధూషణ చేయను. నా సినిమాల్లో ఉన్న డైలాగులన్నీ పత్రికలను చదివో.. మరో రకంగానో మా రచయితలు రాసినవే. 'గాయత్రి'లోనివి కూడా అలాంటి సంభాషణలే" అని అన్నారు. పైరసీ గురించి మాట్లాడుతూ "పైరసీల వల్ల నిర్మాతల కళ్లల్లో ఏడుపు ప్రజలకు బాగా తెలుసు. మా సినిమాను తొలి రోజే నెట్‌లో పెట్టారు. లక్షలాది మంది ఆ కాపీలను చూసినట్టు తెలిసింది. పైరసీ చేసిన వ్యక్తికీ కుటుంబం ఉంటుంది. తప్పుడు పని చేస్తే భగవంతుడు ఇక్కడే శిక్షిస్తాడు. 'గాయత్రి'తో ఈ వయసులో నేనేదో ప్రూవ్ చేసుకోవాల్సిన అవసరం లేదు. ఇందులో విష్ణు పాత్రను చూసిన ప్రతి ఒక్కరూ మెచ్చుకుంటున్నారు. తన నటనను ప్రశంసిస్తుంటే తండ్రిగా సంతోషిస్తున్నాను" అని అన్నారు. దర్శకుడు మదన్ మాట్లాడుతూ "మౌత్ టాక్‌తో సినిమా చాలా బాగా ఆడుతోంది. విజయవాడ నాటక కళా పరిషత్ వాళ్లు ఫోన్ చేసి మెచ్చుకున్నారు. 55 ఏళ్ల వయసులో హాలీవుడ్ నటులు పడే కష్టాన్ని గుర్తించే మనం.. ఈ వయసులోనూ 'గాయత్రి'లో మోహన్‌బాబుగారు చేసిన ఫైట్లను తప్పక గుర్తించాలి. యాక్షన్ ఎపిసోడ్లు చేస్తున్నప్పుడు మా కుటుంబ సభ్యులు ఆయన అంకితభావం చూసి ఆశ్చర్యపోయారు" అని అన్నారు. ఇవాళ్టి సమాజంలో రైతు, నిర్మాత ఇబ్బందుల్లో ఉన్నారని రచయిత డైమండ్ రత్నబాబు చెప్పారు. ఈ కార్యక్రమంలో నటులు రాజా రవీంద్ర, పృథ్వి, నటి గీతా సింగ్, రచయిత రవి తదితరులు పాల్గొన్నారు.

అలా కనిపిస్తే తప్పేంటి?

\- రకుల్‌ప్రీత్ సింగ్



రకుల్‌ప్రీత్ సింగ్... ఉత్తరాది అమ్మాయి అయినా ఎక్కువశాతం తెలుగు సినిమాలు చేస్తూ తెలుగమ్మాయిగా మారిపోయింది. 'పక్కింటి అమ్మాయి' క్యారెక్టర్ అంటే తన పేరే మొదట చెబుతారు అభిమానులు. అలాగని ఈ అమ్మాయి గ్లామర్ పాత్రలకు దూరమేమీ కాదు. అడపాదడపా పాటల్లో మాంచి హాట్‌గా కనిపిస్తూ యువతను అలరిస్తోంది. సినిమాల్లో హాట్‌గా కనిపించినప్పుడు ఆమెపై పెద్దగా విమర్శలు రాలేదు కానీ.. ఇటీవల ఓ మ్యాగజైన్ కవర్‌పేజీ కోసం రకుల్ ఇచ్చిన ఫొటో షూట్ చర్చనీయాంశమైంది. దాని గురించి రకుల్ మాట్లాడుతూ "ఈ మధ్యన ఓ మ్యాగజైన్‌కు ఇచ్చిన ఫోటోషూట్ చూసి జనాలంతా అవాక్కయ్యారు. నన్ను గాళ్ నెక్స్ట్ డోర్ అన్నవాళ్లే ఒక్క షూట్‌తో 'హాట్ గాళ్' అనే బిరుదు ఇచ్చేశారు. పక్కింటి అమ్మాయి పాత్రల్లో మాత్రమే నటించాననీ, గ్లామర్ పాత్రల అవకాశం కోసం హాట్ ఫొటో షూట్ చేశానని అంటున్నారు. నాకు అలాంటి ఆలోచన లేదు. తెలుగులో చాలా పాటల్లో హాట్‌గా కనిపించాను. కాబట్టి గ్లామర్‌గా కనిపించడం నాకు కొత్తేమీ కాదు. నా ఫిగర్, ఫిట్‌నెస్ బావున్నప్పుడు కవర్‌పేజ్‌పై నా ఫొటో ఉండటంలో తప్పులేదనిపించింది. ఏ హీరోయిన్ అయినా సరే జీవితంలో ఒక్కసారైనా మ్యాగజైన్‌లకు పోజులివ్వకుండా ఉండరు" అని అన్నారు. దాదాపు నాలుగేళ్ల తర్వాత 'అయ్యారీ' చిత్రంతో బాలీవుడ్ ప్రేక్షకులను పలకరించబోతోంది రకుల్. శుక్రవారం ప్రేక్షకుల ముందుకు రానుందీ సినిమా.

ఆలోచిస్తే.. అవసరమే అనిపించింది!

\- నాని



"హీరోగా బిజీగా ఉన్న ఈ తరుణంలో 'అ!' సినిమాను నిర్మించడం అవసరమా? అని తొలిరోజే ప్రశ్నించుకున్నాను. అవసరమే అనిపించింది. ఇలాంటి సినిమాలు తెలుగులో రాలేదని అనుకుని, ఎదురుచూసే ప్రతి ఒక్కరికీ నచ్చే చిత్రమవుతుంది" అని నాని అన్నారు. ఆయన నిర్మించిన 'అ!' శుక్రవారం విడుదల కానుంది. ఈ సినిమా గురించి నాని గురువారం హైదరాబాద్‌లో విలేకరులతో మాట్లాడుతూ "ఇష్టపడ్డచోట కష్టమనిపించదు అని అంటారు. సినిమాల విషయంలో రాత్రింబవళ్లు పనిచేస్తూనే ఉన్నా, నాకు ఏరోజూ శ్రమ అనిపించదు. ఓ వైపు 'కృష్ణార్జున యుద్ధం' షూటింగ్, మరోవైపు 'అ!' పోస్ట్ ప్రొడక్షన్ పనులతో ఈ మధ్య నిద్రలేని రాత్రులు గడుపుతున్నాను. 'అ!' నేను సంపూర్ణంగా నమ్మి చేసిన సినిమా. అన్ని వర్గాల వారికీ నచ్చుతుందని చెప్పను కానీ, వైవిధ్యమైన కథలు కావాలనుకునేవారికి మాత్రం తప్పకుండా నచ్చుతుంది. ఒక రకంగా చెప్పాలంటే ఈ సినిమాతో నిర్మాతగా మారి నేను రిస్క్ చేశాను. ఆ రిస్క్‌ని ఇంకొకరి మీద రుద్దడం నాకు నచ్చలేదు. అందుకే నేనే రిలీజ్ చేస్తున్నా. 'నాని గొప్ప సినిమా చేశాడు' అని తప్పకుండా అందరూ అంటారు. అయితే అది ఇప్పుడా? ఏడాది తర్వాతా? అనేది మాత్రం చెప్పలేను. నేను మొదటి నుంచీ నిర్మాతలను గౌరవిస్తాను. ఈ చిత్రానికి నిర్మాతగా మారడం వల్ల నిర్మాతలు పడే కష్టాలు నాకు మరింత లోతుగా అర్థమయ్యాయి. నేను సొంత బ్యానర్‌ని పెట్టుకున్నంత మాత్రాన, ఇకపై నా సినిమాలను నేనే తీసుకుంటానని అర్థం కాదు. నన్ను ఇంతటివాడిని చేసిన బయటి నిర్మాతలకు వరుసగా సినిమాలు చేస్తూనే ఉంటాను. నేను హీరోగా పనిచేసే ప్రతి సినిమాకూ అసిస్టెంట్ డైరక్టర్‌గానూ పనిచేస్తుంటాను. అసిస్టెంట్ డైరక్టర్ల పేర్లతో పాటు నా పేరు కూడా ఆ విభాగంలో వేయమని అందరినీ కోరుతుంటాను. కానీ ఎందుకో ఎవరూ వేయరు" అని అన్నారు. 'అ!' నటీనటుల గురించి మాట్లాడుతూ "ఈ చిత్రంలో నటించిన ప్రతి ఒక్కరూ కథ నచ్చి చేశారు. నాకోసమనో, నాకు ఫేవర్ చేస్తున్నామనో ఎవరూ చేయలేదు. అందరికీ ప్రాపర్‌గా పారితోషికం ఇచ్చాను. పక్కా నిర్మాతగా వ్యవహరించాను" అని చెప్పారు. మార్చి 1 నుంచి పరిశ్రమ చేయబోతున్న బంద్ గురించి ప్రస్తావిస్తూ "నాకు ఇంకా క్యూబ్‌ల వల్ల జరిగే వివరాలు తెలియదు. ఒకవేళ మార్చి 1 నుంచి బంద్ జరిగితే మాత్రం నిర్మాతగా నష్టం ఉంటుంది. రెండు వైపులా ఇప్పుడు నాకు డేంజరే" అని తెలిపారు. సినిమా విడుదల టెన్షన్‌ని మేనేజ్ చేయడం ఇంకా చేతకావడం లేదనీ, 'అ!' తమిళ, మలయాళ హక్కుల కోసం ఇప్పటికే సంప్రతింపులు జరిగాయనీ ఆయన అన్నారు.

చిన్న నిర్మాతల కష్టాలు తెలుసుకున్నా

\- దామోదర ప్రసాద్

"మొదట్లో చిన్న సినిమా నిర్మాతలకు చాలా ఇబ్బందులు ఉంటాయంటే ఏంటో అనుకునేవాడిని. ఇప్పుడు అనుభవపూర్వకంగా తెలిసింది. ఈ సమస్యను పరిష్కరించడానికి తోటి నిర్మాతలతోనూ, థియేటర్ ఓనర్లతోనూ మాట్లాడుతున్నా" అని కె.ఎల్ దామోదర ప్రసాద్ అన్నారు. విద్యాసాగర్ రాజు హీరోగా నటిస్తూ దర్శకత్వం వహించిన చిత్రం 'రచయిత'. సంచిత పడుకొనే కథానాయిక. కల్యాణ్ ధూళిపాళ్ల నిర్మాత. శుక్రవారం ప్రేక్షకుల ముందుకొస్తున్న ఈ చిత్రాన్ని కె.ఎల్.దామోదర ప్రసాద్ నైజాంలో విడుదల చేస్తున్నారు. ఆయన మాట్లాడుతూ "ఈ కథ నాకు బాగా నచ్చింది. పబ్లిక్‌కి సినిమా చూపించా. మంచి సినిమా అని అందరూ మెచ్చుకుంటున్నారు. అందుకే రంజిత్ మూవీస్ సంస్థ ద్వారా నైజాంలో విడుదల చేస్తున్నా. స్వచ్ఛమైన తెలుగు సినిమాకు చంద్రబోస్ చక్కని సాహిత్యం అందించారు" అని తెలిపారు. నిర్మాత మాట్లాడుతూ "సినిమా నిర్మించడం ఒక ఎత్తైతే విడుదల చేయడం మరో ఎత్తని ఈ ప్రయాణంలో తెలిసింది. ఎన్నో అడ్డంకులను అధిగమించడానికి దామోదర ప్రసాద్, రామదాసు, జగపతి బాబు కృషి చేశారు" అని అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ "ఒక అమ్మాయి మనసు ఎంత లోతుగా ఉంటుందో తెలిపే సినిమా ఇది. ఎమోషన్స్, థ్రిల్లింగ్ కాన్సెప్ట్‌తో తెరకెక్కించాం" అని చెప్పారు.


సంచిత, విద్యాసాగర్ రాజు

ఆద్యంతం ఫ్రెష్‌గా ఉంటుంది

"'మనసుకు నచ్చింది' సినిమా మొమెంట్స్ డ్రివన్ చిత్రం. మనసుకు హత్తుకునే అంశాలు చాలా ఉంటాయి. ఉరుకులు పరుగులుగా సాగుతున్న జీవితంలో ఒక్క క్షణం ఆగి మనచుట్టూ ఉన్న అందాలను ఆస్వాదించాలని చెప్పే సినిమా అవుతుంది" అని అన్నారు సందీప్‌కిషన్. మంజుల దర్శకత్వంలో ఆయన నటించిన చిత్రం 'మనసుకు నచ్చింది'. శుక్రవారం విడుదల కానుంది. ఈ సినిమా గురించి సందీప్ కిషన్ మాట్లాడుతూ "జెమిని కిరణ్‌గారికి, మంజులగారికి 100 శాతం సక్సెస్‌లున్నాయి. నేను వాళ్ల జడ్జిమెంట్‌ని నమ్మాను. అమ్మాయిలకు సంబంధించిన సెన్సిబిలిటీస్‌ని మంజులగారు చాలా బాగా క్యారీ చేశారు. సూరజ్ పాత్రలో నన్ను ప్రేక్షకులు తప్పక మెచ్చుకుంటారు. నా గత చిత్రాలకు సంపూర్ణంగా భిన్నంగా ఉంటుంది. మహేశ్‌గారు ఇంకా సినిమా మొత్తం చూడలేదు. అక్కడక్కడా ఫుటేజ్ చూశారు. సినిమా విడుదల రోజు వాళ్ల కుటుంబం మొత్తం చూస్తామని చెప్పారు. ఇకపై వరుసగా నా తరహా వినోదాత్మకంగా సాగే చిత్రాల్లో కనిపిస్తాను. మధ్యమధ్యలో ప్రయోగాలు చేస్తాను" అని అన్నారు. 'ప్రాజెక్ట్ జెడ్' నిర్మాత బషీద్ తనపై చేసిన ఆరోపణలన్నీ తప్పుడువేననీ, అలాంటి వ్యక్తి గురించి మాట్లాడటం కూడా వృథాననీ తెలిపారు.


సందీప్ కిషన్

నవ్వులు గ్యారెంటీ!

\-సత్య సింధూజ



మానస్, నిత్యా నరేష్, కారుణ్య కీలక పాత్రధారులుగా మల్లూరి హరిబాబు దర్శకత్వం వహించిన 'సోడ గోలీ సోడ' చిత్రం శుక్రవారం ప్రేక్షకుల ముందుకొస్తుంది. ఈ సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో నిర్మాత సత్య సింధూజ భువనగిరి మాట్లాడుతూ "సోడ గోలీ సోడ' మా బ్యానర్‌లో వస్తున్న తొలి సినిమా. కుటుంబం మొత్తం కలసి చూసేలా ఉండాలని పూర్తి వినోదాత్మక కథతో రూపొందించాం. చక్కని సందేశం కూడా ఉంది. థియేటర్‌లో కూర్చొన్న ప్రతి ఒక్కరికీ నవ్వులు గ్యారెంటీ. హీరోహీరోయిన్లు ఎంతో ఇష్టపడి పనిచేశారు. బెస్ట్ కమెడియన్స్ అంతా ఈ చిత్రంలో నటించారు. భరత్ సంగీతం అందించిన పాటలకు స్పందన బావుంది. సినిమాకు కూడా ప్రేక్షకుల్ని అలరిస్తుందని నమ్ముతున్నాం" అని అన్నారు.



విజయ గాధ

కూరగాయల్లో రారాజు ఆకాకర. పోషకాల గనిగా పేరుండటం, శాకాహారులతో పాటు మాంసాహారులు కూడా ఎక్కువగా వినియోగిస్తుడడంతో ఆకాకరకు తరగని డిమాండ్ వుంది. నిరంతరం మంచి ధర పలికే ఆకాకరను సాగు చేస్తూ గణనీయమైన లాభాలు గడిస్తున్నారు తూర్పుగోదావరి జిల్లా గొల్లప్రోలు, ప్రత్తిపాడు మండలాల రైతులు.

లాభాల్లో రారాజు ఆ కాకర

తెలుగు రాష్ట్రాలు, కర్ణాటక, మహారాష్ట్రలో డిమాండ్.. తూర్పుగోదావరి జిల్లాలో 700 ఎకరాల్లో సాగు

కూరగాయల సాగు నిరంతరం ఆదాయం తెచ్చిపెట్టినా కొన్ని కూరగాయల ధరలు ఒక్కోసారి పాతాళానికి పడిపోతాయి. ఫలితంగా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ పరిస్థితిని గమనించిన తూర్పుగోదావరి జిల్లాకు చెందిన పలువురు రైతులు నిత్యం మంచి డిమాండ్, ధర వుండే ఆకాకర సాగు ప్రారంభించారు. మంచి రుచితో పాటు పోషకాలు పుష్కలంగా వుండటంతో ఆకాకరకు పట్టణాల్లో మంచి గిరాకీ వుంది. దానికి తోడు మంచి ధర పలకడంతో తూర్పుగోదావరి జిల్లా గొల్లప్రోలు మండలం వన్నెపూడి, కొడవలి, తాటిపర్తి గ్రామాలు, ప్రత్తిపాడు మండలం పోతులూరు గ్రామ రైతులు 700 ఎకరాల్లో అకాకర సాగు చేస్తున్నారు. 15 ఏళ్ల క్రితం కొద్ది విస్తీర్ణంలో ప్రారంభమైన ఈ పంట సాగు ఇప్పుడు వేగంగా విస్తరిస్తున్నది. కిలో వంద రూపాయల నుంచి 250 రూపాయలకు పైగా ధర పలికే ఆకాకర సాగు వల్ల అధిక ఆదాయం వచ్చినా ఖర్చులు, శ్రమ కూడా ఎక్కువే అంటున్నారు రైతులు.

పందిరి కోసం అధిక వ్యయం

ఆకాకర రైతులు సొంతంగానే విత్తనాన్ని తయారు చేసుకుంటారు. ఒక పొలంలో పండిన పంట నుంచి విత్తనాలు అదే పొలంలో నాటరు. అలా చేస్తే సరిగా మొలకెత్తదని రైతుల నమ్మకం. తీగ జాతికి చెందిన ఈ పంట సాగులో అధిక భాగం పందిరి వేసేందుకే ఖర్చవుతుంది. మొక్కలు పందిరికి ఎంత బాగా అల్లుకుంటే అంత అధిక దిగుబడి వస్తుంది. దీని సాగుకు ఎకరానికి సుమారు లక్ష నుంచి 1.20 లక్షల వరకూ వ్యయం అవుతుంది. పందరి వేసేందుకే రూ.40 నుంచి 55 వేల వరకూ ఖర్చు చేయాలి. పంట వేసిన 100 రోజులకు దిగుబడులు ప్రారంభమవుతుంది. వారానికి ఒకసారి కాయలను కోస్తారు. ఆరు నెలలు పాటు నిరంతరాయంగా దిగుబడులు వస్తాయి. ఎకరానికి సగటున మూడు టన్నుల వరకూ దిగుబడి లభిస్తుంది. పరిస్థితులు అనుకూలిస్తే అత్యధికంగా 4.5 టన్నుల వరకూ దిగుబడి వస్తుందని రైతులు తెలిపారు. విత్తనం వేసిన ఏడాది కాకుండా మరుసటి ఏడాది మొక్కలకు ఉన్న దుంపలతో సాగును కొనసాగిస్తారు. పంట దిగుబడి ప్రారంభంలో 10 కిలోల ఆకాకర ధర రూ.1500 వుంటుంది. పంట చివరి దశకు చేరే కొద్దీ రేటు తగ్గుతూ వచ్చి రూ.500కు చేరుకుంటుంది.

ఈ ప్రాంతంలో పండిన పంటలో 90 శాతం శ్రీకాకుళం, విశాఖపట్టణం, విజయవాడ, గుంటూరు, ఇచ్ఛాపురం, అనకాపల్లి, గుంటూరు, ఒంగోలు మార్కెట్లతో పాటు తెలంగాణాలోని హైదరాబాదు, ఖమ్మం, వరంగల్ మహారాష్ట్రలోని ముంబయి, కర్నాటకలోని బళ్లారి, బెంగుళూరు తదితర మార్కెట్లకు ఎగుమతి అవుతున్నది. వ్యాపారులు రైతుల వద్ద పంట కొనుగోలు చేసి వేరే ప్రాంతాలకు లారీల మీద తరలిస్తున్నారు.

– ఆంధ్రజ్యోతి ప్రతినిధులు, పిఠాపురం, గొల్లప్రోలు రూరల్



ఎకరాకు లక్ష ఆదాయం

15 ఏళ్లుగా ఆకాకర సాగు చేస్తున్నాం. తుఫాన్లు వస్తే తప్ప ఏటా లాభం వస్తూనే ఉంది. అన్ని ఖర్చులూ పోను ఎకరాకు సుమారు లక్ష ఆదాయం వస్తుంది. గతంలో ఆకాకరను పందిరి పంటగా గుర్తించి సబ్సిడీ ఇచ్చేవారు. ఇప్పుడు అది తీసేశారు. విత్తనాలపై రాయితీ ఇచ్చి, సబ్సిడీ ఇస్తే మరింత మంది రైతులు ఈ పంట సాగు చేస్తారు.

– కందా దొరబాబు, కె. చంటిబాబు, ఆకాకర రైతులు, వన్నెపూడి



మధుమేహానికి చెక్

కాకరకాయను పోలి వుండే ఆకాకర పోషకాల గని. ఇందులో శరీరాన్ని శుద్ధి చేసే ఫినోలిక్ అధికంగా లభిస్తుంది. దీనికి శరీరంలోని మాలిన్యాలను తొలగించే శక్తి వుండటంతో కేన్సర్, ఊబకాయం వంటి వ్యాధులు దరిచేరకుండా వుంటాయి. అకాల వృద్ధాప్యాన్ని ఆకాకర దరిచేరకుండా చేస్తుంది. ఇందులో లభించే లుటిన్ వంటి సెరిటోనాయిడ్స్ వల్ల కంటి జబ్బులు, గుండె జబ్బులు వచ్చే అవకాశం తక్కువ. రక్తంలో చక్కెర శాతాన్ని తగ్గిస్తుంది. తద్వారా మధుమేహం దరిచేరకుండా చేస్తుంది. వందగ్రాముల ఆకాకరలో కేవలం 17 గ్రాముల కేలరీలు మాత్రమే వుంటాయి. పీచు పదార్థం కూడా అధికంగా వుండటంతో జీర్ణశక్తిని పెంపొందించడంతో పాటు అలర్జీలను కూడా దరిచేరనివ్వదంటున్నారు నిపుణులు.



విభిన్నం

పుట్టగొడుగుల పెంపకం..

నిత్యం ఆదాయం

స్వయంకృషితో పాలపుట్టగొడుగులు పెంచుతూ లాభాలు ఆర్జిస్తున్నారు కృష్ణా జిల్లా మొవ్వ మండలం ఆవిరిపూడి గ్రామానికి చెందిన మేడిశెట్టి ప్రసన్న. ఆరోగ్యశాఖలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తూనే తల్లిదండ్రుల ప్రోత్సాహంతో పుట్టగొడుగులు పెంచుతున్నారామె.

తక్కువ పెట్టుబడితో, కూలీల ఖర్చు లేకుండా పుట్టగొడుగుల్ని ఎవరైనా పెంచుకోవచ్చు. పట్టణాల్లో పుట్టగొడుగులకు మంచి గిరాకీ వుండటంతో మార్కెటింగ్ ఇబ్బందులు కూడా లేవు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా పలువురు పుట్టగొడుగులు పెంచుతూ ఆదాయం పొందుతున్నారు. తొలుత ఎండుగడ్డిని అంగుళం సైజులో ముక్కలు ముక్కలుగా కట్ చేసుకోవాలి. అనంతరం గడ్డిని ఉడకబెట్టాలి. ఉడకబెట్టిన గడ్డిని 20 శాతం తేమ ఉండే విధంగా ఆరబెట్టుకోవాలి. పాలిథిన్ కవర్లను సంచులుగా తయారుచేసుకుని ఆరబెట్టిన గడ్డిని ఐదు వరసలుగా నింపాలి. సంచుల్లో కొద్దిపాటి గడ్డివేసి దానిపైన విత్తనాలు, మరలా దానిపై గడ్డి, దానిపై విత్తనాలు ఇలా ఐదు వరసలుగా సంచిని నింపుకోవాలి. ఈ విధంగా తయారు చేసిన సంచిని గాలి ఆడకుండా గట్టిగా మూసి ఉంచాలి. ఆ సంచికి 25 చిన్న చిన్న రంధ్రాలు పెట్టాలి. ఆ సంచులను 21 రోజులపాటు చీకటి గదిలో ఉంచాలి. పుట్టగొడుగుల తయారీలో భాగంగా మట్టిని సేకరించి దానిని నానబెట్టి తర్వాత ఉడకబెట్టాలి. ఉడకబెట్టిన మట్టిలో చాక్ పౌడర్ కలపాలి. తదుపరి డార్క్ రూమ్‌లో ఉంచిన బ్యాగులను 21 రోజుల తర్వాత బ్యాగును సగానికి కట్ చేసి తయారుచేసుకున్న మట్టిని నింపాలి. అనంతరం ఈ బ్యాగులను వెలుతురు గదుల్లోకి మార్చాలి. 24 గంటల గడిచిన తర్వాత రోజుకు రెండుపూటలా పల్చగా తడుపుతూ ఉండాలి. 15 రోజులకు పుట్టగొడుగులు మొలకెత్తుతాయి. ఈ ప్రక్రియ మొత్తంలో 40 రోజులకు పుట్టగొడుగులు పూర్తిస్థాయిలో తయారవుతాయి. తయారైన పుట్టగొడుగులు రెండు నెలలపాటు కోసుకోవచ్చు. కేజీ విత్తనాలతో ఐదు కిలోల పుట్టగొడుగులు తయారవుతాయి. తయారైన పుట్టగొడుగులను ఆన్‌లైన్ ద్వారా కిలో రూ.200లకు హైదరాబాద్, కాకినాడ, విజయవాడలో విక్రయిస్తున్నట్లు తెలిపారు. కొనుగోలుదారులు తమ అకౌంట్‌లో ముందుగానే డబ్బులు వేస్తారని, అనంతరం వారి అడ్రస్ ప్రకారం సరుకులు పంపిస్తామని తెలిపారు.

– ఆంధ్రజ్యోతి ప్రతినిధి, ఆవిరిపూడి (కూచిపూడి)

నెలకు 20 వేల ఆదాయం

కూలీలపై ఆధారపడకుండా కుటుంబసభ్యులే పనిచేసుకుంటే నెలకు రూ.20 వేల వరకు ఆదాయం లభిస్తున్నది. ప్రభుత్వం ప్రోత్సహిస్తే ఎక్కువ విస్తీర్ణంలో పుట్టగొడుగుల పెంపకాన్ని విస్తరించే ఆలోచనలో ఉన్నాను. – ప్రసన్న

నయా మాల్



పంటలకు మందులు చల్లేందుకు ఇప్పటి వరకు రైతులు ఉపయోగిస్తున్న పవర్ స్ప్రేయర్, ట్రాక్టర్ స్ప్రేయర్‌ల స్థానంలో మరో ఆధునిక యంత్రం అందుబాటులోకి వచ్చింది. పురుగుల మందు ఏమాత్రం వృధాకాకుండా, మొక్క మొత్తం మందును చల్లే వీలున్న బూమ్ స్ప్రేయర్ విశేషాలు.

బూమ్ స్ప్రేయర్ భళా



రాఘవరెడ్డి

పొలంలో పవర్ స్ప్రేయర్‌తో పురుగుల మందు చల్లినప్పుడు ఆవిరి రూపంలో ఎక్కువ మందు గాలిలో కలిసిపోతుంది. ట్రాక్టర్ స్ప్రేయర్‌తో మందు పిచికారి చేసినా 30 శాతం వరకు నష్టం కలుగుతుంది. పైగా ట్రాక్టర్ వల్ల పంట నష్టం కూడా 15 శాతం వరకు వుంటున్నది. ఈ సమస్యలను అధిగమించి పంట నష్టం జరగకుండా, తక్కువ ఖర్చుతో, మొక్క అంతటికీ మందు పడే విధంగా పురుగులు మందును చల్లే బూమ్ స్ప్రేయర్ మార్కెట్‌లోకి వచ్చింది. రక్షక్-400 పేరుతో శక్తిమాన్ కంపెనీ ట్రాక్టర్ మౌంటెడ్ బూమ్ స్ప్రేయర్‌ను తయారుచేసింది. దీని ధర రూ.11 లక్షలు. 400 లీటర్ల డబుల్ లేయర్ హైడెన్సిటీ పాలిథిన్ కెమికల్ ట్యాంక్ కలిగి ఉంటుంది. ఈ యంత్రానికి 12 మీటర్లు (40 అడుగులు) పొడవైన బూమ్ కలిగి ఉంటుంది. మందు పిచికారి సమయంలో దీనిని విచ్చుకునేలా చేసి తర్వాత మడతపెట్టే విధంగా డిజైన్ చేశారు. ఈ యంత్రానికి సిరామిక్ డిస్క్‌తో టువే ట్రిపుల్ యాక్షన్ 24 నాజిల్స్ ఉంటాయి. దీని వలన పెద్దగా పంట నష్టం వుండదు. వరి మళ్లలో వరి సాలు తీయకుండానే ఈ స్ప్రేయర్‌తో మందు కొడితే సాలు ఏర్పరిచే కూలీల ఖర్చు కూడా మిగులుతుంది.

ఖర్చు తక్కువ.. ఫలితం ఎక్కువ

'మా సంస్థ ద్వారా బూమ్ స్ప్రేయర్‌ను కొనుగోలు చేశాం. ఈ యంత్రంతో వరి, పత్తి, శనగ, మిరప, కంది పైర్లలో మందు పిచికారీ చేశాం. ఈ స్ప్రేయర్ వల్ల పురుగుల మందు మొక్కలపై పూర్తిగా పడుతుంది. ఎత్తుగా పెరిగే వరి, కంది, జొన్న పంటలకు నష్టం వాటిల్లకుండా, సునాయాసంగా తిరుగుతూ స్ప్రే చేయడం ఈ యంత్రం ప్రత్యేకత. ట్రాక్టర్ ద్వారా మందు పిచికారీ చేసేందుకు ఒక హెక్టారుకు రూ.300 తీసుకుంటున్నారు. ఈ యంత్రం కోసం నాలుగు ఎకరాల్లో మందు చల్లేందుకు రూ.700 తీసుకుంటున్నాం' అన్నారు కామనూరు గ్రామంలోని రాధా ప్రకృతి ఫార్మస్ ప్రొడ్యూసర్ కంపెనీ అధ్యక్షుడు నంద్యాల రాఘవరెడ్డి.

– ఆంధ్రజ్యోతి ప్రతినిధి, ప్రొద్దుటూరు

సమాచారం

రైతుకు వరం

1800-425-341

పంటల సాగులో రైతులకు అవసరమైన సమాచారాన్ని అందించేందుకు ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం అన్నపూర్ణ కృషి ప్రసార సేవ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఇందుకోసం టోల్ ఫ్రీ నంబరు(1800 425 341)ను ఏర్పాటు చేసింది. ఈ నంబరుకు దేశంలో ఎక్కడి నుంచైనా మాట్లాడవచ్చు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 23 జిల్లాల్లోని రైతుల సమస్యలకు ఇటు ఏపీలోని 13 జిల్లాల ఏరువాక కేంద్రం/ కృషి విజ్ఞాన కేంద్రాలకు, అటు తెలంగాణలోని పాత 10 జిల్లాల్లోని ఏరువాక/కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలతో రైతులు నేరుగా మాట్లాడవచ్చు. టోల్ ఫ్రీ నంబరుకు ఫోన్ చేయగానే ఆటోమేటిక్‌గా ఏ జిల్లా రైతు సమస్య అయితే, ఆ జిల్లాలోని ఏరువాక/ కృషి విజ్ఞాన కేంద్ర ప్రధాన శాస్త్రవేత్తకు కాల్ అనుసంధానం అవుతుంది. వ్యవసాయ, ఉద్యాన పంటలతో పాటు పశువుల యాజమాన్యం, చేపల పెంపకంపై రైతులు తమ సందేహాలకు సలహాలు పొందే వీలుంది. ఫోన్‌కు ఎస్ఎంఎస్‌లు కూడా పంపుతారు. ఈ సేవలు పొందటానికి సంబంధిత జిల్లా కృషి విజ్ఞాన కేంద్రం/ ఏరువాక కేంద్రంలో రైతులు తమ వివరాలను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలి. నెంబరును ఉచితంగా నమోదు చేస్తారు. అదనపు సమాచారం కోసం 99896 25239, 97006 51031, 91778 04355 సంప్రదించవచ్చని అన్నపూర్ణ కృషి ప్రసార సేవ ఇన్‌ఛార్జి డాక్టర్ పున్నారావు తెలిపారు. టోల్ ఫ్రీ నంబరుకు కాకుండా నేరుగా ఏరువాక కేంద్రం/ కృషి విజ్ఞాన కేంద్రం ఫోన్ నంబర్లకు ఫోన్ చేస్తే, రైతుకు కాల్ ఛార్జీలు పడతాయి.

ఏపీలోని 13 జిల్లాల ఏరువాక కేంద్రం/ కృషి విజ్ఞాన కేంద్రాల ప్రధాన శాస్త్రవేత్తల నంబర్లు ఇవీ : శ్రీకాకుళం - కృషి విజ్ఞాన కేంద్రం- 99896 23822, విజయనగరం- ఏరువాక కేంద్రం- 99896 23801, విశాఖపట్నం- ఏరువాక కేంద్రం - 99896 23802, తూర్పుగోదావరి- ఏరువాక కేంద్రం- 99896 23803, పశ్చిమగోదావరి- కృషి విజ్ఞాన కేంద్రం- 99896 23823, కృష్ణా- కృషి విజ్ఞాన కేంద్రం- 99896 23824, గుంటూరు- ఏరువాక కేంద్రం- 99896 23806, ప్రకాశం- కృషి విజ్ఞాన కేంద్రం- 99896 23827, నెల్లూరు- కృషి విజ్ఞాన కేంద్రం - 99896 23828, కడప - కృషి విజ్ఞాన కేంద్రం- 99896 23826, కర్నూలు- ఏరువాక కేంద్రం- 99896 23910, అనంతపురం- కృషి విజ్ఞాన కేంద్రం- 99896 23825, చిత్తూరు - కృషి విజ్ఞాన కేంద్రం- 80085 00320.

– ఆంధ్రజ్యోతి ప్రతినిధి, అమరావతి

బాపట్లలోని వ్యవసాయ పరిశోధనా కేంద్రం 11 రకాల కొత్త జీడిమామిడి వంగడాలు రూపొందించింది. ఈ ఏడాది రైతులకు లక్ష జీడిమామిడి మొక్కలు అందించేందుకు బాపట్ల కేంద్రం సన్నాహాలు చేస్తున్నది.



వైవిధ్యం

జీడిమామిడికి కొత్త వంగడాల కళ



కె.ఉమామహేశ్వరరావు

జాతీయ జీడిమామిడి పరిశోధన పథకం కింద బాపట్ల పరిశోధన స్థానంలో 60 ఎకరాల్లో జీడిమామిడి చెట్లు విస్తరించి వున్నాయి. ఈ క్షేత్రంలో శాస్త్రవేత్తలు కొత్తరకాల వంగడాలను తయారుచేయటంతో పాటు ప్రాచుర్యం పొందిన వంగడాల మొక్కల అంటులను తయారుచేసి రైతులకు అందిస్తున్నారు. 60 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న చెట్ల నుంచి వచ్చే పంటను వేలంపాట ద్వారా విక్రయిస్తారు. పరిశోధనా స్థానం ఇప్పటివరకు 11 రకాల వంగడాలను విడుదల చేసింది. విడుదలైన వంగడాలలో బిపిపి-8 అత్యధిక ప్రాచుర్యం పొందింది. అధిక దిగుబడి ఇవ్వడంతో పాటు ఈ హైబ్రీడ్ రకం గింజ బరువు 7 నుంచి 8 గ్రాములు ఉంటుంది. దీంతో దీనికి జాతీయ వంగడంగా గుర్తింపు లభించింది. అధిక దిగుబడి ఇచ్చే ఈ వంగడం పట్ల తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలతో పాటు శ్రీకాకుళం రైతులు ఆసక్తి చూపుతున్నారు. నూతనంగా బిపిపి 10, బిపిపి 11 రకాలను కూడా విడుదల చేశారు. ఇవి కూడా అత్యధిక ప్రాచుర్యం పొందాయి. గత ఏడాది బాపట్ల జీడిమామిడి పరిశోధన స్థానం నుంచి 50 వేల మొక్కలు అంటుగట్టి రైతులకు విక్రయించారు. ఈ ఏడాది లక్ష మొక్కలు టార్గెట్ పెట్టుకున్నట్లు సీనియర్ శాస్త్రవేత్త కె. ఉమామహేశ్వరరావు తెలిపారు. జీడిమామిడికి ఆశించే పురుగు నివారణకు చర్యలు చేపడితే అధిక దిగుబడులు సాధించవచ్చు అని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.



తేయాకు దోమ : జీడిమామిడికి తేయాకు దోమ ఆశిస్తే లీటర్ నీటికి 0.6 ఎం.ఎల్ కరాటే మందును కలిపి పిచికారి చేసుకోవాలి. జీడిమామిడి ప్రస్తుతం పూత, పిందె దశలో ఉంది కాబట్టి ఈ రకం దోమ ఆశించే అవకాశం ఎక్కువగా ఉంది.

గింజతినే పురుగు : ప్రస్తుత దశలో గింజతినే పురుగు ఆశించే అవకాశం ఉంది. ప్రొఫినోఫాస్ మందును పిచికారీ చేసి నివారించుకోవచ్చు అని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

– ఆంధ్రజ్యోతి ప్రతినిధి, బాపట్ల

మిద్దె తోటలపై అవగాహనా సదస్సు

నగరం శరవేగంగా విస్తరిస్తున్నది. ఫలితంగా మనం తాగే నీరు, పీల్చే గాలి, తినే తిండి అంతా కలుషితం అవుతున్నాయి. మిద్దె తోటల పెంపకం వల్ల వాతావరణంలో ఆక్సిజన్ పెరుగుతుంది. ఆరోగ్యకరమైన ఆహారం లభిస్తుందనే దిశగా ప్రజలు ఆలోచిస్తున్నారు. అలా ఆలోచిస్తున్న వారికి అండగా నిలబడేందుకు తెలంగాణ రాష్ట్ర ఉద్యానవన శాఖ సహకారంతో రైతునేస్తం ఫౌండేషన్ మిద్దెతోటలపై ఒక రోజు అవగాహనా సదస్సును నిర్వహిస్తున్నది. ఈ నెల 18న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు హైదరాబాద్ లక్డీకాపూల్ రెడ్‌హిల్స్‌లోని ఫ్యాప్సీభవన్‌లో ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు రైతునేస్తం ఫౌండేషన్ సారథి యడవల్లి వెంకటేశ్వరావు తెలిపారు. మిద్దెతోటల నిపుణులు విజయనగరానికి చెందిన కర్రి రాంబాబు తదితరులు ఈ సదస్సులో పాల్గొంటారు.





సమస్య - సమాధానం

దాళ్వాకు నీరు లేని పరిస్థితుల్లో అనేక కష్ట నష్టాలకు ఓర్చి మినుము సాగు చేస్తున్నాం. తెగుళ్లు, పురుగుల బారి నుంచి మినుము పైరును కాపాడుకునేందుకు క్రిమి సంహారకాలు వాడక తప్పడం లేదు. దీంతో ఖర్చు అధికమవుతుంది. వాతావరణ మార్పుల వల్ల చీడపీడలు అధికంగా వస్తున్నాయి. దీనికి తోడు ఎలుకలు పంటను ధ్వంసం చేస్తున్నాయి. వీటన్నింటిని అధిగమించి మినుము దిగుబడులు తీస్తుంటే ధర విషయంలో దగా పడుతున్నాం. క్వింటాలు మినుములు రూ.4200లు అంటే రైతుకు, కౌలు రైతులకు ఎలా గిట్టుబాటు అవుతుంది? గతంలో క్వింటా

మినుము రైతుకు భరోసా

మినుములు రూ.14500 అత్యధిక ధర పలికి జిల్లా రైతులను లాభాల వైపు నడిపించింది. రెండేళ్ల క్రితం ఒక్కసారిగా క్వింటా ధర రూ.14500ల నుంచి క్రమక్రమంగా రూ.8వేలు, రూ.6వేలకు తగ్గి ప్రస్తుతం క్వింటా రూ.4,200లకు పడిపోవడంతో అపరా రైతు కుదేలవుతున్నాడు. పెరిగిన సమాచార సాంకేతిక పరిజ్ఞానంతో నిజమైన రైతుల నుంచి ప్రభుత్వ కేంద్రాల్లో మినుములు కొనుగోలు చేయాలి? కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, శాంపిళ్ల పరిశీలన, కొనుగోలు విషయంలో రైతులను ఇబ్బందులు పెట్టడం, నాణ్యతా పరమైన లోపాల సాకుతో ధరలు తగ్గించే దళారులను ప్రోత్సహించడం వంటి అవసవ్య విధానాల వల్ల కొనుగోలు కేంద్రాలు నిరుపయోగంగా మారుతున్నాయి. మద్దతు ధర విషయంలో, కొనుగోలు కేంద్రాల్లో అడ్డదారులు తొక్కేవారిని దారికి తెచ్చే విషయంలో ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటున్నది?

– అట్లూరి వెంకటేశ్వరరావు, అపరాల రైతు, చౌటపల్లి కృష్ణాజిల్లా

ఆరు కొనుగోలు కేంద్రాలు



కృష్ణా జిల్లాలో ఈ ఏడాది మినుము దిగుబడులు పెరగనున్నాయి. దాదాపు 1.59 లక్షల మెట్రిక్ టన్నులు మినుము దిగుబడులు అంచనా వేశాం. మినుము దిగుబడులు చేతికి వచ్చే తరుణం ఆసన్నం కావడంతో ప్రభుత్వం మద్దతు ధర క్వింటాలు రూ.5400లు చొప్పున కొనుగోలు చేసేందుకు మార్కెఫెడ్ సన్నాహాలు చేస్తోంది. ఈ మేరకు జిల్లా కలెక్టర్ జిల్లాలో ఆరు మినుము కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాల్సిందిగా ఆదేశాలిచ్చారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని ప్రభుత్వ మద్దతు ధర పొందవచ్చంటున్నారు కృష్ణా జిల్లా వ్యవసాయాధికారి పి. మోహనరావు.

– ఆంధ్రజ్యోతి ప్రతినిధి, గుడివాడ

రూ.365 పెరిగిన బంగారం

ముంబై : బంగారం ధరలు పెరుగుతున్నాయి. గురువారం ఇక్కడి బులియన్ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన 10 గ్రాముల బంగారం ధర 365 రూపాయలు పెరిగి 30,725 రూపాయలకు చేరింది. 99.5 శాతం స్వచ్ఛత ఉన్న పసిడి ధర కూడా ఇదే స్థాయిలో పెరిగి 30,575 రూపాయలకు చేరింది. ఇక కిలో వెండి ధర 470 రూపాయలు పెరిగి 38,655 రూపాయలకు ఎగబాకింది. విదేశీ మార్కెట్లలో నెలకొన్న ట్రెండ్‌కు అనుగుణంగా దేశీయ మార్కెట్లో బంగారం ధరలు పెరుగుతున్నాయి. స్థానిక జువెలర్స్ నుంచి డిమాండ్ పెరగడం కూడా ధరల వృద్ధికి కారణమవుతున్నట్టు పరిశ్రమవర్గాలు తెలిపాయి. ప్రపంచ మార్కెట్లో ఔన్స్ స్పాట్ బంగారం ధర 1,354 డాలర్ల స్థాయిలో ఉండగా.. ఔన్స్ వెండి ధర 16.92 డాలర్లు పలుకుతోంది.

ఔను..

నీరవ్ నుంచి ఆఫర్ నిజమే

- అయితే అస్పష్టంగా, అసమగ్రంగా ఉంది.
- ఎవరికీ నష్టం రానివ్వం.. బాధ్యులపై కఠిన చర్యలు
- స్కామ్‌ను బ్యాంకే బయటపెట్టింది.. పిఎన్‌బి చైర్మన్ సునీల్ మెహతా



న్యూఢిల్లీ : వజ్రాభరణాల వ్యాపారి నీరవ్ మోదీ తమ బ్యాంకును 11 వేల కోట్ల రూపాయల మేర ముంచిన కేసులో బాధ్యులపై కఠినమైన చర్యలు తీసుకోనున్నట్టు పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పిఎన్‌బి) ప్రకటించింది. ఈ కేసులో నిందితులను ఎవర్నీ ఉపేక్షించేది లేదని బ్యాంకు సిఎండి సునీల్ మెహతా చెప్పారు. ఈ కేసు ముంబైలోని తమ ఒక శాఖకు సంబంధించినదే తప్ప బ్యాంకు మొత్తానికి సంబంధించినది కాదని ఆయన తెలిపారు. ఇంకా ఎక్కడైనా ఇలాంటి అక్రమాలు జరిగాయా తేల్చేందుకు దాదాపు అన్ని శాఖల రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేసినట్టు తెలిపారు. ఇప్పటికే పది మంది అధికారులను పిఎన్‌బి సస్పెండ్ చేసింది. కేసును సిబిఐకి అప్పగించింది. నీరవ్ మోదీ ఇళ్లు, కార్యాలయాలపై సిబిఐ, ఇడి దాడులు నిర్వహించి ఆస్తులను జప్తు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో కేసుకు సంబంధించిన వివరాలపై మెహతా గురువారం నాడు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కిక్కిరిసిన విలేకరుల సమావేశంలో బాణాల్లా దూసుకువచ్చిన పలు ప్రశ్నలకు ఓపిగ్గా సమాధానం ఇచ్చే ప్రయత్నం ఆయన చేశారు. ఆయన ఏం చెప్పారంటే.....

- పంజాబ్ నేషనల్ బ్యాంకును బోగస్ లెటర్స్ ఆఫ్ అండర్‌టేకింగ్ (ఎల్‌ఒయు)లతో 11,346 కోట్ల రూపాయల మేర దగా చేసిన నీరవ్ మోదీ అందులో కొంత మొత్తాన్ని బ్యాంకుకు చెల్లించేందుకు ముందుకు వచ్చాడంటూ వస్తున్న వార్తలు నిజమే. అయితే నీరవ్ తరఫున వచ్చిన ఆఫర్లు చాలా అస్పష్టంగా ఉన్నాయి. నిర్థుష్టమైన ఆఫర్ ఏమీ రాలేదు.
- నీరవ్ బ్యాంకుకు స్వయంగా వచ్చి ఎలాంటి ప్రతిపాదనలు చేయలేదు. ఆయన తరఫున లాంఛనంగా ఒక ప్రతిపాదన మాత్రమే అందింది. అస్పష్టంగా ఉన్నప్పటికీ దానిని కూడా మేం పరిశీలిస్తున్నాం.
- స్వయంగా బ్యాంకుకు వచ్చి డబ్బు తిరిగి ఎలా చెల్లిస్తారో లిఖితపూర్వకంగా తెలియజేయాలని నీరవ్‌ను కోరాం. పిఎన్‌బితో పాటు ఇతర బ్యాంకుల ప్రయోజనాలను కాపాడేందుకు పూర్తిస్థాయిలో చర్యలు తీసుకుంటాం.
- ఇప్పటికే ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ నీరవ్ మోదీ, ఆయన కంపెనీల ఆస్తులను జప్తుచేసుకునే ప్రక్రియ మొదలుపెట్టింది.
- 123 ఏళ్ల చరిత్రలో బ్యాంకు అనేక ఎత్తుపల్లాలు చూసింది. తప్పు చేసిన వారెవరైనా వదిలే ప్రసక్తి లేదు. ఈ స్కామ్ 2011లో ప్రారంభమైంది. మా బ్యాంకే దీనిని కనిపెట్టింది. దర్యాప్తు సంస్థలకు ఫిర్యాదు చేసింది.
- ఈ స్కామ్ నేపథ్యంలో రుణాల మంజూరు, లెటర్ ఆఫ్ అండర్‌టేకింగ్ జారీకి సంబంధించిన పద్ధతులను సమగ్రంగా సమీక్షించి ఎక్కడెక్కడ లోపాలున్నాయో గుర్తించి వాటిని సరిదిద్దుతాం. అవసరమైతే ఫోరెన్సిక్ ఆడిటింగ్ జరిపిస్తాం.
- ప్రభుత్వం ఈ కేసుకు సంబంధించిన పరిణామాలను రోజువారిగా సమీక్షిస్తోంది. కేసు ప్రస్తుతం దర్యాప్తులో ఉంది. ఆర్‌బిఐ నుంచి మాకు ఆదేశాలేమీ రాలేదు. ఆర్‌బిఐ ఏం ఆదేశించినా పాటిస్తాం.
- ఈ స్కామ్ కారణంగా బ్యాంకు అదనంగా ఎంత సొమ్మును పద్దుల్లో కేటాయించాల్సి (ప్రొవిజనింగ్) వస్తుందనే విషయం ఇప్పుడే తేల్చిచెప్పడం కష్టం.
- ఇతర బ్యాంకులకు నష్టం రానిచ్చే ప్రసక్తిలేదు. చట్టప్రకారం ఉన్న కమిట్‌మెంట్స్ అన్నింటినీ పిఎన్‌బి పూర్తి చేస్తుంది. బాధ్యతాయుతమైన బ్యాంకుగా మేం పారదర్శకంగా, నిజాయితీగా ఉంటామని మా స్టేక్ హోల్డర్లందరికీ స్పష్టం చేస్తున్నాం. ఈ కేసు గురించి స్టేక్ హోల్డర్లందరికీ ఇప్పటికే తెలియజేశాం. సెబికి మొట్టమొదటే సమాచారం ఇచ్చాం.

దోపిడీకి ఎల్‌ఒయు స్కెచ్

కేవలం ఇద్దరే ఇద్దరు ఉద్యోగులు 123 ఏళ్ల ఘనచరిత్ర ఉన్న పంజాబ్ నేషనల్ బ్యాంకు (పిఎన్‌బి)ను నిలువునా ముంచేందుకు సాహసించగలరా? బోగస్ ఎల్‌ఒయులతో ఏడేళ్లుగా బ్యాంకుకు నీరవ్ మోదీ ఘరానాగా కన్నం వేస్తుంటే అంతర్గత నియంత్రణ, నిఘా వ్యవస్థలన్నీ ఏమైనట్టు? ఏటా జరిగే ఆర్‌బిఐ తనిఖీలు ఏమైనట్టు? పిఎన్‌బి చెబుతున్న కథనం ప్రకారం బ్యాంకును 11,346 కోట్ల రూపాయల మేర దగా చేసిన నీరవ్ మోదీ స్కామ్‌లో ఇద్దరే ఇద్దరు ఉద్యోగులు కీలకపాత్ర పోషించారు. ఈ కథనంలోని విశ్వసనీయతను పక్కనబెడితే స్కామ్ పిఎన్‌బి ఇస్తున్న వివరణ అనేక కొత్త ప్రశ్నలకు ఆస్కారం ఇస్తోంది. అసలీ స్కామ్ ఎలా జరిగిందీ, ఎల్‌ఒయులంటే ఏమిటీ, ఈ సౌకర్యాన్ని మోదీ కంపెనీలు ఎలా ఉపయోగించుకున్నాయి...

లెటర్ ఆఫ్ అండర్‌టేకింగ్ (ఎల్‌ఒయు) ఈ స్కామ్‌లో అత్యంత ప్రధాన పాత్ర పోషించింది. అంతర్జాతీయ బ్యాంకింగ్ లావాదేవీల్లో ఎల్‌ఒయును ఉపయోగిస్తారు. ఇది లెటర్ ఆఫ్ క్రెడిట్ లాంటి సౌకర్యమే. ఇందులో నాలుగు పార్టీలుంటాయి. దేశీయంగా ఉన్న దిగుమతి సంస్థ, విదేశాల్లోని ఎగుమతి సంస్థ, ఎల్‌ఒయు జారీ చేసే బ్యాంకు, విదేశాల్లో ఈ ఎల్‌ఒయుపై రుణాన్ని ఇచ్చే బ్యాంకు శాఖ. సాధారణంగా ఎల్‌ఒయుకు సమానమైన లేదా అంతకంటే ఎక్కువ విలువైన నగదును డిపాజిట్ చేస్తేనే బ్యాంకులు దానిని జారీ చేస్తాయి.

ఎలా పనిచేస్తుందంటే...

ఉదాహరణకు హైదరాబాద్‌లోని ఒక కంపెనీ హాంకాంగ్ సంస్థ నుంచి ముడి వజ్రాలను కొనుగోలు చేసింది. ఈ డీల్‌కు అవసరమైన నగదును ఫారెక్స్‌లో సదరు కంపెనీ హాంకాంగ్‌లోని విక్రేతకు చెల్లించాలి. అయితే ముడి వజ్రాలను దిగుమతి చేసుకొని వాల్యుయాడెడ్ ఉత్పత్తులుగా మార్చి ఎగుమతి చేస్తేనే కంపెనీకి ఫారెక్స్‌లో రాబడి వస్తుంది. మరెలా... దీనికి పరిష్కారమే ఎల్‌ఒయు. హైదరాబాద్ కంపెనీ తరఫున బ్యాంకు జారీ చేసే ఎల్‌ఒయును విదేశాల్లోని మరో బ్యాంకు శాఖ స్వీకరించి ఎల్‌ఒయు విలువకు సమానమైన మొత్తాన్ని విదేశీ మారకంలో రుణంగా ఇస్తుంది. ఈ రుణంతో ముడిసరుకు విక్రేతకు హైదరాబాద్ సంస్థ చెల్లింపులు జరుపుతుంది. ముడిసరుకును వాల్యుయాడెడ్ ఉత్పత్తిగా మార్చిన తర్వాత వచ్చిన సొమ్ముతో బ్యాంకు రుణాన్ని తీర్చివేస్తుంది. ఈ మొత్తం సర్కిల్ సవ్యంగా పూర్తయ్యే వరకు ఎల్‌ఒయు జారీ చేసిన కంపెనీ ఎల్‌ఒయును స్వీకరించి సొమ్ము సమకూర్చిన బ్యాంకు శాఖకు రుణపడి ఉన్నట్టే లెక్క. ఈ స్కామ్‌లో దిగుమతుల పేరుతో ఎల్‌ఒయులను ఉపయోగించి రాబట్టుకున్న సొమ్మును నీరవ్ మోదీ దారి మళ్లించి సొంత అక్కరలకు ఇతర ఉపయోగాలకు వాడుకున్నట్టు ఆరోపిస్తున్నారు. అంటే ఈ స్కామ్‌లో దిగుమతులు బోగస్, ఎల్‌ఒయులు బోగస్.. పిఎన్‌బి కోల్పోయిన సొమ్ము మాత్రమే నిజం.

ఇలా చేరవేస్తారు...

సొసైటీ ఫర్ వరల్డ్‌వైడ్ ఇంటర్‌బ్యాంక్ ఫైనాన్షియల్ టెలికమ్యూనికేషన్స్ (స్విఫ్ట్) అనే మాధ్యమం ద్వారా ఎల్‌ఒయు వివరాలు ఒక బ్యాంకు నుంచి మరో బ్యాంకుకు చేరుతుంటాయి. ప్రతి గంటకూ ఈ పద్ధతిలో కొన్ని లక్షల డాలర్ల విలువైన లావాదేవీలు జరుగుతుంటాయి. స్విఫ్ట్ ఆదేశాలను బ్యాంకులు బేఖాతర్ చేసిన ఉదంతం ఇప్పటి వరకు లేదు. ఎందుకంటే ఎల్‌ఒయు జారీ చేయడం, దానిని ధృవీకరించడం, తుది అనుమతులు మంజూరు చేయడం.. ఇవన్నీ బ్యాంక్‌లో విధిగా జరిగే ప్రక్రియ. ఈ ఎల్‌ఒయుల వివరాలన్నీ బ్యాంకు రికార్డుల్లో వెంటవెంటనే నమోదవుతాయి. ఎల్‌ఒయులను సాధారణంగా నూరు శాతం నగదు మార్జిన్ తీసుకొనే జారీ చేస్తారు. అందువల్ల ఇప్పటి వరకు ఈ ఏర్పాటు ఎక్కడా కట్టుదప్పలేదు.

ఎవరినీ వదలం..

పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పిఎన్‌బి) కుంభకోణం కేసులో ఎవర్నీ వదిలే ప్రసక్తి లేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. నీరవ్ మోదీ ఆస్తులను జప్తు చేస్తామని కేంద్ర ప్రభుత్వ ఆర్థిక శాఖ కార్యదర్శి రాజీవ్ కుమార్ చెప్పారు. ఈ కేసులో మోసపోయిన మొత్తాలకు నిబంధనల ప్రకారం పిఎన్‌బి ప్రొవిజనింగ్ చేస్తుందని ఆయన చెప్పారు. ప్రొవిజనింగ్‌కు పిఎన్‌బి దగ్గర తగినన్ని నిధులున్నాయని ఆయన వివరించారు. ఈ కేసు గురించి అన్ని బ్యాంకులను అప్రమత్తం చేసినట్టు వెల్లడించారు. నిందితుల ఆస్తులను జప్తు చేసి బ్యాంకు నష్టపోయిన సొమ్మును రికవర్ చేస్తామని అన్నారు.



పిఎన్‌బి ఏం చెబుతోంది...

బ్యాంకుకు సంబంధించిన ప్రతి లావాదేవీ అప్పులు ఇచ్చినా, డిపాజిట్లు తీసుకున్నా, ఎల్‌సిలు, ఎల్‌ఒయులు జారీ చేసినా... కోర్ బ్యాంకింగ్ సిస్టమ్‌లో నమోదు కావాలి. దీనివల్ల తమ ఆస్తులు, అప్పులపై బ్యాంకుకు ప్రతిక్షణం సమాచారం ఉంటుంది. మోదీ కంపెనీల విషయంలో ఇద్దరు ఉద్యోగులు కోర్ బ్యాంకింగ్‌లో వివరాలు నమోదు చేయకుండా అనధికారికంగా, అక్రమంగా ఎల్‌ఒయులను సృష్టించారు. భారతీయ బ్యాంకుల విదేశీ శాఖలకు స్విఫ్ట్ ద్వారా నేరుగా వివరాలను పంపించారు. మోదీకి చెందిన కంపెనీలు (స్టెల్లార్ డైమండ్స్, డైమండ్ ఆర్‌యుఎస్, సోలార్ ఎక్స్‌పోర్ట్స్) ఎగుమతిదారులకు చెల్లించాల్సిన సొమ్మును ఈ ఎల్‌ఒయులను తీసుకున్న బ్యాంకు శాఖలు సమకూర్చాయి.

పిఎన్‌బి చెల్లించాల్సిందే..

ప్రస్తుతానికి తెలిసిన వివరాల ప్రకారం, మోదీ కంపెనీల తరఫున జారీ అయిన ఎల్‌ఒయులకు హాంకాంగ్‌లోని యాక్సిస్ బ్యాంక్, అలహాబాద్ బ్యాంక్ శాఖలు నిధులను సమకూర్చాయి. అంటే ఈ సొమ్మును ఈ బ్యాంకులకు పిఎన్‌బి చెల్లించాలన్నమాట. యాక్సిస్, అలహాబాద్ బ్యాంకుతో పాటు యూనియన్ బ్యాంక్, ఐసిఐసిఐ బ్యాంక్ కూడా పిఎన్‌బి ఎల్‌ఒయులపై రుణాలు మంజూరు చేసినట్టుగా చెబుతున్నారు. ఇందులో యాక్సిస్ బ్యాంకు ఈ ఎల్‌ఒయులను సెకండరీ మార్కెట్లో విక్రయించినట్టుగా చెబుతోంది. అంటే ఈ ఎల్‌ఒయులను విక్రయించడం ద్వారా తాను రుణంగా ఇచ్చిన సొమ్మును యాక్సిస్ బ్యాంకు రాబట్టుకుంది. ఇప్పుడు వాటిని కొనుగోలు చేసిన బ్యాంకుకు పిఎన్‌బి నుంచి సొమ్ము రావాల్సి ఉంది. పిఎన్‌బి ఈ చెల్లింపులో విఫలమైతే దీని ప్రభావం అనేక బ్యాంకులపై ఉంటుందన్నమాట.

ఎంఎస్ఆర్ ఇండియా రాబడి రూ.50 కోట్లు


హైదరాబాద్ : డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో ఎంఎస్ఆర్ ఇండియా లిమిటెడ్ ప్రోత్సాహకర ఫలితాలను ప్రకటించింది. అక్టోబరు-డిసెంబరు త్రైమాసికానికి గాను కంపెనీ మొత్తం రాబడులు ఏకంగా 118 శాతం వృద్ధితో 22.87 కోట్ల రూపాయల నుంచి 49.85 కోట్ల రూపాయలకు పెరిగాయి. కాగా త్రైమాసిక లాభం కూడా 57.53 లక్షల రూపాయల నుంచి 1.02 కోట్ల రూపాలకు పెరిగింది. డాక్టర్ కాపర్ విక్రయాలు గణనీయంగా పెరగటంతో లాభం పెరిగిందని ఎంఎస్ఆర్ ఇండియా తెలిపింది.



బులియన్

బంగారం (10 గ్రాములు)	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	ప్రొద్దుటూరు	చెన్నై
24 క్యారెట్లు	31,610	31,500	31,590	31,300	30,710
క్రితం ముగింపు	---	31,200	31,230	30,900	30,330
22 క్యారెట్లు	29,270	29,250	29,060	29,000	29,250
క్రితం ముగింపు	---	29,000	28,730	28,610	28,890
వెండి (కిలో)	39,800	40,000	39,700	40,000	41,800
క్రితం ముగింపు	---	39,500	39,300	39,700	41,300

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	70.00	విజయవాడ	75.00
కరీంనగర్	71.00	గుంటూరు	75.00
వరంగల్	72.00	ఒంగోలు	77.00
మహబూబ్‌నగర్	70.00	చిత్తూరు	58.00
కర్నూలు	70.00	నెల్లూరు	65.00
విశాఖపట్నం	71.00	అనంతపురం	68.00
గోదావరి	74.00		

రిటైల్ (ఒక గుడ్డు) ధర రూ. 4.50 నెక్ (100 గుడ్లు)



హైదరాబాద్	391.00	చిత్తూరు	408.00
వరంగల్	393.00	చెన్నై	415.00
విజయవాడ	395.00	నమక్కల్	395.00
గోదావరి	395.00	బెంగళూరు	400.00
విశాఖపట్నం	400.00	ముంబై	435.00

ఫారెక్స్ (థామస్‌కుక్ రేట్లు) (రూపాయల్లో..)



కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
యుఎస్ డాలర్	58.20	67.49
పౌండ్	81.52	94.56
యూరో	72.48	84.06
ఆస్ట్రేలియా డాలర్	46.14	53.38
బహ్రెయిన్ దినార్	157.62	180.63
కువైట్ దినార్	176.29	219.61
ఒమని రియాల్	154.35	176.59
సౌదీ రియాల్	15.51	18.39
సింగపూర్ డాలర్	---	---
యుఎఇ దిరమ్	15.84	18.52

ఎస్‌ఎంఇలను ఆదుకోండి

- కఠిన నిబంధనలు వద్దు
- వడ్డీ భారమూ తగ్గించాలి
- దక్షిణాది రాష్ట్రాల సమాఖ్య డిమాండ్



సమాఖ్య సమావేశంలో ప్రసంగిస్తున్న నవ్యాంధ్ర ప్రదేశ్ ప్రతినిధి కె సుబ్బారావు

చెన్నై (ఆంధ్రజ్యోతి): రుణ వసూళ్లలో తమ పట్ల బ్యాంకులు వ్యవహరిస్తున్న కఠిన వైఖరిపై చిన్న, మధ్యతరహా కంపెనీ(ఎస్‌ఎంఇ)లు ఆందోళన వ్యక్తం చేశాయి. చెన్నైలో గురువారం జరిగిన దక్షిణాది రాష్ట్రాల చిన్నతరహా పరిశ్రమ సంఘాల సమాఖ్య కేంద్ర ప్రభుత్వానికి ఈ మేరకు విజ్ఞప్తి చేసింది. ఫెడరేషన్ ఆఫ్ స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ ఆఫ్ ఇండియా నేషనల్ ప్రెసిడెంట్ ఏపీకే రెడ్డి ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎస్‌ఎంఇల నుంచి రుణాల వసూలు కోసం, గతంలో బ్యాంకులు 180 రోజులు గడువిచ్చి అప్పటికీ వసూలు కాకపోతే మొండి బకాయి(ఎన్‌పిఎ)లుగా ప్రకటించేవని నవ్యాంధ్రప్రదేశ్ ప్రతినిధి కె సుబ్బారావు పేర్కొన్నారు. బ్యాంకులు ఇపుడు ఆ గడువును 90 రోజులకు కుదించి, ఆ లోగా బాకీలు వసూలు కాకపోతే ఆస్తులు జప్తు చేసుకోవడం పరిపాటిగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో చిన్న, మధ్యతరహా పరిశ్రమలు తీవ్రంగా నష్టపోతున్నాయన్నారు.

వడ్డీ రేట్లలోనూ వివక్ష

గృహనిర్మాణ రంగాలకు 8.5 శాతం వడ్డీతో రుణాలు ఇస్తున్న బ్యాంకులు ఎస్‌ఎంఇల నుంచి మాత్రం 11 నుంచి 13 శాతం వడ్డీ వసూలు చేస్తున్నాయని సుబ్బారావు ఆందోళన వ్యక్తం చేశారు. హోమ్ లోన్లకి ఇస్తున్న విధంగా తమకూ 8.5 శాతం వడ్డీకి రుణాలు ఇవ్వాలని కోరారు. నష్టాలపాలై నడపలేని స్థితిలో ఉన్న ఎస్‌ఎంఇలు ఈజీ ఎగ్జిట్ పాలసీ ద్వారా రుణవిముక్తి పొందే సదుపాయం కల్పించాలన్నారు. జిఎస్‌టితో తమకు అవసరమైన పరికరాలపై పన్ను భారం పెరిగిపోయిందన్నారు. అదే సమయంలో బిహెచ్ఇఎల్ వంటి సంస్థల నుంచి తమకు రావలసిన బకాయిలు మాత్రం సకాలంలో అందడం లేదన్నారు. ఈ బకాయిలు త్వరగా అందేలా రాష్ట్రాలలో పని చేసే ఫెసిలిటేషన్ కౌన్సిళ్ళు తగు చొరవ చూపాలన్నారు. నిరుద్యోగ సమస్యల నిర్మూలనలో కీలక పాత్ర పోషించే చిన్న, మధ్యతరహా పరిశ్రమలపై కేంద్రప్రభుత్వం చిన్నచూపు చూడటం తగదని సుబ్బారావు అన్నారు.

మూడు నెలలకోసారి సమీక్ష

ఎస్‌ఎంఇల సమస్యలను పరిష్కరించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రతి మూడు మాసాలకొకసారి సమీక్షా సమావేశాలు నిర్వహించాలని ఫెడరేషన్ ఆఫ్ స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ ఆఫ్ ఇండియా నేషనల్ ప్రెసిడెంట్ ఎపికె రెడ్డి డిమాండ్ చేశారు. వీలయితే ప్రధాని మోదీ అధ్యక్షతన ఈ సమావేశాలు జరగాలని కోరారు. సమాఖ్య సమావేశంలో కేంద్ర ప్రభుత్వానికి పంపనున్న వినతి పత్రాన్ని దక్షిణాది రాష్ట్రాల ప్రతినిధులు విడుదల చేశారు. ఈ సమావేశానికి ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, తెలంగాణా, కర్నాటక, కేరళ రాష్ట్రాలకు చెందిన వందమందికి పైగా ప్రతినిధులు హాజరయ్యారు.

పెరిగిన లాంకో ఇన్‌ఫ్రా నష్టాలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్) : డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో లాంకో ఇన్‌ఫ్రా నష్టాలు మరింతగా పెరిగాయి. అక్టోబరు-డిసెంబరు త్రైమాసికంలో కంపెనీ నష్టాలు 388.60 కోట్ల రూపాయల నుంచి 426.10 కోట్ల రూపాయలకు పెరిగాయి. మరోవైపు త్రైమాసిక సమీక్షా కాలంలో స్థూల రాబడులు కూడా 238.60 కోట్ల రూపాయల నుంచి ఏకంగా 17.8 కోట్ల రూపాయలకు పడిపోయాయి. గత ఏడాది ఇదే త్రైమాసికంతో పోల్చితే స్థూల రాబడులు ఏకంగా 93 శాతం పడిపోయాయని తెలిపింది. కాగా డిసెంబరుతో ముగిసిన తొమ్మిది నెలల కాలానికి గాను స్థూల రాబడులు 1,088 కోట్ల రూపాయల నుంచి 293.80 కోట్ల రూపాయలకు పడిపోయాయని లాంకో తెలిపింది.

త్వరలో 700 క్యాష్ డిపాజిట్ మిషన్లు

- నవ్యాంధ్రలో మరిన్ని శాఖల ఏర్పాటు
- విరివిగా వ్యవసాయ రుణాల పంపిణీ
- ఐఒబి ఎండి సుబ్రమణియ కుమార్

విజయవాడ (ఆంధ్రజ్యోతి): వచ్చే రెండు మూడు నెలల్లో ఆంధ్రప్రదేశ్, కర్నాటక, తమిళనాడు రాష్ట్రాల్లో ఖాతాదారుల సౌలభ్యం కోసం 700 క్యాష్ డిపాజిట్ మిషన్లు ఏర్పాటు చేస్తామని ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్ (ఐఒబి) ప్రకటించింది. విజయవాడలో ఖాతాదారుల సమావేశం తర్వాత జరిగిన విలేకరుల సమావేశంలో బ్యాంక్ ఎండి ఎంఆర్.సుబ్రమణియ కుమార్ ఈ విషయం వెల్లడించారు. రైతులకు విరివిగా వ్యవసాయ రుణాలు ఇచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. తమ బ్యాంకు ఆధ్వర్యంలో రిటైల్ రుణాలు ఇవ్వడానికీ సిద్ధంగా ఉన్నట్టు చెప్పారు. గతంతో పోలిస్తే ఇటీవల అప్పుల రికవరీ కొంత మేర పెరిగిందన్నారు. కస్టమర్లకు మరింత దగ్గరై వారికి అవసరమైన అత్యుత్తమ సేవలు అందించడానికి హ్యాపీ మిస్డ్ కాల్, అన్‌హ్యాపీ మిస్డ్ కాల్ సిస్టమ్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. తమ సిబ్బంది నుంచి సంతృప్తికరమైన సేవలు అందకపోతే ఖాతాదారులు వెంటనే అన్‌హ్యాపీ మిస్డ్ కాల్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చన్నారు.



మరిన్ని శాఖలు

విజయవాడ రీజియన్ పరిధిలో ఐఒబికి ఇప్పటికే 92 బ్రాంచ్‌లు ఉన్నట్టు ఎండి సుబ్రమణియ కుమార్ చెప్పారు. నవ్యాంధ్రలో మరిన్ని శాఖలు ఏర్పాటు చేసే దిశగా ఆలోచిస్తున్నట్లు తెలిపారు. విజయవాడ రీజియన్ పరిధిలో ఇప్పటి వరకు 11.52 శాతం వృద్ధి రేటుతో రూ.239.80 కోట్లు వ్యవసాయ రుణాలుగా ఇచ్చామన్నారు. డిపాజిట్ల ద్వారా రూ 6265.76 కోట్లు సేకరించి, అందులో రూ. 4372.89 కోట్లు అడ్వాన్సుల రూపంలో ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఇందులో రిటైల్ అడ్వాన్సులే రూ.786.43 కోట్లు ఉంటాయని తెలిపారు. స్వయం సహాయక గ్రూపులకు దాదాపు రూ 160.10 కోట్లు రుణాల కింద ఇచ్చినట్లు చెప్పారు. తద్వారా మహిళలు ఆర్థికంగా ఎదుగుదలకు అవసరమైన అన్ని రకాల సహాయం అందిస్తున్నామన్నారు. విలేకరుల సమావేశంలో బ్యాంకు చీఫ్ రీజనల్ మేనేజర్ సదానంద మూర్తి, జోనల్ మేనేజర్ రమణలు పాల్గొన్నారు.

24 నుంచి విశాఖలో భాగస్వామ్య సదస్సు

- 36 దేశాల ప్రతినిధులు హాజరు



అమరావతి (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి భారీ స్థాయిలో పెట్టుబడులు ఆకర్షించడమే లక్ష్యంగా ఈ నెల 24, 25, 26 తేదీల్లో రాష్ట్ర ప్రభుత్వం విశాఖలో సిఐఐ భాగస్వామ్య సదస్సును నిర్వహిస్తోంది. సదస్సు నిర్వహణ ఏర్పాట్లపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గురువారం సచివాలయంలో సమీక్షించారు. ఈ సదస్సును ఉపరాష్ట్రపతి ఎం వెంకయ్యనాయుడు ప్రారంభించనున్నారు. కేంద్రమంత్రులు, సురేష్ ప్రభు, ఎంజేఅక్బర్, నితిన్ గడ్కరీ, అశోక్ గజపతిరాజు, ధర్మేంద్ర ప్రధాన్, హర్షవర్ధన్, రవిశంకర్ ప్రసాద్, నీతిఆయోగ్ వైస్‌చైర్మన్ అజయ్ కుమార్, నీతిఆయోగ్ సిఇఒ అమితాబ్ కాంత్ హాజరుకానున్నారు. బంగ్లాదేశ్, కెనడా, జపాన్, జోర్డాన్, మయన్మార్, మారిషస్, మొరాకో, సింగపూర్, శ్రీలంక, టాంజానియా, థాయిలాండ్, యుఎఇ, జాంబియా దేశాలకు చెందిన మంత్రులతో పాటు 36 దేశాలకు చెందిన పారిశ్రామిక, వాణిజ్య ప్రముఖులు ఈ సదస్సుకు హాజరవుతారని ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు.

ఆక్వా రైతుల కోసం టెక్నాలజీ అప్లికేషన్ సెంటర్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్) : ఆక్వా రైతులకు సరికొత్త టెక్నాలజీలను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ఆంధ్రప్రదేశ్‌లోని కైకలూరులో తొలి టెక్నాలజీ అప్లికేషన్ సెంటర్‌ను ప్రారంభించినట్లు కార్గిల్ వెల్లడించింది. కంపెనీ గత నెలలో విజయవాడలో ఫిష్ ఫీడ్ ప్లాంట్‌ను ప్రారంభించింది. 3.6 హెక్టార్లలో ఈ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు కార్గిల్ తెలిపింది.

ఇందులో 20 చేపల, రొయ్యల చెరువులు, శిక్షణా కేంద్రం, రొయ్యలకు అవసరమైన దాణాను అభివృద్ధి చేసేందుకు గాను తోడ్పాటునందించనున్నట్లు తెలిపింది. విజయవాడలోని ఫిష్ ఫీడ్ ప్లాంట్, రాజమండ్రిలోని రొయ్యల ఫీడ్ ప్లాంట్ సమీపంలోని ఆక్వా రైతులకు మెరుగైన సేవలందించేందుకు ఈ సెంటర్ దోహదపడుతుందని పేర్కొంది.

టి-మొబైల్, ఎటిసలాత్‌తో బిఎస్‌ఎన్‌ఎల్ జట్టు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్) : అమెరికా, యుఎఇ దేశాల్లోని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ వినియోగదారుల కోసం యునిలాటరల్ ప్రీపెయిడ్ ఇంటర్నేషనల్ రోమింగ్ సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకువచ్చినట్లు బిఎస్‌ఎన్‌ఎల్ వెల్లడించింది. అమెరికాకు చెందిన టి-మొబైల్, యుఎఇకి చెందిన ఎటిసలాత్ భాగస్వామ్యంతో ఈ సదుపాయాన్ని తీసుకువచ్చినట్లు తెలిపింది. అంతర్జాతీయ భాగస్వాములకు చెందిన నెట్‌వర్క్‌తో బిఎస్‌ఎన్‌ఎల్ ప్రీ పెయిడ్ వినియోగదారులు రోమింగ్ సేవలను అందుకోవచ్చని పేర్కొంది. అయితే ఈ సేవల కోసం వినియోగదారులు ప్రీ పెయిడ్ డ్యూయల్ ఐఎంఎస్ఐ సిమ్‌లతో ప్రస్తుత సిమ్‌లను మార్చుకోవాల్సి ఉంటుందని బిఎస్‌ఎన్‌ఎల్ తెలిపింది.

టెక్, ఫిన్‌టెక్ నిపుణుల కోసం ప్రత్యేక ప్రోగ్రామ్

- టాలెంట్ స్ప్రింట్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): టెక్నాలజీ, ఫైనాన్స్ నిపుణుల కోసం ప్రత్యేకమైన ప్రోగ్రామ్‌ను ప్రారంభించినట్లు టాలెంట్ స్ప్రింట్ వెల్లడించింది. ఫౌండేషన్స్ ఆఫ్ ఫిన్‌టెక్, బ్లాక్‌చెయిన్స్ పేరుతో ఈ ప్రోగ్రామ్‌ను తీసుకువచ్చినట్లు తెలిపింది. ఆన్‌లైన్, కాంటాక్ట్, యాక్షన్ లెర్నింగ్ కాంపోనెంట్స్‌తో ఈ హైబ్రిడ్ ప్రోగ్రామ్‌ను పరిశ్రమ దిగ్గజాలైన రిప్పిల్, పేపాల్, పేటీఎం పేమెంట్స్ బ్యాంక్, ఐసిఐసిఐ బ్యాంక్, ఇండియన్ ఏంజెల్ నెట్‌వర్క్ భాగస్వామంతో తీర్చిదిద్దినట్లు టాలెంట్ స్ప్రింట్ పేర్కొంది. సాంప్రదాయిక బ్యాంకింగ్, ఆర్థిక సర్వీసులు, ఐటి సర్వీసుల స్థానంలో కొత్త తరం కంపెనీలకు సరికొత్త వ్యాపార పద్ధతులను తీర్చిదిద్దేందుకు అవసరమైన నిపుణులను తయారు చేయటంలో ఈ ప్రోగ్రామ్ దోహదపడుతుందని తెలిపింది.

ఎస్‌ఎంఇల కోసం యాక్సిస్ బ్యాంక్ 'ఎవాల్వ్'

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఎస్‌ఎంఇ వినియోగదారుల కోసం నాలుగో ఎడిషన్ ఎవాల్వ్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు యాక్సిస్ బ్యాంక్ తెలిపింది. ఎస్‌ఎంఇ సంస్థలు తమ వ్యాపారాభివృద్ధి కోసం చేపట్టాల్సిన చర్యలను ఈ కార్యక్రమం ద్వారా వివరించనున్నట్లు బ్యాంక్ పేర్కొంది. కుటుంబ వ్యాపారాలను కలల కంపెనీగా మార్చుకోవటం ఎలా అన్న అంశంతో ఎవాల్వ్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు యాక్సిస్ బ్యాంక్ తెలిపింది. దేశవ్యాప్తంగా 30 నగరాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ఇందులో భాగంగానే హైదరాబాద్‌లోని చిన్న, మధ్య తరహా (ఎస్‌ఎంఇ) కంపెనీల కోసం దీన్ని నిర్వహించినట్లు యాక్సిస్ బ్యాంక్ ఎస్‌ఎంఇ, ప్రెసిడెంట్, హెడ్ జెపి సింగ్ తెలిపారు.

ఆంధ్రజ్యోతి

బిజినెస్

13

విజయవాడ • శుక్రవారం 16 ఫిబ్రవరి 2018

andhrajyothibusiness@gmail.com

సెన్సెక్స్	నిఫ్టీ	బంగారం	వెండి	రూపాయి డాలర్	ముడి చమురు
34297.47	10545.50	30725	38655	63.91	63.87
↑ 141.52	↑ 44.60	↑ 365	↑ 470	↑	↓

ముంబై - 10 గ్రాములు (99.9 స్వచ్ఛత)

దిగొచ్చిన ధరలు



జనవరిలో టోకు ద్రవ్యోల్బణం 2.84 శాతం

న్యూఢిల్లీ : ఆహార వస్తువుల ధరలు తగ్గడంతో జనవరి నెలలో టోకు ధరల ద్రవ్యోల్బణం ఆరు మాసాల కనిష్ఠస్థాయి 2.84 శాతానికి దిగివచ్చింది. ఇది ఆరు నెలల కనిష్ఠస్థాయి. గత జూలైలో నమోదైన కనిష్ఠ స్థాయి 1.88 శాతం తర్వాత నమోదైన మరో కనిష్ఠ స్థాయి ఇదే. ద్రవ్యోల్బణం తగ్గి పారిశ్రామికోత్పత్తి పుంజుకోవడంతో వడ్డీరేట్లు తగ్గించాలనే డిమాండు మరోసారి ఊపందుకుంది. కూరగాయల ధరలు పెరిగినప్పటికీ మొత్తం ఆహార వస్తువుల విభాగంలో మాత్రం ధరలు అదుపులోకి వచ్చాయి. డబ్ల్యుపిఐ గత ఏడాది జనవరిలో 4.26 శాతం ఉండగా డిసెంబరులో 3.58 శాతం ఉంది. ఆహారవస్తువుల విభాగంలో ద్రవ్యోల్బణం జనవరిలో అంతకు ముందు నెలతో పోల్చితే 4.72 శాతం నుంచి మూడు శాతానికి దిగివచ్చింది. కూరగాయల ధరల పెరుగుదల 56.46 శాతం నుంచి 40.77 శాతానికి క్షీణించింది. అయితే ఉల్లి ధర మాత్రం 194 శాతం పెరిగింది. పప్పుల ధరల్లో వృద్ధి 30.43 శాతం ఉండగా గోధుమ ధరలు 6.94 శాతం, కాయధాన్యాల ధరలు 1.98 శాతం పెరిగాయి. ప్రోటీన్లు అధికంగా ఉండే చేపలు, మాంసం, గుడ్ల ధర పెరుగుదల కేవలం 0.37 శాతానికే పరిమితం కాగా పళ్ల ధర 8.49 శాతం పెరిగింది. ఇంధన విభాగంలో ద్రవ్యోల్బణం 4.08 శాతానికి పెరిగింది. సోమవారం విడుదల చేసిన గణాంకాల ప్రకారం రిటైల్ ద్రవ్యోల్బణం 5.07 శాతానికి దిగివచ్చింది. కీలక రెపో రేటు నిర్ణయించే విషయంలో ఆర్‌బిఐ రిటైల్ ద్రవ్యోల్బణాన్నే పరిగణనలోకి తీసుకుంటుంది. జనవరి-మార్చి త్రైమాసికంలో ద్రవ్యోల్బణం 5.1 శాతం ఉండవచ్చునన్న అంచనాలతో ఆర్‌బిఐ ఇటీవల ప్రకటించిన ద్రవ్యపరపతి విధాన సమీక్షలో రెపో రేట్లలో ఎలాంటి మార్పు లేకుండా యథాతథంగా కొనసాగించింది. ఏప్రిల్-సెప్టెంబరు త్రైమాసికానికి ద్రవ్యోల్బణం 5.1 శాతం నుంచి 5.6 శాతం ఉండవచ్చునని ఆర్‌బిఐ అంచనా ప్రకటించింది. కాగా నవంబరు నెలలో డబ్ల్యుపిఐ ద్రవ్యోల్బణానికి 3.93 శాతం నుంచి 4.02 శాతానికి ఎగువకు సవరించారు.

జిడిపి ప్రాతిపదిక సంవత్సరంలో మార్పు

జిడిపి, ఐఐపి మదింపునకు ప్రాతిపదిక సంవత్సరాన్ని ప్రభుత్వం 2017-18గా మార్చబోతోంది. అలాగే రిటైల్ ద్రవ్యోల్బణానికి ప్రాతిపదిక సంవత్సరం 2018గా సవరిస్తారు. కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు శాఖ మంత్రి డివి సదానంద గౌడ ఈ విషయం తెలిపారు. మారుతున్న సామాజిక, ఆర్థిక పరిస్థితులకు దీటుగా గణాంకాలు ఉండేలా చేయడానికి తమ మంత్రిత్వ శాఖ పలు కీలక చర్యలు తీసుకోనున్నట్టు ఆయన చెప్పారు.

ఎగుమతులు 9 శాతం అప్

న్యూఢిల్లీ : భారత ఎగుమతులు జనవరి నెలలో 9 శాతం వృద్ధిని నమోదు చేశాయి. రసాయనాలు, ఇంజనీరింగ్ వస్తువులు, పెట్రోలియం ఉత్పత్తుల విభాగంలో ఆరోగ్యకరమైన వృద్ధి నమోదైంది. జనవరిలో మన దేశం నుంచి విదేశాలకు ఎగుమతి అయిన వస్తుసేవల విలువ 2438 కోట్ల డాలర్లు (రూ.1.56 లక్షల కోట్లు). ఇదే సమయంలో వాణిజ్య లోటు మూడేళ్ల గరిష్ఠ స్థాయికి దూసుకుపోయి 1,630 కోట్ల డాలర్లకు (రూ.1.04 లక్షల కోట్లు) చేరింది. కేంద్ర వాణిజ్య శాఖ విడుదల చేసిన గణాంకాల ప్రకారం జనవరిలో క్రూడాయిల్ దిగుమతులు పెరగడంతో దిగుమతుల్లో 26.1 శాతం వృద్ధి ఏర్పడి 4,068 కోట్ల డాలర్లకు (రూ.2.60 లక్షల కోట్లు) చేరింది. ఫలితంగా వాణిజ్యలోటు గణనీయంగా పెరిగింది. 2014 నవంబరు నెల తర్వాత వాణిజ్య లోటు ఇంత భారీగా నమోదు కావడం ఇదే ప్రథమం. గత ఏడాది జనవరిలో వాణిజ్య లోటు 990 కోట్ల డాలర్లుంది.

2016 ఆగస్టు నుంచి ఈ ఏడాది జనవరి వరకు ఎగుమతులు నిరంతరంగా పెరుగుతూ వస్తున్నాయని వాణిజ్య శాఖ ఆ ప్రకటనలో తెలిపింది. కాగా వర్తమాన ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-జనవరి నెలల మధ్య కాలంలో 11.75 శాతం 24789 కోట్ల డాలర్లకు (రూ.15.86 లక్షల కోట్లు) చేరాయి. దిగుమతులు 22.21 శాతం పెరిగి 37,900 కోట్ల డాలర్లకు (రూ.24.26 లక్షల కోట్లు) చేరగా వాణిజ్యలోటు 13,115 కోట్ల డాలర్లకు (రూ.8.39 లక్షల కోట్లు) చేరింది.

తగ్గిన బంగారం దిగుమతులు

జనవరి నెలలో బంగారం దిగుమతులు 22 శాతం తగ్గి 159 కోట్ల డాలర్లకు (రూ.10,176 కోట్లు) క్షీణించాయి. అయితే ఇదే సమయంలో ముడిచమురు దిగుమతులు 42.64 శాతం, నాన్ ఆయిల్ ఎగుమతులు 20.49 శాతం పెరిగాయి. 2017-18 ఏప్రిల్-జనవరిలో చమురు దిగుమతులు 26.35 శాతం పెరిగాయి.

మార్కెట్‌లో ఫుజిత్సు కొత్త ఏసిలు

52 డిగ్రీల ఉష్ణోగ్రతలోనూ చల్లని గాలులు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): తీవ్రమైన వేసవిలో ఉష్ణోగ్రతలు 52 డిగ్రీలకు చేరిపోవడం నేడు సర్వసాధారణం అయిపోయింది. అలాగే వోల్టేజిలో ఆటుపోట్లు 155 నుంచి 265 వోల్టుల మధ్యన ఉండే ప్రాంతాలెన్నో. ఇలాంటి అసాధారణ సందర్భాల్లో కూడా చల్లని గాలులందిస్తూ సేద దీర్చే ఏసిలను జపాన్‌కు చెందిన ఫుజిత్సు సంస్థ మార్కెట్‌లోకి తెచ్చింది. గురువారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఈ ఏసిలను కంపెనీ ప్రెసిడెంట్ ఎత్సురో సైతో హైదరాబాద్ వేదికగా భారత మార్కెట్లోకి విడుదల చేశారు. ప్రీమియం సెగ్మెంట్‌లో 'జనరల్' బ్రాండ్‌తో మొత్తం 26 కొత్త మోడల్ ఏసిలను మార్కెట్‌లోకి తెచ్చినట్టు కంపెనీ సిఇఒ, డైరెక్టర్ ఇజాజుద్దీన్ ప్రకటించారు. వీటిలో 14 మోడళ్లు ఉష్ణోగ్రతలు 52 డిగ్రీలకు చేరిన సమయంలో కూడా ఆగిపోకుండా చల్లని గాలులందిస్తాయని ఆయన చెప్పారు.

అలాగే వోల్టేజి ఆటుపోట్లు తీవ్ర స్థాయిలో ఉండే ప్రదేశాల్లో కూడా ట్రిప్ కాకుండా పనిచేసేవి ఐదు మోడల్స్ ఉన్నట్టు ఆయన తెలిపారు. వీటి ధర 25200 రూపాయల నుంచి 1,52,250 రూపాయల మధ్యన ఉంటుందని ఆయన చెప్పారు. ప్రస్తుతం థాయ్‌లాండ్ ప్లాంట్ నుంచి ఈ ఏసిలను దిగుమతి చేసుకుంటున్నట్టు ఆయన తెలిపారు.



భారత్‌లో ప్లాంట్ ఏర్పాటు - దక్షిణాదికే చాన్స్..

తమకు ప్రస్తుతం తైవాన్, థాయ్‌లాండ్, చైనా దేశాల్లో ఏసి తయారీ ప్లాంట్లున్నాయని సైతో అన్నారు. డిమాండుకు దీటుగా ఉత్పత్తులను చేరువలోనే తయారుచేసి అందించడం లక్ష్యంగా తమ ప్లాంట్ల ఏర్పాటు వ్యూహం ఉంటుందని అన్నారు. భారత మార్కెట్‌లో ఏసిల డిమాండు గణనీయంగా పెరిగిందని, ప్రస్తుతం ఇక్కడ నాలుగు శాతం మంది జనాభాకే ఏసిలున్నందు వల్ల మార్కెట్ అవకాశాలు అపారమని చెబుతూ ఈ అంశాలు దృష్టిలో ఉంచుకుని భారత్‌లో ప్లాంట్ ఏర్పాటు చేసే అంశం పరిశీలిస్తున్నట్టు ఆయన తెలిపారు. వచ్చే రెండు మూడేళ్ల కాలంలో తాము 100 కోట్ల డాలర్ల పెట్టుబడులకు సన్నాహాలు చేసుకుంటుండగా అందులో 20 కోట్ల డాలర్లు భారత ప్లాంట్‌పై పెట్టాలనుకుంటున్నామని ఆయన అన్నారు. ప్లాంట్ ఏర్పాటుకు భిన్న రాష్ట్రాలను పరిశీలిస్తున్నామని, దక్షిణాదిలో కూడా తాము అధ్యయనం చేస్తున్నామని సైతో చెప్పారు. ప్రస్తుతం భారత మార్కెట్ పరిమాణం ఏడాదికి 60 లక్షల ఏసిలు కాగా అందులో తాము నాలుగు శాతం మార్కెట్ వాటా కలిగి ఉన్నట్టు ఆయన తెలిపారు.

తమ ఉత్పత్తుల నాణ్యత అత్యధికంకావడంతో పాటు దీర్ఘకాలిక మన్నిక కలిగి ఉంటాయంటూ ధరలు కూడా పోటీ కంపెనీలతో పోల్చితే 20 శాతం వరకు అధికంగా ఉంటాయని ఆయన అన్నారు. కాని వినియోగదారుల సొమ్ముకి అవి పూర్తి సంతృప్తినిస్తాయి గనుక కస్టమర్లు ధరల గురించి అంతగా కలత చెందడంలేదని ఆయన వ్యాఖ్యానించారు.

అనిశ్చితి కొనసాగింపు

టెక్ వ్యూ

నిఫ్టీ గురువారం నాడు పాజిటివ్‌గా ప్రారంభమై కీలక నిరోధం 10600 పాయింట్ల వరకు వెళ్లినప్పటికీ తర్వాత కరెక్షన్‌లో పడింది. ఆ క్రమంలో మానసిక స్థాయి 10500 పాయింట్ల వరకు కూడా దిగజారి చివరికి డే కనిష్ఠ స్థాయిలో క్లోజయింది. ఈ ముగింపు అప్రమత్త ట్రెండ్‌కు సంకేతం. నిఫ్టీ కొద్ది రోజులుగా 10600 పాయింట్ల వద్ద విఫలమవుతూ సైడ్‌వేస్ ధోరణి ప్రదర్శిస్తోంది. ఇప్పుడు కనిష్ఠ స్థాయిల్లో పరీక్ష ఎదుర్కొనబోతోంది. అప్‌ట్రెండ్ ఆశలు నిలబెట్టుకోవాలంటే బౌన్స్‌బ్యాక్ తప్పనిసరి.

శుక్రవారం స్థాయిలివే...

నిరోధం : 10600 **మద్దతు :** 10500

- రికవరీ బాట పడితే స్వల్పకాలిక అప్‌ట్రెండ్ కోసం ప్రధాన నిరోధం 10600 పాయింట్ల కన్నా పైన బలంగా క్లోజ్ కావాలి. వీక్లీ చార్టు పాటర్న్‌కు శుక్రవారం నాటి ముగింపు అత్యంత కీలకం.
- మద్దతు స్థాయి 10500 పాయింట్ల కన్నా దిగజారితే స్వల్పకాలిక కరెక్షన్ కొనసాగుతుంది.
- బ్యాంక్ నిఫ్టీ మైనర్ రికవరీ సాధించినా టెక్నికల్‌గా ఎలాంటి సంకేతం ఇవ్వలేదు.

■ వి.సుందర్ రాజా

ఆటుపోట్లకు ఆస్కారం

ఆస్ట్రో వ్యూ

తిథి : ఫాల్గుణ శుద్ధ పాడ్యమి **నక్షత్రం :** ధనిష్ఠ, శతభిషం

ఆశ్లేష, జ్యేష్ఠ, రేవతి నక్షత్ర జాతకులు, మీన, కర్కాటక రాశులవారు అప్రమత్తంగా ఉండాలి.

నిఫ్టీ : 10545.50 (+44.60)

ట్రెండ్ మార్పు వేళలు : ఉదయం 9.40 గంటలు

ధోరణి : గ్రహగతులను బట్టి నిలకడగా ప్రారంభమై 10.30 నుంచి 12.15 మధ్యలో నిస్తేజంగా ఉండి తదుపరి మెరుగ్గా ట్రేడవుతూ 2.15 తర్వాత మరోసారి నిస్తేజ ధోరణిలోకి మారే ఆస్కారం ఉంది.

ట్రేడింగ్ వ్యూహం...

నిఫ్టీ ఫ్యూచర్స్ 10.30 సమయానికి ప్రారంభ స్థాయి/సగటు (ఎటిపి) కన్నా దిగువన ట్రేడవుతుంటే తగు స్టాప్‌లాస్‌తో షార్ట్ పొజిషన్లు తీసుకుని 12.10 సమయానికి క్లోజ్ చేసుకోవాలి. 12.30 తర్వాత ఎటిపి కన్నా పైకి వస్తే లాంగ్ పొజిషన్లు తీసుకుని 2.10 సమయానికి క్లోజ్ చేసుకోవాలి. 2.15 తర్వాత తిరిగి నిస్తేజం అయి ఎటిపి కన్నా దిగువకు వస్తే మరోసారి షార్ట్ పొజిషన్లు తీసుకుని చివరిలో క్లోజ్ చేసుకోవాలి.

ఇంట్రాడే ట్రేడింగ్‌కు ప్రారంభ స్థాయి కీలకం. అంతకన్నా దిగువన మాత్రమే షార్ట్ పొజిషన్లు శ్రేయస్కరం.

నిరోధ స్థాయిలు : 10585, 10625

మద్దతు స్థాయిలు : 10505, 10475

గమనిక : ఇది పూర్తిగా ఆస్ట్రోటెక్నికల్ అంశాల ఆధారంగా ఇచ్చిన సూచన. మార్కెట్ వాస్తవిక కదలికల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలి.

■ డా.భువనగిరి అమరనాథశాస్త్రి

www.thefinanciala strologer.blogspot.in

ద్రవ్యోల్బణం డేటాతో మార్కెట్‌కు ఊపిరి

సెన్సెక్స్ 141 పాయింట్ల లాభం

భారీ నష్టాల్లో పిఎన్‌బి, గీతాంజలి

మార్కెట్‌ను వెన్నాడుతున్న పిఎన్‌బి స్కామ్ భయాలు

ముంబై : మార్కెట్లో తీవ్రమైన ఆటుపోట్లు కొనసాగుతున్నాయి. సెన్సెక్స్ అనిశ్చిత ధోరణి ఇన్వెస్టర్లను గందరగోళపరుస్తోంది. పిఎన్‌బి స్కామ్ దెబ్బతో బుధవారం నష్టాలతో ముగిసిన మార్కెట్ గురువారం నాడు 141 పాయింట్ల లాభంతో ముగిసింది. ద్రవ్యోల్బణం డేటా ప్రోత్సాహకరంగా ఉండటం గురువారం నాడు ఇన్వెస్టర్లను ఉత్తేజపరిచినట్టుగా చెబుతున్నారు. మార్కెట్ స్థూలంగా లాభాల్లో ఉన్నప్పటికీ స్కామ్ దెబ్బతో పిఎన్‌బి షేరు మరో 12 శాతం పతనమై 128 రూపాయల వద్ద ముగిసింది. గీతాంజలి జువెలర్స్ షేరు ధర 20 శాతం నష్టంతో 46.90 రూపాయల వద్ద క్లోజైంది. ద్రవ్యోల్బణం జనవరిలో ఆరునెలల కనిష్ఠ స్థాయి 2.84 శాతాన్ని చేరడం, కొన్ని బ్లూచిప్ సంస్థల క్యూ3 ఫలితాలు ఆకర్షణీయంగా ఉండటంతో ఎంపికచేసిన షేర్లలో కొనుగోళ్లు జరిపారు. సెన్సెక్స్ 141 పాయింట్ల లాభంతో 34297 పాయింట్ల వద్ద ముగియగా నిఫ్టీ 44 పాయింట్ల లాభంతో 10545 పాయింట్ల వద్ద క్లోజైంది. మార్కెట్లో ఎఫ్ఐఐల అమ్మకాల జోరు కొనసాగుతోంది. బుధవారం విదేశీ ఇన్వెస్టర్లు 728 కోట్ల రూపాయల విలువైన షేర్లను విక్రయించారు. దేశీ ఇన్వెస్టర్లు 152 కోట్ల రూపాయల విలువైన షేర్లను విక్రయించారు. వాస్తవానికి అమెరికా ద్రవ్యోల్బణం 2.1 శాతానికి పెరగడంతో దీని ప్రభావం మార్కెట్లపై ఉంటుందని అనుమానించినా మార్కెట్లు భిన్నంగా స్పందించాయి.



ద్రవ్యోల్బణం పెరగడం వల్ల అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీరేట్లు పెంచే అవకాశం ఉంది. అది మన మార్కెట్లకు ప్రతికూలం. బ్యాంకింగ్ రంగాన్ని కుదిపేస్తున్న ఎన్‌పిఎలు స్కామ్‌ల సమస్య కూడా మార్కెట్‌కు ప్రతికూలమే. అయినా గురువారం మార్కెట్ లాభాలతో ముగిసి ఇన్వెస్టర్లను విస్మయపర్చింది.

- స్కామ్ దెబ్బకు పిఎన్‌బి షేర్లు కుప్పకూలడంతో రెండు రోజుల్లోనే బ్యాంకు మార్కెట్ క్యాప్ 8000 కోట్ల రూపాయల మేర హరించుకుపోయింది. ఇతర బ్యాంకింగ్ షేర్లు మాత్రం గురువారం నాడు స్థిరంగానే ఉన్నాయి.
- సెన్సెక్స్ షేర్లలో ఐసిఐసిఐ బ్యాంక్ గరిష్ఠంగా 3.5 శాతం లాభపడగా, ఇన్ఫోసిస్, హెచ్‌డిఎఫ్‌సి, పవర్ గ్రిడ్, ఒఎన్‌జిసి, బజాజ్ ఆటో, ఎస్‌బిఐ, ఐటిసి, డాక్టర్ రెడ్డీస్, ఎన్‌టిపిసి, టిసిఎస్ లాభాలతో ముగిశాయి.
- హీరో మోటోకార్ప్, టాటా స్టీల్, భారతి ఎయిర్‌టెల్, ఎల్ అండ్ టి, విప్రో, కోటక్ మహీంద్రా బ్యాంక్, ఏషియన్ పెయింట్స్ నష్టాలతో ముగిశాయి.
- పిఎన్‌బి స్కామ్ నేపథ్యంలో గీతాంజలి జెమ్స్ అండ్ జువెలర్స్ షేరు 20 శాతం పతనమైంది. ఈ దెబ్బతో ఈ విభాగంలోని పిసి జువెలర్, త్రిభువన్‌దాస్ భీమ్‌జీ జవేరీ, రాజేష్ ఎక్స్‌పోర్ట్స్ షేర్లు కూడా పతనమయ్యాయి.
- 2017లో అద్భుతమైన వార్షిక ఫలితాలతో 10 వేల కోట్ల రూపాయల అమ్మకాల రాబడిని ప్రకటించిన ఎంఎన్‌సి దిగ్గజం నెస్లే ఇండియా షేరు 4.3 శాతం పెరిగింది. మార్కెట్ క్యాప్ 3,000 కోట్ల రూపాయల మేర దూసుకుపోయింది.

నాణాలన్నింటినీ అనుమతించాల్సిందే

బ్యాంకులకు ఆర్‌బిఐ ఆదేశం



ముంబై : బ్యాంకులు అన్ని విలువలు గల నాణాలను అనుమతించాల్సిందేనని, ఏ నాణాన్ని నిరాకరించడానికి లేదని ఆర్‌బిఐ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులను ఉల్లంఘించినట్టయితే దానికి జరిమానా చెల్లించాల్సి ఉంటుందని హెచ్చరించింది. గతంలో చేసిన ఇలాంటి హెచ్చరికలను బ్యాంకులు పెడచెవిన పెడుతున్నాయంటూ పలు ఫిర్యాదులు అందిన నేపథ్యంలో తాజా ఉత్తర్వులను జారీ చేస్తున్నట్టు పేర్కొంది. నిరాకరణను ప్రజలకు కలిగిస్తున్న అసౌకర్యంగా పరిగణించడం జరుగుతుందని తెలిపింది. క్యాషియర్లకు సులభంగా ఉండేందుకు 100 రూపాయల నాణాలను ఒక్కో బ్యాగ్ వంతున పాలిథిన్ బ్యాగుల్లో ప్యాక్ చేసి తీసుకురావలసిందిగా కస్టమర్లను కోరవచ్చునని తెలియచేసింది. ప్రతి శాఖలోనూ నోటీసు బోర్డ్‌లో ఈ ప్రకటనను ప్రముఖంగా ప్రదర్శించాలని కూడా కోరింది. బ్యాంకులు ఆ నాణాలను కరెన్సీ చెస్ట్‌లలో జమ చేసినట్టయితే అవి నాణాలను తిరిగి చలామణిలోకి తెస్తూ ఉంటాయని పేర్కొంది.

భారత్‌లో డైసన్ సొంత స్టోర్లు

2020లో ఎలక్ట్రిక్ కారు ఆవిష్కరణ


న్యూఢిల్లీ : బ్రిటన్‌కు చెందిన ప్రీమియం అప్లయెన్సెస్ తయారీ సంస్థ డైసన్ భారత్‌లో సొంతంగా స్టోర్లను ఏర్పాటు చేయాలనుకుంటోంది. సింగిల్ బ్రాండ్ రిటైల్ కింద ఇవి ఏర్పాటుకానున్నాయి. ఈ స్టోర్ల కోసం 15 కోట్ల పౌండ్ల పెట్టుబడులు పెట్టాలని కంపెనీ యోచిస్తోంది. అంతేకాకుండా 2020నాటికి ఎలక్ట్రిక్ వాహనాలను విడుదల చేయాలనుకుంటోంది. ప్రీమియం వాక్యూమ్ క్లీనర్లు, హెయిర్ డ్రయర్లు, ఎయిర్ ప్యూరిఫయర్లను విక్రయిస్తున్న ఈ కంపెనీ ఢిల్లీ, ముంబై, బెంగళూరు సహా 10 నగరాల్లో 20 బ్రాండెడ్ స్టోర్లను ప్రారంభించాలన్న ప్రణాళికతో ఉంది. భారత్ చాలా కీలకమైన మార్కెట్ అని, ఈ మార్కెట్లోకి ప్రవేశించే దిశగా ప్రయత్నాలు చేస్తున్నట్టు కంపెనీ బోర్డు సభ్యుడు జాక్ డైసన్ తెలిపారు. దీర్ఘకాలిక వ్యూహంలో భాగంగా భారత్‌లోనే తమ ఉత్పత్తులను తయారు చేయాలనుకుంటున్నామన్నారు. ఉత్పత్తుల అమ్మకాలు పెరిగితే భారత్‌లో తయారీ గురించి యాజమాన్యం నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. ఎలక్ట్రిక్ వాహనాల అభివృద్ధి కోసం 250 కోట్ల పౌండ్లు వెచ్చిస్తున్నట్టు ఆయన తెలిపారు. 2020లో మొదటికారును ఆవిష్కరిస్తామని చెప్పారు.

త్వరలో నూతన ఫార్మా విధానం

డిపిసిఒలో భారీ సంస్కరణలు

కేంద్ర మంత్రి అనంత్ కుమార్

బెంగళూరు: ఔషధ ధరల నియంత్రణ ఆదేశం (డిపిసిఒ)లో భారీ మార్పులు చేర్పులు చేయనున్నట్టు కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ మంత్రి అనంత్ కుమార్ తెలిపారు. దేశవ్యాప్తంగా ప్రతిపాదిత 'నమోకేర్' అమలుకుగాను నూతన ఫార్మా విధానాన్ని తీసుకురానున్నట్టు చెప్పారు. వచ్చే రెండు నెలల్లో ఈ విధానాన్ని ఖరారు చేసే అవకాశం ఉందని తెలిపారు. నమో కేర్ దేశంలోని 10 కోట్ల కుటుంబాలకు ఆరోగ్య భద్రతను కల్పిస్తుందని, ఇందుకు పెద్ద ఎత్తున మౌలిక సదుపాయాలు, మానవ వనరులు, ఫార్మా, మెడికల్ డివైజ్‌ల అవసరం ఉంటుందని ఆయన చెప్పారు. గురువారం ఇక్కడ ఇండియా ఫార్మా, మెడికల్ డివైజ్ కాన్‌క్లేవ్‌ను ప్రారంభించిన సందర్భంగా అనంత్ కుమార్ మాట్లాడారు. ఫార్మా, మెడికల్ డివైజెస్‌కు సంబంధించి ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఈ విషయాన్ని ప్రధాని దృష్టికి తీసుకువెళతున్నామని తెలిపారు. నూతన డిపిసిఒలేకుండా నమోకేర్‌ను అమలు చేయడం కష్టంగా ఉంటుందన్నారు. డిపిసిఒ 2013 ద్వారా అత్యవసర ఔషధాల ధరలను ఎన్‌పిపిఎ నిర్ణయిస్తుంది. ఈ ఔషధాల ధరల నియంత్రణ మూలంగా పేద, మధ్యతరగతి ప్రజలు అందుబాటు ధరల్లోనే ఔషధాలు కొనుగోలు చేసే అవకాశం ఏర్పడుతుంది.



ఆస్టర్ ఐపిఓ

1.33 రెట్లు ఓవర్ సబ్‌స్క్రిప్షన్

న్యూఢిల్లీ : ఆరోగ్య సంరక్షణ రంగంలోని ఆస్టర్ డిఎం హెల్త్ పబ్లిక్ ఇష్యూ చివరి రోజున 1.33 రెట్లు ఓవర్ సబ్‌స్క్రయిబ్ అయింది. 980 కోట్ల రూపాయల సమీకరణ లక్ష్యంగా 3.74 కోట్ల షేర్లు మార్కెట్‌లో జారీ చేయగా గురువారం ఇష్యూ ముగిసే సమయానికి 4.88 కోట్ల బిడ్‌లు దాఖలయ్యాయి. రిటైల్ ఇన్వెస్టర్ల విభాగం 1.19 రెట్లు ఓవర్ సబ్‌స్క్రయిబ్ అయింది. సోమవారం మార్కెట్‌లోకి వచ్చిన ఈ ఇష్యూలో షేరు ధరల శ్రేణి 180-190 రూపాయలు. కొత్త ఆస్పత్రుల ఏర్పాటుకు, విస్తరణ కార్యకలాపాలకు, రుణభారం తగ్గించుకోవడానికి, ఇతర కార్పొరేట్ అవసరాలకు ఈ నిధులు ఉపయోగించుకోనున్నట్టు కంపెనీ ప్రకటించింది.

అమ్మకానికి నిజాం షుగర్స్!

మెదక్/మెదక్ రూరల్ : నిజాం షుగర్స్ కర్మాగారాల విక్రయానికి వేగంగా అడుగులు పడుతున్నాయి. నిజాం షుగర్స్ లేఆఫ్ తర్వాత ప్రభుత్వం ఆధీనంలోకి తీసుకుంటుందని ఆశించిన రైతులకు, కార్మికులకు నిరాశే మిగలనుంది. ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంలో నడుస్తున్న ఈ సంస్థలో ప్రభుత్వం, ప్రైవేట్ మధ్య సయోధ్య కుదరకపోవటంతో విక్రయ బాధ్యతలను మూడో వ్యక్తికి అప్పగించారు. నిజాం షుగర్స్ వ్యవహారాన్ని సాధ్యమైనంత త్వరలో ఒక కొలిక్కి తీసుకురావాలనే ఉద్దేశంతో ప్రభుత్వం.. దీన్ని నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సిఎల్‌టి)కి అప్పగించింది. ఇందులో భాగంగానే రిజొల్యూషన్ ప్రొఫెషనల్ రామకృష్ణ గుప్తాకు మెట్‌పల్లి, బోధన్, మంబోజిపల్లి ఫ్యాక్టరీల ఆస్తుల విలువను అంచనా వేసేందుకు అప్పగించింది. 100 కోట్ల రూపాయల పెట్టుబడి పెట్టగలిగిన పారిశ్రామికవేత్తలు, సంస్థలు.. నిజాం షుగర్స్ కొనుగోలుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించినట్లు తెలిసింది. ఫ్యాక్టరీ నిర్వహణ, అనుభవంతో పాటు 100 కోట్ల రూపాయల పెట్టుబడి పెట్టగల సామర్థ్యం ఉన్న పారిశ్రామికవేత్తలు, సంస్థలు 2017 మార్చి నాటికి 500 కోట్ల రూపాయల వరకు లావాదేవీలు చేపట్టి ఉండాలని కూడా దరఖాస్తులో పేర్కొన్నారు.

రెండేళ్లుగా నానుతూనే..

నిజాం షుగర్స్ కర్మాగారాలు.. ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మందికి ఉపాధి కల్పిస్తున్నాయి. 1935లో నిజాం హయాంలో బోధన్ చక్కెర కర్మాగారాన్ని ఏర్పాటు చేయగా, మెట్‌పల్లి కర్మాగారాన్ని 1984లో, మెదక్ జిల్లా మంబోజి పల్లిలో 1988లో అప్పటి ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్‌టి రామారావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఫ్యాక్టరీల ఏర్పాటుతో 11 మండలాల పరిధిలోని గ్రామాలకు చెందిన రైతులు పెద్ద ఎత్తున చెరకు సాగు చేస్తూ వస్తున్నారు. అనంతర కాలంలో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్ చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో నిజాం షుగర్స్ కర్మాగారాల్లో 51 శాతం వాటాను దక్కన్ షుగర్స్‌కు విక్రయించారు. అప్పటి నుంచి ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంలో కొనసాగుతూ వచ్చిన ఈ కర్మాగారాలు పూర్తి స్థాయిలో పతనావస్థకు చేరుకున్నాయి. కర్మాగారాల నిర్వహణ విషయంలో ఇరువురి మధ్య అవగాహన కొరవడటం ఇందుకు కారణం. మరోవైపు చెరకు ఉత్పత్తి కూడా 4 లక్షల మెట్రిక్ టన్నుల నుంచి 90 వేల టన్నులకు పడిపోవటంతో ఫ్యాక్టరీ నిర్వహణకు దక్కన్ షుగర్స్ యాజమాన్యం ఎంతమాత్రం ఆసక్తి చూపించలేదు. మరోవైపు నిజాం షుగర్స్‌ను ప్రభుత్వం స్వాధీన చేసుకుంటుందని ఉద్యమ సమయంలో ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్ రావు ప్రకటించారు. టిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రావటంతో కర్మాగారాల దశ మారుతుందని అందరు భావించారు. అయితే అందుకు విరుద్ధంగా 2015 డిసెంబరు 23న కార్మికులకు ఎలాంటి సమాచారం లేకుండా దక్కన్ షుగర్స్ లేఆఫ్ ప్రకటించింది.

దీంతో కార్మికులు, రైతులు పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టినా సంస్థ నుంచి గాని, ప్రభుత్వం నుంచి గాని ఎలాంటి ప్రకటన వెలువడలేదు. నెలల పాటు ఆందోళనలు నిర్వహించినా ఎలాంటి స్పందన లేకపోవటంతో రైతులు, కార్మికులు ఆశలు వదులుకున్నారు. తాజాగా కర్మాగారాల విక్రయానికి దరఖాస్తులు ఆహ్వానించటంతో.. ఇప్పటి వరకు పని చేసిన కార్మికుల సమస్యలు పరిష్కరించకుండా ఎలా విక్రయిస్తారనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

బిఎస్‌ఇలో తెలుగు రాష్ట్రాల కంపెనీల షేర్లు

ACI INFOCOM 4.84(5)1200
ADITYA SPIN. 8.82(8.4)100
AGRO TECH FO 650.85(652.5)6792
AISHWARYA TE 7.16(7.49)18889
ALPHAGEO (I) 832.7(841.75)1998
ALU FLUORIDE 120(117.35)11058
AMAR RAJA BA 826.65(839.35)39756
ANDHRA BANK 47(46.9)251558
ANDHRA CEMEN 11.61(11.76)15359
ANDHRA PETRO 59(60.85)108262
ANJANI PORTL 202.6(204.1)532
ASTRA MICRO 106.5(107.4)61265
AUROB.PHARMA 593.45(601.85)150442
AVANTEL LTD 578.8(595.85)8770
AVANTI FEEDS 2371.5(2411.6)9847
B.N.RATHI SE 42.85(43.25)7700
BALAJI AMINE 654.2(672.2)5533
BAMBINO AGRO 261.6(275.35)2430
BARTRONICSIN 13.34(13.81)14896
BHAGIRA.CHEM 304.9(317.2)2503
BHAGYA INL 48.3(50.55)24099
BHARATFIN 1017.4(1021.15)11753
BNR UDYOG 30.85(33.85)1226
CAMBRIDGE 79.95(81.55)30
CCHHL 14.8(15.4)33275
CCL PRODUCTS 284.6(291.7)3716
CELESTIAL 17.95(17.7)68712
CIL SECURITS 32(33)897
COROM INTER 528.4(533.25)3851
CUBEX TUBING 23.55(23.7)1251
CYBERMATE 3.52(3.53)44151
CYIENT 617.95(623.7)15110
DANLAW TECH. 74.8(77.2)19958
DECAN CEMENT 599(587.2)1652
DECCAN POLYP 3(2.95)800
DHAN ROTO SP 44.1(42)1482
DIAMONPOWER 15.75(16.6)79169
DIVI'S LAB. 1048(1050.3)23637
DIVYA.GRANIT 108(107.5)105
DQ ENT 15.75(16.3)11170
DR.REDDY'S 2194.45(2183.1)30129
EMPEE SUGARS 4.64(4.83)17074
EVEREST ORG. 146.7(145.65)363
FACOR ALLOYS 3.47(3.65)132328
FIRSTOBJ 15.85(16.65)3609
GATI LTD. 114.55(115.45)118550
GAYATRI BIO 10.6(10.39)6210
GAYATRI PROJ 223.35(223.85)70834
GENNEX LAB 4.59(4.9)764984
GMR INFRASTR 18.7(19.7)9075250
GODAVARI DRU 34.9(35.6)3299
GOLDST INFRA 197.25(213.8)117100
GOLDSTONE EN 15.2(16)8689
GRANULES (I) 117.65(122.25)181894
GVK POWERINF 18.75(19.6)1328756
HBL P SYS 57.55(61.25)134953
HERITGFOOD 689.85(702.05)3063
HIND.FLUROCA 15.5(15)1533
I.C.S.A. IND 3.8(4)31386
IKF TECHNO .83(.87)55602
INCAP LTD. 101.45(98)226
IPAPPM 331.55(345.25)7454
IVRCL LTD 4.77(4.98)81380
KAKATIYA CEM 300.4(306.9)6685
KALLAM SPG. 27.3(28.75)96383
KAVERI SEED 472.45(473.6)26452
KCP LTD 131.7(139.75)11602
KERNEX MICRO 46(45.85)6721
KNR CONST 321.1(321.25)18395
KREBS BIOCHM 161.5(154)6960
LANCO INFRA 1.32(1.36)3000259
LOKESH MACH 67.75(70.45)22832
LOTUS CHOC 48(50.5)2256
MADHUCON PRJ 28.55(29.3)16834
MOLD-TEK TEC 63(63.05)202
MOSCHIP SEMI 34.5(36)63908
MSR INDIA 45.5(46.65)11916
N C L IND. 243.45(243.9)21415
NACLIND 47.1(48.2)15044
NATCO PHARM 787.05(782.75)60181
NCC 123.4(126.5)953811
NEHA INTER. 7.51(8.04)12506
NETTLINX LTD 88.4(87.65)8132
NEULAND LAB. 711.7(708.3)2360
NIHAR INFO 14.89(14.45)564
NILE LTD. 876.85(899.3)1820
NTL 4.3(4.14)616
OIL COUNTRY 43.9(44.3)27934
PADMALAYA TE 4.9(5.05)7810
PALRED 98.2(93.55)11353
PANYAM CEMEN 51.2(51.35)16092
PENNAR STEEL 62.4(66.1)130689
PFL INFOTECH 9.67(10.15)13359
PHYTOCHEM I. 64.15(66.2)8544
PITTI LAMIN. 93(98.2)43803
POKARNA LTD 215.8(216.5)833
PRAJAY ENGS. 14.15(14.85)38257
PREMIER EXPL 396.2(405.55)1044
PRISM CEMENT 125.5(137.95)216065
RAIN 376.75(383.55)374707
RAJ PACKAGIN 38.7(38)50
REG.CERAMIC 5.53(5.71)25
RESTILE CER. 7.99(8.42)9093
SAGAR CEM. 993.55(1012.1)1100
SAMKRG PIST. 307.35(318.45)3816
SAMPRE NUTRI 57.55(60.55)7841
SANGHI IND. 116.35(120.5)69661
SATVAH.ISPAT 23.5(24)9774
SAVEN TECHNO 22(21.8)3292
SMPL 1.43(1.45)29525
SMS PHARMACE 92.7(95.3)3156
SREE RAYALA 186(202.3)10552
STEEL EXCH 33.5(33.65)49266
SUJANA INDUS .95(1)30200
SURANATP 5.31(5.45)83457
SURYACHAKRA 1.35(1.39)32451
SURYAMBA SP 72(73.5)425
SURYAVA SPIN 7.04(7.41)4514
SURYLAK.COTT 81.35(84.45)17958
SUVEN LIFE S 197.3(199.9)99671
TAJ GVK HOTL 176.45(178.2)10643
TANLA 32.35(32.95)65191
TRANSCORP IN 36.75(37.95)12742
TRANSGENE BI 2.22(2.13)8523
TRANSPORT CO 291.5(293.35)3833
USHER AGRO 7(7.36)56998
VICEROY HOTE 15.9(17.05)87961
VIJAY TEXTIL 53.65(55.05)1157
VIMTA LABS 212.85(212.55)7103
VIRAT CRANE 50.7(48.3)12588
VIRINCHI 125.75(131.25)61744
VISAKA IND. 716.05(717.05)19829
VISTA PHARMA 42.9(44.2)12457
VIVIMED LABS 84.6(87.05)138402
VST INDUS. 3295.85(3289.85)25
WATERBASE 312.9(321.95)293234
XLENERGY 2.92(3.07)11739
YBRANTDIGI 5.59(5.83)1367841
ZEN TECH 122(123.1)17005
ZENOTECH 44.7(44.4)9762



కేంద్రానిది ద్రోహం

ఏపీకి సాయంపై సీపీఎం ధ్వజం

ఐఆర్ఆర్‌కు 8 వేల ఎకరాల వెనుక కుట్ర



అమరావతి, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి):రాష్ట్ర విభజన సమయంలో ఇచ్చిన హామీల్లో వేటినీ నెరవేర్చకుండా కేంద్ర ప్రభుత్వం తీరని ద్రోహం చేస్తోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, ఆ పార్టీ రాజధాని ప్రాంత కన్వీనర్ అయిన సీహెచ్ బాబూరావు మండిపడ్డారు. అమరావతి నిర్మాణానికి రూ.58 వేల కోట్లు అవసరమని రాష్ట్రం ప్రతిపాదనలు పంపగా కేవలం రూ.1,500 కోట్లు విదిలించిందని విమర్శించారు. విజయవాడలోని కనకదుర్గ గుడి, బెంజి సర్కిల్ ఫ్లైవోవర్ నిర్మాణ పనులు ఎప్పటికి పూర్తవుతాయో తెలియడం లేదన్నారు. విజయవాడలోని శ్రీశ్రీ భవన్‌లో గురువారం విలేకరులతో మాట్లాడారు. అమరావతి చుట్టూ కొత్తగా నిర్మించదలచిన 96 కిలోమీటర్ల పొడవైన ఇన్నర్ రింగ్ రోడ్డు(ఐఆర్ఆర్) కోసం రాష్ట్ర ప్రభుత్వం సుమారు 8 వేల ఎకరాలను భూసమీకరణ ప్రాతిపదికన తీసుకోవాలన్న నిర్ణయాన్ని బాబూరావు తప్పుపట్టారు. ఐఆర్ఆర్‌కు 1,253 ఎకరాలు సరిపోతుందని, కానీ అంతకు ఆరున్నరెట్లు అధికంగా భూమిని సమీకరించాలనుకోవడం వెనుక భారీ కుట్ర దాగి ఉందని ఆరోపించారు. రాజధాని నిర్మాణమంటే తమకు మాత్రమే సంబంధించిన ప్రైవేట్ వ్యవహారంగా ప్రభుత్వం భావిస్తోందని, అందువల్లనే ఎదురుదెబ్బలు తగులుతున్నాయన్నారు.

నేడు, రేపు జేఎఫ్‌సీ సమావేశం

▸▸ పవన్ అధ్యక్షతన దసపల్లాలో నిర్వహణ



హైదరాబాద్‌లో పవన్‌తో చలసాని

హైదరాబాద్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): కేంద్రం నుంచి ఏపీకి రావాల్సిన నిధులు, ఇప్పటి వరకు జరిగిన కేటాయింపులు, ఖర్చులకి సంబంధించి వాస్తవాలను వెలికితీస్తామని జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఏర్పాటు చేసిన జాయింట్ ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ (జేఎఫ్ఎసీ) తొలి సమావేశం శుక్రవారం జరగనుంది. పవన్ అధ్యక్షతన హైదరాబాద్‌లోని దసపల్లా హోటల్‌లో రెండు రోజులపాటు ఈ సమావేశం జరుగుతుందని జనసేన మీడియా విభాగం గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. కేంద్ర నిధులు, విభజన హామీలు, తదితర అంశాలపై జేఎఫ్‌సీలోని నేతలు, మేధావులు, న్యాయనిపుణులు మేధోమథనం చేస్తారని పేర్కొంది. మధ్యాహ్నం 2 గంటలకు మొదలయ్యే ఈ సమావేశానికి లోక్‌సత్తా అధినేత జయప్రకాశ్ నారాయణ, మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్, కాంగ్రెస్ నేత గౌతమ్, సీపీఐ, సీపీఎం ఏపీ రాష్ట్ర కార్యదర్శులు రామకృష్ణ, పి.మధు, తదితరులు హాజరవుతారని వెల్లడించింది. కాగా, స్వరాజ్ అభియాన్ ఉద్యమకారుడు, ఆమ్ ఆద్మీ పార్టీ మాజీ నేత యోగేంద్ర యాదవ్ గురువారం సాయంత్రం జనసేన అధినేతతో భేటీ అయ్యారు. ఇటీవల అనంతపురం జిల్లాలో జరిపిన పర్యటనల వివరాలను యోగేంద్ర యాదవ్, పవన్‌కు వివరించినట్లు తెలిసింది. ఆ జిల్లా బుందేల్ ఖండ్ తరహాలో ఉందని యోగేంద్ర యాదవ్ ఆవేదన వ్యక్తం చేసినట్లు జనసేన వర్గాలు పేర్కొన్నాయి. ప్రత్యేకహోదా సాధన సమితి అధ్యక్షుడు చలసాని శ్రీనివాసరావు పవన్ కల్యాణ్‌ను కలిసి, ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీకి తన మద్దతును ప్రకటించారు.

ఒత్తిడి వ్యూహం!

(మొదటి పేజీ తరువాయి)

'కీలక నిర్ణయాలు' ప్రకటించాలని టీడీపీ నిర్ణయించుకున్నట్లు తెలిసింది. అంటే... వైసీపీ 'రాజీనామా'లకు నెల రోజుల ముందే కేంద్రంపై ఒత్తిడి తెచ్చేలా టీడీపీ కార్యాచరణ మొదలుకానుంది. రైల్వేజోన్, ఓడరేవు, రెవెన్యూ లోటు భర్తీకోసం అదనంగా మరిన్ని నిధుల వంటి అంశాలపై కేంద్రం నుంచి సానుకూల సంకేతాలు వచ్చిన సంగతి తెలిసిందే. దీనికి సంబంధించిన కార్యాచరణ బడ్జెట్ మలివిడత సమావేశాల (మార్చి 5)లోపు ప్రారంభిస్తారనీ వార్తలు వచ్చాయి. అలా జరగకపోతే... 'అంచెలంచెలుగా నిర్ణయాలు' ఉంటాయని టీడీపీ అధిపతి, ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. మొట్టమొదట... కేంద్ర మంత్రి పదవులకు టీడీపీ రాజీనామా చేసే అవకాశముంది. ఇలా ఒత్తిడి పెంచుతూ వెళ్లి... అప్పటికీ ఫలితం రాకపోతే బీజేపీతో కటీఫ్ చెప్పి, ఎన్డీయే నుంచి వైదొలిగేదాకా వెళ్లవచ్చునని తెలుస్తోంది. "రాష్ట్రానికి న్యాయం చేయాలని కేంద్రానికి పదేపదే విన్నవిస్తున్నాం. వారి స్పందన కోసం ఎదురు చూస్తున్నాం. న్యాయం చేయాల్సిన బాధ్యత వారిపై ఉంది. అయినా న్యాయం జరగకపోతే అంచెలంచెలుగా ముందుకు వెళ్లడం తప్ప మరో గత్యంతరం లేదు" అని చంద్రబాబు తెలిపారు. గురువారం ఉదయం ఆయన నివాసంలో జరిగిన టీడీపీ సమన్వయ కమిటీ సమావేశంలో ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇందులో మంత్రులు, జిల్లా పార్టీ అధ్యక్షులు, పార్టీ ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు, రాష్ట్ర పార్టీ బాధ్యులు పాల్గొన్నారు. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం... చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు ఆయన మాటల్లోనే...

"ఈ మూడున్నరేళ్లలో బీజేపీని ఏనాడూ ఇబ్బంది పెట్టలేదు. నోట్లరద్దు, జీఎస్టీ తదితర అంశాల్లో పూర్తి మద్దతు ఇచ్చాం. హామీలను అమలు చేయాలని 29సార్లు ఢిల్లీ చుట్టూ తిరిగాను. కేంద్రం నుంచి అభివృద్ధి చెందిన రాష్ట్రాలకూ, ప్రత్యేక అవసరమున్న మనకూ ఒకేలా నిధులు వస్తున్నాయి. జాతీయ రహదారులు అన్ని రాష్ట్రాలకు ఇచ్చినట్లే మనకూ ఇచ్చారు. ఉపాధి హామీ పథకాన్ని ఎంత సమర్థంగా వినియోగించుకుంటే అన్ని నిధులు అందరికీ వస్తాయి. కేంద్ర పథకాలు కూడా అందరికీ వస్తాయి. ఆ లెక్కలు చెబితే ఉపయోగం లేదు. విభజన వల్ల నష్టపోయిన మన రాష్ట్రానికి పార్లమెంటు వేదికగా ఇచ్చిన హామీలను అమలు చేయడం ద్వారా ఆదుకోవాలని కోరుతున్నాం.

ఆంధ్రులకు అన్యాయమే

మూడు వందల సంవత్సరాలుగా ఆంధ్రులు పోరాటం చేస్తూనే ఉన్నారు. అయినా ఒట్టిచెయ్యే మిగులుతోంది. గుజరాత్‌లో బుల్లెట్ రైలుకు జైకా నిధులు రూ. లక్ష కోట్లు కేటాయించారు. ఆ దెబ్బతో ఆ సంస్థ నుంచి మిగిలిన రాష్ట్రాలకు పైసా రాకుండా పోయింది. మహారాష్ట్రలో సబర్బన్ రైలుకు రూ. 51 వేల కోట్లు కేటాయించారు. బెంగళూరులో మెట్రో రైలుకు రూ. 17 వేల కోట్లు ఇచ్చారు. మనం ఏం పాపం చేశాం? పోలవరంలో మనం పెట్టిన ఖర్చే ఇంకా రూ. 2500 కోట్లు రావాలి. అది పూర్తి కావాలంటే ఇంకా రూ.54 వేల కోట్లు కావాలి. ఈఏపీ కింద రూ. 16 వేల కోట్లు రావాలి. వీటి గురించి అడిగితే తప్పా!?

జైట్లీ చెప్పినందునే...

హోదా కోసం ఆత్మహత్యలు చేసుకొంటుంటే ప్రధానిని కలిసి వెంటనే పరిష్కరించాలని కోరాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఉన్నత స్థాయి సమావేశాలు పెట్టించాం. మా ఒత్తిడి వల్ల హోదా బదులు అవే ప్రయోజనాలతో ప్రత్యేక ఆర్థిక సాయం ఇస్తామని కేంద్రం ప్రకటించింది. పేరు మార్పు తప్ప హోదాలో వచ్చే ప్రయోజనాలన్నీ ప్రత్యేక ఆర్థిక సాయం ద్వారా అందిస్తామని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ 2016 సెప్టెంబరు 14వ తేదీన తన ప్రకటనలో బహిరంగంగా ప్రకటించారు. ప్రధాని ప్రకటించిన హామీలకు సమానమైన ప్రత్యేక సాయం అందిస్తామని, ఐదేళ్లపాటు సాయం కొనసాగుతుందని తెలిపారు. ఆయన అంత స్పష్టంగా చెప్పిన తర్వాత అంగీకరించడం తప్పా? (జైట్లీ ఆ రోజు చేసిన ప్రకటనను చంద్రబాబు ఈ సమావేశంలో చదివి వినిపించారు)

జగన్‌కే కేసుల భయం

కేంద్రానికి భయపడుతున్నామని కొందరు మాట్లాడుతున్నారు. ఒక ప్రభుత్వం మరో ప్రభుత్వానికి ఎందుకు భయపడుతుంది? నేనెందుకు భయపడాలి? నాపై కేసు ఏదైనా ఉందా? ఎక్కడ ఉంది? లేని కేసుపై వైసీపీ ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి హైకోర్టుకు వెళ్తే అక్కడ కొట్టేశారు. సుప్రీం కోర్టుకు వెళ్తే పోస్టు చేసి పక్కన పెట్టారు. జగన్ కేసుల విచారణలో వేగం పెరిగింది కాబట్టి ఆయన భయపడుతున్నాడు. ఆయన తండ్రి నాపై 26 కేసులు వేయించాడు. ఏం సాధించాడు? రాజధానిలో రైతుల భూమి ఇంకా వారి వద్దే ఉంది. కానీ లక్ష కోట్ల అవినీతి అని ఆయన ఆరోపిస్తాడు. లేని కేసును పట్టుకొని ఆయనా... నేనూ ఒకటేనని చిత్రించాలని ప్రయత్నిస్తున్నాడు. వైఎస్ హయాంలో రాష్ట్రం పరువు తీశారు. ఫోక్స్ వ్యాగన్ కార్ల ఫ్యాక్టరీ పేరుతో జరిగిన అవినీతితో ఏపీకి ప్రపంచ దేశాల్లో చెడ్డపేరు వచ్చింది. కియ కార్ల కంపెనీ ప్రతినిధులు అంతా పారదర్శకంగా ఉండాలని చెప్పి మరీ ఒప్పందంలో రాయించుకొన్నారు.

అడక్కుండానే మద్దతిచ్చింది ఆయనే...

మనం ఎన్డీయేలో భాగస్వాములుగా ఉన్నా రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి అభ్యర్థుల పేర్లు ప్రకటించిన తర్వాతే మద్దతు ప్రకటించాం. జగన్ ఎన్డీయేలో లేరు. అభ్యర్థులు ఎవరో కూడా తెలియకముందే రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో బీజేపీకి మద్దతు ప్రకటించారు.

దక్షిణాదికి అన్యాయం..

రాష్ట్రాలకు నిధుల కేటాయింపులో కేంద్రం అనుసరిస్తున్న విధానం దక్షిణాది రాష్ట్రాలకు నష్టం చేస్తోంది. జనాభా ప్రాతిపదికన నిధులు, పథకాలు అమలు చేస్తామని కేంద్రం ప్రతిపాదించడం నిజంగా అన్యాయం. నేను ఉమ్మడి రాష్ట్రం ముఖ్యమంత్రిగా ఉండగా 1996- 97లో ఇలాంటి ప్రతిపాదన వస్తే గట్టిగా వ్యతిరేకించాను. దక్షిణాది రాష్ట్రాలు జనాభా నియంత్రణలో ముందున్నాయి. జనాభా పెరుగుదలను నియంత్రించని ఉత్తరాది రాష్ట్రాలు లాభపడతాయి. నిధులు, సీట్లు, మౌలిక వసతులు, ఇళ్ల కేటాయింపు.. అన్నిటికీ ఇదే ప్రాతిపదికగా మారుతోంది. మనం నష్టపోతున్నాం!

వైసీపీ-బీజేపీ ఒప్పందం?

పార్లమెంటు ఎన్నికల తర్వాత మద్దతు ఇచ్చేలా వైసీపీ, బీజేపీ మధ్య ఒప్పందం కుదిరినట్లు జాతీయ పత్రికల్లో వార్తలు వస్తున్నాయి. (ఒక ఆంగ్ల పత్రికలో వచ్చిన వార్తను చూపించారు) ఉప ఎన్నికలు రావన్న ధైర్యంతోనే ఇప్పుడైనా ఎంపీల రాజీనామాలు ప్రకటించారు. ఈ జగన్నాటకాలని ప్రజల్లోకి తీసుకువెళ్లాలి!

నాడే నిలదీశాను

రాష్ట్రానికి అన్యాయం జరుగుతోందని కేంద్రం మొదటి బడ్జెట్ పెట్టిన రోజే గొంతు విప్పాను. మొదటి బడ్జెట్‌లో పోలవరానికి రూ.వంద కోట్లు కేటాయించడంతో బాధ కలిగింది. రెక్కలు విరిచి ఎగరమంటే ఎలా ఎగురుతామని ఆనాడే ప్రశ్నించాను. ప్రతి బడ్జెట్ సమావేశంలోనూ నిధుల గురించి అడుగుతూనే ఉన్నాం. ఆఖరి బడ్జెట్‌లో కూడా రాష్ట్రానికి న్యాయం జరగకపోతే నిలదీసింది కూడా టీడీపీ ఎంపీలే. ఇటీవలే ప్రధానిని కలిసి మాట్లాడాను. అయినా బడ్జెట్‌లో ఆ ఫలితం కనిపించలేదు. అందుకే ఎంపీలు ఆందోళన బాట పట్టారు. తెలుగుదేశం పార్టీకి పదవులు లెక్కలోవి కావు. మంత్రి పదవులకు రాజీనామా చేయడం ముఖ్యం కాదు. ఎప్పుడు ఏ సమయంలో ఏది చేయాలో అది చేస్తాం.

కాంగ్రెస్ తొలి ముద్దాయి...

పవన్ కల్యాణ్ నిజ నిర్ధారణ కమిటీ భేటీకి కాంగ్రెస్ ప్రతినిధులను పిలవడం సరికాదు. రాష్ట్రానికి జరిగిన అన్యాయంలో మొదటి ముద్దాయి కాంగ్రెస్ పార్టీయే. రాష్ట్రప్రభుత్వం శ్వేతపత్రం ఇవ్వాలని అంటున్నారు. ఇవ్వాల్సింది రాష్ట్రం కాదు.. కేంద్రమే! రాష్ట్రానికి ఏమిచ్చారో.. ఎప్పుడు ఇచ్చారో వారు చెప్పాలి.

అక్కడ నాయకత్వ లోపం..

కొన్ని నియోజకవర్గాల్లో పార్టీ బలం పెరగడం లేదు. అక్కడి నాయకత్వ లోపమే దీనికి కారణం. ప్రతిపక్షంలో బాగా పనిచేసిన వారు కొందరు ఇప్పుడు పట్టించుకోవడం లేదు. పైపైన తిరుగుతున్నారు.అజాగ్రత్త, ఉదాసీనత సరికాదు. అధికార పార్టీలో ఉండి చిన్న తప్పు చేసినా ప్రజలు గమనిస్తుంటారు. మా కుటుంబం పాతికేళ్ల నుంచి వ్యాపారం చేస్తోంది. హెరిటేజ్ సంస్థ పెట్టినప్పుడు దాని షేర్ ధర రూ.10. ఈ పాతికేళ్లలో రూ.1000కి పెరిగింది. నేను ముఖ్యమంత్రి అయిన రోజునే ఆ సంస్థలో నా షేర్లు నా కుటుంబానికి ఇచ్చేశాను. నా పేరు మీద ఆస్తులు, ఇళ్లు లేవు. కుటుంబం సహా ఏటా ఆస్తుల వివరాలు ప్రకటిస్తున్న రాజకీయ నేతను దేశంలో నేనే. అయినా నన్ను సంపన్న ముఖ్యమంత్రిగా చిత్రీకరించడం సరికాదు!

హైకోర్టు కోసం స్పీకర్ అడ్డగింత



నిరసన తెలుపుతున్న న్యాయవాదులతో మాట్లాడుతున్న కోడెల

అనంతపురం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): రాయలసీమలో హైకోర్టు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ అనంతపురంలో గత 15 రోజులుగా ఆందోళన చేస్తున్న న్యాయవాదులు... అసెంబ్లీ స్పీకర్ కోడెల శివప్రసాద్‌ను అడ్డుకున్నారు. గురువారం పీస్ మెమోరియల్ మ్యూజియం ప్రారంభోత్సవానికి స్పీకర్ హాజరయ్యారు. దీంతో, న్యాయవాదులు, సీపీఐ నాయకులు, కార్యకర్తలు 'వీ వాంట్ జస్టిస్' అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ కార్యక్రమం జరుగుతున్న చోటుకు వెళ్లడానికి ప్రయత్నించారు. అయితే జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, డీఎస్పీ వెంకట్రావ్, ఇతర పోలీసు అధికారులు ఆందోళనకారులను అడ్డుకున్నారు. అయినా నిరసనకారులు అక్కడే నిలబడి నినాదాలు చేస్తూ ఉండిపోయారు. పీస్ మెమోరియల్ ప్రారంభం ముగించుకుని సభా వేదిక వద్దకు స్పీకర్ వస్తున్న సమయంలో న్యాయవాదులు అడ్డుకున్నారు. రాయలసీమలో హైకోర్టు ఏర్పాటు చేయాలని నిరసనకారులు ఆయనకు విజ్ఞప్తి చేయగా.. అసెంబ్లీలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని స్పీకర్ హామీ ఇచ్చారు. అనంతరం నిరసనకారులను పోలీసులు అక్కడి నుంచి పంపించేశారు.



రేణమాల మహిళా సదస్సులో మాట్లాడుతున్న జగన్

టీడీపీ ఎంపీలూ రాజీనామా చేయాలి

▸▸ 25 మంది ఎంపీలూ చేస్తే కేంద్రం దిగొస్తుంది

▸▸ నెల్లూరులో ముగిసిన జగన్ పాదయాత్ర

కొండాపురం, ఫిబ్రవరి 15: వైసీపీ ఎంపీలతోపాటు టీడీపీ ఎంపీలు కూడా రాజీనామా చేసినప్పుడే రాష్ట్రానికి ప్రత్యేక హోదాసాధ్యమవుతుందని వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. నెల్లూరు జిల్లా కొండాపురం మండలం రేణమాల వద్ద మహిళా సదస్సు జరిగింది. ఈ సందర్భంగా జగన్ మాట్లాడారు. రాజకీయాలు పక్కనపెట్టి రాష్ట్రానికి చెందిన 25 మంది ఎంపీలూ మూకుమ్మడిగా రాజీనామా చేస్తే కేంద్రప్రభుత్వం దిగివచ్చి ప్రత్యేక హోదా ఇస్తుందన్నారు. హోదా ఆంధ్రుల హక్కు అని, దాని కోసం తాము చేసే పోరాటానికి అందరూ మద్దతివ్వాలని పిలుపిచ్చారు. నాలుగేళ్లుగా ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర ప్రజలను అబద్ధపు మాటలతో మోసం చేస్తున్నారని ఆరోపించారు. తాను అధికారంలోకి వస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ఇతర వెనుకబడిన వర్గాలవారికి 45 ఏళ్లకు... మిగిలిన వర్గాలకు 60 ఏళ్లకు రూ.2000 చొప్పున పింఛను ఇస్తానని చెప్పారు. డ్వాక్రా సంఘాలకు పావలా వడ్డీకే రుణాలు పొందేలా చేస్తానన్నారు. ప్రతి పేదవాడికీ పక్కా-ఇల్లు నిర్మించి కుటుంబంలోని మహిళపేరుతో రిజిస్ట్రేషన్ చేయిస్తానని, ఆ పత్రాలను బ్యాంకులో తనఖా పెట్టి ఆ నగదుతో కుటుంబ ఖర్చుల కోసం మహిళలు వినియోగించుకోవచ్చన్నారు. గ్రామాల్లో సచివాలయాలు ఏర్పాటు చేసి, ప్రతి గ్రామంలో 10 మంది యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తానని.. అందులో 50 శాతం మహిళలకు కేటాయిస్తానన్నారు. భూమిలేని నిరుపేదలకు లక్ష ఎకరాల భూమిని పంచుతానన్నారు. కాగా.. జగన్ పాదయాత్ర నెల్లూరు జిల్లాలో గురువారంతో పూర్తయింది. శుక్రవారం ప్రకాశం జిల్లాలో అడుగుపెడతారని మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి ఒంగోలులో తెలిపారు. ఉదయం 8 గంటలకు నెల్లూరు జిల్లా నుంచి కందుకూరు నియోజకవర్గంలోకి ప్రవేశిస్తుందని, రాళ్లపాడు రిజర్వాయరు వద్ద జగన్‌కు ఘనస్వాగతం పలుకుతామని చెప్పారు.

ఎంపీల రాజీనామాలు సరే.. మీరేం చేస్తారు?

▸▸ జగన్‌కు సీపీఐ నేత రామకృష్ణ ప్రశ్న



తిరుపతి, ఫిబ్రవరి 15: 'ప్రత్యేక హోదా కోసం ఏప్రిల్ 6న వైసీపీ ఎంపీలు రాజీనామా చేస్తారని ఆ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ ప్రకటించారు సరే.. అసలు ఆయనేం చేస్తారో చెప్పరెందుకు' అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ సూటిగా ప్రశ్నించారు. గురువారం తిరుపతిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజలను మభ్యపెట్టేందుకు బీజేపీ నేతలు తప్పుడు ప్రకటనలు చేస్తున్నారని, చిత్తశుద్ధి ఉంటే రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మరింత బాధ్యతగా మెలగాలని, ఆయనొక్కడే ప్రత్యేక హోదా సాధించుకొచ్చినా మంచిదేనన్నారు. హోదా, విభజన హామీల సాధనకు సీపీఐ పోరాటం సాగిస్తుందని, అన్ని ప్రతిపక్షాలను, ప్రజాసంఘాల నేతలను కలుపుకొని ముందుకెళ్తామని తెలిపారు. 18న విజయవాడలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి.. వచ్చే నెల 6న ఢిల్లీకి వెళ్లి ప్రధాని మోదీని నిలదీస్తామని చెప్పారు. బడ్జెట్‌లో జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ నిర్వహించిన రాష్ట్ర బంద్‌కు సహకరించిన ప్రజలకు, మద్దతు తెలిపిన పార్టీలకు ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలో హిందూత్వ పోకడలను చొప్పించాలని చూస్తున్న దేవదాయ మంత్రి మాణిక్యాలరావును మంత్రివర్గం నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు.

6న మా కేంద్ర మంత్రుల రాజీనామా

▸▸ మంత్రి ఆదినారాయణరెడ్డి ప్రకటన

▸▸ 5 తర్వాత అమీతుమీ: టీడీపీ నేతలు

▸▸ ఆదిపై సీఎం ఆగ్రహం.. మందలింపు

▸▸ తొందరపడి మాట్లాడవద్దని హితవు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

పార్లమెంటు రెండో విడత బడ్జెట్ సమావేశాలు మార్చి ఐదో తేదీన మొదలు కాగానే.. ఆరో తేదీన కేంద్ర ప్రభుత్వంలోని తమ మంత్రులు రాజీనామా చేస్తారని మార్కెటింగ్ మంత్రి ఆదినారాయణరెడ్డి ప్రకటించారు. గురువారం సాయంత్రం సచివాలయంలో మీడియాతో మాట్లాడుతూ ఆయన చేసిన వ్యాఖ్యలు సంచలనం సృష్టించాయి. సీఎం చంద్రబాబు ఆయన ప్రకటనపై ఆగ్రహం వ్యక్తంచేశారు. విధాన నిర్ణయాలను పార్టీ అధినాయకత్వం తీసుకుంటుందని, తొందరపడి మాట్లాడవద్దని మందలించినట్లు సమాచారం. దీనిపై టీడీపీ రాష్ట్ర కార్యాలయ వర్గాలు కూడా మంత్రితో మాట్లాడాయి. దీంతో మంత్రి మరోసారి మీడియాతో మాట్లాడారు. కేంద్ర మంత్రులు రాజీనామా చేస్తారన్నది తన వ్యక్తిగత అభిప్రాయమని చెప్పారు. ఇంకోవైపు.. ఇచ్చిన మాట నిలబెట్టుకునేందుకు కేంద్ర ప్రభుత్వానికి వచ్చే నెల 5వ తేదీ వరకు గడువుందని రాష్ట్ర మంత్రులు, టీడీపీ నేతలు తెలిపారు. సానుకూల స్పందన లేకుంటే అమీతుమీ తేల్చుకుంటామని, పార్లమెంటును స్తంభింపజేస్తామని గురువారం హెచ్చరించారు. 'ఐదో తేదీ అని మేం పెట్టిన గడువు కాదు. కేంద్రమే చెప్పింది. ఆలోపు అంతా సవ్యంగా సాగితే సరేసరి. లేదంటే పరిణామాలు ఇంకో రకంగా ఉంటాయి. రాష్ట్ర ప్రయోజనాల కోసం సీఎం చంద్రబాబు సహనంతో ఉంటున్నారు. అనుకున్నట్లు జరగకపోతే తగు నిర్ణయం తీసుకుంటారు' అని పౌరసరఫరాల మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు ఏలూరులో చెప్పారు. కేంద్రం రాష్ట్రానికిచ్చిన నిధుల వివరాలను జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ఆన్‌లైన్‌లో చూసుకోవచ్చని చెప్పారు. ఎంపీల రాజీనామాలపై జగన్ ఇప్పటికే చాలా సార్లు రాజీనామా ప్రకటన చేశారని.. ఎప్పుడో చేసే బదులు తక్షణమే రాజీనామా చేయొచ్చు కదా అని ఉపముఖ్యమంత్రి నిమ్మకాయల చినరాజప్ప కాకినాడలో ప్రశ్నించారు. కేసులను ఎత్తివేయించుకునేందుకే జగన్ రాజీనామాలను తెరపైకి తెచ్చారని హిందూపురం ఎంపీ నిమ్మల కిష్టప్ప ధ్వజమెత్తారు. విభజన హామీలపై మార్చి 5లోగా కేంద్రం అనుకూల ప్రకటన చేయకుంటే అమీతుమీ తేల్చుకుంటామని, పార్లమెంటును స్తంభింపజేస్తామని అనకాపల్లి ఎంపీ ముత్తంశెట్టి శ్రీనివాసరావు విశాఖ జిల్లా మాకవరపాలెంలో చెప్పారు. 'ఎంపీలంటే లోక్‌సభ సభ్యులేనా? రాజ్యసభ సభ్యులు కాదా? విజయసాయిరెడ్డితో కూడా రాజీనామా చేయించేదీ లేనిదీ జగన్ స్పష్టత ఇవ్వాలి' అని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వర్ల రామయ్య విజయవాడలో డిమాండ్ చేశారు. జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ కాంగ్రెస్‌ను ముందుపెట్టుకుని నిజాలను ఏం నిర్ధారిస్తారని ఆయన అన్నారు.



కాపు కోటా కోసం ఒత్తిడి

▸▸ డీవోపీటీ అభ్యంతరం దురదృష్టకరం

▸▸ ముఖ్యమంత్రి వ్యాఖ్యలు

▸▸ రాష్ట్ర కేబినెట్‌లో మరోసారి తీర్మానం!



తెలుగుదేశం పార్టీ సమన్వయ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

అమరావతి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): కాపు రిజర్వేషన్ల బిల్లును ఆమోదించేలా కేంద్రంపై తీవ్ర ఒత్తిడి తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ రిజర్వేషన్లపై కేంద్రం అభ్యంతరం దురదృష్టకరమని ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు. గురువారమిక్కడ జరిగిన టీడీపీ సమన్వయ కమిటీ సమావేశంలో ఈ అంశం ప్రస్తావనకు వచ్చింది. 'మనం పకడ్బందీగా బీసీ కమిషన్ వేసి దానితో అధ్యయనం చేయించాకే కేంద్రానికి సిఫారసు చేశాం. ఊరికే ఆషామాషీగా పంపలేదు. రిజర్వేషన్లు ఏభై శాతం దాటే మాట వాస్తవమే. అందుకే కేంద్రానికి పంపాం. కేంద్రం చట్టం చేసి తొమ్మిదో షెడ్యూల్‌లో పెట్టాలని కోరాం. వారి అభ్యంతరాలకు సమాధానం ఇస్తాం. మనం అడిగిన పద్ధతిలో కేంద్రం చేస్తుందని ఆశిస్తున్నాం. పార్టీ నాయకులెవరూ ఈ విషయంలో పార్టీ వైఖరిని దాటి మాట్లాడవద్దు. జరిగిన విషయాలను ప్రజలకు వివరించండి' అని ఆయన అన్నారు.

ఆ వ్యాఖ్యానాలు అప్రస్తుతం..

కాపు కోటాను నిలిపివేయాలంటూ డీవోపీటీ కేంద్ర హోంశాఖకు లేఖ రాసిన విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తెచ్చిన సంగతి తెలిసిందే. ఈ వ్యవహారంపై ప్రభుత్వ వర్గాలు అనేక సమాలోచనలు చేశాయి. ముఖ్యమంత్రి ఈ అంశంపై ఇటు పార్టీ, అటు ప్రభుత్వ వర్గాలతో కూలంకషంగా చర్చించారు. ఏ రాష్ట్రం ఏం డిమాండ్ చేస్తోంది.. ఎవరికి ఎంత రిజర్వేషన్ అడుగుతున్నారో తెలియకుండా.. నివేదికలను పరిశీలించకుండానే డీవోపీటీ స్పందించడం విడ్డూరంగా ఉందని ప్రభుత్వ వర్గాలు ఆక్షేపిస్తున్నాయి. రాష్ట్రం పంపించిన నివేదికలను, మంత్రివర్గ తీర్మానాన్ని అధ్యయనం చేయకుండానే అప్రస్తుత వ్యాఖ్యానాలు చేయడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నాయి. నిజానికి కాపులకు రిజర్వేషన్ ఎందుకివ్వాలి? విద్యా, ఉద్యోగాల్లో వారికి రిజర్వేషన్ ఎలా ఇవ్వాలో ఇటు అసెంబ్లీ తీర్మానంలో, అటు బిల్లులోనూ ప్రస్తావించారు. వాటిని చదవకుండానే రిజర్వేషన్లు ఎందుకు అడుగుతున్నారో రాష్ట్రం ప్రస్తావించలేదని డీవోపీటీ అనడంపై ప్రభుత్వం ఆగ్రహంతో ఉంది. ఈ నేపథ్యంలో కాపులకు రిజర్వేషన్‌కు ప్రాతిపదిక ఏమిటి? ఎందుకు అవసరమన్న అంశాలపై డీవోపీటీతోపాటు కేంద్రానికి మరోసారి స్పష్టమైన వివరణ ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇదే అంశంపై త్వరలో జరిగే కేబినెట్ సమావేశంలో మరోసారి తీర్మానం చేయాలని నిర్ణయించినట్లు తెలిసింది. దీనికితోడు వివిధ అంశాలపై వివరణలు ఇచ్చేందుకు బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి ఉదయలక్ష్మిని ఢిల్లీ పంపించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అవసరాన్నిబట్టి బీసీ సంక్షేమశాఖ మంత్రి అచ్చెన్నాయుడిని కూడా ఢిల్లీకి పంపించి కేంద్ర అధికారులతో మాట్లాడించాలని ప్రభుత్వం భావిస్తోంది. సుప్రీం కోర్టు ఉత్తర్వులను ప్రస్తావిస్తూనే.. రిజర్వేషన్లు 50 శాతంపైనే పెరగనున్నందున ఆ కోటాను రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చాలని రాష్ట్రం కోరుతోంది. దీనివల్ల న్యాయపరిశీలనకు అవకాశం ఉండదని, తమిళనాడు తరహాలోనే రిజర్వేషన్లు అమలు చేసుకోవచ్చన్నది ఆలోచన. మరోవైపు.. డీవోపీటీ లేఖలో లేవనెత్తిన భిన్నాభిప్రాయాలు అంత తీవ్రంగా లేవని కూడా ప్రభుత్వం భావిస్తోంది. కేంద్రప్రభుత్వంతో సంప్రదింపులతోపాటు కేంద్ర పెద్దలపై ఒత్తిడి పెంచడం ద్వారా రిజర్వేషన్లు సాధించాలని నిశ్చయించింది.

బాబు సారథ్యంలోనే హోదా సాధ్యం: కొణతాల

నర్సీపట్నం, ఫిబ్రవరి 15: ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు సారథ్యం వహించి పోరాడితేనే రాష్ట్రానికి ప్రత్యేక హోదా కల సాకారమవుతుందని మాజీ మంత్రి, ఉత్తరాంధ్ర చర్చావేదిక కన్వీనర్ కొణతాల రామకృష్ణ అన్నారు. పార్టీలకతీతంగా ఒకే ఎజెండాతో పోరాడితే తప్ప ఢిల్లీ పాలకుల్లో కదలిక రాదన్నారు. ఇందుకు ముఖ్యమంత్రి నాయకత్వం వహించి అన్ని పార్టీలతో ఉమ్మడిగా కేంద్రంపై ఒత్తిడి తేవాలని కోరారు. ఆయన ఇందుకు అంగీకరిస్తే తామంతా వెంట నడుస్తామన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఏర్పాటుచేసిన అఖిలపక్ష సమావేశానికి తాను హాజరవుతున్నానని కొణతాల తెలిపారు. మార్చి 5 నుంచి జరిగే పార్లమెంటు సమావేశాల్లోనే ప్రత్యేక హోదాపై తాడో పేడో తేల్చుకోవాలన్నారు. ఈ అంశాన్ని వదిలిపెట్టి ప్రత్యేక ప్యాకేజీకి అంగీకరించడం రాష్ట్ర ప్రభుత్వం చేసిన అతి పెద్ద తప్పిదమన్నారు. ఈశాన్య రాష్ట్రాలకు ప్రత్యేక హోదా కాల పరిమితిని మరో పదేళ్లపాటు పొడిగించి కేంద్రం ఆంధ్రులను తప్పుదోవ పట్టించిందని ఆరోపించారు.

పోలవరంపై మాట్లాడే అర్హత టీడీపీకి లేదు

▸▸ వెంకయ్య వల్లే ప్రాజెక్టు దక్కింది

▸▸ నిధులపై బహిరంగ చర్చకు సిద్ధం: సోము



కోరుకొండ/కొవ్వూరు, ఫిబ్రవరి 15: కేంద్ర నిధులకు సంబంధించి టీడీపీపై బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాటలదాడి కొనసాగుతోంది. రాష్ట్ర విభజన సమయంలో పార్లమెంటులో పోలవరం ప్రాజెక్టుపై నోరు మెదపని టీడీపీకి దానిపై మాట్లాడే అర్హత గానీ, నైతిక హక్కు గానీ లేదని ఆయన తాజా గా అన్నారు. గురువారం తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ, పశ్చిమగోదావరి జిల్లా కొవ్వూరుల్లో బీజేపీ సభల్లో పాల్గొన్నారు. ఆనాడు రాజ్యసభలో ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు వల్లే ఆంధ్రకు పోలవరం దక్కిందన్నారు. ఉమ్మడి రాష్ట్రానికి 9ఏళ్ల ముఖ్యమంత్రిగా పని చేసిన చంద్రబాబు హయాంలో ఈ ప్రాజెక్టు ఎందుకు ప్రారంభించలేదని ప్రశ్నించారు. తెలంగాణలోని ఏడు మండలాలను ఆంధ్రలో కలిపి ఆర్డినెన్స్ తీసుకొచ్చి.. రాష్ట్రానికి ప్రాజెక్టును వరంగా ప్రసాదించిన ఘనత బీజేపీదేనన్నారు. 'రాజధాని నిర్మాణానికి రూ.2,500 కోట్లు ఇచ్చాం. రాష్ట్రంలో వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమల అభివృద్ధిని మరచి.. ప్రపంచంలోనే అత్యద్భుతమైన రాజధాని నిర్మిస్తామని ప్రగల్భాలు పలకడం ఎంత వరకూ న్యాయం' అని అన్నారు. దేశంలో ఎన్నో రాష్ట్రాలకు రాజధాని లేదని చెప్పారు. చంద్రబాబు, రాజశేఖర్‌రెడ్డి హయాంలో ఏనాడైనా 24 గంటలూ కరెంటు ఉందా అని ప్రశ్నించారు. మోదీ చలవ వల్ల నేడు 24గంటలు రాష్ట్రానికి విద్యుత్ లభించిందన్నారు. రాష్ట్రాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఎన్ని నిధులిచ్చిందో బహిరంగ చర్చకు సిద్ధమని వీర్రాజు చెప్పారు. తమ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు హరిబాబు విడుదల చేసిన నివేదికలో అన్నీ అవాస్తవాలేననడాన్ని బీజేపీ ఎమ్మెల్సీ మాధవ్ విశాఖలో ఆక్షేపించారు. రాష్ట్రంలో స్మార్ట్‌సిటీలకు ఇంతవరకు రూపాయి కూడా ఇవ్వలేదని టీడీపీ ప్రకటించిందని, రూ.300 కోట్లతో విశాఖపట్నంలో స్మార్ట్‌సిటీ పనులు జరుగుతున్నాయని తెలిపారు. విశాఖపట్నంలో పెట్రోలియం యూనివర్సిటీ ఏర్పాటుకు అంచనా వ్యయం రూ.650 కోట్లు కాగా.. 2016-17లో రూ.42 కోట్లు, 2017-18లో రూ.147 కోట్లు, 2018-19లో రూ.40 కోట్లు కేటాయించారని.. ఇన్ని నిధులిచ్చినా అక్కడ ప్రహరీ తప్ప ఇంకేమీ నిర్మించలేదని విమర్శించారు.

శ్యామ్ పసిడి పంచ్

జకార్తా: తెలుగు బాక్సర్ కాకర శ్యామ్‌కుమార్ ఆసియా క్రీడల టెస్ట్ ఈవెంట్‌లో పసిడి పంచ్ విసిరాడు. గురువారం జరిగిన 49 కిలోల ఫైనల్‌లో శ్యామ్ విజేతగా నిలిచాడు. ఈ పోటీలలో భారత్ మొత్తం ఐదు స్వర్ణాలు, ఓ రజతం, నాలుగు కాంస్య పతకాలు చేజిక్కించుకుంది. ఇండోనేసియాకు చెందిన మారియో బ్లాసియస్‌తో జరిగిన ఫైనల్ బౌట్‌లో విశాఖ బాక్సర్ శ్యామ్‌కుమార్ 4-1తో గెలుపొంది స్వర్ణ పతకం కైవసం చేసుకున్నాడు. అయితే బౌట్‌లో శ్యామ్ విసిరిన కొన్ని పంచ్‌లపై అంపైర్ అతడిని హెచ్చరించాల్సి వచ్చింది. మహిళల 60 కేజీల విభాగం ఫైనల్లో ప్రత్యర్థి నీలవాన్ టెకాస్యూప్ (థాయ్‌లాండ్)ను 5-0తో చిత్తు చేయడం ద్వారా పవిత్ర.. చివరిరోజు భారత్‌కు బంగారు బోణీ చేసింది. మహిళల విభాగంలో భారత్ సాధించిన ఏకైక స్వర్ణ పతకం ఇదే కావడం గమనార్హం. ఇక ఇండియా ఓపెన్ పసిడి పతక విజేత మనీష్ కుమార్ (60 కిలోలు), షేక్ సల్మాన్ అన్వర్ (52 కిలోలు), ఆశిష్ (64 కిలోలు) టైటిళ్లు నెగ్గిన ఇతర భారత బాక్సర్లు. అన్వర్ 5-0తో ఫిలిప్పినో రోగెన్ లాడన్ (జపాన్)ను, మనీష్ కూడా జపాన్‌కే చెందిన రెంటారో కిమూరాను, ఆశిష్..స్థానిక బాక్సర్ సుగర్ రే ఒకానాను ఓడించి బంగారు పతకాలు సాధించారు. గత నెలలో జరిగిన ఇండియా ఓపెన్‌లో కాంస్య పతకం నెగ్గిన శశి చోప్రా 57 కిలోల తుది పోరులో 0-5తో రచ్చపోర్న్ సోటా (థాయ్‌లాండ్) చేతిలో పరాజయంతో రజత పతకంతో సరిపెట్టుకొన్నాడు. మహ్మద్ ఎతేషా ఖాన్ (56 కిలోలు), రితూ గ్రేవల్ (51 కిలోలు), పవన్ కుమార్ (69 కిలోలు), ఆశిష్ కుమార్ (75 కిలోలు) బుధవారం జరిగిన సెమీఫైనల్స్‌లో ఓటమితో కాంస్య పతకాలతో సంతృప్తి చెందిన సంగతి తెలిసిందే.



శ్యామ్‌కుమార్

తొలి టీ-20 శ్రీలంకదే

ఢాకా: ఓపెనర్ కుశాల్ మెండిస్ మెరుపు హాఫ్ సెంచరీ (27 బంతుల్లో 53)కి మరో ఓపెనర్ గుణతిలక (15 బంతుల్లో 30), షనక (42 నాటౌట్), తిసార పెరీరా (39 నాటౌట్) ధాటి బ్యాటింగ్ తోడవడంతో బంగ్లాదేశ్‌తో గురువారం జరిగిన తొలి టీ-20లో శ్రీలంక ఆరు వికెట్లతో విజయం సాధించింది. టాప్, మిడిలార్డర్ విరుచుకుపడడంతో 194 పరుగుల భారీ లక్ష్యాన్ని పర్యాటక జట్టు 20 బంతులు మిగిలి ఉండగానే 4 వికెట్లు కోల్పోయి సునాయాసంగా ఛేదించింది. టీ-20ల్లో లంకకు ఇది అత్యుత్తమ ఛేదన. అంతకు ముందు టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్ ఓపెనర్ సౌమ్య సర్కార్ (51), ముష్ఫికర్ రహీమ్ (66 నాటౌట్), కెప్టెన్ మహ్మదుల్లా (43) సత్తా చాటడంతో నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లకు 193 పరుగులు చేసింది. టీ20ల్లో బంగ్లాకిది అత్యధిక స్కోరు.

ఫైనల్లో విష్ణు జోడీ

చెన్నై : చెన్నై ఏటీపీ చాలెంజర్ టెన్నిస్ టోర్నీ డబుల్స్‌లో విషవర్దన్ జోడీ ఫైనల్‌కు చేరింది. గురువారం జరిగిన సెమీఫైనల్లో విష్ణువర్దన్-శ్రీరామ్ బాలాజీ జంట 6-3, 7-5 స్కోరుతో సాకేత్ మైనేని-లుకా మార్గరోలి జోడీపై విజయం సాధించింది. భారత్‌కు చెందిన రెండోసీడ్ యుకీ భాంబ్రీ పురుషుల సింగిల్స్ సెమీస్‌లో అడుగుపెట్టాడు.క్వార్టర్‌ఫైనల్లో భాంబ్రీ 5-7, 6-2, 6-4తో జపాన్ ప్లేయర్ యసుతకా ఉచియామపై విజయం సాధించాడు.



రోహిత్ శర్మ

శార్దూల్ ఠాకూర్

సా. 4.30 నుంచి SONY TEN 1

ప్రయోగాలకు వేళాయెరా..

- తుది జట్టును మార్చనున్న భారత్
- భువీ, బుమ్రాలకు విశ్రాంతి!
- దక్షిణాఫ్రికాతో చివరి వన్డే నేడే

దక్షిణాఫ్రికా గడ్డపై తిరుగులేని ఆధిక్యంతో 'తొలి' వన్డే సిరీస్ ఇప్పటికే సొంతమైంది.. అటు ఈ ఫార్మాట్‌లో ప్రపంచ నెంబర్‌వన్ ర్యాంకును సైతం దక్కించుకుంది. ఇక నామమాత్రమైన చివరి మ్యాచ్‌లో టీమిండియా తమ రిజర్వ్ బెంచ్‌ను పరీక్షించాలనుకుంటోంది. ఇప్పటిదాకా విన్నింగ్ కాంబినేషన్ అంటూ ఒకే జట్టుతో ఐదు వన్డేలు ఆడింది. ఒక్క కేదార్ జాదవ్ తొలి వన్డే ఆడినా గాయం కారణంగా మిగతా మ్యాచ్‌లకు దూరమయ్యాడు. సుదీర్ఘంగా ఆడుతున్న పేసర్లు భువనేశ్వర్, బుమ్రాలకు విశ్రాంతినిచ్చే అవకాశాలున్నాయి. తమ 'ఎక్స్‌ట్రా' బలంతోనూ విశేషంగా రాణించి మరో విజయంతో సిరీస్‌ను ముగించాలనే లక్ష్యంతో విరాట్ కోహ్లీ సేన బరిలోకి దిగబోతోంది.

అటు పేలవ ఆటతీరుతో ఇప్పటికే సిరీస్ కోల్పోయిన దక్షిణాఫ్రికా చివరి మ్యాచ్‌లో ఓదార్పు విజయాన్ని అందుకోవాలని చూస్తోంది. తొలి మూడు వన్డేలకు దూరమైన స్టార్ బ్యాట్స్‌మన్ డివిల్లీర్స్ మిగతా వన్డేలకు అందుబాటులో ఉన్నా తన మార్క్ చూపించలేకపోయాడు. జట్టు మొత్తం ఒక్క పింక్ వన్డేలోనే మెరవగలిగింది. కనీసం ఈ మ్యాచ్‌లోనైనా సమష్టి ఆటతీరుతో చెలరేగి భారత్ ఆధిక్యాన్ని తగ్గించాలనే కసితో ఉంది.

సెంచూరియన్: దక్షిణాఫ్రికా గడ్డపై పాతికేళ్ల తర్వాత వన్డే సిరీస్ నెగ్గిన టీమిండియా తిరుగులేని ఆత్మవిశ్వాసంతో ఆఖరి మ్యాచ్‌కోసం సిద్ధమవుతోంది. ఈనేపథ్యంలో ఇప్పటి వరకు బెంచ్‌కే పరిమితమైన ఆటగాళ్లను బరిలోకి దించాలని చూస్తోంది. 4-1తో సిరీస్ దక్కించుకున్న భారత్ నేడు (శుక్రవారం) దక్షిణాఫ్రికాతో ఆరో వన్డేలో తలపడనుంది. వర్షం అంతరాయం కలిగించిన జొహాన్నెస్‌బర్గ్ మ్యాచ్‌లోనే భారత్‌కు పరాజయం ఎదురైంది. ఐదో వన్డేలో గెలుపుతో టీమిండియాకు సిరీస్‌తో పాటు దక్షిణాఫ్రికా నుంచి నెంబర్‌వన్ ర్యాంకు కూడా అధికారికంగా వశమైంది. అదనపు ఆటగాళ్లను తుది జట్టులోకి తీసుకుని సిరీస్‌ను 5-1తో ముగించడంతో పాటు రాబోయే మూడు టీ20ల సిరీస్‌ను ఆత్మవిశ్వాసంతో ఆరంభించాలని భారత్ భావిస్తోంది. దక్షిణాఫ్రికా మాత్రం తమ శక్తిసామర్థ్యాల మేరకు రాణించి ఎట్టి పరిస్థితుల్లోనూ ఆఖరి వన్డేను తమ ఖాతాలో వేసుకోవాలని అనుకుంటోంది.

పేసర్లకు విశ్రాంతి: ఐదు వన్డేలను ఒకే జట్టుతో ఆడించిన కెప్టెన్ విరాట్ కోహ్లీ ఈసారి కొత్త ఆటగాళ్లతో బరిలోకి దిగాలనుకుంటున్నాడు. దీంట్లో భాగంగా పలువురు ఆటగాళ్లకు విశ్రాంతినివ్వనున్నాడు. పేసర్లు భువనేశ్వర్, బుమ్రాలకు ఈ మ్యాచ్ నుంచి తప్పించవచ్చు. శ్రీలంకలో భారత్ పర్యటన నుంచి భువీ నాన్‌స్టాప్‌గా ఆడుతున్నాడు. ఇప్పటికే 19 వన్డేలు, ఆరు టీ20లు, రెండు టెస్టుల్లో పాల్గొన్నాడు. ఇక బుమ్రా కూడా లంక పర్యటన నుంచి 20 వన్డేలు, 8 టీ20లతో పాటు ఇక్కడ మూడు టెస్టులు ఆడాడు. కాబట్టి వీరికి విశ్రాంతి కల్పించడమే అన్ని విధాలా మేలు అనే అభిప్రాయంతో టీమ్ మేనేజ్‌మెంట్ ఉంది. వాస్తవానికి భువీ, బుమ్రా జోడీపై భారత్ ఎక్కువగా ఆధారపడుతోంది. సిరీస్ నెగ్గిన తరుణంలో ఆఖరి వన్డేలోనైనా తమ ద్వితీయ శ్రేణి పేస్ అటాక్‌ను కూడా పరీక్షించాల్సిన అవసరం ఉంది. 2019 ప్రపంచకప్ కోసం ఇది అత్యవసరం కూడా. 2015 ప్రపంచకప్ తర్వాత షమి మూడు వన్డేల్లోనే పాల్గొన్నాడు. గాయం నుంచి కోలుకున్న తర్వాత విండీస్‌తో రెండుసార్లు, ఆసీస్‌తో ఓసారి ఆడాడు. నాలుగో పేసర్ శార్దూల్ ఠాకూర్ కేవలం రెండు వన్డేల అనుభవమే ఉంది. దీన్ని బట్టి చూస్తే ద్వితీయ శ్రేణి పేస్ బలగాన్ని వెంటనే పటిష్ఠ పరుచుకోవాల్సి ఉంటుంది. స్పిన్నర్లలో అక్షర్ పటేల్‌ను పరీక్షించడంపై ఆసక్తి నెలకొంది.

మిడిలార్డర్ పరిస్థితేంటి?

భారత మిడిలార్డర్ కష్టాలు ఏ మాత్రం తీరడం లేదు. నాలుగో నెంబర్ నుంచి ఏడో నెంబర్ వరకు కేవలం ఒక్క అర్ధ సెంచరీ (రహానె)నే నమోదైంది. వాండరర్స్‌లో ధోనీ అజేయంగా 42 పరుగులు చేయగలిగాడు. శ్రేయాస్ అయ్యర్ రెండు మ్యాచ్‌ల్లో ఆడినా విఫలమయ్యాడు. పాండ్యా నాలుగు ఇన్నింగ్స్‌లో 26 పరుగులు చేశాడు. స్లో పిచ్‌లు కూడా వీరి పేలవ బ్యాటింగ్‌కు కారణమవుతోంది. మనీష్ పాండే, దినేశ్ కార్తీక్‌లకు ఈ మ్యాచ్‌లోనైనా అవకాశమిస్తారో లేదో వేచిచూడాలి. గురువారం జట్టు ప్రాక్టీస్‌కు దూరంగా ఉంది.

విజయమే లక్ష్యంగా..:

సిరీస్ ఓటమిని పక్కనబెడుతూ ఆఖరి మ్యాచ్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ కోల్పోవద్దనే ఆలోచనలో ఆతిథ్య జట్టు ఉంది. చివరి మ్యాచ్‌లో ఆడిన బ్యాటింగ్ లైనప్‌తోనే ముందుకెళ్లనుంది. మార్‌క్రమ్, ఆమ్లా, డుమిని, డివిల్లీర్స్‌తో పాటు చివరి రెండు వన్డేల్లో మిల్లర్, క్లాసెన్ మెరుగ్గా ఆడారు. సెంచూరియన్ పిచ్‌ను దృష్టిలో ఉంచుకుని మోరిస్, మోర్కెల్, ఎన్‌గిడి కీలకం కానున్నారు. అయితే ఆసీస్‌తో టెస్టు సిరీస్ ఉండడంతో రబాడకు విశ్రాంతినిచ్చే అవకాశాలున్నాయి.

పిచ్, వాతావరణం

ఈ పిచ్‌పై ఇప్పటిదాకా భారత్ రెండు మ్యాచ్‌లు ఆడింది. ఇది ఉపఖండ పిచ్‌లను పోలి బంతి టర్న్ అయ్యే అవకాశం ఉంది. గోధుమ వర్ణంతో కూడిన ఈ వికెట్‌పై టాస్ నెగ్గిన జట్టు ముందుగా బ్యాటింగ్ తీసుకునే అవకాశం ఉంటుంది. చిరు జల్లులకు ఆస్కారం ఉంది.

జట్లు (అంచనా)

భారత్: రోహిత్, ధవన్, కోహ్లీ (కెప్టెన్), రహానె, అయ్యర్/కేదార్, ధోనీ, పాండ్యా, కుల్దీప్, షమి, చాహల్, ఠాకూర్.

దక్షిణాఫ్రికా: మార్‌క్రమ్ (కెప్టెన్), ఆమ్లా, డుమిని, డివిల్లీర్స్, మిల్లర్, క్లాసెన్, మోరిస్, ఫెహ్లుక్వాయో, ఎన్‌గిడి, మోర్కెల్, షంసి.

1 చివరి మ్యాచ్‌లో భారత్ నెగ్గితే ఆతిథ్య జట్టును వారి సొంత దేశంలో ఐదు వన్డేల్లో ఓడించిన తొలి జట్టుగా ఆసీస్‌తో సమానంగా నిలుస్తుంది.

33 వన్డేల్లో పది వేల పరుగులు పూర్తి చేయడానికి ఎంఎస్ ధోనీకి కావాల్సిన రన్స్

మాకిది కనువిప్పు!



సెంచూరియన్: సొంతగడ్డపై టీమిండియా చేతిలో సిరీస్ ఓటమి తమను నేలకు దించిందని దక్షిణాఫ్రికా ఓపెనర్ హషీమ్ ఆమ్లా అన్నాడు. వరల్డ్‌కప్ ముందు ఇది తమకు కనువిప్పని చెప్పాడు. చివరి వన్డేలో పరువు కోసం పోరాడతామన్నాడు. స్పిన్నర్లు చాహల్, కుల్దీప్ ప్రదర్శనే రెండు జట్ల మధ్య ప్రధానంగా తేడా చూపిందని ఆమ్లా అభిప్రాయపడ్డాడు. సౌతాఫ్రికా వికెట్లపై స్పిన్నర్లు వికెట్లు తీయడం కష్టం.. కానీ వీరు మాత్రం అద్భుతం చేశారని ప్రశంసించాడు.

బాగా ఆడినా తొలగించారు : రైనా



న్యూఢిల్లీ: తాను బాగా ఆడినా జట్టు నుంచి తొలగించడం ఎంతో బాధించిందని టీమిండియా బ్యాట్స్‌మన్ సురేష్ రైనా తెలిపాడు. అయితే దక్షిణాఫ్రికాతో జరగబోయే టీ20 సిరీస్‌లో సత్తా చాటగలనన్న ఆశాభావంతో ఉన్నాడు. 'బాగా రాణిస్తున్నా నన్ను తప్పించడం వేదన కలిగించింది. ప్రస్తుతం యోయో టెస్ట్‌ను అధిగమించా. గత కొన్ని నెలలుగా తీవ్రంగా శ్రమిస్తున్న తరుణంలో భారత్‌కు మళ్లీ ఆడాలన్న ఆకాంక్ష మరింత బలపడింది' అని చెప్పాడు. 'ఇక్కడితో వదిలి పెట్టను. సాధ్యమైనంత ఎక్కువ కాలం భారత్‌కు ఆడాలి. ఇంగ్లండ్‌లో గతంలో సత్తా చాటాను. అందువల్ల 2019 వరల్డ్ కప్ ఆడాలి. సౌతాఫ్రికాతో టీ20 సిరీస్‌లో రాణిస్తానన్న నమ్మకం ఉంది' అని రైనా పేర్కొన్నాడు. 31 ఏళ్ల రైనా 223 వన్డేలు, 65 టీ20లు ఆడాడు.

లోధా సిఫారసుల అమలులో హెచ్‌సీఏ వెనుకంజ

- హైకోర్టుకు నివేదించిన అడ్మినిస్ట్రేటర్స్ కమిటీ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి): జస్టిస్ లోధా కమిటీ సిఫారసులకు ఆమోదం తెలిపేందుకు హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) ప్రస్తుత పాలకవర్గం సమావేశం ఏర్పాటు చేయడం లేదని ఉమ్మడి హైకోర్టు నియమించిన అడ్మినిస్ట్రేటర్స్ కమిటీ నివేదించింది. సిఫారసుల అమలులో హెచ్‌సీఏ వెనుకబడి ఉందని తెలిపింది. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ అనిల్ రమేష్ దవే, హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సీతాపతి సభ్యులుగా ఉన్న ఈ కమిటీ ఇటీవల తుది నివేదిక సమర్పించింది. జనవరి 7న సమావేశం నిర్వహించి జస్టిస్ లోధా కమిటీ సిఫారసులను ఆమోదించామని హెచ్‌సీఏ అధ్యక్షుడు వివేక్ తమకు తెలిపారని, అయితే ఇది నిజం కాదని పేర్కొంది. బైలాను పరిశీలిస్తే సీఈవో నియామకానికి సంబంధించిన మార్పులు చేశారని తెలిపింది. హెచ్‌సీఏలో పాలన సక్రమంగా జరిగేలా చూడాలని, లోధా కమిటీ సిఫారసులు అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని గతంలో విచారించిన ధర్మాసనం.. అడ్మినిస్ట్రేటర్స్ కమిటీని ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే.

విజయంతో ముగించాలి

(కృష్ణమాచారి శ్రీకాంత్)

భారత జట్టుకు శుభాకాంక్షలు. దక్షిణాఫ్రికాలో ద్వైపాక్షిక సిరీస్ నెగ్గడం అంటే మామూలు విషయం కాదు. ఆస్ట్రేలియా తర్వాత సౌతాఫ్రికాలో సిరీస్ నెగ్గిన జట్టు భారత్. ఇది చాలు సొంతగడ్డపై సఫారీలు ఎంత బలంగా ఉంటారో చెప్పేందుకు. వాండరర్స్‌లో పరాజయం ఎదురైనా టీమిండియా వెంటనే కోలుకుంది. ఆఖరి వన్డే నామమాత్రమే అయినా కోహ్లీ అండ్ కో పట్టువదలదని భావిస్తున్నా. చివరి మ్యాచ్‌ను విజయంతో ముగిస్తే ఆ ఆనందమే వేరు. సిరీస్ ఆసాంతం భారత జట్టు అద్భుత ప్రదర్శన చేసి ఘన విజయాలు సాధించింది. ఎక్కడా కూడా సౌతాఫ్రికాకు పుంజుకునే అవకాశం ఇవ్వకపోవడం జట్టు వ్యూహానికి అద్దం పడుతోంది. రోహిత్ శర్మ సెంచరీతో ఫామ్‌లోకి రావడం శుభపరిణామం. ఆస్ట్రేలియా, ఇంగ్లండ్‌ల్లో రోహిత్ లాంటి వారి ప్రదర్శన ఎంతో కీలకం కానుంది. ధవన్, రోహిత్ ఫామ్‌లో ఉంటే భారత్‌కు ఎదురే ఉండదు. విరాట్ బ్యాటింగ్ గురించి ఎంత చెప్పుకొన్నా తక్కువే..! సిరీస్ విజయంతో నెం:1 ర్యాంక్‌ను టీమిండియా ఎంతో రాజసంతో చేజిక్కించుకుంది. చివరి వన్డేతోపాటు టీ20 సిరీస్‌నూ దక్కించుకుంటే వరల్డ్‌కప్ ముందు భారత్ ఆత్మవిశ్వాసం ఎంతో పెరుగుతుంది. ఈ భారత జట్టు భవిష్యత్‌లో మరిన్ని విజయాలను సొంతం చేసుకుంటుందని ఆశిస్తున్నా.

-(టీసీఎమ్)

అశ్విన్, జడేజాకు చోటు కష్టమే..!

- టీమిండియా మాజీ బౌలర్ అతుల్ వాసన్



న్యూఢిల్లీ: యువ స్పిన్ ద్వయం కుల్దీప్, చాహల్ సత్తా చాటుతున్న నేపథ్యంలో సీనియర్లు అశ్విన్, రవీంద్ర జడేజాలకు వరల్డ్‌కప్ టీమ్‌లో చోటుదక్కే అవకాశాలు అడుగంటాయని టీమిండియా మాజీ బౌలర్ అతుల్ వాసన్ అభిప్రాయపడ్డాడు. వాస్తవానికి అనుభవజ్ఞులైన అశ్విన్, జడేజాలను కాదని దక్షిణాఫ్రికా టూర్‌కు వీరిని ఎంపిక చేయడంపై విమర్శలు తలెత్తాయి. అయితే ఐదు వన్డే మ్యాచ్‌ల్లో చాహల్, కుల్దీప్ కలసి 30 వికెట్లు నేల కూల్చి జట్టు చారిత్రక సిరీస్ విజయంలో కీలకపాత్ర పోషించారు. శ్రీలంక టూర్‌లో ఆకట్టుకునే ప్రదర్శన చేసిన కుల్దీప్, చాహల్ సౌతాఫ్రికాలో తమ తొలి పర్యటనలోనే అదరగొట్టి కెప్టెన్ నమ్మకాన్ని గెలుచుకున్నారు. ఈ నేపథ్యంలో వరల్డ్‌కప్ జట్టులో వీరిద్దరికీ చోటు ఖాయమని వాసన్ విశ్లేషించాడు.

జోరు కొనసాగించాలని..

- నేడు మహిళల రెండో టీ20

ఈస్ట్ లండన్ (సౌతాఫ్రికా): తొలి టీ20లో ఆతిథ్య దక్షిణాఫ్రికాను చిత్తు చేసిన భారత మహిళలు.. గెలుపు జోరును కొనసాగించాలన్న పట్టుదలతో ఉన్నారు. ఐదు టీ20ల సిరీస్‌లో భాగంగా శుక్రవారం రెండో మ్యాచ్ బఫెలో పార్క్‌లో జరగనుంది. వన్డే సిరీస్‌ను 2-1తో నెగ్గి ఆత్మవిశ్వాసంతో



వేద హర్మన్

ఉన్న టీమిండియా.. మొదటి మ్యాచ్‌లో ఏడు వికెట్ల తేడాతో సౌతాఫ్రికాను చిత్తు చేసింది. ముఖ్యంగా బ్యాటింగ్‌లో హర్మన్‌ప్రీత్ సేన బలంగా కనిపిస్తోంది. సౌతాఫ్రికాను 164 పరుగుల స్కోరుకే కట్టడి చేసిన భారత్.. ఛేదనలో మిథాలీరాజ్ అజేయ అర్ధ శతకంతోపాటు అరంగేట్రం ప్లేయర్ జెమీమా రోడ్రిగ్స్, వేద రాణించడంతో విజయాన్ని అందుకుంది. పర్యాటక జట్టుకు బ్యాటింగ్‌లో ఎటువంటి ఇబ్బందీ లేకపోయినా.. బౌలింగ్ విభాగం కొంత ఆందోళన కలిగిస్తోంది. వెటరన్ పేసర్ జులన్ గోస్వామి గాయం కారణంగా సిరీస్‌కు దూరం కావడంతో బౌలింగ్ విభాగం బలహీనపడింది. జులన్ గైర్హాజరీలో పాండే... జట్టు బౌలింగ్ భారాన్ని మోయాల్సి ఉంది. కాగా, తొలి మ్యాచ్ పరాజయానికి బదులు తీర్చుకోవాలని దక్షిణాఫ్రికా కసిగా ఉంది. చోల్ ట్రయోనా (7 బంతుల్లో 32) ధనాధన్ బ్యాటింగ్‌తో భారత బౌలర్లకు చుక్కలు చూపించింది. రెండో మ్యాచ్‌లో ఆమె భారీ స్కోరు చేయాలని కెప్టెన్ డేన్ వాన్ నీకెర్క్ కోరుకుంటోంది.

ఆరంభ మ్యాచ్‌లకు ఫించ్, మాక్సీ దూరం

- ఏప్రిల్ 7న ఆరోన్ పెళ్లి



ఫించ్-గ్రిఫిత్స్

సిడ్నీ: ఆస్ట్రేలియా ప్లేయర్లు ఆరోన్ ఫించ్, గ్లెన్ మాక్స్‌వెల్.. ఐపీఎల్ ఆరంభ మ్యాచ్‌లకు గైర్హాజరు కానున్నారు. ఏప్రిల్ 7న ఐపీఎల్ మ్యాచ్‌లు మొదలుకానున్నాయి. అయితే అదేరోజు సహచరి అమీ గ్రిఫిత్స్‌తో ఫించ్ పెళ్లి ముహూర్తాన్ని ఖరారు చేసుకున్నాడు. జట్టు సభ్యుడి వివాహ కార్యక్రమం కోసం మాక్స్‌వెల్ కూడా తన ప్రయాణాన్ని వాయిదా వేసుకున్నాడు. ఐపీఎల్ ఫ్రాంఛైజీ కింగ్స్ లెవెన్ పంజాబ్ రూ. 6.2 కోట్లకు ఫించ్‌ను, ఢిల్లీ డేర్‌డెవిల్స్ రూ. 9 కోట్లకు మాక్స్‌వెల్‌ను ఖరీదు చేశాయి.



భారత జట్ల కెప్టెన్లు రాణీ రాంపాల్, మన్‌ప్రీత్

భారత హాకీ స్పాన్సర్‌గా ఒడిశా

న్యూఢిల్లీ: టీమ్‌కు స్పాన్సర్లు అంటే కార్పొరేట్ కంపెనీలే గుర్తుకువస్తాయి. అయితే ఒడిశా రాష్ట్ర ప్రభుత్వం ఆ ట్రెండ్‌ను బ్రేక్ చేసి భారత హాకీ కొత్త స్పాన్సర్‌గా ఐదేళ్లపాటు ఒప్పందం కుదుర్చుకుంది. ఒక రాష్ట్ర ప్రభుత్వం జట్టుకు స్పాన్సర్‌గా వ్యవహరించడం ఇదే తొలిసారి. గురవారమిక్కడ జరిగిన కార్యక్రమంలో ఒప్పంద విషయాన్ని ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ప్రకటించారు. అంతర్జాతీయ హాకీ సమాఖ్య అధ్యక్షుడు నరీందర్ బాత్రాతోపాటు భారత పురుషుల, మహిళల జట్ల ఆటగాళ్లు కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఒడిశా ప్రభుత్వ లోగో ఉన్న జెర్సీలను ఆవిష్కరించారు.



దావోస్‌లో ప్రధాని మోదీతో దిగిన గ్రూప్ ఫొటోలో నీరవ్ మోదీ (రెండో వరుస..ఎడమ నుంచి నాలుగో వ్యక్తి). (సీపీఎం నేత సీతారాం ఏచూరి ఈ ఫొటోను ట్విటర్‌లో పోస్ట్ చేశారు)

నీరవ్ పరార్

ముంబై, ఫిబ్రవరి 15: ముంబైలోని బాంద్రా కుర్లా కాంప్లెక్స్‌లో ఉన్న ప్రధాన కార్యాలయం- ఫైర్‌స్టార్ డైమండ్ ప్రైవేట్ లిమిటెడ్‌లో ఈ దాడులు మొదలయ్యాయి. అధికారులు అదే సమయంలో కుర్లా వెస్ట్‌లో ఉన్న నీరవ్ మోదీ ప్రైవేట్ ఆఫీసు కోహినూర్ సిటీలోనూ, దక్షిణ ముంబైలో అత్యంత ఖరీదైన ఇట్స్ హౌజ్ షోరూమ్‌లోనూ, పవాయ్, నారిమన్ పాయింట్‌ల వద్ద ఉన్న బొటీక్‌ల్లోనూ సోదాలు జరిపారు. గుజరాత్‌లో వజ్రాల వ్యాపార కేంద్రం బెల్జియం టవర్స్ కార్యాలయంలోనూ, సూరత్ ఎస్ఈజెడ్ లోని షోరూముల్లోనూ, ఢిల్లీ చాణక్యపురి , డిఫెన్స్ కాలనీల్లోని వజ్రాభరణాల షాపుల్లోనూ దాడులు జరిపారు. నాలుగు గంటలకు పైగా ఈ సోదాలు సాగాయి. అనంతరం ఈ షాపులను సీజ్ చేశారు. ఈ మోసం గుట్టు బయటపడుతుందని ముందే ఉప్పందిందో ఏమో... నీరవ్ మోదీ - జనవరి ఒకటో తేదీనే విదేశాలకు మకాం మార్చాడు. ఆయన మేనమామ మెహుల్ చోక్సి, సోదరుడు నిశాల్, భార్య అమీ..ఈ ఘరానా మోసంలో కీలక పాత్రధారులు. వారంతా జనవరి ఆరో తేదీనే దేశం విడిచి వెళ్లిపోయారు. విజయ్ మాల్యా మాదిరిగానే నీరవ్ కూడా- పెట్టే బేడా సర్దేశాడు. ప్రస్తుతం స్విట్జర్లాండ్‌లో ఉన్నట్లు పీటీఐ వార్తాసంస్థ తెలిపింది. కుటుంబసభ్యులంతా బెల్జియంలో ఉన్నారు. నీరవ్ ఇంతవరకూ కాంటాక్ట్‌లోకి రాలేదని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. సీబీఐ కూడా ఈ కుంభకోణంపై దర్యాప్తు ముమ్మరం చేసింది. బ్యాంకు సీనియర్ ఉద్యోగులను ప్రశ్నించింది. ఈ భారీ కుంభకోణంలో పాత్ర ఉందని అనుమానిస్తున్న- రుణ అనుమతి మంజూరు విభాగానికి చెందిన- పదిమంది ఉద్యోగులను పీఎన్‌బీ ఇప్పటికే సస్పెండ్ చేసింది. ఇప్పటికే నీరవ్ మోదీ రూ 280 కోట్ల రూపాయల మనీ లాండరింగ్ కేసును ఎదుర్కొంటున్నారు. ఆయనను ఇంకా సీబీఐ ఇంటరాగేట్ చేయలేదు. మోదీ, అతని కుటుంబసభ్యులు 2011లో ఈ మోసానికి పాల్పడ్డట్లు పీఎన్‌బీ - కేంద్రానికి ఫిర్యాదు చేసింది. దీనిపై నిరుడే సీబీఐ ఆ కుటుంబంపై ఎఫ్ఐఆర్ నమోదుచేసి దర్యాప్తు చేస్తోంది. పీఎన్‌బీ స్కాంలో దోషులెవరైనా, ఎంతటివారైనా వదిలిపెట్టే ప్రశ్నే లేదని కేంద్రం స్పష్టం చేసింది. ఇప్పటికే నీరవ్‌కు సంబంధించిన సంస్థల నుంచి రూ 5100 కోట్ల రూపాయల ఆస్తులు జప్తు చేశామని కేంద్ర న్యాయశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ తెలిపారు. దాడులు కొనసాగుతాయన్నారు.



ఎవరీ నీరవ్ మోదీ?

దేశప్రజానీకానికి ఇతనెవరో తెలీదు.. కానీ బడా వ్యాపారవేత్తలు, రాజకీయ నేతలు, సామాజిక ప్రముఖులకు ఇతను పరిచయస్థుడే. 'డైమండ్ కింగ్ ఆఫ్ ఇండియా' అని కూడా ఈయనకు పేరు. పుట్టింది బెల్జియంలో.. తండ్రి వజ్రాల వ్యాపారి, తల్లి ఫ్యాషన్ డిజైనర్. వార్టన్ స్కూల్ ఆఫ్ పెన్సిల్వేనియా యూనివర్సిటీలో ఎంబీఏ చదువుతూ మధ్యలో మానేశాడు. ఆధునిక చిత్రకళా ప్రియుడైన నీరవ్ - ఐరోపాలో అనేక మ్యూజియాల్లో మంచి మంచి పెయింటింగ్స్‌ను కొంటూ ఉండేవాడు. 1999లో భారత్ వచ్చి- తన మేనమామ మెహుల్ చినూ భాయ్ చోక్సి వద్ద వజ్రాల కటింగ్, ఫైనింగ్, వ్యాపారంలో మెళకువలు తెలుసుకున్నాడు. అప్పట్లోనే ఫైర్‌స్టార్ డైమండ్స్ అనే సంస్థను ఏర్పాటు చేసి వజ్రాల వ్యాపారంలో ఎదిగాడు. ఒక్క భారత్‌లోనే గాక ఆసియా, యూరప్, అమెరికా ఖండాల్లో తన వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించాడు. అతి తక్కువ కాలంలో ఢిల్లీ, హాంకాంగ్, మకావూ, లండన్, న్యూయార్క్‌ల్లో వజ్రాల షాపులు తెరిచారు. తన పేరుతోనే ఓ బ్రాండ్ సృష్టించాడు (నీరవ్ మోదీ డైమండ్).. దాని ప్రమోషన్ కోసం ప్రభుత్వాలను యథేచ్ఛగా వాడుకున్నాడు. బ్యాంకుల నుంచి అప్పులు తీసుకోవడం, ఎగ్గొట్టడం ఆయనకు తెలిసిన మరో విద్య. అగ్రశ్రేణి రాజకీయ వేత్తలతో రాసుకు పూసుకు తిరిగి- ఆ ఫోటోలు వాడుకుని బ్యాంకులను, ఆర్థిక సంస్థలను మోసం చేశాడు. నీరవ్ మోదీ ప్రస్తుత ఆస్తి దాదాపు 12,000 కోట్లు. ఫోర్బ్స్ జాబితా ప్రకారం ఆయన భారత్‌లోని సంపన్నుల్లో 46 వస్థానంలో ఉన్నారు. ప్రపంచంలో ఆయన ర్యాంకు 1057. ప్రపంచంలోని అగ్రశ్రేణి సెలబ్రిటీలు, హాలీవుడ్ బాలీవుడ్ తారలు నీరవ్ మోదీ వజ్రాలు కొంటూంటారు. కేట్ విన్‌స్లెట్ దగ్గర నుంచి ఐశ్వర్యా రాయ్ దాకా ఆయన కంపెనీ వజ్రాలు కొని వాడుతున్నారు.

సొమ్ము తిరిగిచ్చేస్తా: నీరవ్

తాను బకాయిపడ్డ మొత్తాన్ని తిరిగి ఇచ్చేస్తానని మోదీ- పీఎన్‌బీకి గతంలో ఓ లేఖ రాసినట్లు తెలుస్తోంది. తన సంస్థ ఫైర్‌స్టార్ డైమండ్స్‌ను అమ్మకానికి పెట్టి- దాని ద్వారా రూ 6400 కోట్లు సమీకరిస్తానని, ఆ మొత్తం పీఎన్‌బీకి చెల్లిస్తానని, మిగిలిన బకాయి దశలవారీగా తీర్చేస్తానని నీరవ్ అందులో పేర్కొన్నారు. ఇవన్నీ ఉత్తుత్తి మాటలని, ఆస్తుల రికవరీకి రాకుండా ఆయన పన్నిన ఎత్తుగడ అని పీఎన్‌బీ మేనేజింగ్ డైరెక్టర్ సునీల్ మెహతా చెప్పారు.

నన్నూ మోసం చేశాడు



» ప్రియాంకా చోప్రా

నీరవ్ మోదీ తనను కూడా మోసం చేశారని బాలీవుడ్ భామ ప్రియాంక చోప్రా ఆరోపించారు. 'నీరవ్ మోదీ వజ్రాలకు బ్రాండ్ అంబాసిడర్‌గా నాతో ఒప్పందం కుదుర్చుకున్నారు. అడ్వాన్స్ మాత్రమే ఇచ్చి.. మిగతా మొత్తాన్ని ఇవ్వబోమని అన్నారు. దీనిపై కోర్టుకెళతా' అని చెప్పారు. ఒకే రకమైన ఆలోచనలుండడం వల్ల నీరవ్‌తో పరిచయం ఏర్పడిందని, భారతీయ సంస్కృతిని ఆధునిక ప్రపంచం ముందు ఆవిష్కరించాలన్న ఉద్దేశంతో.. కలిసి పనిచేయాలని నిర్ణయించామని ఆమె చెప్పుకొచ్చారు. మరో బాలీవుడ్ నటుడు సిద్దార్థ్ మల్హోత్రా కూడా నీరవ్ మోదీ తనను మోసం చేశారని, కేసు పెడతానని అన్నారు.



ప్రధానిని కౌగిలించుకోండి! దావోస్‌లో ఫొటో దిగండి దేశాన్ని లూటీ చేయండి

» కేంద్రం ఇవేమీ పట్టించుకోదు.. నీరవ్ చోటా మోదీ 2

» పీఎన్‌బీ కుంభకోణంపై రాహుల్ వ్యంగ్యాస్త్రాలు



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 15: పీఎన్‌బీ కుంభకోణం దేశ చరిత్రలోనే అతిపెద్ద 'బ్యాంకు మోసం' అని కాంగ్రెస్ పార్టీ పేర్కొంది. లూటీ చేయడం, పారిపోవడం అనేది మోదీ సర్కారుకు 'హాల్ మార్క్'గా మారిపోయిందని ఎద్దేవా చేసింది. జువెలరీ డిజైనర్ నీరవ్ మోదీ పీఎన్‌బీకి రూ.11,346 కోట్లకు టోకరా వేసి దర్జాగా పారిపోతే.. మోదీ సర్కారు కళ్లు మూసుకు కూర్చుందని ఆరోపించింది. లలిత్ మోదీ, విజయ్ మాల్యాల్లా నీరవ్ కూడా దేశం వీడి వెళుతుంటే సర్కారు ఏం చేస్తోందని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ నిలదీశారు. 'దేశాన్ని లూటీ చేయడానికి నీరవ్ మోదీ చూపిన దారి.. 1.ప్రధాని మోదీని కౌగిలించుకోవాలి. 2. దావోస్‌లో ఆయనతో ఫొటో దిగాలి. దాన్ని వాడుకొని 12 వేల కోట్లు కొట్టేయాలి. మాల్యాలాగా దేశం విడిచి పారిపోవాలి. ప్రభుత్వం మాత్రం పట్టించుకోదు' అని రాహుల్ ట్విటర్‌లో విమర్శించారు. దావోస్‌లో ప్రధానితో కలిసి నీరవ్ దిగిన ఫొటోను కూడా జతచేశారు. కాంగ్రెస్ అధికార ప్రతినిధి రణదీప్ సుర్జేవాలా విలేకర్లతో మాట్లాడుతూ.. లలిత్ మోదీని 'చోటా మోదీ-1'గా, నీరవ్ మోదీని 'చోటా మోదీ-2గా' అభివర్ణించారు. సీపీఎం నేత సీతారాం ఏచూరి.. 'నీరవ్ జనవరి 31న ఎఫ్ఐఆర్ నమోదు కాకముందే పారిపోయాడా? దీనిపై మోదీ సర్కారు స్పష్టత ఇవ్వాలి' అని ట్వీట్ చేస్తూ దావోస్ ఫొటోను కూడా జత చేశారు. 'పీఎన్‌బీ కుంభకోణంపై సమగ్ర దర్యాప్తు చేయాలి' అని పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ పేర్కొన్నారు. 'నీరవ్‌కు ప్రధానితో సంబంధాలున్నాయి' అని ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ ఆరోపించారు.

ఎవరినీ వదలం: రవిశంకర్ ప్రసాద్

నీరవ్ మోదీని కాంగ్రెస్ పార్టీ 'చోటా మోదీ2'గా అభివర్ణించడంపై కేంద్ర మంత్రి రవిశంకర్‌ప్రసాద్ మండిపడ్డారు. ఇప్పటికే నీరవ్‌కు చెందిన రూ.1300 కోట్ల ఆస్తులను సీజ్ చేశామని, పాస్‌పోర్టును కూడా రద్దు చేశామని రవిశంకర్ ప్రసాద్ తెలిపారు.

దక్షిణాఫ్రికా అధ్యక్షుడు జుమా అవుట్

జొహెన్నెస్‌బర్గ్, ఫిబ్రవరి 15: కుంభకోణాల్లో కూరుకుపోయిన దక్షిణాఫ్రికా అధ్యక్షుడు జాకబ్ జుమా(75) పదవి నుంచి వైదొలిగారు. ఆయన స్థానంలో 2 నెలల క్రితం ఏఎన్‌సీ అధ్యక్షుడిగా ఎన్నికైన సిరిల్ రామాఫోసా దేశాధ్యక్షుడిగా కూడా బాధ్యతలు స్వీకరించనున్నారు.

రేప్ బాధితులు బిచ్చగాళ్లా?: సుప్రీం కోర్టు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 15: అత్యాచార బాధితులకు అరకొరగా ఇస్తున్న నగదు సాయంపై మధ్యప్రదేశ్ ప్రభుత్వానికి సుప్రీం కోర్టు తలంటింది! ఆ రాష్ట్రంలో 1951 మంది రేప్ బాధితుల కోసం రూ. కోటి మాత్రమే వెచ్చించడంపై సుప్రీం ధర్మాసనం దిగ్భ్రాంతిని వ్యక్తం చేసింది. సగటున "ఒక్కో బాధితురాలికి రూ. 6,000-రూ.6,500 ఇస్తారా? ఇలా ఎలా ఇవ్వగలుగుతారు? మీ దృష్టిలో వాళ్లమైనా బిచ్చగాళ్లా?" అని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది.

నీరవ్ జీవిత విశేషాలు

వయస్సు:	47 సంవత్సరాలు
పుట్టిన ప్రదేశం:	సూరత్ (గుజరాత్)
నివాసం:	ముంబై (మహారాష్ట్ర)
విద్యార్హతలు:	వార్టన్ బిజినెస్ స్కూల్ (డ్రాప్ అవుట్)
వృత్తి:	వజ్రాల వ్యాపారి/ నిపుణుడు, ఆభరణాల డిజైనర్
ఆస్తులు:	రూ. 11,068 కోట్లు

సాధించిన విజయాలు

- ఆభరణాలను వేలం వేసే ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన సోథబిజ్ కేటలాగ్ (2010)లో స్థానం సంపాదించిన మొదటి భారతీయుడు.
- ఫోర్బ్స్ భారతీయ కుబేరుల జాబితాలో 2013లో చోటు. ప్రస్తుతం భారత కుబేరుల్లో 85వ స్థానం.
- ప్రియాంక చోప్రా, ఐశ్వర్యారాయ్, డెకోట జాన్సన్, విన్‌స్లెట్, తారాజీ పీ హెన్సన్ వంటి ప్రఖ్యాత బాలీవుడ్, హాలీవుడ్ తారలు ఈయన డిజైన్ చేసిన ఆభరణాలను వినియోగిస్తారు.
- పుట్టింది సూరత్‌లోనే అయినా.. పెరిగింది బెల్జియంలో. చదువును బిజినెస్ స్కూల్ స్థాయిలో మధ్యలోనే మానేశాక భారత్ తిరిగి వచ్చారు.
- తన మామ నుంచి వజ్రాల వ్యాపారంలో శిక్షణ పొందారు
- నీరవ్ మోదీ బ్రాండ్‌తో వజ్రాల వ్యాపారం ప్రారంభించారు
- న్యూఢిల్లీ, ముంబై, న్యూయార్క్, హాంగ్‌కాంగ్, లండన్, మెకావ్‌లలో 16 వజ్రాల దుకాణాలున్నాయి.

గోల్కొండ డైమండ్ నెక్లెస్ రూపకర్త నీరవ్ మోదీయే!



ప్రపంచంలో అతి సుందరమైన, విశేష ఖ్యాతిపొందిన గోల్కొండ లోటస్ డైమండ్ నెక్లెస్ రూపకర్త నీరవ్ మోదీయే. 2010లో ఇది ప్రసిద్ధిపొందిన క్రిస్టీ వేలంలో రూ 16.29 కోట్లకు అమ్ముడుపోయింది. మరో ప్రసిద్ధ ఆభరణాల వేలం వేదిక- సొత్‌బీలో- 2014 ఏప్రిల్‌లో ఇలాంటి మరో హారం రూ 55 కోట్లకు పైగా ధర పలికింది. ఇప్పటికీ గోల్కొండ డైమండ్ నెక్లెస్ అన్నది ఓ విశిష్టమైన మోడల్. అతి అరుదైన గోల్కొండ వజ్రం గురించి నీరవ్ మోదీ ఓ ఇంటర్వ్యూలో వివరించారు. 'ఇది హైదరాబాద్ నుంచే మాకు లభించింది.. 2009లో మా దగ్గరికి ఓ డైమండ్ డీలరు వచ్చాడు. అతను హైదరాబాదీలానే ఉన్నాడు. గోల్కొండ వజ్రం తెచ్చింది ఆయనే. 1960 ప్రాంతాల్లోనే ఆ విలువైన వజ్రం తొలిసారి అమ్ముడుపోయిందని చెప్పాడు. అంత పెద్ద, తెల్లగా మెరిసిపోతున్న వజ్రాన్ని చూడడం నాకు అదే మొదటిసారి. చూడగానే అబ్బురపడ్డాను. వజ్రాలు రకరకాల రంగుల్లో వస్తాయి. బయటికి కన్పించే రంగు కాకుండా అవి రిఫ్లెక్ట్ చేసే అసలు రంగు మీదే ధర ఆధారపడి ఉంటుంది. దాన్ని పరిశీలించి చూశాక- చాలా క్వాలిటీ వజ్రమని తేల్చాం. దానిపై చాలా గీతలు పడిఉన్నాయి. దాన్ని మా వర్క్‌షాపులోనే బాగా సానబెట్టాం.. అతి జాగ్రత్తగా పాలిష్ చేశాం. దానిని కొనుగోలు చేసి.. ఓ అద్భుతమైన ఆభరణంగా తీర్చిదిద్దాలని నిర్ణయించుకున్నాం. అప్పట్లో మేం అతి గాఢమైన గులాబీ రంగు వజ్రాలను తయారుచేసేవాళ్లం.. వాటికి ఆర్గైల్ డైమండ్స్ అని పేరు. రష్యా నుంచి కొనుగోలు చేశాం. మొత్తం 17 వజ్రాలు వాడాం. పెద్దది 10 క్యారట్లు, చిన్నది రెండు క్యారట్లు.. అంతా కలిపి మొత్తం 85 క్యారట్ల వజ్రాలు. వీటన్నింటినీ పొదిగి- మధ్యలో ఆ గోల్కొండ వజ్రాన్ని పెట్టి- ఓ అందమైన అపురూపమైన వజ్రాల హారాన్ని తయారుచేశాం. నిజానికి మా పనితనానికి, దాని సౌందర్యానికి రూ 16 కోట్లు చాలా తక్కువ. దాదాపు రెండేళ్లు కష్టపడ్డాం' అని చెప్పారు. తర్వాతి కాలంలోనూ హైదరాబాద్ నుంచి వచ్చిన వజ్రాలను కొనుగోలు చేశామన్నారు.

భక్తి ముసుగులో దోపిడీ

» యాగం పేరుతో రూ.3 కోట్లు వసూలు?

» బాబా మనస్తాపం..ఆత్మహత్యాయత్నం



సుధాకర్‌బాబా

నెల్లూరు(క్రైం), ఫిబ్రవరి 15: భక్తి ముసుగులో ఓ స్వామీజీ దోపిడీకి తెరలేపాడు. తాను నెలకొల్పిన ఆశ్రమంలో యాగాల నిర్వహణ పేరుతో రూ.3 కోట్ల వరకు వసూలు చేసి మోసం చేసినట్లు భక్తులు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు గురువారం వారు ఆందోళన చేపట్టారు. దాంతో స్వామీజీ ఆత్మహత్యాయత్నం చేయడం కలకలం రేపింది. నెల్లూరు ప్రశాంతినగర్‌లో సుధాకర్‌బాబా అనే వ్యక్తి గురుదత్తాత్రేయ ఆశ్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇటీవల ఆశ్రమంలో మహాయాగం ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. ఈ యాగం సందర్భంగా వేరే జిల్లాకు చెందిన ఒక కుటుంబం ఆశ్రమానికి చేరుకుంది. వారు భక్తులకు యాగానికి సంబంధించినవంటూ కొన్ని పుస్తకాలను పంపిణీ చేసి ఒక్కొక్క భక్తుడి నుంచి రూ.50 వేలు వసూలు చేశారు. ఆ పుస్తకంలో తాము చెప్పిన మంత్రాన్ని రాసిఇస్తే పుస్తకానికి రూ.2వేల చొప్పున తిరిగి చెల్లిస్తామని కూడా చెప్పారు. దీంతో భక్తులు ఎగబడ్డారు. పుస్తకాలు అమ్మడం ద్వారా దాదాపు రూ.3 కోట్లు వసూలు చేసినట్లు చెబుతున్నారు. రెండ్రోజులుగా ఆ దంపతుల బృందం కనిపించడం లేదు. భక్తులకు అనుమానం వచ్చి ఆశ్రమానికి చేరుకుని సుధాకర్ బాబాను నిలదీశారు. తాము చెల్లించిన నగదును వెనక్కి ఇచ్చేయాలని డిమాండు చేశారు. సుధాకర్ బాబా ఈ వ్యవహారంతో తనకెలాంటి సంబంధం లేదని చెప్పినా, భక్తులు వినకపోవడంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నం చేశారు.



బెంగళూరులోని కసవనహళ్లిలో నిర్మాణంలో ఉన్న ఐదంతస్తుల భవనం గురువారం కుప్పకూలింది. ఆ సమయంలో భవనంలో దాదాపు 20 మంది కూలీలు ఉన్నట్లు సమాచారం. ఈ ప్రమాదంలో ముగ్గురు మృతి చెందారు. స్థానికులు శిథిలాల నుంచి ఏడుగురిని కాపాడారు.

బడిలో నరమేధం

(మొదటి పేజీ తరువాయి)

పన్నెండు మందికి పైగా గాయపడ్డారు. ప్రవర్తన సరిగా లేదనే కారణంగా స్కూలు నుంచి సస్పెండ్ చేయడంతో, నికోలస్ క్రూజ్ (19) అనే విద్యార్థి ఇంతటి ఉన్మాదానికి తెగబడ్డాడని పోలీసులు వెల్లడించారు. అతడి నుంచి ఆఆర్-15 రైఫిల్ స్వాధీనం చేసుకొని, అరెస్టు చేశారు.





కాల్పుల నిందితుడు నికోలస్ క్రూజ్‌ను పోలీసులు అరెస్టు చేస్తున్న దృశ్యం

ఫైర్ అలారం మోగించి..

ఎవడో ఆగంతకుడు తమ స్కూలులో కాల్పులు జరుపుతున్నాడని తొలుత టీచర్లు భావించారు. కానీ, అతడు తమ మాజీ విద్యార్థేనని తెలుసుకొని వారంతా నివ్వెరపోయారు. స్కూలులోకి చొచ్చుకెళ్లిన వెంటనే నికోలస్, ఫైర్ అలారం మోగించాడు. దీంతో విద్యార్థులు, టీచర్లు హుటాహుటిన బయటకు పరుగులు తీశారు. అయోమయంతో.. ఒక చోట గుమిగూడిన వారిపై అతడు కాల్పులకు తెగబడ్డాడు. కొంతమంది టీచర్లు.. పిల్లలను తీసుకొని తరగతి గదుల్లో దాక్కున్నారు. దీంతో చాలావరకు ప్రాణనష్టం తప్పిందని స్కూలు వర్గాలు తెలిపాయి.

చంపుతా.. చంపుతా..

నికోలస్ తొలినుంచీ విపరీత ప్రవర్తన కలిగి ఉన్నట్టు తోటి విద్యార్థులు, టీచర్లు చెబుతున్నారు. తన ప్రవర్తనతో పిల్లలను భయపెడుతున్నాడని, తన మాజీ ప్రేమికురాలి బాయ్‌ఫ్రెండ్‌తో గొడవ పడ్డాడనే కారణంగా అతడిని గత ఏడాది స్కూలు యాజమాన్యం సస్పెండ్ చేసింది. అసలే మానసిక స్థితి సరిగా లేని అతడు, ఈ ఘటనతో మరింతగా రగిలిపోయాడని పోలీసులు చెబుతున్నారు.

దడ పుట్టించిన పోస్టులు

నికోలస్‌కు తుపాకులంటే పిచ్చి. తుపాకీ చేతబట్టి ఫోజు ఇచ్చిన ఫొటోలు, సొంత వీడియోలను సోషల్ మీడియాలో పోస్టు చేసేవాడు. అరెస్టు సమయంలో అతని వద్ద పెద్దఎత్తున తూటాలు, గ్యాస్ మాస్క్, పొగ బాంబులతోపాటు, మారణాయుధాల వినియోగానికి సంబంధించిన పేపర్ క్లిప్పింగ్స్, పత్రికలను పోలీసులు గుర్తించారు. అతని ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ ఖాతాల్లోని కొన్ని పోస్టులు, వీడియోలు తీవ్ర కలవరానికి గురి చేసేలా ఉన్నాయని, వాటిని తొలగించేస్తున్నామని ఫ్లోరిడా పోలీస్ చీఫ్ స్కాట్ ఇజ్రాయెల్ తెలిపారు. చంపుతా.. చంపుతా' అని నికోలస్ తమను భయపెట్టేవాడని, సహ విద్యార్థులు చెబుతున్నారు.



క్షతగాత్రుల్లో ప్రవాసాంధ్ర విద్యార్థి

డగ్లస్ స్కూలులో భారత సంతతి విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో ఉన్నారు. వీరిలో ప్రవాసాంధ్ర కుటుంబానికి చెందిన ఓ విద్యార్థి తీవ్రంగా గాయపడ్డాడు. ఆ కుటుంబానికి సన్నిహితుడైన శేఖర్‌రెడ్డి అనే వ్యక్తి ఈ విషయాన్ని వెల్లడించారు. అమెరికాకు మాత్రమే కాదు, ఇక్కడ ఉంటున్న భారత సంతతి కుటుంబాలన్నింటికీ ఇది దుర్దినమని ఆయన వాపోయారు. ఈ ఘటనతో 31వేల మంది జనసంఖ్య కలిగిన పార్క్‌ల్యాండ్‌లో విషాదఛాయలు అలుముకొన్నాయి. ఫ్లోరిడాలోని అత్యంత ప్రశాంత ప్రాంతం ఇది. కనెక్టికట్‌లోని ఓ స్కూలులో 26 మందిని కాల్చిచంపిన ఘటన తరువాత, ఈ ప్రాంతంలో ఆరేళ్లలో తొలిసారి అంతటి రక్తపాతం జరగడం అధికారులను, స్థానికులను చలింపజేసింది. కాగా, స్కూళ్లను లక్ష్యంగా చేసుకొని ఏడాదికాలంలో అమెరికాలో జరిగిన కాల్పుల ఘటనల్లో ఇది 18వది. ఈ ఘటన పట్ల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆవేదన వ్యక్తం చేశారు.

15 ఏళ్లు దాటితే తుక్కే!

» త్వరలో పాత వాహనాలపై నిషేధం: గడ్కరీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 15: పదిహేనేళ్లు దాటిన వాహనాలను తుక్కు చేయాల్సిందేననే విధానాన్ని త్వరలో అమలు చేయనున్నట్లు కేంద్ర రోడ్డు రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. ఆయన గురువారమిక్కడి నీతి ఆయోగ్ ప్రాంగణంలో విద్యుత్ వాహనాల చార్జింగ్ పాయింట్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వాహన కాలుష్యానికి కళ్లెం వేసేందుకు ఈ విధానాన్ని దాదాపు ఖరారు చేశామన్నారు. దేశంలో 2030 నాటికి పూర్తిగా విద్యుత్ వాహనాలను తీసుకురావాలన్న లక్ష్యాన్ని ప్రభుత్వం నిర్దేశించుకున్నట్లు తెలిపారు. నేషనల్ ఎలక్ట్రిక్ మొబిలిటీ ప్లాన్‌లో భాగంగా 2020లోపు 60-70లక్షల విద్యుత్ వాహనాలను రోడ్లపైకి తీసుకురానున్నట్లు తెలిపారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107
Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.